ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ పంచమి తె. 3.10 వరకు, అనంతరం షష్ఠి; నక్షత్రం: స్వాతి రా. 11.19 వరకు, అనంతరం విశాఖ; అమృతకాలం: మ. 2.10 నుండి 3.50 వరకు; వర్జ్యం: తె. 5.13 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి:56 • సంచిక:324 • మంగళవారం 6 మార్చి 2018 • హైదరాబాద్ ❋ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

447 కంపెనీలు.. రూ.3200 కోట్లు స్వాహా చేశాయి



తాజాగా వెలుగుచూసిన మరో కుంభకోణం • ఉద్యోగుల నుంచి పన్ను వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వాడేసుకున్నారు • 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి వరకు సాగిన అక్రమాల తతంగం • కంపెనీల్లో అత్యధిక భాగం నిర్మాణ రంగానిదే • ఆ జాబితాలో సినిమా ప్రొడక్షన్స్ హౌజ్, స్టార్టప్‌లు, బిల్డర్లు • ఆదాయపు పన్ను శాఖ తనిఖీల్లో వెలుగులోకి • విచారణకు ఐటీశాఖ ఆదేశం

6 లో

15న రాష్ట్ర బడ్జెట్



సారీ..!

ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ లేదు

రాజ్యాంగ నిబంధనల అడ్డుతోనే నిర్ణయం

అయినా బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తాం

ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలన్న ఆలోచనను తెలంగాణ ప్రభుత్వం విరమించుకుంది. రాజ్యాంగ నిబంధనలు, అసెంబ్లీ నియమావళి ప్రకారం శాఖల వారీగా ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టడం కుదరడం లేదని సీఎం కె.చంద్రశేఖరరావు ప్రకటించారు. ప్రత్యేక బడ్జెట్ సాధ్యం కాకపోయినప్పటికీ 2018-19 వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని ఆయన ➪ 3వ పేజీలో...

టూర్లు.. చర్చలు

జాతీయ స్థాయిలో కేసీఆర్ మేథోమధనం

మెట్రోనగరాల్లో భేటీలు.. మంతనాలు

థర్డ్ ఫ్రంట్‌కు దశ, దిశ కార్యాచరణ

దేశం బాగుపడాలి.. దేశ ప్రజలు బాగుండాలి అని ఆలోచించే ప్రతి ఒక్క వర్గంతోనూ మాట్లాడి అభిప్రాయాలు సేకరించి దేశానికి అవసరమైన అజెండా రూపొందించాలనే లక్ష్యంగా గులాబీ దళపతి కార్యోన్ముఖులయ్యారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడం కోసం జాతీయ స్థాయిలో రాజకీయ ఫ్రంట్ ఏర్పాటుకు అవసరమైన కసరత్తు కేసీఆర్ ప్రారంభించారు. హస్తిన వేదికగా సమాలోచనలు నిర్వహించనున్నారు.


• త్వరలో అఖిల భారత సర్వీసు మాజీ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం

• అనంతరం రాజకీయవేత్తలతో సంప్రదింపులు... సమాలోచనలు

• రైతు, కార్మిక, పారిశ్రామిక, యువజన, విద్యార్థి సంఘాలతో వేర్వేరు భేటీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : థర్డ్‌ఫ్రంట్ ఆవశ్యకతను వివరించి దేశాన్ని ఆలోచింపజేసిన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తన లక్ష్యాన్ని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకువెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. దేశంలో ఆ రెండు జాతీయ పార్టీల ద్వారా సాధించలేని మెరుగైన ఫలితాలను ఈ కూటమి ద్వారా ఏవిధంగా సాధించవచ్చుననే అంశంపై మేథోమథనం నిర్వహించాలని నిర్ణయించారు. అందుకోసం గడిచిన రెండు దశాబ్దాల కాలంగా దేశవ్యాప్తంగా కీలక స్థానాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన అఖిల భారత సర్వీస్ ఉద్యోగులకు సమాలోచనలు జరిపి కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేసే పనిలో పడ్డారు.

దేశ భవిష్యత్తు కోసం ఏం కావాలన్న అంశంపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన తర్వాతే ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించే మూడవ రాజకీయ కూటమికి మద్దతు ఇస్తున్న వారితో సమావేశం కావాలని కేసీఆర్ అనుకుంటున్నారు. 2019 నాటికి అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన భారీ స్థాయిలో కసరత్తు మొదలుపెట్టనున్నారు. దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావాలన్న సంకల్పాన్ని ఏ మేరకు ప్రజల మద్దతు ఉంటుందనే అంశంపై ఆయన అంతర్గత సర్వేలు నిర్వహిస్తున్నారు. ముందుచూపు ఆలోచనతో జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ప్రకటించిన కేసీఆర్ ఆ మేరకు ముందుకు సాగుతున్నారు. ముందుగా రిటైర్డ్ ఐఎఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటా. ఆ తర్వాత ఉద్యోగ సంఘాలు, రైతు సంఘాలు, విభజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, ప్రత్యామ్నాయ రాజకీయ వేదికలకు నేతృత్వం వహిస్తున్న రాజకీయవేత్తలతో వరుసగా సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఢిల్లీ స్థాయిలో మకాంవేసి వివిధ జాతీయ పార్టీల అధినేతలు, మాజీ మంత్రులు, తలపండిన రాజకీయవేత్తలతో సమాలోచనలు జరుపుతారు. వ్యవస్థీకృత మార్పులతో భారత రాజ్యాంగాన్ని ప్రక్షాళన చేసి నవభారత నిర్మాణాన్ని ఆవిష్కరించేందుకు పదవీ విరమణ పొందిన న్యాయమూర్తుల, సైనికాధిపతులు, వాయు, వైమానిక దళంలో అత్యున్నత స్థాయిలో పనిచేసిన వారిని సంప్రదించి తనకున్న సరికొత్త ముందుచూపు ఆలోచనను పంచుకుంటారు. ఈ నేపథ్యంలోనే కోల్‌కత, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించనున్నారు. న్యాయ నిపుణులు, ప్రముఖ న్యాయవాదులు, సీనియర్ ఐఎఎస్, ఐపీఎస్ అధికారులకు మేధావివర్గంతో ఒకకూటమిని ఏర్పాటుచేసి థర్డ్‌ఫ్రంట్ భాగస్వామ్యం కల్పిస్తారు. దేశ జనాభాలో అత్యధికులు రైతు సామాజికవర్గానికి చెందిన వారు ఉండడంతో ఏ విధమైన మార్పులు చేస్తే వ్యవసాయ రంగం లాభాల భాటన పయనిస్తుందనే అంశంపై అన్ని రాష్ట్రాల నుంచి ➪ 8వ పేజీలో...



ఆస్కార్‌లో కొత్తకోణం

గ్రహాంతర వాసులకూ సమాదరణ

సరికొత్త ఆలోచనలకు అద్దం

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

భగవంతుడి సృష్టిలో మానవుడే తెలివైన జీవి. ఇంతవరకు మానస సంబంధాలకే అంతర్జాతీయ సమాజం పెద్దపీటేసింది. కొన్ని దశాబ్దాల క్రితం మనుషుల మధ్యనున్న ఘర్షణలు, పరస్పర వైరాలు వీడి మానవ సంబంధాలు మెరుగుపడాలని సమాజం ఆశించింది. కానీ ఇప్పుడు ఆ స్థాయి కూడా దాటిపోయింది. మానవుల మధ్యే కాదు.. అంతరిక్షంలో ఉన్నారని భావిస్తున్న గ్రహాంతర వాసుల నుంచి మనలాగే సృష్టించబడ్డ ఇతర జీవుల పట్ల కూడా సమాదరణ, ప్రేమ చూపాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందని అంతర్జాతీయ సమాజం భావిస్తోంది. మారుతున్న ఆలోచనలకు తాజా ఆస్కార్ అవార్డులు అద్దంపడుతున్నాయి.

తొమ్మిది చిత్రాల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో చివరకు "ది షేప్ ఆఫ్ వాటర్" ఉత్తమ చిత్రంగా ఆస్కార్ అవార్డు పొందింది. 13కేటగిరీల్లో ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అయితే ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఒరిజనల్ స్కోర్, ఉత్తమ నిర్మాణ విలువల కేటగిరిలో నాలుగు ఆస్కార్‌లు పొందింది. గతేడాదితో పోలిస్తే ఈ సారి పోటీ అధికంగా ఉంది. 2016లో పెద్దగా గుర్తింపు పొందిన చిత్రాలు విడుదల కాలేదు. లా..లా.. ల్యాండ్ చిత్రం అవార్డుకు ఎంపిక అవుతుందని మొదట్లోనే అంచనాలేసేశారు. చివరకు ఆ చిత్రమే 2017 ఆస్కార్ ఉత్తమ చిత్రం అవార్డును దక్కించుకోగలిగింది. కానీ ఈసారి ఇందుకు భిన్నంగా "షేప్ ఆఫ్ వాటర్"తో పాటు ➪ 3వ పేజీలో...



ఆస్కార్ అవార్డుల వ్యాఖ్యాత

ట్రాన్స్‌జెండర్

'ది షేప్ ఆఫ్ వాటర్'కు అవార్డుల పంట షో లో

7 పురస్కారాలు కైవశం • డన్ కర్క్‌కు 3

ఆస్కార్ వేడుకలో శశికపూర్, శ్రీదేవిలకు నివాళి

15 నుంచి ఒంటి పూట బడులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఒంటిపూట బడులు ఎప్పట్నుంచి? అనే శీర్షికతో ఆంధ్రప్రభ సోమవారం వార్త కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ప్రభుత్వం రోజు రోజుకు ఎండలు పెరుగుతున్నందున ఒంటిపూట బడులపై తగిన ప్రతిపాదనలు పంపించాలని సర్కార్ పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించింది. గతేడాది మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించామని, ఈ ఏడాది కూడా 15 నుంచి ప్రారంభించాలని కోరుతూ పాఠశాల విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి సోమవారం ప్రతిపాదనలు పంపించారు. దీంతో మార్చి 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి.

హైస్కూల్ విద్యార్థినులకు ఉచిత సైకిళ్లు 8

విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకొస్తే చేయూత ఇస్తాం



• ఉద్యోగాలు ఆశించేవాళ్లుగా కాకుండా కల్పించేవాళ్లుగా తయారు కావాలి • భవిష్యత్తులో ఉద్యోగాలన్నీ స్టార్టప్స్ నుంచే

• ఐటీ మంత్రి కేటీఆర్ వెల్లడి


• అనంత సాగర్‌లో ఐటీ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం



ఎస్.ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులతో మంత్రి కేటీఆర్ మాటామంతీ. చిత్రంలో డిప్యూటీ సీఎం కడియం

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో: యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని ప్రపంచం అబ్బురపడేలా ఆవిష్కరణలు చేయాలని రాష్ట్ర ఐటి పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ అర్బన్ జిల్లా, హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆయన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటిఆర్ మాట్లాడుతూ సాంకేతికపరంగా సాధించిన పరిజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా మలచుకోవాల్సిన అవసరం ఉందని, 130 కోట్ల జనాభా కలిగిన భారత దేశంలో కలిగిన భారతదేశంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు, స్టార్టఫ్ అంటే తెలియని కోట్లాది మంది ఉన్న భారతదేశంలో సామాన్య ప్రజలకు కూడా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలని, టెక్నాలజీ ఎవరి అబ్బ సొత్తుకాదని ప్రపంచ దేశాలకు ధీటుగా మన యువత నూతన ఆలోచనలు చేయాలన్నారు. టెక్నాలజీ అంటే అమెరికాను..మరో దేశం కాదని కొత్తగా ఆలోచించడమే టెక్నాలజీ అని సమస్యను గుర్తించడమే కాదు... పరిష్కరించగలగాలని ఆయన పేర్కొన్నారు. ఇన్నోవెషన్ అంటే ఆర్టిఫిషియల్‌గా ఆలోచించడమే ➪ 7వ పేజీలో...

ఔరా..!



పీఎన్‌బీ స్కాం దద్దరిల్లిన పార్లమెంట్
ఉభయ సభల్లో రభస.. వాయిదా 10

ఉద్యోగాల పేరుతో అఘాయిత్యాలు

• యువతులకు మత్తు మందిచ్చి రేప్.. ఆపై వ్యభిచారం

• బాధితుల్లో నిందితుడి కుమార్తె • నిందితుడు అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కూతురు స్నేహితులు, ఇరుగు పొరుగున నివసించే యువతులకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేయడంతో పాటు ఆపైన వ్యభిచారం చేయిస్తున్న ఒక నీచుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రబుద్ధుడు చివరకు కన్న కూతురిపై అఘాయిత్యానికి పాల్పడటంతో పాటు రొంపిలోకి దించాడని పోలీసులు పేర్కొంటున్నారు. సదరు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. యూసుఫ్‌గూడ బస్తీ ప్రాంతంలో నివసించే ఒక వ్యక్తి ఇరుగు పొరుగున నివసించే యువతులతో ➪ 9వ పేజీలో...



సంజ్వాన్ ఆర్మీ దాడి రూపకర్త ముఫ్తీ వకాస్ హతం

హత్వార్ ఎన్‌కౌంటర్‌లో కాల్చివేత • సోపియాన్‌లో ఇద్దరు మిలిటెంట్లు హతం • నలుగురు పౌరులు మృతి

11 లో

ఢిల్లీకి కేసీఆర్ యాక్షన్ ప్లాన్

లోక్‌సభ జట్టు ఎంపికపై సీఎం కసరత్తు



ఫైల్

- తనతోపాటు ఆరుగురు మంత్రులకు ఎంపీలుగా ఛాన్స్
- 2019 ఎన్నికలకు ద్విముఖ వ్యూహం రెడీ
- నల్లగొండ పార్లమెంట్, గజ్వేల్ అసెంబ్లీ స్థానాలకు కేసీఆర్ పోటీ
- మెదక్ పార్లమెంట్, సిద్ధిపేట అసెంబ్లీ స్థానాల బరిలోకి హరీశ్‌రావు
- ఖమ్మం నుండి తుమ్మల..వరంగల్ నుండి కడియం శ్రీహరి పోటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ రాజకీయ ప్రవేశ ప్రకటనతో సంచలనం సృష్టించిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తనతో పాటు ఢిల్లీ వచ్చే టీంను సెట్ చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. తనతో పాటు జాతీయ రాజకీయాలకు అవసరమైన సీనియర్ నేతలతో వ్యూహం సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం, మిగతా 16స్థానాల్లో టిఆర్ఎస్ విజయం సాధించేవిధంగా మాస్టర్‌ప్లాన్ రెడీ చేసినట్లు సమాచారం. మనం.. ఢిల్లీ పోదాం అంటూ కొందరు మంత్రులకు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టిఆర్ఎస్ 11లోక్‌సభస్థానాలలో విజయం సాధించగా, ఆ తర్వాత గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డి టిఆర్ఎస్ గూటికి చేరారు. దీంతో టిఆర్ఎస్ ఎంపీల సంఖ్యాబలం 14కు చేరింది. ఈ దఫా 16ఎంపీ స్థానాలపై గురిపెట్టిన టిఆర్ఎస్.. బలమైన నేతలనే ఎంపీలుగా బరిలోకి దింపాలని నిర్ణయించింది. తద్వారా, థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుతో హస్తినలో చక్రం తిప్పాలని కేసీఆర్ భావిస్తున్నారు.

పార్లమెంట్‌కు హేమాహేమీలు..

బలమైన నేతలను లోక్‌సభ బరిలోకి దించనున్నారు. తనతో పాటు సీనియారిటీ ఉన్న మంత్రివర్గ సహచరులను ఢిల్లీకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. మరోవైపు ఆయా పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ పార్టీని గెలిపించేలా ద్విముఖ వ్యూహం రచిస్తున్నారు. సీఎం నిర్ణయించిన ఎంపీల టీమ్‌లో సీనియర్ మంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీలకు స్థానభ్రంశం తప్పదన్న సంకేతాలు వెల్లడవుతున్నాయి.

ద్విముఖ వ్యూహం..

- కేసీఆర్ ప్రస్తుతం గజ్వేల్ శాసనసభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో గజ్వేల్‌తోపాటు, నల్లగొండ లోక్‌సభ స్థానానికి పోటీ చేయనున్నట్లు సంకేతాలు ఇచ్చారు.
- నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావును కూడా ఢిల్లీ రమ్మని కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన సిద్దిపేట అసెంబ్లీ స్థానంతోపాటు, మెదక్ పార్లమెంట్ స్థానానికి కూడా పోటీ చేసే అవకాశం ఉంది.
- మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నుండి పోటీ చేస్తే ఆ జిల్లా అంతా ఫలితాలు ఏకపక్షంగా ఉంటాయని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ క్రమంలో తుమ్మలను ఖమ్మం పార్లమెంట్‌కు, ఎంపీ శ్రీనివాసరెడ్డిని పాలేరు అసెంబ్లీ స్థానాల్లో పోటీకి దించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.
- ఇక పార్టీ ఆవిర్భావం నుండి తనను వెన్నంటి వున్న మంత్రి ఈటల రాజేందర్‌ను కరీంనగర్ నుండి, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని వరంగల్ నుండి లోక్‌సభ బరిలోకి దింపాలని సీఎం యోచిస్తున్నారని పార్టీ వర్గాల సమాచారం.

వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డిని కూడా నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయిస్తారని తెలుస్తోంది. సికింద్రాబాద్ నుండి మంత్రి పద్మారావు లేదా తలసాని శ్రీనివాసయాదవ్‌లలో ఒకరిని బరిలో నిలిపే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

ఎన్నికల నాటికి అప్పటి రాజకీయ పరిస్థితులను బట్టి కొన్ని మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉన్నా.. హేమాహేమీలను లోక్‌సభ రేసులో నిలపాలన్నది సీఎం వ్యూహం. ఈసారి బాల్కసుమన్‌ను అసెంబ్లీకి పంపించి, పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి వివేక్‌ను పోటీ చేయిస్తారని చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. మహబూబ్‌నగర్ నుండి శ్రీనివాసగౌడ్ పేరు తాజాగా వినిపిస్తుండగా.. భువనగిరి నుండి ఉమామాధవరెడ్డి, ఆదిలాబాద్ నుండి రమేష్ రాథోడ్, మహబూబాబాద్ నుంచి రెడ్యానాయక్, మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డిని చేవెళ్ళ నుండి, చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిని మల్కాజగిరి నుండి పోటీచేయించే అవకాశాలపై పార్టీలో చర్చ జరుగుతోంది. ఎంపీలుగా అవకాశం లభించని వారికి అసెంబ్లీ టిక్కెట్లిచ్చి సర్దుబాటు చేసే అవకాశాలున్నాయని తెరాస వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా భవిష్యత్ రాజకీయం ముఖచిత్రం కొత్తరూపు సంతరించుకోనుందని స్పష్టమవుతోంది.

హస్తినలో పాలాభిషేకం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : జాతీయ పార్టీలతో సాధ్యం కాని పనిని ప్రాంతీయ పార్టీలతో సాధ్యమయ్యేలా తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తారని పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రఘువీర్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద జై కేసీఆర్ - జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ పలువురు తెలంగాణా ప్రతినిధులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలు రాష్ట్రాల వారి మన్ననలు పొందిన కేసీఆర్‌కు వివిధ పార్టీలు మద్దతు పలుకుతున్నాయని రఘువీర్ అన్నారు. తెలంగాణా ప్రజల జేజేలు అందుకుంటున్న కేసీర్ పూరించిన శంఖారావంతో భారతదేశం గర్విస్తుందని చెప్పారు. థర్డ్ ఫ్రంట్‌కు కేసీఆర్ నాయకత్వం వహించి విజయవంతంగా ముందుకు నడపాలని రఘువీర్ విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే భారత్ ముందుకు వెళ్తుందని అభిప్రాయపడ్డారు. సాగునీరు, తాగునీరుతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే నంబర్ వన్ సీఎంగా కేసీఆర్ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారని రఘువీర్ చెప్పారు. ఢిల్లీలో కూర్చుని యావత్ భారతదేశానికి దిక్సూచిగా ఉండాలని ఆయన కోరారు.

నవభారత నిర్మాణానికి.. జాతీయ ఎజెండా

- సీఎం కేసీఆర్ కార్యాచరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నవభారతనిర్మాణం కోసం బలమైన సంకల్పం తీసుకున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మూసరాజకీయాలకు స్వస్తిచెప్పి కొత్త రాజకీయ వ్యవస్థకు ప్రాణం పోసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. కెసిఆర్ ప్రకటించిన బిజెపి, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయ ఫ్రంట్ ప్రతిపాదనకు జాతీయ స్థాయిలో సానుకూలత వ్యక్తమవుతుండగా.. బలమైన ఎజెండాతోనే రాజకీయపార్టీలు, ప్రజల్లో కదలిక తీసుకురావాలని నిర్ణయించారు. వీలు చిక్కినప్పుడల్లా.. ప్రపంచంలోని వివిధ దేశాల పాలనావ్యవస్థలు, అద్భుత విధానాలపై అధ్యయనం చేస్తున్న సిఎం కెసిఆర్.. 130కోట్ల భారతదేశాన్ని అద్భుతశక్తిగా మలిచేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వివిధరంగాల నిపుణులతో చర్చించాలని ఇప్పటికే నిర్ణయించగా, అంతకుముందే తన మదిలో ఉన్న ఆలోచనలతో.. అజెండా రూపొందించాలని భావిస్తున్నారు. బిజెపి, కాంగ్రెస్‌లు తాను ప్రకటించే ఎజెండాను తప్పకుండా ప్రస్తావించాల్సిన అనివార్యత తెచ్చేలా దీనిని రూపొందిస్తున్నారు.

ప్రధాన అంశాలు ఇవీ..

దేశంలో అందుబాటులో ఉన్న 70వేల టిఎంసిల నీటిని సంపూర్ణంగా వినియోగించేలా ప్రణాళిక రూపొందించి.. శాశత్వంగా సాగునీరు, తాగునీరు సమస్యను తరిమికొట్టాలని కెసిఆర్ ప్రతిపాదించనున్నారు. సాగునీటి ప్రాజెక్టులన్నింటికీ ర్యాపిడ్ అనుమతులు, తెలంగాణలో ఈ-పాస్ విధానం దేశమంతా పరిశ్రమలకు అమలు, భారీగా ఉద్యోగాల కల్పన.. దేశమంతా 24గంటల కరెంట్ సాధ్యమేనని కెసిఆర్ ప్రకటించనున్నారు. ప్రధానంగా నదీజలాల వివాదాలు, సమస్యలు.. తాగునీరు, సాగునీరు, కరెంట్ దేశమంతా 24గంటలు ఇచ్చే ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. దేశానికి స్వాతంత్ర్యం లభించి 70ఏండ్లు గడిచినా ఇంకా తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు పడుతున్న వైనాన్ని.. ప్రస్తావిస్తున్న కెసిఆర్ ఐదేళ్ళలోనే సమస్యను శాశ్వతంగా పరిష్కరించే ప్రణాళికపై నిపుణులతో చర్చిస్తున్నారు. సామాన్యుడికి అందుబాటులో న్యాయవ్యవస్థను తీసుకురావడం, పాలసీ నిర్ణయాల్లో ముఖ్యమంత్రులకు భాగస్వామ్యం, రాష్ట్రాలకు కీలక హక్కులన్నీ బదలాయించేలా రాజ్యాంగ సవరణలు, ప్రభుత్వ రంగసంస్థలకు ఊపిరిలూదడం.. మూతపడ్డప్రభుత్వ సంస్థలను తెరిపించడం , దేశ అభివృద్ధిలో టాటా, అంబానీ వంటి పారిశ్రామిక దిగ్గజాల సహకారం తీసుకోవడం, ఆకుపచ్చ భారత్ కోసం గ్రీన్ బెటాలియన్‌ల ఏర్పాటు వంటి నినాదాలను కెసిఆర్ ఇవ్వబోతున్నారు. దేశంలో ఉన్న బిజెపి, కాంగ్రెసేతర రాజకీయపక్షాలను ఒకేవేదిక మీదికి తీసుకొస్తానని చెబుతున్న కెసిఆర్. జాతీయ స్థాయి ఎజెండాను రూపొందిస్తున్నారు. నదుల అనుసంధానం.. అంతర్రాష్ట్ర నదీజలాల సమస్య పరిష్కారం , అన్ని మతాలను గౌరవించే సంస్కృతిని పెంపొందించేలా పథకాలకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అమలుచేయబోతున్న రైతుకు పెట్టుబడి పథకాన్ని దేశవ్యాప్తంగా అమలుచేస్తామని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు, జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వంటి అస్త్రాలను బయటికి తీయనున్నారు. అమలుచేస్తున్న సంక్షేమపథకాలను జాతీయ స్థాయి అజెండాలో చేరిస్తే.. పెద్ద చర్చనీయాంశమవుతాయన్న అంచనాలో నేతలు ఉన్నారు. జాతీయస్థాయి పరిస్థితులు పూర్తిగా అవగాహన చేసుకుని.. అందుకు అనుగుణంగా ఆకర్షణీయ ఎజెండా రూపొందించాలని కెసిఆర్ భావిస్తున్నారు. గత ఫ్రంట్‌లకు భిన్నంగా.. వాదాలు, నినాదాలను తెరపైకి తేనున్నారు. దేశ భవిష్యత్తుపై కొత్త ఆశలు కల్పించాలని నిర్ణయించారు.

థర్డ్ ఫ్రంట్‌కు వామపక్షాలు కలిసిరావాలి

- ఆంధ్రా పార్టీలు భాగస్వాములు కావాలి
- దేశరాజకీయాలను నిర్దేశించేది సీఎం కేసీఆరే
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి వెల్లడి

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు ప్రత్యామ్నయంగా దేశంలో తృతీయ ప్రత్యామ్నయానికి ఏర్పాటు కావాల్సిన అవసరం ఆసన్నమైందని, విబేధాలు పక్కన పెట్టి వామపక్ష పార్టీలు కలిసిరావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలంటే దేశ రాజకీయాలల్లో థర్డ్ ఫ్రంట్ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర సారధి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలవుతున్నాయన్నారు. సోమవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ రాజకీయాలను నిశితంగా పరిశీలించిన కేసీఆర్ వ్యవస్థ ప్రక్షాళనకు రాజకీయ పునరేకీకరణ జరుగాలని నిర్ణయానికి వచ్చారన్నారు. తృతీయ ప్రత్యామ్నయ ఏర్పాటుకు దేశ వ్యాప్తంగా వివిధ పార్టీలు, వ్యక్తుల ముందుకు వస్తున్ననేపథ్యంలో వామపక్ష పార్టీలు తమ సిద్ధాంతాలను కొనసాగిస్తూనే బేధాలు మరిచి ఏకం కావాలని కోరారు. ప్రత్యేక ప్రతిపత్తి కోసం పోరాడుతున్న



ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పార్టీలు సైతం భాగస్వాములు కావాలని సూచించారు. ప్రశ్నించే తత్వాలు అలవర్చుకునే బావాలు ఉన్న వామపక్ష పార్టీలు బలంగా ఉండాలని దేశంలో వస్తున్న మార్పుకు అనుగుణంగా వారి సైద్ధాంతిక సిద్ధాంతాలను మార్చుకుని కాంగ్రెస్, బీజేపీ లకు ప్రత్యామ్నాయంగా కలిసి రావాలని కోరారు. తెలుగుదేశం పార్టీని కూడా తృతీయ ప్రత్యామ్నయంలో భాగస్వామ్యం కోసం ఆహ్వానిస్తామని కడియం వెల్లడించారు. వేలకోట్ల బ్యాంకు డిపాజిట్లు లూటీ జరుగుతుంటే ప్రధాన మంత్రి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, బ్యాంకుల భద్రత విషయంలో దేశ ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారని శ్రీహరి అన్నారు. తెలంగాణరాష్ట్ర అధికారంలోకి వచ్చిన మూడేళ్లల్లోనే అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని, ఇలాంటి పథకాలను దేశవ్యాప్తంగా ఎందుక ు అమలు కావడంలేదని ఆయన ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రపంచ చిత్రపటంలో భారత దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికేసిఆర్ తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు చేసిన ప్రకటనను తామంతా స్వాగతిస్తున్నట్లు శ్రీహరి వెల్లడించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి చందూలాల్, జెడ్పీ ఛైర్‌పర్సన్ జి. పద్మ, నగరమేయర్ నన్నపునేని నరేందర్, ఎంపీ పసునూరి దయాకర్, రాష్ట్రపౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి,. ఆగ్రోస్ ఛైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, గొర్రెల, మేకల కార్పొరేషన్ ఛైర్మన్ కన్నెబోయిన రాజయ్యయాదవ్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభకు సంతోష్, నోముల!

నేడు అభ్యర్థులను ప్రకటించనున్న తెరాస

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు టిఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులను మంగళవారం ప్రకటించే అవకాశం ఉందని పార్టీవర్గాలు తెలిపాయి. సోమవారం రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీచేయగా, ఈ నెల 12వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ క్రమంలో ఆదినుండి ముఖ్యమంత్రి వెన్నంటే నిలిచి.. పార్టీ వ్యవహారాల్లో సిఎంకు కుడిభుజంగా, తలలో నాలుకలా వ్యవహరిస్తున్నాడన్న పేరున్న జోగినిపల్లి సంతోష్‌కుమార్ పేరును ఇప్పటికే సిఎం ఖరారు చేసినట్లు సమాచారం. యాదవవర్గానికి సంబంధించి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నేత నోముల నర్సింహ్మయ్య వైపు సిఎం మొగ్గుచూపుతున్నట్లు పార్టీవర్గాలలో చర్చ జరుగుతోంది. నల్లగొండ రాజకీయాలపై సిఎం ప్రత్యేకదృష్టి సారించిన నేపథ్యం లో భవిష్యత్ రాజకీయాల దృష్ట్యా ఆయనవైపు మొగ్గు చూప వచ్చని భావిస్తున్నారు. మూడోసీటు విషయంలో.. నల్లగొండ నేతను పరిశీలిస్తే యాదవ స్థానం వరంగల్‌కు దక్కవచ్చన్న చర్చ కూడా పార్టీలో ఉంది. మూడవ రాజ్యసభ స్థానం కోసం సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఉమా మాధవరెడ్డి, నాయిని నర్సింహారెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. మొత్తంగా టిఆర్ఎస్ దక్కించుకునే మూడు రాజ్యసభ స్థానాల అభ్యర్థుల అంశం మంగళవారం కొలిక్కి వచ్చే అవకాశముంది.



మీ నిర్ణయం భేష్

మూడో రాజకీయ కూటమికి అజిత్ జోగి మద్దతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యా మ్నాయంగా మూడో రాజకీయ కూటమిని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, జనతా కాంగ్రెస్ నాయకుడు అజిత్ ప్రమోద్ కుమార్ జోగి మద్దతు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయన సోమవారం కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆ రెండు జాతీయ పార్టీల విధానాలపై దేశ ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని, ఈపరిస్థితుల్లో మీ నిర్ణయం ఎంతో హర్షించదగినదని పేర్కొన్నారు. భారత రాజకీయాఇల్లో మీ పయనం తప్పకుండా విజయవం తమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యా మ్నాయ రాజకీయ కూటమికి తనవంతు మద్దతుగా మిగతా నేతలతోనూ చర్చించి సానుకూల పరిస్థితులకు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

జాతీయ రాజకీయాల్లో తృతీయ రాగాలు

కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రకటనతో ప్రాంతీయ పార్టీల్లో కదలిక

- బీజేపీ-కాంగ్రెస్సేతర కూటమి దిశగా అడుగులు
- 2019 సార్వత్రిక సమీకరణాలపై చర్చోపచర్చలు



న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో కుదుపు మొదలైంది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందే తృతీయ ఫ్రంట్ వాదన తెరపైకి వచ్చింది. కేంద్రంలోని అధికార బీజేపీ (ఎన్డీయే) రాష్ట్రాలపై పెత్తనం చేయడాన్ని ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. నిధుల విడుదలలో వివక్షఅసంతృప్తులకు ప్రధాన కారణమైంది. దాంతో కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి అనివార్యమన్న భావనకు ప్రాంతీయ పార్టీలు వచ్చాయి. తెలంగాణ ముఖ్యమంత్రి, తెరాస అధినేత కల్వకుంట్ల కేసీఆర్ నేరుగా కేంద్రంపై ఎదురుదాడికి దిగారు. రాష్ట్రాల హక్కుల పరిరక్షణ, అభివృద్ధికి ప్రత్యామ్నాయ కూటమి అనివార్యమని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో తృతీయ ఫ్రంట్ వాదన మళ్లీ బలం పుంజుకుంది. 70 ప్రజాస్వామ్య పాలనలో నేటికీ ప్రజలు గుణాత్మక మార్పును చూడలేక పోవడం దురదృష్టకరం. బీజేపీ స్థానంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా కొత్తగా వచ్చే మార్పేమీ ఉండదు అన్న కేసీఆర్ వ్యాఖ్యలను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీల నేతలు బలపర్చడం తృతీయ ఫ్రంట్ అవసరాన్ని సమర్థించినట్లయింది.

కేసీఆర్‌తో కలిసి పనిచేసేందుకు తాను సిద్ధమేనని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. అదేవిధంగా జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ కూడా తృతీయ వాదానికి మద్దతిచ్చినట్లు తెలుస్తోంది. ఇక తెలుగు రాష్ట్రాల్లోని ఎంఐఎం, జనసేన పార్టీలు కొత్త ఫ్రంట్‌ను స్వాగతిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు, బీజేపీకి దూరంగా ఉంటున్న పార్టీలతో కేసీఆర్ సంప్రదింపులు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని డీఎంకే, కమల్‌హాసన్ పార్టీలతో ఇప్పటికే తెరాస అధినేత ఫోన్ సంభాషణ జరిపారు.


ఒకవేళ తృతీయ ఫ్రంట్ ఏర్పాటు వాదం బలం పుంజుకుంటే, ఏయే పార్టీలు ఇటువైపు అడుగులు వేస్తాయన్న అంశంపై చర్చ జరుగుతోంది. 2019 ఎన్నికల్లో బీజేపీ 200 సీట్లకు, కాంగ్రెస్ 100 సీట్లకు పరిమితం అయితే, తృతీయ ఫ్రంట్ వ్యూహం ఫలిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తెరాస, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే జేడీఎస్, ఏజీపీ, జార్ఖండ్ వికాస్ మోర్చా, బీజేడీ, నాలుగు వామపక్ష పార్టీలు, బీఎస్పీ, జమ్ము-కాశ్మీర్ పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ, ఎంఐఎం, జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజా తాంత్రిక్), నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, జార్ఖండ్ ముక్తిమోర్చా, కేరళలోని సోషలిస్టు జనతాపార్టీ (డెమొక్రాటిక్), ఆమ్‌ఆద్మీ, వైకాపా తదితర పార్టీలు ప్రస్తుతానికి తటస్థంగా ఉన్నాయి. 542 మంది సభ్యుల లోక్‌సభలో వీరి 150కి పైగానే ఉంటుంది. ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీ అయిన శివసేన కొద్దిమాసాలుగా బీజేపీకి తెగతెంపులకు సిద్ధంగా ఉంది. ఇదే నిజమైతే తృతీయంవైపు ఉద్ధవ్ థాక్రే మొగ్గు చూపొచ్చు. వీరికి 18 మంది ఎంపీల బలం ఉంది. అదేమాదిరి 37మంది సభ్యులు కలిగిన అన్నాడీఎంకే బీజేపీకి బయట నుంచే మద్దతిస్తోంది. ఎన్నికల వేళ పళనిస్వామి ప్రత్యామ్నాయ కూటమి దిశగా అడుగులు వేసే అవకాశాలు లేకపోలేదన్నది విశ్లేషకుల వాదన.

25 ఎంపీ స్థానాలున్న ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ఎన్డీయేలో భాగస్వామ్య పక్షంగా ఉంది. అయితే, ప్రత్యేక హోదా జగడం నేపథ్యంలో 2019 ఎన్నికల్లో పొత్తు ఉంటుందన్న గ్యారెంటీ కనిపించడం లేదు. మరొకవైపు వైకాపా సమయం కోసం వేచిచూస్తోంది. ఈ రెండింటిలో ఏదోఒక పార్టీ తృతీయ పక్షానికి చేరువ అయ్యే అవకాశం లేకపోలేదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ బలహీనపడిన క్రమంలో బీహార్‌లోని ఆర్జేడీ, యూపీలో సమాజ్‌వాది పార్టీ, జమ్ము-కాశ్మీర్‌లోని ఫరూఖ్ అబ్దుల్లాకి చెందిన ఎన్సీపీ పార్టీల మద్దతు పొందగలిగితే కాంగ్రెస్-బీజేపీయేతర కూటమి మరింత శక్తివంతంగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది.


1991లో జార్ఖండ్ ముక్తిమోర్చా పార్టీ నేషనల్ ఫ్రంట్‌లో భాగస్వామి అయింది. 1996లో ఈ ఫ్రంట్‌కు గడ్డుకాలం వచ్చిపడింది. తమిళనాడులోని డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలను కలుపుకు పోయే ప్రయత్నం బెడిసికొట్టింది. ఫలితంగా కూటమి నుంచి డీఎంకే బయటకు వెళ్లింది. దీనికితోడు తెలుగుదేశం పార్టీలో ఏర్పడిన సంక్షోభం ఎన్టీఆర్ పార్టీని మైనార్టీలో పడవేసింది. అనంతరం రామారావు మరణించడంతో కూటమి చెల్లాచెదురైంది.

నేషనల్ ఫ్రంట్ (1989-1991)

దేశ రాజకీయాల్లో కాంగ్రెస్సేతర, బీజేపీ యేతర మూడో కూటమికి మొదటిసారిగా 1989లో బీజం పడింది. జనతాదళ్ నేతృత్వంలో నేషనల్ ఫ్రంట్ కూటమి ఏర్పాటైంది. దానికి నాటి తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీ రామారావు అధ్యక్షుడిగా ఉన్నారు. వీపీ సింగ్ కన్వీనర్‌గా వ్యవహరించారు. కూటమి తరపున వీపీసింగ్ ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టాడు. ఆ తర్వాత 1990లో చంద్రశేఖర్ ప్రధాని పీఠాన్ని అధిష్టించారు. ఈ కూటమిలో జనతాదళ్, తెలుగుదేశంపార్టీ, ద్రావిడ మున్నేట్ర కజగం, అసోం ఘనపరిషత్, ఇండియన్ కాంగ్రెస్ (సోషలిస్టు) పార్టీలు సభ్యులుగా ఉన్నాయి. లెఫ్ట్ ఫ్రంట్ బయట నుంచి మద్దతు ఇచ్చింది.



యునైటెడ్ ఫ్రంట్ (1996-98)



1996 సార్వత్రిక ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజార్టీ లభించలేదు. కాం గ్రెస్‌కు 140, బీజేపీకి 161 సీట్లు వచ్చాయి. అతిపెద్ద పార్టీగా అవ తరించిన బీజేపీ తరపు న వాజ్‌పేయి ప్రధాని గా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్ద తును కూడగట్ట లేక పోవ డంతో 13 రోజులకే బీజేపీ ప్రభుత్వం పడిపోయింది. ఈ సమయంలో మరోసారి ప్రాంతీయ పార్టీలు ఒక్కటయ్యాయి. నేషనల్ ఫ్రంట్ స్థానంలో కొత్తగా యునైటెడ్ ఫ్రంట్ ఆవిర్భవించింది. జనతాదళ్, సమాజ్‌వాది పార్టీ, డీఎంకే, టీడీపీ, ఏజీపీ, ఆల్‌ఇండియా ఇందిరా కాంగ్రెస్ (తివారి), నాలుగు వామపక్ష పార్టీలు, తమిళ మనీలా కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ కలిసి 1196-98 ప్రాంతంలో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఈ కూటమికి కర్నాటక ముఖ్యమంత్రి, జనతాదళ్ నాయకుడు దేవెగౌడ ప్రధానిగా ఎన్నికయ్యారు. కొద్దికాలం తర్వాత దేవెగౌడ ప్రభుత్వం పడిపోయింది. బయట నుంచి మద్దతిచ్చిన కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించింది. ఆ తర్వాత ఐకే గుజ్రాల్ ప్రధాని అయ్యారు. ఈ రెండు ప్రభుత్వాలకు సీతారాం కేసరి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ బయటనుంచి మద్దతు ప్రకటించింది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు యునైటెడ్ ఫ్రంట్‌కు కన్వీనర్‌గా వ్యవహరించారు. 19 మార్చి 1998లో గుజ్రాల్ ప్రభుత్వం కూడా పడిపోయింది. దీంతో మళ్లీ ఎన్నికలు అనివార్యం అయ్యాయి. యునైటెడ్ ఫ్రంట్ అధికారాన్ని కోల్పోయింది.

ఆస్కార్‌లో కొత్తకోణం

(మొదటిపేజీ తరువాయి)

''గెట్ అవుట్'', ''డాకెస్ట్ అవర్'', ''ది ఫ్లోరిడా ప్రాజెక్ట్'', ''డన్‌కిర్గ్'', ''ఫాంటమ్ త్రెడ్'', ''ది పోస్ట్'', ''కాల్ మీ బై యువర్ నేమ్'', ''లేడీబర్డ్'', ''త్రీ బిల్ బోర్డ్స్ ఔట్‌సైట్'' చిత్రాలు హోరాహోరీ పోటీనిచ్చాయి. వేటికవే వివిధ అంతర్జాతీయ వేదికలపై ప్రత్యేక గుర్తింపు సాధించాయి. ఇవన్నీ కూడా 2017లో విడుదలై భారీ వసూళ్ళు రాబట్టాయి. ఈ చిత్రాలన్నింటిలో గతంలో ఆస్కార్ అవార్డులు పొందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు ఉన్నారు. వీటిలో అత్యధికం మానవ సంబంధాల నేపథ్యంలో రూపుదిద్దుకున్నవే. కానీ వీటన్నింటిని కాదని ''ది షేప్ ఆఫ్ వాటర్''కు అవార్డు దక్కింది.

''ది షేప్ ఆఫ్ వాటర్''లో ప్రధాన పాత్రధారి ఓ మూగ యువతి. నీటిలో ఉండే ఓ ప్రాణితో ఆమెకు అనుబంధం ఏర్పడుతుంది. అది పరస్పర ప్రేమగా మారు తుంది. ఇదంతా కల్పితగాథ. పూర్తిగా ఓ సైన్స్ ఫిక్షన్ కథనం. ప్రధాన స్రవంతి సినిమాల కథనానికి ఇది చాలా దూరమే. నామినేట్ అయినప్పటికీ ఈ చిత్రం చివరివరకు పోటీలో నిలుస్తుందని ఎవరూ భావించలేదు. కానీ న్యాయనిర్ణేతల ఆలోచనా వైఖరిలో వచ్చిన మార్పు ఈ చిత్రానికి ఆస్కార్ దక్కేందుకు దోహదపడింది.

గుల్లెర్మో డెల్ టోరో దర్శకత్వం వహించిన ''షేప్ ఆఫ్ వాటర్'' చిత్రం శాలి హేకిన్స్ ప్రధాన పాత్ర పోషించింది. ఎలిసా ఎస్పోసిటో పాత్రలో ఆమె జీవించింది. చిత్రంలో ఈ పాత్ర మూగయువతి. అంతేకాదు.. ఓ అనాథ. చిన్నతనంలో ఒంటి నిండా దెబ్బలతో ఓ కుటుంబానికి ఆ బాలిక తారసపడుతుంది. కాలగమనంలో ఒంటరిగానే జీవిస్తుంది. 1962 ప్రచ్ఛనయుద్ధ సమయంలో ప్రభుత్వ రహస్య పరిశోధనాశాలలో ఆమె స్వీపర్‌గా పని చేస్తుంటుంది. ఇదే పరిశోధనాశాలలోని నీటికొలనులో హుమనాయడ్ యాంఫీడియాంగ్‌ను ఆమె కనుగొంటుంది. వాస్తవానికి ఇదొక పురుగుజాతికి చెందిన జీవి. దీన్ని ఇదే పరిశోధనశాలలో శాస్త్రవేత్తగా ఉన్న కల్నల్ రిచర్డ్ స్ట్రిక్‌లాండ్ దక్షిణ అమెరికాలోని ఓ నదిలో పట్టుకుంటాడు. అక్కడి నుంచి ఈ



'షేప్ ఆఫ్ వాటర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ అలెగ్జాండర్ డెస్‌ప్లాట్



'షేప్ ఆఫ్ వాటర్' బెస్ట్‌డైరెక్టర్ అవార్డుతో గుల్లెర్మో డెల్ టోరా

పరిశోధనశాలకు తెచ్చి దీన్ని నీటికొలనులోనే ఉంచి పెంచుతుంటాడు. అంతరిక్షంలో జరిగే యుద్ధాల్లో పాల్గొనేందుకు వీలుగా ఈ జీవికి తర్ఫీదునిస్తుంటాడు. ఆ జీవిని చూసిన ఎలీసాకు దానిపట్ల జాలి కలుగుతుంది. దొంగ చాటుగా దానికి ఆహారాన్ని అందించడం మొదలెడుతుంది. అంచెలంచెలుగా జాలి ప్రేమగా మారుతుంది. ఈ విచిత్రజీవి, ఎలీసాల మధ్య బంధం రహస్య పరిశోధనశాలలోని ఇతర సిబ్బందికి తెలిసిపోతుంది. ఈ జీవిని మరో ప్రాంతానికి పంపే క్రమంలో అంతరిక్షం నుంచి ఈ పరిశోధనాశాలపై దాడి జరుగుతుంది. చివరకు ఈ జీవితోనే కలిసుండాలని ఎలీసా నిర్ణయించుకుంటుంది. టూకీగా ఇదీ కథనం.

చిత్రంలో ఓ మూగ యువతి, హుమనాయడ్ యాంఫీడియాంగ్ రకానికి చెందిన విచిత్ర జీవుల మధ్య ఏర్పడ్డ బంధం భావాతీతమైంది. దీన్ని ప్రదర్శించడంలో శాలిహాకిన్స్ అత్యద్భుత ప్రతిభ కనబర్చారు. రచనా సహకారం కూడా అందించిన దర్శకుడు డెల్టోరో అత్యద్భుతంగా చిత్రీకరించారు. టీఎస్‌జీ ఎంటర్‌టైన్‌మెంట్, డబుల్‌డేర్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఉత్తమ నిర్మాణ విలువలతో చిత్రాన్ని తీశాయి.

ఈ ఫలితం అవార్డుల రూపంలో తిరిగొచ్చింది. వాస్తవానికి ఇంతకంటే లోతైన భావాలు, మానసిక సంఘర్షణల్ని ప్రతిబింబించిన చిత్రాలు పోటీలో ఉన్నాయి. కానీ అవేవీ ఓ నోరులేని యువతి, అంతరిక్షం నుంచి వచ్చిన జీవిల మధ్య ఏర్పడ్డ బంధం ముందు నిలదొక్కుకోలేక పోయాయి. పోటీలో ఉన్న త్రీబిల్‌బోర్డ్స్ ఔట్ సైట్ ఎబ్బింగ్ చిత్రం పైకి కామెడీగా కనిపించేలోతైన మానసికసంఘర్షణ కథాంశంగా కలిగింది. విషాదాన్ని గొంతులోనే దిగమింగుకుని పైకి నవ్వులు పంచే తల్లిపాత్రలో గతంలో ఆస్కార్ అవార్డు పొందిన నటి ఫ్రాన్సెస్ మెక్ డొనాల్డ్ అత్యద్భుతంగా నటించారు. టొరంటో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో దీనికి అవార్డు వచ్చింది. అలాగే ''కాల్ మీ బై యువర్ నేమ్'' చిత్రం లాస్‌ఏంజెల్స్ ఫిలిం ఫెస్టివల్‌లో క్రిటిక్స్ అసోసియేషన్ ఉత్తమ చిత్రంగా అవార్డు అందుకుంది. బేరి ఓల్డ్‌మన్ ఇందులో అత్యద్భుతంగా నటించారు. యుక్తవయసు కొచ్చిన ఒక అమ్మాయి కథతో గ్రేటాగెర్విగ్ తీసిన చిత్రం లేడీబర్డ్. శర్షారోనెన్ ఇందులో ప్రధాన పాత్ర పోషించారు. దీనికి కొన్ని వెబ్‌సైట్లు నూటికి నూరుశాతం రేటింగ్ ఇచ్చాయి. విమర్శకుల ప్రశంసలు ఈ చిత్రానికి దక్కాయి. ఇక పోటీలో ఉన్న మరో చిత్రం ''ది పోస్ట్'' అయితే స్టివెన్‌స్పిల్‌బర్గ్ దర్శకత్వంలో వచ్చింది. ఇందులో టామ్‌హాంగ్స్ మెరిల్‌స్ట్రీట్‌లు ప్రధాన పాత్ర పోషించారు.

యుద్ధం నేపథ్యంలో మీడియా స్వేచ్ఛ అంశంతో ఈచిత్రం రూపొందింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ దీన్ని ఉత్తమ చిత్రంగా ప్రకటించింది. ప్రధాన పాత్రలు పోషించిన టామ్‌హాంగ్స్, మెరిల్‌స్ట్రీట్‌లు ఇద్దరూ గతంలో ఆస్కార్ విజేతలే. మరో చిత్రం డన్‌కర్క్ రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో చోటు చేసుకున్న యదార్థ సంఘటనలను కళ్ళకు కట్టినట్లు చూపించింది. ఇందులోనూ మానవ సంబంధాలు అధికంగానే ఉన్నాయి. కానీ వీటన్నింటికంటే కూడా ఓ మనిషికి మరో గ్రహాంతర జీవికి మధ్య సాగిన అనుబంధానికే ఆస్కార్ పెద్దపీటేసింది.

29న ఎన్టీఆర్ బయోపిక్ ప్రారంభం

వెల్లడించిన నందమూరి బాలకృష్ణ



అమరావతి, ఆంధ్రప్రభ : అగ్ర సినీనటుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జీవితం ఆధారంగా తెరకెక్కించనున్న సినిమా షూటింగ్ ఈనెల 29న ప్రారంభం కానున్నట్లు సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. సోమవారం బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బాలకృష్ణ అసెంబ్లీ లాబీలో కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ సినిమా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తీసే సినిమా కాదని స్పష్టం చేశారు. వచ్చే సంక్రాంతికి ఎన్టీఆర్ బయో పిక్‌ను విడుదల చేసే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రపంచలో ఉన్న తెలుగు ప్రజలందరూ పార్టీలకతీతంగా ఎన్టీఆర్‌ను అభినందించేవారనీ, ఈ సినిమాకు చాలామంది చాలా పేర్లు సూచించారని తెలిపారు. ఈనెల 31, ఏప్రిల్ ఒకటిన లేపాక్షి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బాలకృష్ణ పేర్కొన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతికి జలహారతి నిర్వహించి లేపాక్షి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

బాలకృష్ణకు పలువురి పరామర్శ..

బాలకృష్ణ చేతికి ఇటీవల ఆపరేషన్ జరగడంతో అందుకు సంబంధించిన కట్టుతోనే ఆయన అసెంబ్లీకి వచ్చారు. దీంతో ఆయనను పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరామర్శించారు. ఎన్నో దెబ్బలతో పోలిస్తే ఇది పెద్దదెబ్బకాదని బాలకృష్ణ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

సారీ..!

ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ లేదు

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించి సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యాచరణలో వ్యవసాయ రంగానికి అగ్ర తాంబూలం వేశామన్నారు. ఈ ఏడాది మరింత ప్రాధాన్యత ఇచ్చి రైతు కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేలా చేయాలని ఆలోచించినప్పటికీ ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టడంలో నిబంధనలు అడ్డొస్తున్నాయని అన్నారు. ప్రతి ఏటా వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

ఈ ఏడాది బడ్జెట్‌లో రైతు కుటుంబాలు, వ్యవసాయ రంగం పురోగతికి మరిన్ని ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలు ప్రకటిస్తామని, అందుకు అవసరమైన నిధులను కూడా కేటాయిస్తామని సీఎం స్పష్టంచేశారు. వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నందునే క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని అన్నారు. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టే అంశంపై కూడా రాజ్యాంగ, న్యాయ నిపుణులతో చర్చించానని, రాష్ట్రానికి ఒకే బడ్జెట్ ప్రవేశపెట్టే వెసులుబాటు మాత్రమే ఉందని వారు స్పష్టంచేసినట్లు తెలిపారు. శాఖల వారీగా బడ్జెట్ ప్రవేశపెడితే అనంతరం న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపిన తర్వాతే నిర్ణయాన్ని ప్రకటిస్తున్నామన్నారు. అసెంబ్లీ నియమావళిలోని రూల్ నెంబర్ 150 ప్రకారం ఆదాయ, వ్యయాలు మాత్రమే బడ్జెట్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఇతరత్రా ప్రణాళికలు, సవరణలన్నీ పద్దుల కిందనే పరిగణించాలి తప్ప ప్రత్యేక బడ్జెట్ కింద పరిగణించడానికి వీల్లేదని రాజ్యాంగ నిపుణులు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తుచేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒకసారి వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ సాధ్యంకాని పరిస్థితుల్లో ఉపసంహరించుకున్న విషయాన్ని ఉదహరించారు. కేంద్రంలో రైల్వే బడ్జెట్‌ను కూడా ప్రధాన బడ్జెట్‌లోనే కలిపి ప్రవేశపెడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ ప్రతిపాదనను విరమించుకుందని పునరుద్ఘాటించారు. అయినప్పటికీ అనుకున్న విధంగానే ప్రత్యేక బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయించాలని నిర్ణయించామో ఆ మేరకు ప్రాధాన్యతా రంగాలకు, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు, వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న కులవృత్తులకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తామని, పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తామని సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారు. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్, మహేందర్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉభయ సభల్లో చీఫ్ విప్‌లు పి.సుధాకర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్థిక సలహాదారు జిఆర్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగ్ రావు, రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్య కార్య దర్శి పార్థసారధి, ఆ శాఖ కమిషనర్ జగన్మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట రామిరెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

15న రాష్ట్ర బడ్జెట్

ఈసారి భారీ బడ్జెటే .. కసరత్తు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు

- పన్నుల ఆదాయం పెరగడంతో బడ్జెట్ అంచనాలు పెంచాలని ప్రతిపాదన
- లక్షా 80వేల కోట్లకు బడ్జెట్ ఉండవచ్చని అంచనా
- సాగునీటి రంగానికి రూ. 35వేల కోట్లు ● జనాకర్షక పథకాలకు భారీగా నిధులు ● మండలిలో బడ్జెట్ ప్రాతిపాదించనున్న కడియం శ్రీహరి



ఫైల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారీ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో వృద్ధి 15 శాతానికి పైగా ఉండడంతో ఈ ఏడాది బడ్జెట్ అంచనాలు భారీగా పెరుగుతాయన్న విశ్వాసంతో అధికారులు ఉన్నారు. ఈనెల 15వ తేదీన ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ వార్షిక బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశ పెడుతుండగా, విద్యాశాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శాసనమండలిలో బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. ఈనెల 12వ తేదీనుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. బడ్జెట్‌కు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వంలోని వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు ప్రతిపాదనలను సిద్ధంచేసి ప్రభుత్వానికి అందించారు. ఆర్థిక శాఖ ఈ ప్రతిపాదనలను క్రోడీకరించి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపింది. సీఎం కేసీఆర్ తుది కసరత్తు చేసి శాఖల వారీగా కేటాయింపులపై ఆమోదముద్ర వేయవలసి ఉంది.

గత ఏడాదితో పోల్చితే పన్నుల్లో 15శాతం వృద్ధి నమోదైనందున వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ పద్దు 15 శాతానికిపైగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆర్థికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో లక్షా 49వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఈ మార్క్ లక్షా 80వేల కోట్ల రూపాయల వరకు చేరవచ్చని అధికారులు భావిస్తున్నారు. కొత్త రాష్ట్రం సిద్ధించాక కేసీఆర్ ప్రభుత్వం ఐదవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోంది. అన్ని బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కూడా ఈ రంగానికి భారీ ఎత్తున నిధులు కేటాయించేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో కోటి ఎకరాలను మాగాణిగా చేయాలన్న లక్ష్యంతో ప్రతి బడ్జెట్‌లో నీటి పారుదల రంగానికి రూ.25వేల కోట్లను కేటాయిస్తూ వచ్చారు. ఈ ఏడాది తాగునీటి పారుదల రంగానికి బడ్జెట్‌లో నిధులను మరింత పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతుండడం, వచ్చే ఎన్నికల సమ రంలోనూ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయా లన్న ఉద్దేశంతో ముందుకు సాగుతున్న సీఎం కేసీఆర్ ప్రారం భించిన సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్న సంగతి తెలిసిందే.

సాగునీటి రంగానికి ఈ బడ్జెట్‌లో నిధులను మరింత పెంచాలన్న ఆలోచనతో కేసీఆర్ ఉన్నారు. గత ఏడాది ఈ రంగానికి రూ.25వేల కోట్లు కేటా యించగా, మరో రూ.10వేల కోట్లు పెంచి రూ.35వేల కోట్లను బడ్జెట్‌లో పొందుపరిచే విధంగా ఆర్థిక, భారీ నీటిపారుదల శాఖ అధి కారులు కసరత్తు చేసి ప్రభుత్వానికి నివేదించినట్టు తెలుస్తోంది.

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ రైతు పెట్టుబడి పథకానికి అంకురార్పణ చేసిన సంగతి తెలిసిందే. ఏడాదిలో రెండు పంటలకు రూ.8వేల ఆర్థిక సాయం రైతులకు చేయాలని కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం అమలుకు ఈ బడ్జెట్‌లో రూ.12వేల కోట్లను కేటాయించాలని ప్రతిపాదించారు. ఈ పథకానికి తోడుగా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు ప్రభుత్వ ప్రీమియంతో ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే నిర్ణయించి ఇందుకు సంబంధించిన ప్రకటన కూడా చేశారు.

స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఆర్థికసంస్థ ద్వారా రూ.2వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించనున్నట్టు సీఎం కేసీఆర్ ఇదివరకే ప్రకటించారు. ఈ మేరకు ఈ బడ్జెట్‌లో గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థలకు రూ.2వేల కోట్ల నిధులను ప్రతిపాదించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందు పూర్తి, చివరి బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నందున ప్రజాకర్షక కోణంలో కేటాయింపులు జరిపే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన పథకాలను, కార్యక్రమాలను ప్రకటించి వాటికి బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. పేదింటి వర్గాల మహిళల వివాహానికి సంబంధించి ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పేరుతో ఆర్థికసాయం చేస్తున్న సంగతి తెలిసిందే. రూ.75వేల సాయాన్ని కల్పిస్తున్న ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.లక్షకు పెంచాలన్న నిర్ణయానికి వచ్చింది. బడ్జెట్‌లో ఈ పథకానికి పెద్దఎత్తున నిధులను కేటాయించాలని ప్రభుత్వం ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో యాదవ, కురవ సామాజికవర్గాల వారిని దేశంలోనే అత్యంత సంపన్నులుగా చేయాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ గొర్రెల పథకాన్ని చేపట్టారు.

ఈ పథకాన్ని మరింత విస్తరించేందుకు, విస్తృతపరిచేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని ప్రతిపాదించారు. ఇలా ప్రభుత్వం ప్రారంభించిన అన్ని కార్యక్రమాలు, పథకాలకు అవసరమైన నిధులను కేటాయించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. సంక్షేమం, సాగునీటి రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పంట పెట్టుబడి, మద్దతు పథకం అమలుకు అవసరమైన నిధులను కేటాయించాలని దీంతోపాటు వ్యవసాయ రంగానికి భారీగా కేటాయింపులు జరపాలని సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తున్నట్టు సమాచారం.

శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయినందున వచ్చే రెండు, మూడు రోజుల్లో బడ్జెట్ కేటాయింపులపై సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి ఆర్థికశాఖ చేసిన ప్రతిపాదనలపై తుది ఆమోదముద్ర వేయనున్నట్టు సమాచారం. వచ్చే రెండు, మూడు రోజులు పూర్తిగా ఆర్థికశాఖ అధికారులతో సమాలోచన జరపాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

12 నుంచి శాసనసభ సమావేశాలు

రాష్ట్ర శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమా వేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఉభయ సభలను ఉద్దేశించి ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు మొదలవుతాయి. అసెంబ్లీ కార్యదర్శి వి నర సింహాచార్యులు ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గవర్నర్‌తో కేసీఆర్ భేటీ

- అసెంబ్లీలో 12న ఉభయ సభలనుద్దేశించి ప్రసంగ పాఠాన్ని గవర్నర్‌కు అందించిన సీఎం




ఫైల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం సాయంత్రం రాజ్ భవన్‌లో కేసీఆర్ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 12 తేది నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సీఎం గవర్నర్‌తో సమావేశాలకు సంబంధించిన అంశాలను చర్చించినట్టు తెలుస్తోంది. ఈ నెల 12న ఉభయ సభలను ఉద్దేశించి చేసే ప్రసంగ పాఠాన్ని గవర్నర్‌కు సీఎం అందజేశారు. జాతీయ స్థాయిలో తృతీయ ప్రత్యామ్నాయాన్ని తన సారథ్యంలో ఏర్పాటు చేస్తున్న అంశాన్ని కూడా సీఎం గవర్నర్ దృష్టికి తీసుకొచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ భేటీలో ఇరువురి మధ్య ఇతర రాజకీయ అంశాలు కూడా చర్చకు వచ్చినట్టు చెబుతున్నారు. విభజన సమస్యలపై చర్చించేందుకు ఢిల్లీ వెళ్లిన గవర్నర్ అక్కడ రాష్ట్రపతి రామ్‌నాథ్ గోవింద్, హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన విషయం తెలిసిందే. తన ఢిల్లీ పర్యటన వివరాలను గవర్నర్ కేసీఆర్‌కు వివరించి ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. మరోవైపు తెలుగు రాష్ట్రా ల మధ్య నెలకొన్న విభజన సమస్యలను త్వరిత గతిన పరిష్కరించుకోవాలని గవర్నర్ ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు సూచించినట్టు సమాచారం.

అన్నదాతకు నజరానా

- వ్యవసాయ బడ్జెట్ స్థానంలో రూ. 35వేల కోట్లతో ప్రోత్సాహకాలు
- 'పెట్టుబడి'కి రూ. 13వేల కోట్లు
- సబ్సిడీ గొర్రెల పథకానికి రూ. 7వేలకోట్లు ● చేప పిల్లల పథకానికి రూ. 3వేల కోట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బడ్జెట్‌లో అన్నదాతలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించనుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలకు తోడుగా రూ.35వేల కోట్ల భారీ అంచనా వ్యయంతో మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించనుంది. సాగుకు ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను సాంకేతిక కారణాల వల్ల విరమించుకున్న నేపథ్యంలో అంతకు రెట్టింపు ప్రాధాన్యత ఇస్తూ ప్యాకేజీని ప్రకటించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. రెతుల పెట్టుబడి (విత్తనాలు, ఎరువులు, కొంతమొత్తం కూలీలకు) కోసం ఎకరాకు రూ.4వేల చొప్పున వానాకాలం, యాసంగిలో అందజేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ పథకానికి ఏడాదికి రూ.13వేల కోట్లు అవసరమవుతాయని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలను అందజేసింది. అలాగే సబ్సిడీ గొర్రెల పథకానికి రూ.7వేల కోట్లు, ఉచిత చేప పిల్లల పథకానికి రూ.3వేల కోట్లు కేటాయించనున్నారు. మరో 12వేల కోట్ల అంచనా వ్యంతో కొత్త పథకాలకు ప్లాన్ చేశారు.

పెట్టుబడి మద్దతు పథకాన్ని మే 15 నుంచి అమలు చేయనున్నారు. రైతు సమగ్ర సర్వే ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.23 కోట్ల సాగుభూమి ఉన్నట్టు గుర్తించారు. పాత అంచనాల ప్రకారం 1.55 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. వ్యత్యాసం రావడంతో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భూప్రక్షాళన చేపట్టగా, 1,42,12,816 ఎకరాలు సాగు భూమి ఉందని వెల్లడైంది. దీనికప్రకారం పెట్టుబడి పథకానికి రూ.12వేల కోట్లు అవసరమవుతాయని, ఒకవేళ మొత్తం 1.55 కోట్ల ఎకరాలను పరిగణనలోకి తీసుకుంటే మరో రూ.1000 కోట్లు అదనంగా అవసరమని అధికార వర్గాలు పేర్కొంటు న్నాయి.

దేశంలోనే తొలిసారిగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో వృత్తులను బలోపేతం చేసి భరోసా కల్పించారు. సుమారు రూ.6వేల కోట్లతో సబ్సిడీ గొర్రెల పథకం, రూ.1200 కోట్లతో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న కేసీఆర్ దాదాపు రూ.7వేల నుంచి రూ.8వేల కోట్ల వ్యయం అంచనాలతో వచ్చే ఏడాది నుంచి పెట్టుబడి రాయితీ పథకాన్ని అమలు చేయాలని సంకల్పించారు.

ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఈ పథకం ఉద్దేశాలు, లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించాయి. సాంకేతికంగా, వ్యాపార పరంగా అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ రాష్ట్రం సైతం ఇక్కడ ప్రకటించిన పెట్టుబడి పథకంపై అధికార వర్గాలతో వాకబు చేసింది. అలాగే ఉత్తర్‌ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు అధ్యయనం చేసి వెళ్ళారు. తెలంగాణాలో ఉన్న వ్యవసాయ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితిగతులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, రైతుల్లో ఉన్న అభిప్రాయాలపై కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారించింది. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ద్వారా ఇక్కడి పరిస్థితులపై నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం.

గతంలో అనేక ఒడిదుడుకులు, నిరాదరణ, కష్టనష్టాల మధ్య కొనసాగిన వ్యవసాయ రంగాన్ని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక గట్టెక్కించేందుకు కేసీఆర్ తనదైన శైలిలో చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. తెలంగాణ సాధన ఉద్యమ నేపథ్యంలో ఆయన మదిలో ఉన్న ఆలోచనలు పరిస్థితులకు అనుగుణంగా అమలుకు నోచుకుంటున్నాయి. అన్నదాతల్లో భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంపట్ల రాజకీయాలకు అతీతంగా హర్ష ధ్వానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాన వ్యాప్తంగా ఉన్న 56లక్షల రైతు కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే విధంగా పెట్టుబడి రాయితీ పథకం రూపుదిద్దుకుంది.

రాష్ట్ర ప్రతిష్టను చాటేవిధంగా కొత్త పథకాలు

సీఎం కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా ప్రత్యేక తెలంగాణలో మొట్టమొదటిగా ఏర్పడిన ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాలన్న వ్యూహంతోనే ముందుకు సాగుతున్నారు. రానున్న రోజుల్లో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు వ్యవసాయాన్ని పండగ చేసేందుకు మరిన్ని సరికొత్త పథకాలను ప్రవేశపెట్టేందుకు ప్రస్తుతం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఉచిత విద్యుత్, ఉచిత ఎరువులతో పాటు భవిష్యత్‌లో విత్తనాలు కూడా ఇస్తే రైతులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కల్పించినట్లవుతుందని కేసీఆర్ తన ఆలోచనను కొంతమంది మంత్రివర్గ సహచరులతో పంచుకున్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న, కరవును నివారించేందుకు పొరుగు రాష్ట్రాలకు, తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ప్రకటించనున్న తాజా నిర్ణయాలు ఆదర్శప్రాయం కాబోతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం చిన్న, మధ్యతరహా, భారీ నీటి ప్రాజెక్టులు, బోరుబావుల కింద ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాలకుపైగా వ్యవసాయ భూమిలో పంటలు సాగవుతు న్నాయి. సుమారు 40 లక్షల ఎకరాలు వ్యవసాయ యోగ్యమైనప్పటికీ ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రతియేటా బీడు భూములుగానే మిగులుతున్నాయి. వ్యవసాయ రంగంలో ఆధారపడి జీవిస్తున్న కోటి 20 లక్షల కుటుంబాల్లో సుమారు 40 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర సాగుకు అవసరమైన ముడి సరుకును సబ్సిడీపై అందిస్తున్నా, బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను పంపిణీ చేస్తున్నా గడిచిన మూడేళ్ళ పరిస్థితిని పరిశీలిస్తే వ్యవసాయ రంగంలో ఆశించిన ఫలితాలు ఏమాత్రం సాధ్యం కావడంలేదు. ఈ రంగంపై ఆధార పడిన కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబనను తీసుకురాలేక పోతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన కేసీఆర్ సర్కార్ వచ్చే ఏడాది మరిన్ని కొత్త పథకాలతో, పెద్దఎత్తున నిధుల కేటాయింపుతో అన్నదాతలను ఆదుకోవాలని నిర్ణయించింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 6 మార్చి 2018

సిరియాలో శాంతి సాధ్యమేనా!



హర్షవాక్కు

-వేటూరి శ్రీహర్ష(న్యూఢిల్లీ)

ప్రపంచంలో రెండు ఘర్షణాత్మక ప్రాంతాలున్నాయి. అక్కడ కాల్పుల విరమణ, ఉద్రిక్తతల నివారణకు తీసుకునే చర్యలు ఎటువంటి సత్ఫలితాలను ఇవ్వవు. జమ్మూ-కాశ్మీర్‌లో సరిహద్దు నియంత్రణ రేఖ పొడవునా, రష్యా, ఇరాన్ మధ్య సిరియన్ ప్రాంతాలలో కాల్పుల విరమణ నియమాలు తరచూ హేళనకు గురవుతున్నాయి. అసలీ ఒప్పందాలకు పవిత్రత ఉందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇందులో భాగస్వాములు వాటిని అసలు గౌరవించడం లేదు. బాహ్య శక్తులు సిరియాలో శాంతిని విచ్ఛిన్నం చేశాయి. అమాయకులైన ఆ దేశ పౌరులు తమనుతాము కాపాడుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇది యూరప్ ఖండానికి శరణార్థుల సమస్యను సృష్టిస్తోంది. ప్రపంచంలో తమ బలమెంతో అంచనా వేసుకోవడానికి బాహ్య శక్తులు సిరియాపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. జమ్మూ-కాశ్మీర్‌లో తీవ్రవాద శక్తులకు పాకిస్తాన్ సైతం, ఇతర ముఠాలు ఆజ్యాన్ని పోస్తూ.. హింస నిత్య నూతనంగా ఉండేలా ప్రయత్నిస్తున్నాయి. ఈ రెండు ప్రాంతాలూ పెద్ద యుద్ధాన్ని తెచ్చిపెట్టగల సత్తాను సముపార్జించుకున్నాయి. ప్రపంచానికే ఒక ముప్పులా మార్చేందుకు కొన్ని శక్తులు ఇక్కడ తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌కు తనకంటూ ఒక ప్రత్యేక ప్రణాళిక ఉంది. అది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు నిద్రలేని రాత్రులను మిగల్చడం. సిరియా, రష్యా, ఉత్తర కొరియాలపై అమెరికా తరచూ మండిపడుతూనే ఉంటుంది. ఇది కిమ్‌కు ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ట్రంప్ హెచ్చరికలు, బెదిరింపులు ఇప్పటి వరకూ ట్వీట్లకే పరిమితమయ్యాయి. ఇది సిరియాలో అమెరికా గెరిల్లా యుద్ధానికి దిగేలా చేసింది. సిరియా, ఇరాన్, రష్యా దేశాలు ఉపరితల దాడులనూ, అమాయకులపై కాల్పులను నిలిపివేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది.

మార్చి 15న సిరియాలో అంతర్యుద్ధం ఎనిమిదో సంవత్సరంలోకి ప్రవేశిస్తుంది. ఈ ఏడేళ్ళలో 4లక్షల 65వేల మంది సిరియన్లు యుద్ధంలో మరణించారు. పదిలక్షలమందికి పైగా గాయపడ్డారు. కోటి 20లక్షల మంది అంటే సిరియాలోని సగం జనాభా ఇళ్ళను విడిచి వెళ్ళిపోయారు. ఇదంతా విన్న వారు సిరియాలో ఏం జరుగుతోందని ఆశ్చర్యానికి గురవుతున్నారు. అమెరికా, రష్యా, ఇరాన్‌ల కారణంగానే యూరప్‌కు శరణార్థుల తాకిడి పెరుగుతోందని చాలామందికి తెలియదు. ఇజ్రాయిల్‌తో సిరియా యుద్ధం సాగిస్తుండగా..సిరియన్ ప్రాంతాలలో అమెరికా, రష్యా, ఇరాన్ దేశాలు దాడులు చేస్తున్నాయి. ఈ ప్రాంతాలు ఇజ్రాయెల్ సరిహద్దుకు దగ్గరలో ఉన్నాయి. తమకు సమస్య సృష్టించకుండా అవీపనికి పాల్పడుతున్నాయి.1970-80 దశకంలో క్రిస్టియన్ మిలీషియాతో తలపడుతున్న ముస్లిం మిలీషియా గ్రూపులపై ఇజ్రాయెల్ దయాదాక్షిణ్యాలు లేకుండా విరుచుకుపడింది. లెబనాన్‌ను ఇజ్రాయిల్ దారికి తెచ్చుకుంది. ఇప్పుడు లెబనాన్ శాంతియుత దేశంగా మారిపోయింది. సిరియాలో పరిణామాలు లెబనాన్‌పై రానున్న రోజుల్లో ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయోననే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. స్వాతంత్ర్యం లోపించడంతో పాటు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి సిరియా ప్రభుత్వంలో క్రోధాగ్నిని రగిల్చాయి. ఆ క్రమంలో ఆందోళనకారులపై విరుచుకుపడిన వైనం ప్రజలలో ఆగ్రహాన్ని కలిగించింది. 2011లో చెలరేగిన అరబ్ విప్లవం కారణంగా ట్యునీషియా, ఈజిప్టు అధ్యక్షులు పదవీచ్యుతులయ్యారు. ఇది సిరియాలోని ప్రజాస్వామ్య అనుకూలురకు ఆశలు పెంచింది. ఆ ఏడాది మార్చిలో సిరియాలో శాంతియుత ప్రదర్శనలు సాగాయి. అరబ్ విప్లవానికి అనుకూలంగా గోడమీద రాతలు రాసిన ఐదుగురు పిల్లల్ని అదుపులోకి తీసుకుని, తీవ్రంగా హింసించారు. వీరిలో 13ఏళ్ళ బాలుడు చిత్రహింసలు భరించలేక మరణించాడు.

బషర్ అల్ అసద్ అధ్యక్షతన సిరియన్ ప్రభుత్వం ఆందోళనలను నిర్దాక్షిణ్యంగా అణిచేసింది. వందలాదిమంది ఆందోళనకారులను హతమార్చింది. వేలాది మందిని జైళ్ళలో పెట్టింది. సైన్యాన్ని వీడిన వారు జూలై 2011లో ఫ్రీ సిరియన్ ఆర్మీని ఏర్పాటుచేసినట్లు ప్రకటించారు. తిరుగుబాటు బృందం ప్రభుత్వాన్ని పడగొట్టడమే లక్ష్యంగా చేసుకుంది. ఈ క్రమంలో సిరియా అంతర్యుద్ధంలోకి మెల్లిగా జారిపోయింది. 2011 ఆందోళనలు జాతిభేదం లేకుండా సాగాయి. సాయుధ ఘర్షణలో జాతి భేదాలు ప్రస్ఫుటమయ్యాయి. సిరియాలో ముస్లింలు ఎక్కువగా సున్నీలు. రక్షణ వ్యవస్థను చూసే విభాగంలో అల్వీ తెగ ఆధిపత్యముండేది. అధ్యక్షుడు అసద్ ఇందులో సభ్యుడు. 1982లో అసద్ తండ్రి హమాలోని ముస్లిం సోదరులపై మిలటరీ చర్యకు ఆదేశించాడు. వేలాదిమంది ఇందులో కన్నుమూశారు. హమా పట్టణాన్ని ఆ చర్య ఇంచుమించుగా నిర్జీవం చేసేసింది. 2011లో భూతాపం కూడా తన వంతు పాత్ర పోషించింది. 2007-10మంది సిరియాను తీవ్రమైన కరవు పట్టిపీడించింది. ఈ కారణంగా 15లక్షల మంది గ్రామాల నుంచి పట్టణాలకు తరలిపోయారు. ఇది పేదరికాన్నీ, సామాజిక అస్థిరతను మరింత పెంచింది. సిరియా అంతర్యుద్ధంలో విదేశీ మద్దతు, బహిరంగ జోక్యాలు కీలకపాత్రను పోషించాయి. 2015లో రష్యా ఈ వివాదంలో తలదూర్చింది. అప్పటి నుంచి అసద్ ప్రభుత్వానికి సహాయంగా నిలిచింది. షియా ఆధిపత్యమున్న ఇరాన్, ఇరాక్, లెబనాన్ వేదికగా పనిచేసే హెజ్‌బొల్లాలు అల్ అసద్‌కు మద్దతు పలికాయి.

రష్యా మద్దతు పొందుతున్న అసద్ ప్రభుత్వంపై అమెరికా అనేక పర్యాయాలు తన వ్యతిరేకతను వెల్లడించింది తప్ప లోతుగా జోక్యం చేసుకోలేదు. సిరియాలో రసాయనిక ఆయుధాలను ప్రయోగిస్తే తీవ్రంగా పరిగణిస్తామనీ, అది మిలటరీ జోక్యానికి కారణమవుతుందనీ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హెచ్చరించారు. 2017లో అమెరికా అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొట్టమొదటి మిలటరీ చర్యను చేపట్టింది. సిరియా వైమానిక స్థావరంపై 59 తొమహాక్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. ఖాన్ షేకౌన్‌పై ఇక్కడి నుంచి రసాయనిక దాడి చేసినట్లు అమెరికా విశ్వసించారు. అల్ అసద్‌ను వ్యతిరేకించే రెబెల్ గ్రూపులకు 2013లో సిఐఏ ఒక కుట్ర చేసింది. దీని ప్రకారం ఆ గ్రూపులకు ఆయుధాలందించడం, నిధులను సమకూర్చడం, శిక్షణ గరపడం చేశారు. 500మిలియన్లు ఖర్చు చేసి కేవలం 60మందికి మాత్రమే శిక్షణ ఇచ్చిందన్న నివేదికలు వెల్లడైన అనంతరం సిఐఏ ఆ కార్యక్రమానికి తెరదించింది. ఐఎస్ఐఎల్, అమెరికా బలపరిచే అల్ అసద్ రెబెల్ గ్రూపులను రష్యా తీవ్రవాద బృందాలుగా గుర్తించి, సెప్టెంబర్ 2015లో రష్యా బాంబింగ్ ప్రచారాన్ని నిర్వహించింది. అసద్ రక్షణను బలీయం చేసేందుకు మిలటరీ సలహాదారులను మొహరించింది. సిరియా అంశంపై పశ్చిమ దేశాలు ఐక్యరాజ్య సమితిలో ప్రవేశపెట్టిన తీర్మానాలను రష్యా, చైనా దేశాలు పదేపదే వీటో చేశాయి. సిరియా ప్రభుత్వానికీ, ప్రతిపక్షానికీ మధ్య శాంతి చర్చలు జరిగాయి. కాల్పుల విరమణ, రాజకీయాధికార మార్పునకు వీటిని ఉద్దేశించారు. అల్ అసద్ వద్దే చర్చలు స్తంభించిపోయాయి. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో 2012 జూన్‌లో మొదటి విడత చర్చలు జరిగాయి. తాజా చర్చలు డిసెంబరు 2017లో ఏర్పాటయ్యాయి. అల్ అసద్ భవిష్యత్తులో నిర్వహించాల్సిన పాత్ర గురించి ఇరు పక్షాలు విడుదల చేసిన ప్రకటనల కారణంగా ఆ చర్చలు విఫలమయ్యాయి.

రసాయనిక ఆయుధాలను ఉపయోగిస్తున్నారంటూ అమెరికా సిరియా ప్రభుత్వాన్ని తప్పు పడుతోంది. వాయవ్య సిరియాలో వైపీజీపై జనవరిలో ఎఫ్ఎస్ఏ దాడులు ప్రారంభించింది. అఫిన్‌కు సమీపంలో ఈ దాడులను మొదలుపెట్టింది. ప్రభుత్వ అనుకూల దళాలు కూడా ఈ దాడులలో పాల్గొన్నాయి. విదేశీ దళాలను ఉపసంహరించనంతవరకూ సిరియాలో శాంతి స్థాపన అసాధ్యం. ఈలోగా అమాయకులు తామెందుకు చనిపోతున్నామో... ఏకారణంగా చనిపోతున్నామో కూడా తెలియకుండా కన్నుమూస్తూనే ఉంటారు. ఇది సిరియాలో విషాదం.



ముందస్తు పొత్తుల మాయాజాలం

బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పి) ప్రధానంగా ఉత్తరప్రదేశ్‌కే పరిమితమైన పార్టీగా ముద్రవేసుకుంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లలో అక్కడక్కడ ఉండేవారు. ఆ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ హయాంలో దేశవ్యాప్తంగా శాఖలు ఏర్పడినప్పటికీ, మాయావతి పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ పార్టీ కార్యకలాపాలు ఉత్తరాదికే ఎక్కువగా పరిమితం అయ్యాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా మూడు నాలుగు పర్యాయాలు వ్యవహరించిన మాయావతి స్వరాష్ట్రంలో కూడా పార్టీని పటిష్ఠం చేసుకోలేకపోవడానికి కారణాలు అనేకం. ఆమె పాలనలో అవినీతి ఆరోపణలు రావడం ఒక కారణం అయితే, సమర్థులైన నాయకులకు పార్టీలో ఆమె సరైన గౌరవం ఇవ్వకపోవడం వల్లనే వారంతా ఇతర పార్టీల్లోకి వెళ్ళిపోయారన్నది రెండవ కారణం. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఉత్తర ప్రదేశ్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా బీజేపీలోని గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల ముందు బీఎస్‌పిలో ద్వితీయ శ్రేణి నాయకులందరినీ తమ పార్టీలో చేర్చుకున్నారు. వరుసగా ఓటములతో మాయావతిలో కూడా పునరాలోచనలు ప్రారంభమయ్యాయి. అయితే అవి నిలకడగా ఉండటంలేదు. బీజేపీని ఎదుర్కోవాలంటే, లౌకిక వాద పార్టీలన్నింటినీ కూడగట్టాలన్న నిర్ణయానికి ఆమె వచ్చినట్టు వార్తలు వచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, పూల్పూర్ లోక్‌సభ స్థానాలకు త్వరలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు స్థానాలనూ సమాజ్ వాదీపార్టీకి విడిచి పెట్టి రాష్ట్ర శాసనసభ ద్వారా రాజ్యసభకు జరిగే ద్వైవార్షిక ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా తాను పోటీచేయాలని మాయావతి అనుకుంటున్నట్టు తాజా సమాచారం. అయితే, ఇవి నిరాధారమైన వార్తలంటూ మాయావతి ఖండించారు. రాజకీయాల్లో ద్వితీయ శ్రేణి నాయకులను నమ్మకపోవడం, నిలకడలేనితనం వల్లే ఆమెకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆమె కర్నాటక అసెంబ్లీ ఎన్నికలపై దృష్టిసారించడం విడ్డూరమే. కర్నాటకలో బీఎస్‌పికి సరైన నాయకులు ఎవరూ లేరు. షెడ్యూల్డ్ కులాలు, బడుగు వర్గాల ఓట్లను చీల్చడం కోసమే ఆమెను కర్నాటకకు రప్పిస్తున్నారన్న వాదం నిరాధారం కాకపోవచ్చు. అయితే, మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (ఎస్)ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సీరియస్‌గా పోటీ చేయాలని అనుకుంటోంది. మాయావతి మద్దతుతో దళిత ఓట్లు తమ పార్టీకి దక్కేట్టు చేయాలన్నది దేవెగౌడ ఆలోచనగా కనిపిస్తోంది. మాయావతి కూడా దక్షిణాదిన తమ పార్టీని విస్తరింపజేయడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు. దేశంలో ప్రాంతీయ స్థాయిలో బలంగా ఉన్న పార్టీల మద్దతు సేకరించి జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి పదవికి ఉమ్మడి అభ్యర్థిగా తనపేరు ప్రతిపాదనకు వచ్చేట్టు చేసుకోవాలన్న ఆకాంక్ష మాయావతికి ఉంది. దేవెగౌడతో ఈ ఎన్నికల్లో చేతులు కలిపితే భవిష్యత్‌లో తన చిరకాల కోర్కె తీరేందుకు వీలవుతుందని ఆమె భావిస్తూ ఉండవచ్చు.

కర్నాటకలో మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడతో పొత్తు కుదుర్చుకునేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. దేవెగౌడ పరిస్థితి కూడా దాదాపు అలాంటిదే. ఆయన నేతృత్వంలోని జనతాదళ్ (ఎస్) పార్టీకి దేశంలో ఎక్కడా శాఖలు లేవు. స్వరాష్ట్రంలోనే ఆయన పార్టీకి బలం లేదు. ఉత్తరాదికి చెందిన మాయావతి వచ్చి దేవెగౌడతో కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటే ఎవరికెంత లాభం అని బేరీజు వేస్తే, ఎవరికీ ఉండదన్న సమాధానం వస్తుంది. అయితే, రానున్న లోక్‌సభ





ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువసీట్లు పొందాలన్న లక్ష్యంతో ఆమె పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఉత్తరప్రదేశ్‌లో జనతాదళ్ (ఎస్) బలం అంతంత మాత్రమే. అలాగే, కర్నాటకలో బీఎస్‌పి బలం కూడా అంతే. కర్నాటకలో దళితుల ఓట్లను మాయావతి ఎంతవరకూ చీల్చగలరనేది ఊహాజనితమే. ఎందుకంటే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెనకబడిన వర్గాల నాయకునిగా పేరొందినప్పటికీ, దళితులు కూడా ఆయన పట్ల విశ్వాసాన్ని కలిగి ఉన్నారు.

దళిత నాయకుల్లో సీనియర్ అయిన మల్లికార్జున్ ఖర్గే లోక్‌సభలో కాంగ్రెస్ నాయకునిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలోని దళితులు మాయావతి మాట కన్నా, ఆయన మాటకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అందువల్ల సిద్ధరామయ్య బీసీ ఓట్లనూ, ఖర్గే దళితుల ఓట్లనూ గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడేట్టు చేయగలరని కాంగ్రెస్ అధిష్ఠానం గంపెడాశతో ఉంది. అయితే, సిద్ధరామయ్య ఐదేళ్ళ పాలన పట్ల విసుగు చెందిన వారు బీజేపీ వైపు మొగ్గు చూపకుండా, వారిని తమ పార్టీ వైపు తిప్పుకోవాలన్నది దేవెగౌడ వ్యూహం. కర్నాటక ఎన్నికల్లో మాయావతితో పొత్తు లాభిస్తే, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఇదే ఫార్ములాని అనుసరించాలని దేవెగౌడ ఉద్దేశ్యం. సెక్యులర్ ఓట్లు చీలకూడదని కాంగ్రెస్, జనతాదళ్ (ఎస్)వంటి పార్టీలతో మాయావతి, ఆమె నేతృత్వంలోని బీఎస్‌పి పొత్తు పెట్టుకోవడం కొత్త కాదు.1996లో పీవీ నరసింహారావు నేతృత్వంలో కాంగ్రెస్‌తో బీఎస్‌పి పొత్తు పెట్టుకుంది. అప్పట్లో మాయావతి గురువుఅయిన బీఎస్‌పి వ్యవస్థాపకుడు కాన్షీరామ్ పార్టీ వ్యవహారాలు స్వయంగా చూసుకునే వారు. అవిభక్త ఉత్తరప్రదేశ్ (ఉత్తరాఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటానికి ముందు) అసెంబ్లీలో 425 సీట్లు ఉండేవి. అప్పట్లో బీఎస్‌పి 296 సీట్లకూ, కాంగ్రెస్ 125 స్థానాలకూ పోటీ చేశాయి. కాంగ్రెస్‌తో పొత్తు వల్ల బీఎస్‌పి పరిస్థితి మెరుగుపడింది. ఇప్పుడు అదే మాదిరిగా కర్నాటకలో దేవెగౌడతో పొత్తు వల్ల లాభ పడాలని మాయావతి ఎత్తుగడ.ఆ విషయాన్ని కర్నాటకలో బీఎస్‌పి నాయకులు ధ్రువీకరించడమే కాకుండా, ఆమె అంచనా సరైనదేనని అంటున్నారు.

అయితే, మాయవతి పైనా, ఆమె సన్నిహితులపైన అనేక కేసులు ఉన్నాయి. వాటిల్లో సీబీఐ కేసులు కూడా ఉన్నాయి. ఎన్నికల ముందు సిబీఐని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులపై ఒత్తిడి తేవడంలో కాంగ్రెస్ అనుసరించిన పద్ధతులనే బీజేపీ అనుసరిస్తోంది. మాయావతిపై ఒత్తిడి తేవడానికి బీజేపీ నాయకులు సీబీఐ కేసులను పైకి తేవచ్చని అనుకుంటున్నారు. అలాంటిదేమీ లేని పక్షంలోనే ఆమె దేవెగౌడతో పొత్తు కోసం ప్రయత్నిస్తారని ఆమె సన్నిహితులు అంటున్నారు. అయితే, కాగా, కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టిన రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లో మాయావతితో పొత్తు కోసం అప్పుడే సంకేతాలు పంపినట్టు తెలుస్తోంది. అయితే, ఆమె నుంచి ఇంకా ఎటువంటి సమాధానం రాలేదు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పడాలంటే సమాజ్ వాదీ, బీఎస్‌పీలకు 35 సీట్లు ఇవ్వాలని ఒక నాయకుడు అన్నారు. ఢిల్లీలో ప్రతిపక్షాల సమావేశాలకు మాయావతి ఆమె పార్టీ నాయకులు దూరంగా ఉంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇతర పార్టీలతో తమ పార్టీ పొత్తు పెట్టుకోబోదని సమాజ్ వాదీ పార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. సమాజ్ వాదీ పార్టీతో పొత్తును కాంగ్రెస్‌లో ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. అందువల్ల మాయావతితో పొత్తు కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టు వచ్చిన వార్తలు నిరాధారం కాదని స్పష్టం అవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో రాయబరేలీ, అమేథీ సీట్లనైనా గెల్చుకోవాలన్నట్టయితే ఇతర పార్టీలతో పొత్తు తప్పదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. అయితే, కాంగ్రెస్‌తో పొత్తుకు మాయావతి ప్రాధాన్యం ఇవ్వడంలేదు. దానిని ఆఖరి అస్త్రంగా వినియోగించుకోవాలని ఆమె అనుకుంటున్నట్టు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ ఒకే నాణానికి రెండు వైపుల వంటివని మాయావతి తరచూ వ్యాఖ్యానిస్తున్న సంగతి తెలిసిందే. అందువల్ల కర్నాటకలో కానీ, ఉత్తరప్రదేశ్‌లో కానీ, ఆమె కాంగ్రెసేతర, బీజేపీ యేతర పార్టీలతోనే జత కట్టే అవకాశం ఉందని సన్నిహితులు అంటున్నారు.

-ఎపి స్వామి

ఆవిష్కరణలతోనే రైతు ఆదాయం రెట్టింపు!

దేశంలో ఎన్ని సంస్కరణలు అమలు జరుగుతున్నా, వ్యవసాయ రంగంలో ఇంకా పాత పద్ధతులు, విధానాలే కొనసాగుతున్నాయి. వ్యవసాయ రంగంలో నికరమైన ఆదాయం లేకపోవడం, దీనిపై పెట్టుబడులు లాభదాయకం కాకపోవడం వల్ల కొత్తతరం ఈ రంగంలోకి ప్రవేశించడం లేదు. సంప్రదాయకంగా, తరతరాలుగా ఈ రంగంలో ఉన్న కుటుంబాలకు చెందిన వారు సైతం ఇతర రంగాల వైపు మొగ్గు చూపుతున్నారు. అందువల్లనే ఇప్పుడు వ్యవసాయ రంగం నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉంది. ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటోంది. చిన్న కమతాలను సాగు చేసుకునే రైతుల సమస్యలను గురించి పట్టించుకునే వారేలేరు. చిన్న రైతులకు పెట్టుబడులు లభించడం ఎంత కష్టమో, వారు పండించిన పంటకు గిట్టు బాటు ధర లభించడం అంతకన్నా కష్టం రైతుల ఆదాయాన్ని ఐదేళ్ళలో రెట్టింపు చేస్తానని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇప్పటికి ఎన్నో సార్లు ప్రకటించారు. అది సాకారం కావాలంటే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల మధ్య సమన్వయం ఉండాలి. వృత్తిపరమైన నైపుణ్యం కలిగిన వారి సలహాలు ఉన్నప్పుడు మాత్రమే రైతులకు న్యాయం జరుగుతుంది. అలాగే, చిన్న కమతాల రైతుల సమస్యలను మానవీయ కోణంతో పరిశీలించి పరిష్కరించే యంత్రాంగం ఉండాలి. కొత్త ఆవిష్కరణల ఫలాలు రైతులకు చేరేట్టు చూడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు ధరలూ, బోనస్‌లు అన్నీ పెద్ద రైతులకే చెందుతున్నాయి. రైతుల ఆదాయం పెరగాలంటే కొత్త ఆవిష్కరణలకు స్వాగతం పలకాలని శాస్త్రవేత్తలు తరచూ అంటూంటారు. అందులో అసత్యం ఏమీ లేదు. కొత్త ఆవిష్కరణల సమాచారం ముందుగా అందేది పెద్ద రైతులకే, మధ్యతరగతి, చిన్న రైతులకు ఆ సమాచారం లేదా, కొత్త వంగడాలు అందుబాటులోకి వచ్చేసరికి ఏళ్ళు పడుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నకారు, మధ్యతరగతి రైతుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారు. వాటిలో ప్రధానమంత్రి కృషి సించయి యోజన, భూసార కార్డు పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటివి. ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో రైతులు ఎంతో కాలంగా కోరుతున్న కనీస మద్దతు ధరకు తగిన ప్రతిపాదనలు కూడాచేశారు. పెట్టుబడుల వ్యయంలో 50 శాతం వచ్చేట్టు ఈ ప్రతిపాదనలు చేశారు. ఈ కార్యక్రమాలన్నీ సక్రమంగా అమలు జరిగితే, బడుగు రైతుల ఆదాయాన్ని పెంచుతాయనడంలో సందేహం లేదు, స్వాతంత్ర్యానంతరం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలూ, కార్యక్రమాలు అమలులోకి వచ్చాయి. అయితే, అవి ఏవీ సక్రమంగా అమలు జరగకపోవడం వల్లే రైతుల ఆదాయం మెరుగుపడలేదు. వారి పరిస్థితిలో మార్పు లేదు. మొక్కుబడి పథకాలు, పద్ధతుల కన్నా, ఏయే ప్రాంతాల్లో ఏయే పంటలకు ప్రజల ప్రోత్సాహం లభిస్తుందో అంచనాలు తయారు చేసి వాటినే వేయడం ఉత్తమం. సువిశాల దేశంలో అన్ని ప్రాంతాల్లో పండే పంటలు, ప్రజల ఆహారపు అలవాట్లు ఒకే విధంగా ఉండవు. అంతేకాక, భౌగోళిక పరిస్థితులను బట్టి కూడా పంటలు పండుతాయి. ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టే పథకాల్లో ఈ అంశాలను చేర్చాల్సిన అవసరం ఉంది. రైతులతో వ్యవసాయ విస్తరణాధికారులు తరచూ సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఉండాలి. అలాగే, ప్రయోగశాలల్లో కొత్తగా కనుగునే విత్తనాలు, పద్ధతుల గురించి రైతులకు తెలియజేస్తూ ఉండాలి. లాబ్ టు ఫారమ్ అనే నినాదంతో పూర్వపు ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని కొంత కాలం పాటు సజావుగానే అమలు జేశాయి. అయితే, వాటి కొనసాగింపు సక్రమంగా లేకపోవడం, క్షేత్ర సిబ్బందిలో అలసత్వం పెరిగిపోవడమో జరగడం వల్ల కొత్త ఆవిష్కరణల ఫలితాలు రైతులకు చేరడం లేదు. అలాగే, పండిన పంటలను మార్కెట్ లకు పంపే ఏర్పాట్లలో కూడా రైతులకు క్షేత్ర స్థాయి సిబ్బంది తోడ్పాటును అందించాలి. ఈ సిబ్బంది తరచూ పంటలు పండే ప్రాంతాల్లో పర్యటించకపోవడం వల్ల దళారులే రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పొలాల నుంచి నేరుగా మార్కెట్లకు పంటలను చేర్చేందుకు మోడీ ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే, ఆ పథకం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అమలు జరుగుతోంది. వ్యవసాయ రంగంలో కూడా ప్రైవేటు భాగస్వామ్యాన్ని కల్పించడం కోసం ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పథకాలను అమలు జేస్తోంది. వ్యవసాయ దారులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేట్టు చూడటం, వారు పండించిన పంట మార్కెట్లకు చేరేట్టు చూడటం వంటి కార్యక్రమాలపై పర్యవేక్షణ జరగాలి. లేని పక్షంలో దళారులు సొమ్ము చేసుకుంటారు. దీనిని నివారించడం కోసమే ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యాన్ని (పీపీపీ) పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ పీపీపీ పద్ధతి వాణిజ్య పంటలకు ఎక్కువ ఉపయోగపడుతుంది. మార్కెట్లలో రైతుల పంటకు గిట్టుబాటు లభించేట్టు చూడటానికి ఈనామ్ వేదికను ఏర్పాటు చేశారు. అలాగే, గ్రామాల నుంచి సమీపంలో ఉన్న పట్టణాలు, నగరాలకు వ్యవసాయోత్పత్తులను చేరవేయడానికి మౌలిక సదుపాయాలను పెంచే అంశంపై కూడా ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించింది. వ్యవస్థీకృత మార్పుల ద్వారానే రైతుల ఆదాయం పెరుగుతుంది. ప్రాంతాల వారీగా అమలులో ఉన్న వివిధ పథకాలను సమన్వయ పర్చడం కూడా చాలా ముఖ్యం. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకుని రావల్సి ఉంటుంది. ప్రాంతాల వారీగా ఏయే ఉత్పత్తులకు గిరాకీ ఉంటుందో కనుగొని వాటి ఉత్పత్తులను ప్రోత్సహించడమే కాకుండా, మార్కెటింగ్‌కి సరైన సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది.

-సి

మోడీ వ్యూహానికి విజయం!

ఈశాన్యంలో ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడం ప్రధాని నరేంద్రమోడీ దీర్ఘకాలిక వ్యూహానికి విజయం. కమలనాథులు కూడా ఇదే మాటంటున్నారు. సోమవారం మోడీ పార్లమెంటుకు రాగానే ఆయనకు ఘన స్వాగతం చెప్పారు. త్రిపురలో పాగా వేసేందుకు ఆయన నాల్గేళ్ళ క్రితమే వ్యూహ రచన చేశారు. తన మాదిరిగానే సంఘ్ పరివార్‌లో శిక్షణ పొంది రాటు తేలిన ముగ్గురు నాయకులకు ఆ వ్యూహాన్ని అమలు జరిపే బాధ్యత అప్పగించారు. అది ఫలించడం వల్లనే పాతికేళ్ళుగా అక్కడ అధికారంలో కొనసాగుతున్న మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెళ్ళగించగలిగారు. నిజానికి మాణిక్ సర్కార్ ఓటమిని ఆ పార్టీ వారే కాక, దేశంలో ప్రగతి శీల, ప్రజాస్వామ్య శక్తులేవీ జీర్ణించుకోలేకపోతున్నాయి. దీర్ఘకాలం అధికారంలో ఉన్నా ఆయన ఆదాయం లక్షల్లో మాత్రమే ఉందంటే, సర్పంచ్ పదవితోనే కోట్లకు పడగలెత్తే నాయకులున్న మన దేశంలో ఇలాంటి వారున్నారా అన్న ఆశ్చర్యం ఎవరికైనా కలగక తప్పదు. అయినప్పటికీ మాణిక్ సర్కార్ ప్రభుత్వం ఓటమి పాలవడానికి కారణం స్వయం కృతం ఆయనకు వృద్ధాప్యం పైబడటం... పార్టీ శ్రేణుల్లో నిర్లిప్తత చోటు చేసుకోవడం... ప్రత్యర్థులతో సమానంగా ఖర్చు చేయగల ఆర్థిక స్థోమత లేకపోవడం... ఇవీ ప్రధాన కారణాలు. వీటన్నింటికీ తోడు అతి విశ్వాసం బెంగాల్‌లో మాదిరిగానే త్రిపురలో మార్క్సిస్టు పార్టీ కొంప ముంచింది. మాణిక్ సర్కార్ నిస్వార్థుడైనప్పటికీ, పార్టీ నాయకుల చేతుల్లో కీలుబొమ్మగా మారి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని కమలనాథుల హోరెత్తించే ప్రచారం కూడా బాగా పనిచేసింది. అంతేకాక, తమ పార్టీ అధికారంలోకి వస్తే యువనాయకత్వానికి అవకాశం ఇస్తామనీ, రాజకీయ ప్రత్యర్థులపై దాడులను అంతమొందిస్తామనీ కమలనాథులు ఇచ్చిన హామీతో జనం నమ్మారు. త్రిపురలో కాంగ్రెస్ చేష్టలుడిగిన పార్టీగా తయారు కావడం బీజేపీకి బాగా కలిసి వచ్చింది. కాంగ్రెస్‌లో గతంలో మాదిరి సంతోష్ మోహన్ దేవ్ వంటి వ్యూహ రచనా నిపుణులు ఎవరూ లేరు.

త్రిపురలో బీజేపీ విజయానికి కృషి చేసిన ముగ్గురూ ఆ రాష్ట్రానికి పరాయి వారే. వీరిలో సునీల్ దేవధర్ మహారాష్ట్రకు, రాంమాధవ్ ఆంధ్రప్రదేశ్‌కీ, హిమంత్ బిశ్వాస్ శర్మ అసోంకి చెందిన వారు. మూడేళ్ళక్రితం వరకూ శర్మ కాంగ్రెస్ వాది. రాహుల్ గాంధీతో విభేదించి బయటికి వచ్చారు. అసోంలో బీజేపీ విజయానికి కృషి చేశారు. త్రిపుర తమకు కొత్త అయినా, అన్ని నియోజకవర్గాల్లో బూత్ స్థాయిలో అంకిత భావంతో పనిచేసే నిజాయితీ పరులైన కార్యకర్తలను ఎంపిక చేసి బృందాలుగా ఏర్పాటు చేశారు. ఇది బీజేపీ విజయానికి కలిసొచ్చింది. బీజేపీ డబ్బు సంచులు కుమ్మరించిందన్న ఆరోపణలు నిరాధారం కాకపోవచ్చు. త్రిపురను ప్రధానమంత్రి మోడీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మేఘాలయలో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, గోవా, మణిపూర్‌లలో మాదిరిగా చిన్న పార్టీల వారినీ, ఇండిపెండెంట్లను సామదానంతో తమ వైపునకు తిప్పుకోవడం వల్ల మేఘాలయ బీజేపీ ఖాతాలో చేరింది. మేఘాలయ రాష్ట్ర ప్రతిపత్తి పొంది నాలుగున్నర దశాబ్దాలు దాటింది. ఈ రాష్ట్రంలో కప్పల తక్కెడ రాజకీయాలు మొదటి నుంచి కొనసాగుతున్నాయి. నాగాలాండ్‌లో మాజీ ముఖ్యమంత్రి, యునైటెడ్ నాగా డెమోక్రటిక్ పార్టీ ని మిత్రపక్షంగా చేసుకుని అధికారాన్ని చేజిక్కించుకుంది. నిజానికి మేఘాలయ, నాగాలాండ్‌లలో ప్రాంతీయ పార్టీల దన్నుతోనే బీజేపీ అధికారాన్ని చేపట్టగలిగింది. సరిహద్దు రాష్ట్రాలలో రాజకీయ సుస్థిరత అవసరమన్న బీజేపీ నినాదం ఈ ఎన్నికల్లో బాగా పనిచేసింది. ప్రధానమంత్రి మోడీ కూడా ఈ మూడు రాష్ట్రాల్లో పలుసార్లు పర్యటించడమే కాకుండా, ఆయా ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలను ఆయన అష్టలక్ష్మిలతో పోల్చారు. ఇతర ప్రాంతాలతో సమానంగా ఈశాన్య రాష్ట్రాలను అభివృద్ధి పరుస్తామనీ, ఇక్కడి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామంటూ ఆయన ఇచ్చిన హామీలు కూడా బాగా పని చేశాయి. నాగా గ్రూపుల్లో ఉన్న వైరాన్ని బీజేపీ బాగా ఉపయోగించుకుంది.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజుజు అరుణాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గంప గుత్తగా బీజేపీలో చేరేందుకు వ్యూహరచనచేసిన చాణక్యుడు. ఈశాన్య రాష్ట్రాల్లో కాషాయ పతాకం రెపరెపలాడేట్టు చేస్తానన్న ప్రతినను ఆయన నెరవేర్చుకున్నారు. ఈ మూడు రాష్ట్రాలూ రాష్ట్ర ప్రతిపత్తిని పొందినప్పటినుంచి అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ఏ ఎత్తుగడలను అయితే అనుసరించిందో ఇప్పుడు బీజేపీ కూడా అవే ఎత్తుగడలను అనుసరించింది. ప్రాంతీయ పార్టీ కోర్కెలను ఆమోదించడం, వాటి వర్గ కలహాలను వాటంగా ఉపయోగించుకోవడం, అభ్యర్థులకు దండిగా నిధులు సమకూర్చడం వంటి చతుర్విధోపాయాలను కమలనాథులు అనుసరించారు. అంతేకాక, జాతీయ స్థాయిలో మోడీకి దీటైన నాయకుడు ఎవరూ లేకపోవడం వల్ల కూడా బీజేపీ పట్ల జనం మొగ్గు చూపారు. బీజేపీ విజయం సైద్ధాంతిక పరమైనది కాదు. ఈ మూడు రాష్ట్రాల్లో శాంతి నెలకొంటే మోడీ దీర్ఘకాలిక వ్యూహం సాకారమైనట్టే.

మంచి మాట

చిత్రమేమిటంటే జ్ఞానం ఏ నిష్పత్తిలో పెరుగుతుందో నమ్మకం అదే నిష్పత్తిలో తగ్గుతుంది.

-థామస్ కార్లైల్

ఎమ్మెల్యేల ప్రశ్నలకు ఆన్‌లైన్‌లో సమాధానాలు

● అధికారులకు సీఎస్ జోషి ఆదేశం




హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత శాసనసభ, మండలి సమావేశాల్లో సభ్యులు వేసిన ప్రశ్నలకు సమాధానాలను లెజిస్లేచర్ సెక్రటేరియట్ వెబ్‌సైట్‌లో ఆప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషీ ఆదేశించారు. ఇప్పటికే ప్రశ్నలకు సమాధానాలు పెండింగ్‌లో ఉంటే వెంటనే పంపాలని సూచించారు. శాసనసభ సమావేశాలు మొదవుతున్నందున అధికారుల బాధ్యతలు, నిర్వహణపై సోమవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో చీఫ్ సెక్రటరీ సమావేశం నిర్వహించారు. శాసనసభ, మండలిలో పెండింగ్ ప్రశ్నలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్ల నిర్వహణ, వివిధ శాఖల సినర్జీ అంశాలపై ఆయన శాఖల వారిగా సమీక్షించారు. గతంలో జరిగిన రెండవ సెషన్ నుండి 8 వ సెషన్ వరకు జీరో అవర్, స్పెషల్ మెన్షన్, రూల్ 344, రూల్ 74 నిబంధనల కింద సభ్యులు అడిగిన ప్రశ్నలు, సమాధానాలను సంబంధిత నోడల్ అధికారుల ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. వివిధ శాఖలకు లాగిన్ ఐడి, పాస్‌వర్డ్‌లు ఇవ్వడం జరిగిందని జోషీ చెప్పారు. అంతేగాక బిల్లులు, తీర్మానాలు, మంత్రివర్గం మెమోరాండాలకు సంబంధించి అవసరమైన చర్యలను సూచించారు. ప్రభుత్వ శాఖలు సినర్జీ పర్ఫార్మెన్స్ ఇంటికేటర్స్, టార్గెట్ అచీవ్ మెంట్, ప్యారామీటర్లకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను శాఖల వారిగా రూపొందించి ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి శాఖ నుండి నోడల్ అధికారిని నియమించి శాసనసభ అధికా రులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమాధానాలు, క్లుప్తం గా, కచ్చితమైన సమాచారంతో ఉండాలని, అను బంధ అంశాలకు సమాధానాలు ప్రత్యేక నోట్ రూపంలో ఉండాలన్నారు. వెబ్ సైట్ల ను ఎప్పటికప్పుడు ఆధునీకరించాలని కోరారు. ఈ సంబంధంగా రాష్ట్రానికి సంబంధించిన మాస్టర్ డేటా ఇండిగ్రేషన్‌పై కూడా సీఎస్ చర్చించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యద ర్శులు అజయ్ మిశ్రా, చిత్రా రామచంద్రన్, ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, అర్విందే కుమార్, శశాంక్ గోయల్, రాజీవ్ త్రివేదీ, వికాస్ రాజ్, కార్యదర్శులు బి వెంకటేశం, ఎన్ శివశంకర్, సి జగదీ శ్వర్, సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు స్మార్ట్‌ఫోన్లు!

● 4జీ సదుపాయాలు ● ఇక స్థానిక పాలన వేగవంతం ● అతి పెద్ద నెట్‌వర్క్‌గా పంచాయతీ వ్యవస్థ ● నేడో రేపో ఉత్తర్వులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా టీఆర్ఎస్ సర్కారు పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేసే పని ప్రారంభించింది. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయంపాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అధునాతన టెక్నాలజీని ఉపయోగించుకోవటంద్వారా గ్రామాల్లో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించబోతున్నారు.మరి కొద్ది నెలల్లో గ్రామ పంచాయతీల పాలకమండళ్ల గడువు ముగియనుంది. సర్పంచుల పదవీకాలం పూర్తికానున్న తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సర్పంచులందరికీ జాక్‌పాట్ తగిలినట్టయింది. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచులకు స్మార్ట్ ఫోన్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రెండు మూడు రోజుల్లో వెలువడనున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం పారదర్శకమైన పాలనకు పెద్దపీట వేస్తోంది. గ్రామీణ తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరు, ప్రభుత్వం పాలనా పరంగా తీసుకుంటున్న నిర్ణయాలు తదితర అంశాలను ఎప్పటికపుడు స్మార్ట్‌ఫోన్ల ద్వారా తెలుకునే సదుపాయాలను సర్పంచులకు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో తీసుకుంటున్న ఉన్నత స్థాయి నిర్ణయాలు, ఉత్తర్వులు ఎప్పటికపుడు క్షణాల్లో గ్రామస్థాయికి చేర్చేలా స్మార్ట్ ఫోన్లను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. వార్డు సభ్యులకు కూడా స్మార్ట్ ఫోన్ అందచేయాలన్న ప్రతిపాదన చర్చకు వచ్చినప్పటికీ ప్రస్తుతానికి సర్పంచుకు మాత్రమే ఈ సదుపాయం కల్పించబోతున్నారు. అధునాతన ఫ్యూచర్లతో కూడిన 4జి సపోర్టెడ్ మొబైల్‌ను ప్రభుత్వం ఎంపిక చేసుకుంది. అపరిమిత కాలింగ్ , ఇంటర్నెట్ సదుపాయాలతో కూడిన స్మార్ట్ ఫోన్‌తోపాటు గ్రూప్ సిమకార్డు కూడా అందచేయబోతున్నట్టు సమాచారం. అయితే ఏ కంపెనీకి చెందిన మొబైల్, ఏ కంపెనీకి చెందిన సిమ్‌నెట్ వర్క్ అన్నది మాత్రం అధికారులు వెల్లడించటం లేదు. అయితే ఒక్కో స్మార్ట్ ఫోన్ ఖరీదు పదివేల రూపాయలకు పైనే ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 8684 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పుడున్న సర్పంచులందరికీ స్మార్ట్ పోన్లు అందచేయాలంటే రూ.పదికోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రెండు మూడు రోజుల్లోనే సర్పంచుల స్మార్ట్ ఫోన్లకు సంబందించిన వివరాలతో ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.



దేశంలోనే అతిపెద్ద నెట్ వర్క్

గ్రామ పంచాయతీలన్నింటినీ స్మార్ట్‌ఫోన్ ద్వారా ఒకే నెట్‌వర్క్ పరిధిలోకి తేవటం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తొలిరాష్ట్రంగా నిలవనుంది. గ్రూప్ సిమ్‌ల ద్వారా ఇంత పెద్ద నెట్‌వర్క్ ఉన్న వ్యవస్థ అన్న పేరు కూడా తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవసకే దక్కనుంది. గ్రామ పంచాయతీలో సర్పంచు కూడా స్మార్ట్ ఫోన్ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తున్న గౌరవంగా భావిస్తారని ప్రంచాయతీరాజ్ శాఖ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

క్రీడా పాఠశాల ఓఎస్‌డీగా

నర్సయ్య కొనసాగింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర క్రీడాపాఠశాల ఓఎస్‌డిగా విధులు నిర్వహిస్తున్న కె.నర్సయ్యను మరో రెండేళ్ళ పాటు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఫ్రంట్‌ను నడిపించగలరా?

● కేసీఆర్‌కు కనుకుల ప్రశ్న

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని రైతుల ఆత్మహత్యలను, సమస్యలను అరికట్టలేని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు జాతీయ స్థాయిలో ఫ్రంట్‌లు ఏర్పాటు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని టీ పీసీసీ సేవాదళ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంలోని బీజేపీకి లాభం చేకూర్చేందుకే థర్డ్‌ఫ్రంట్ నాటకం ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అప్పుల ఆత్మహత్యలకు రైతుల ఆత్మహత్యలను నిరోధించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లోనే సీఎం కేసీఆర్ నడుస్తున్నారని ఆయన విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

దేశ రాజకీయాల్లోకి

కేసీఆర్ రాకను స్వాగతిస్తున్నాం

● గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ రాజకీయాల్లోకి సీఎం కె చంద్రశేఖరరావు రావడాన్ని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) స్వాగతించింది. ఇద్దరు ఎంపీలతో తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్‌కు దేశంలోని రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయడం అసాధ్యమేమీ కాదని, గుణాత్మక మార్పులు తీసుకురావడంలో ఆయన విజయం సాధిస్తారని అసోసియేషన్ అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. దేశాన్ని ముందుకు తీసుకుపోవడంలో కీలకపాత్ర పోషిస్తానని కేసీఆర్ ప్రకటించడం శుభపరిణామమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాలుగు సంవత్సరాలైనా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని, 9,10 షెడ్యూల్‌లో ఉన్న సంస్థల విలీనం కాలేదని విమర్శించారు. పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలను కేంద్రం పట్టించుకోవడం లేదని, ఇలాంటి సమస్యల పరిష్కారానికి కేసీఆర్‌లాంటి దమ్మున్న నాయకుడు వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

ఉస్మాన్‌సాగర్ సుందరీకరణకు

రూ. వంద కోట్లు మంజూరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరంలోని ఉస్మాన్‌సాగర్ (గండిపేట్) సుందరీకరణకు రూ.100 కోట్లను వెచ్చించడానికి అవసరమైన అనుమతులను రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ సోమవారం జారీ చేశారు. హెచ్ఎండిఏ సంస్థ నుంచి ఈ నిధులను వెచ్చించనున్నారు. హైదరాబాద్ మహానగరానికి మరో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉస్మాన్‌సాగర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికోసం వివిధ విభాగాల అధికారులతో ప్రత్యేకంగా టాస్కఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో గండిపేట్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకుగానూ హెచ్ఎండిఏ, టూరిజం, రెవిన్యూ, ఇరిగేషన్, వాటర్ బోర్డు, టీఎస్ఎస్‌పీడీసీఎల్, సోషల్ ఫారెస్ట్రీ తదితర విభాగాల అధికారులతో కలిసి టాస్కఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు అరవింద్‌కుమార్ తెలిపారు. సుందరీకరణ పనులకు సంబంధించిన ప్రణాళికను హెచ్ఎండిఏ రూపొందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గ్రీన్ రిక్రియేషన్‌లో గండిపేట్ చెరువును ఒక ఐకాన్‌గా తీర్చిదిద్దాలని సోమవారం విడుదల చేసినఒక ప్రకటనలో అరవింద్‌కుమార్ సూచించారు. గండిపేటలో అందమైన గ్రీనరీతో పాటు వాకింగ్ ట్రాక్‌లు, సైకిలింగ్ ట్రాక్, రోడ్డు ఫార్మేషన్, చైన్‌లింక్ మెష్ ఫెన్సింగ్, స్ట్రీట్ లైటింగ్, మనస్సును దోచుకునే విధంగా అందమైన ల్యాండ్‌స్కేపింగ్‌లను చేపట్టాలని ఆదేశంచారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు రుచికరమైన భోజనాలను అందించేందుకు మంచి రెస్టారెంట్లు, కేబుర్‌కార్, హౌస్‌బోట్లు, ఫుడ్‌కోర్టులను చేపట్టాలని అరవింద్ కుమార్ సూచించారు.

వినికిడి సమస్యకు

కాక్లియర్ ఇంప్లాంట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అడ్వాన్స్ బయోనిక్స్, హైరెస్ అల్ట్రా కాక్లియర్ ఇంప్లాంట్ అనే పరికరాన్ని యశ్వంత్ (6) సంవత్సరాల వయస్సుగల చిన్నారికి అపోలో ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా అమర్చారు. పుట్టుకతోనే వినికిడి సమస్యను ఎదుర్కొంటున్న యశ్వంత్‌కు ఈ పరికరం వలన ఎంతోమేలు జరుగుతుందని అపోలో వైద్యులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి వివరాలను డాక్టర్ వినయ్‌కుమార్, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ వెల్లడించారు. మార్కెట్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అతి సన్నటి సాధనాల్లో ఇది ఒకటని ఆయన తెలిపారు. ఇది చిన్న పిల్లలకి సరిగ్గా సరిపోతుందన్నారు. కాక్లియర్ ఇంప్లాంట్‌ని ఎముక, చర్మానికి మధ్య పెడతారని ఆయన తెలిపారు. వినికిడి సాధనాల అతి తక్కువ ప్రయోజనం పొందలేకపోతున్న వారి కోసం ఈ సాధనం అద్భుతంగా పనిచేస్తుందన్నారు.

మధ్యవర్తిత్వ కేంద్రాలున్నాయ్..


● పెండింగ్ కేసులకు దగ్గరి దారి

● హైదరాబాద్‌లో 884 కేసుల పరిష్కారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే, వాటికి సంబంధించిన ప్రచారం అనుకున్న మేరకు జరగకపోవడంతో ఈ కేంద్రాలను కక్షిదారులు ఆశ్రయించలేకపోతున్నారు. తమ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ మధ్యవర్తిత్వ కేంద్రాలను ఆశ్రయిస్తే సత్వరమే కేసుల పరిష్కారానికి వీలయ్యే పరిస్థితులు ఉన్నప్పటికీ కక్షిదారుల్లో చైతన్యం లేకపోవడంతో ఏళ్ల తరబడి కోర్టులు చుట్టూ తిరిగే పరిస్థితులు తప్పడం లేదు. కోర్టుల్లో ఒక కేసు కింది కోర్టులో నమోదైతే అక్కడ సుదీర్ఘ వాదోపవాదాల తర్వాత తీర్పులు వెలువడడం, ఆ తర్వాత కేసులు వీగిపోయిన వారు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించడం జరుగుతోంది. దాదాపు 20 ఏళ్ల పాటు వివిధ కోర్టుల్లో విచారణలు జరుగుతున్న కేసులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇలాంటి కేసుల విషయంలో మధ్యవర్తిత్వమే సరైన పరిష్కారమని గుర్తించి మధ్యవర్తిత్వ కేంద్రాలను ప్రోత్సహిస్తున్నారు. న్యాయమూర్తుల కొరత వల్ల ఉమ్మడి హైకోర్టులో 3.25 లక్షల కేసులు పెండింగ్‌లో నలుగుతున్నాయి. ఉమ్మడి హైకోర్టులో ఆమోదం పొందిన న్యాయమూర్తుల సంఖ్య 61కాగా కేవలం 30 మంది మాత్రమే ఉన్నారు. న్యాయమూర్తుల కొరత వల్ల ప్రతినెలా కొత్తగా 5 వేల కేసులు నమోదవుతున్నాయి. కేసుల పరిష్కారం ఇప్పుడున్న న్యాయమూర్తులకు తలకుమించిన భారమవుతోంది. ప్రతి రోజు 100 నుంచి 250 కేసులను న్యాయమూర్తులు విచారిస్తున్నారు. కోర్టులోనే గాక ఇంటికి వెళ్లాక సైతం పిటిషన్లను చదవటం, వాదనలు పరిశీలించడం, తీర్పులు రాయటం అగ్నిపరీక్షగా మారిందని చెప్పవచ్చు. అయినప్పటికీ ఉన్నంతలో కేసుల పరిష్కారంలో న్యాయమూర్తులు చూపిస్తున్న చొరవను ప్రశంసించకుండా ఉండలేం. హైకోర్టులో పరిస్థితి ఇలా ఉంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని కింది కోర్టుల్లో 10 లక్షలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కేసుల సత్వర పరిష్కారం కోసం ఉన్నంతలో పరిమితులకు లోబడి వివాదాల పరిష్కార పద్ధతులను న్యాయమూర్తులు, న్యాయాధికారులు ప్రోత్సహిస్తున్నారు.

తరచుగా లోక్ అదాలత్‌లు, మెగా లోక్ అదాలత్‌లు నిర్వహించడం వల్ల కేసుల పరిష్కారంలో పురోగతి సాధించారని చెప్పవచ్చు. కోర్టులకు అనుబంధంగా ఉన్న మధ్య వర్తిత్వ కేంద్రాల ద్వారా కూడా మరి కొన్ని కేసులు పరిష్కారమవుతున్నాయి. కోర్టులకు అనుబంధంగా ఉన్న మధ్యవర్తిత్వ కేంద్రాలు, అదాలత్‌లు నిర్వహించడం వల్ల గత సంవత్సరం కన్న7 శాతం కేసులు తగ్గాయి. ద ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ యాక్ట్ ,2015 (సవరణ) వచ్చిన తర్వాత ఎడిఆర్, ఎఫ్‌డిఆర్ ప్రాక్టీషనర్లకు ప్రోత్సాహం పెరిగింది. లోక్ అదాలత్‌లతో పాటు నాంపల్లిలోని ది ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రెజల్యూషన్ (ఐసీఏడీఆర్) కేంద్రంలో మధ్యవర్తిత్వం ద్వారా కూడా కేసుల పరిష్కారం సాగుతోంది. సుప్రీంకోర్టు అనుమతించిన మధ్యవర్తిత్వ కేంద్రం రాష్ట్రంలో ఇదొక్కటే కావడం విశేషం. ఆర్బిట్రేషన్, మీడియేషన్, కన్సీలియేషన్ పద్ధతిలో కేసుల పరిష్కారం కోసం ఇక్కడ రెండు కోర్టులు పని చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో 884 కేసులు ఆర్బిట్రేషన్, మరో 445 కేసులకు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించారు. ఈ కేంద్రంలో కేసుల పరిష్కారంతో పాటు మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి ముందుకు వచ్చే న్యాయవాదులకు శిక్షణా తరగతులను కూడా నిర్వహిస్తోంది. ఈ కేంద్రాల్లో కేసుల వాయిదాకు పరిమితి ఉండడంతో సత్వరం పరిష్కారం కనుగొనే పరిస్థితి ఏర్పడింది. వివాదాల విలువ ఆధారంగా ఫీజులు నిర్ణయిస్తారు. ప్రతి రోజు మూడు నుంచి ఐదు కేసుల విచారణ జరుగుతోందని ఐసిఎడీఆర్ ప్రాంతీయ కేంద్ర ఇంచార్జ్ జేఎల్ఎన్ మూర్తి చెప్పారు. చట్టపరమైన సంస్కరణలలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మధ్యవర్తిత్వం ఎంతో కీలకంగా మారిందన్నారు. న్యాయస్థానాలలో పెరుగుతున్న కేసుల కారణంగా సత్వర న్యాయం అందించడంలో జాప్యం జరుగుతున్నదనీ, న్యాయం సకాలంలో అందకపోతే పార్టీలు చట్ట విరుద్ధమైన సంస్థలను ఆశ్రయించే ప్రమాదం లేకపోలేదని మూర్తి హెచ్చరించారు. ఇదే పరిస్థితి ఎదురైతే ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కారణంతోనే న్యాయ వ్యవస్థలు ఆర్బిట్రేషన్, మీడియేషన్, కన్సిలియేషన్ విధానాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు.ఈ కేంద్రాలకు చట్టబద్ధత ఉండడంతో కోర్టులు సైతం ప్రోత్సాహం అందిస్తున్నాయి. లేకపోతే సకాలంలో న్యాయం అందకపోతే చట్ట విరుద్ధ సంస్థలను ఆశ్రయించే ప్రమాదం లేకపోలేదని మూర్తి అభిప్రాయపడ్డారు.

వెయిటేజ్ మార్కులపై తుది విచారణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య విధానపరిషత్‌లలో స్టాఫ్ నర్సులు, వైద్యాధికారులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ట్రాన్స్‌కో చేపట్టిన ఇంజనీరింగ్ ఉద్యోగాల భర్తీల్లో ఒప్పంద/పొరుగు సేవల ఉద్యోగులకు 30 శాతం వెయిటేజీ మార్కులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై హైకోర్టు తుది విచారణ ప్రారంభించింది. పిటిషనర్ల తరపున పూర్తి స్థాయిలో వాదనలు వినేందుకు వీలుగా తదుపరి విచారణను హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కొంగర విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యాజ్యాన్ని కె.మల్లేష్, మరో ఆరు మంది దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యం రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ల తరపున మరో న్యాయవాది కపూర్ వాదనలు వినిపిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోటీ పరీక్షల్లో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలన్నారు. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయిలో వాదనలు వినేందుకు తగిన సమయం లేకపోవడంతో ధర్మాసనం తదుపరి విచారణ బుధవారానికి వాయిదా వేసింది.

రోజుకు 2. 15 లక్షల టన్నుల బొగ్గు రవాణా

● సమీక్షలో సింగరేణి సీఎండీ శ్రీధర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న 26రోజులు బొగ్గు ఉత్పత్తికి ఎంతో కీలకమని, రోజుకు 2.15లక్షల టన్నుల బొగ్గురవాణా చేయడానికి అన్ని ఏరియాలు సమిష్టిగా కృషిచేయాలని సింగరేణి చైర్మన్ శ్రీధర్ ఆదేశించారు. సోమవారం సింగరేణి భవన్‌లో కంపెనీలోని అన్ని ఏరియాల జిఎంలతో సమీక్ష నిర్వహించారు. 650 లక్షల టన్నుల బొగ్గు రవాణాను సాధించాలన్నారు. ఓబి తొలగింపుకు సంబంధించి వచ్చే ఏడాది ఎటువంటి జాప్యం తలెత్తకుండా .. వచ్చే బోర్డు సమావేశంలో అనుమతులు పొందేందుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలన్నారు. సత్తుపల్లి కార్మికుల కోసం 350క్వార్టర్లను వెంటనే నిర్మించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశలంఓ డైరెక్టర్లు పవిత్రన్ కుమార్, శంకర్, బి. భాస్కర్‌రావు, ఎస్.చంద్రశేఖర్, సురేంద్రపాండే, బి.కిషన్ రావు, జిఎంలు ఆంథోనిరాజా తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు పర్యటనకు ‘తెలుగు తప్పనిసరి’ కమిటీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరిగా అమలు చేయాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించిన నేపథ్యంలో తెలుగు తప్పనిసరి అమలు కమిటీ సభ్యులు తమిళనాడులో పర్యటించనున్నారు. కమిటీ సభ్యులు 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తమిళనాడులో పర్యటించనున్నారు. తమిళనాడులో ఇప్పటికే అన్ని విద్యా సంస్థల్లోనూ తమిళంను తప్పనిసరిగా అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో వారు ఈ విధానాన్ని ఎలా అమలు చేస్తున్నారు... ఎలాంటి చర్యలు తీసుకున్నారు... అమలులో వచ్చిన సమస్యలు ఏమిటీ.. అనే అంశాలను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా అధ్యయనం చేయనున్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేషం నేతృత్వంలో తెలుగు తప్పనిసరి కమిటీ చైర్మన్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, సీఎంవో ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి 7 నుంచి 9వరకు తమిళనాడు రాష్ట్రంలో పర్యటించనున్నారు.

తమిళనాడులో అన్ని విద్యాలయాల్లో తమిళం తప్పనిసరిగా అమలు జరుగుతోంది. ఇందుకు సంబంధించి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. చట్టం తీసుకురావడానికి సర్కార్ తీసుకున్న జాగ్రత్తలు, అమలులో ఎదురైన సమస్యలు.. వాటి పరిష్కారానికి తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న చర్యలను కమిటీ క్షుణ్ణంగా అధ్యయనం చేయనుంది. అధ్యయనంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు, కేంద్రీయ విద్యాసంస్థల్లో తమిళం తప్పనిసరిగా బోధింపబడుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలన చేయనున్నారు. పర్యటనలో భాగంగా కమిటీ సభ్యులు విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు అమలు చేస్తున్న విద్యాశాఖ అధికారులతోనూ సమావేశం కానున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం 2018-19 నుంచే రాష్ట్రంలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలుగును తప్పనిసరిగా అమలు చేస్తామని కమిటీ చైర్మన్ తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ఆంధ్రప్ర భకు తెలిపారు. తెలుగు తప్పనిసరిగా అమలు చేస్తే రానున్న ఇబ్బందులను కూడా కమిటీ నివేదికలో పొందుపర్చినట్టు చెప్పారు. అయితే ఆ ఇబ్బందులను అధిగమించడానికి అవకాశాలు ఉన్నాయనికూడా కమిటీ నివేదికలో స్పష్టం చేసింది. పర్యటనలో పరిశీలించిన అంశాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పించాలని, బడ్జెట్ సమావేశాల్లోనే ఇందుకు సంబంధించిన చట్టాన్ని అసెంబ్లీలో రూపొందించి వచ్చే విద్యా సంవత్సరం 2018-19 నుంచే అమలు చేయాలని సర్కార్ కృత నిశ్చయంతో ఉంది.

హరిబాబును రాజ్యసభకు పంపండి

కేసీఆర్‌కు యాదవ సంఘం వినతి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: బడుగు, బలహీన వర్గాల్లోని యాదవ సామాజిక వర్గం నుంచి రాజ్యసభకు టీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల హరిబాబు యాదవ్‌కు అవకాశం కల్పించాలని సీఎం చంద్రశేఖర్‌రావుకు అఖిల భారత యాదవ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అఖిల భారత యాదవ సంఘంలో తీర్మానం చేసి సీఎం కేసీఆర్‌కు విన్నవించుకున్నారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా ఉండటమే కాకుండా.. యాదవుల సంక్షేమానికి హరిబాబుయాదవ్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా ఇటీవల జరిగిన గొల్ల, కుర్మ సభలో యాదవులకు రాజ్యసభ, కుర్మ కులస్థులకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే.

‘రేరా’ అమలుకు ఉన్నతాధికార కమిటీ

● త్వరలో కర్ణాటక, మహారాష్ట్రల్లో పర్యటన ● రెండు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రేరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరి అథారిటి) చట్టాన్ని సక్రమంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ త్వరలోనే కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ రేరా చట్టాన్ని అమలు చేస్తున్న తీరు తెన్నులను సమీక్షిస్తుంది.

జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎస్. దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ (ప్లానింగ్) ఎస్. బాలకృష్ణ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ కె. విద్యాదర్‌లకు కమిటీలో స్థానం కల్పిస్తూ సోమవారం మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీ అధికారుల బృందం కేంద్ర ప్రభుత్వ అధికారులతో కూడా భేటీ అవుతారని, చట్టాన్ని అమలు చేయడం కోసం అవసరమైన నివేదికను రెండు వారాల్లో ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. బిల్డర్ల మోసాలను నియంత్రించడానికి, నిబంధనలను మరింత కఠినతరం చేయాలన్న ఉద్దేశ్యంలో రేరాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న విషయం తెలిసిందే.

రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ కింద 2016 సంవత్సరంలోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకవచ్చింది. ఈ చట్టానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం రేరా చట్టాన్ని నిబంధనలను రూపొందించింది. కేంద్రం రూపొందించిన చట్టం పలు రాష్ట్రాల్లో కొద్ది నెలల క్రితం నుంచే అమలు జరుగుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రేరా చట్టంలో అనేక అంశాలపై పూర్తి స్థాయిలో స్పష్టత లేని కారణంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చట్టాన్ని మరింత లోతుగా అధ్యాయనం చేయడంతో పాటు....దానిని సమర్థవంతంగా అమలు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది.

ఇప్పటి వరకు ఉన్న నిబంధనలకు విరుద్ధంగా బిల్డర్లు ప్లాట్లు, ఖాళీ స్థలాలను విక్రయిస్తూ ప్రజలను పెద్దఎత్తున మోసం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. బిల్డర్ల మాటలను నమ్మి సామాన్య, మధ్యతరగతి ప్రజలు పైసా పైసా కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకుని మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో బిల్డర్ల ఆగడాలకు ముకుతాడు వేయాలన్న లక్ష్యంతో రేరా చట్టానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదును పెడుతోంది. ఈ చట్టం కింద బిల్డర్, డెవలపర్ విధిగా ప్రతిపాజెక్టును రిజిష్టర్ చేయాల్సి ఉంటుంది. రిజిష్టర్ లేకుండా ప్లాట్, ఫ్లాట్‌ను విక్రయిస్తే దాదాపు మూడేళ్ళపాటు జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. లేదా ప్రాజెక్టు మొత్తం వ్యయంపై 10శాతం మొత్తాన్ని పెనాల్టీగా బిల్డర్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సదరు సంస్థ ప్రచారం, మార్కెటింగ్, ప్రమోటింగ్ వ్యవహారాలను కూడా రేరా నిబంధనలకు లోబడే చేయాల్సి ఉంటుంది.

రేరా ప్రకారం 500 చదరపు మీటర్ల స్థలం, లేదా ఆరు యూనిట్లు అంతే కంటే ఎక్కువ నిర్మించే నిర్మాణదారులు విధిగా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కొనసాగుతున్న ప్రాజెక్టుల వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సమర్పి స్తేనే సదరు రియల్టర్లకు, బిల్డర్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను సం బంధిత అధికారులు మంజూరు చేస్తారు. అలాగే డెవలపర్లు విధిగా స్థలానికి సంబంధించిన టైటిల్ డీడ్, ఎన్‌కాంబ్రన్స్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం తదితర వివరాలను కూడా వెల్లడించాల్సి ఉంటుంది. అప్పుడే డెవలపర్లకు లైసెన్స్‌లను మంజూరు చేస్తారు. మొత్తానికి రేరా చట్టంతో బిల్డర్లు చేస్తున్న మోసాలకు చెక్ పెట్టడం తథ్యమని తెలుస్తోంది.



విట్‌లో ముగిసిన

వి టాప్-18 ఫెస్ట్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: అమరావతిలో ప్రారంభించిన వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో సెలబ్రేటింగ్ టెక్నాలజీ పేరుతో వి టాప్- 2018 నేషనల్ ఫెస్ట్ జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఫెస్ట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ స్ట్రీట్ ఇండియా ఎండి రమేష్ కాజ, కాగ్నిజెంట్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ మీనన్, షిండైర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అరిందం సేన్ హాజరయ్యారు. స్టేట్ స్ట్రీట్ ఇండియా ఎండి రమేష్ కాజ మాట్లాడుతూ అమరావతిలో మొదటిసారిఇంత పెద్ద టెక్నాలజీ ఫెస్ట్ జరగటం గొప్ప విషయమన్నారు. విట్ ఏపిలో స్థాపించిన మొదటి సారే ఇటువంటి కార్యక్రమం చేయడం ద్వారా విద్యార్ధులకు కొత్త కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. టెక్నాలజీని ఎలా వాడుతున్నామన్నది ఈ రోజుల్లో ఇంపార్టెంట్ అని ప్రతి ఒక్కరూ టీం మెంబర్‌గా కాకుండా టీం ప్లేయర్‌గా మారాలని అప్పుడే మేకిన్ ఇండియా సాధ్యం అవుతుందన్నారు. రాబోయే టెక్నాలజీ అంతా క్లోడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌దేనని, అందులో చాలా ఉద్యోగాలు రాబోతున్నాయని తెలిపారు. నేషనల్ ఫెస్ట్‌లో 40 కాలేజీల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

● సంక్షేమ సంఘం వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని కోరుతూ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం తెలంగాణ బీసీ కమిషన్ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, జూలూరీ గౌరీశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, వన్నాడి రమ, సి రాజేందర్ తదితరులు ఉన్నారు.

మెరిటోరియన్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాంఘీక సంక్షేమ రెసిడెన్సియల్ మెరిటోరియస్ విద్యార్థులకు ఉచితంగా లాప్‌టాప్‌లను అందచేశారు. లాప్‌టాప్‌లను అందచేస్తున్నందుకు గాను మెరిటోరియస్ విద్యార్థులు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేశారు. గుజరాత్‌లోని నేషనల్ లా విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రం కోర్స్ చదువుతున్న స్వర్ణలతకు సోమవారం ఉచితంగా లాప్‌టాప్‌ను అందచేశారు. ఆమెతో పాటు మరో 17 మంది మెరిటోరియస్ విద్యార్థులు లాప్‌టాప్‌లను అందుకున్నారు. సాంఘీక సంక్షేమ రెసిడెన్సియల్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ వారికి లాప్ టాప్ లను అందచేశారు. లాప్‌టాప్‌లను అందుకున్న వారంతా తెలంగాణలోని సాంఘీక సంక్షేమ రెసిడెన్సియల్ స్కూళ్లలో చదువుకొని దేశంలోని ప్రతిష్టాత్మకమైన సంస్థలు విశ్వవిద్యాలయాల్లో సీట్లు సంపాదించారు. వారందరిని ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ అభినందించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 40 మంది మెరిటోరియస్ విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందించామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

జీవీకే-ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో

వెయ్యి మందికి ఉచిత శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జీవీకే-ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో 1000 మందికి ఈనెల 9వ తేదీన ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో సోమవారం పేర్కొంది. జీవీకే-ఈఎంఆర్ఐ తరపున 334 అంబులెన్స్ వాహనాలు రాష్ట్రవ్యాప్తంగా సేవలను అందిస్తున్నాయి. ప్రతిరోజు ప్రమాదాలకు గురైన 1350 మంది క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్చుతున్నారు. ఆ సందర్భంలో 205 మంది క్షతగాత్రులు రక్తం పోవడం వలన మృతి చెందుతున్నట్టు జీవీకే-ఈఎంఆర్ఐ గుర్తించింది. ఈ మరణాలు అరికట్టడానికి జీవీకే-ఈఎంఆర్ఐ అంతర్జాతీయ సంస్థలతో కలిసి పోలీసులకు, ఆటోడ్రైవర్లు, బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇవ్వనుంది. ప్రమాదానికి గురైనప్పుడు రక్తం ఎక్కువగా పోవడం వల్లే వారు చనిపోతున్నారని, చిన్న చిట్కాలు పాటిస్తే క్షతగాత్రులు బతుకుతారన్నది ఈ సంస్థ ఆలోచన. రక్తం ఎక్కువగా పోకుండా ప్రెషర్ బ్యాండ్ అనేనరాలను ఒత్తిపట్టి బ్యాండెజ్ వేస్తే చాలామంది బతికే అవకాశం ఉందని ఈ సంస్థ గుర్తించింది. ఈనెల 9వ తేదీన అంతర్జాతీయ సంస్థతో కలిసి మొదటగా 1000 మందికి రక్తం ఎక్కువగా పోకుండా ఏమీ చేయాలి, దానిని ఎలా ఆపాలి అన్న దానిపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఈ సంస్థ ప్రకటనలో పేర్కొంది. మరిన్ని వివరాలకు డాక్టర్ రాజా నర్సింగ్ రావు 9000015818 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొంది.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

వచ్చే నాలుగైదేళ్లలో టాటామోటార్స్‌లో 25శాతం మహిళా సిబ్బంది

ముంబై : దేశంలోని అతి పెద్ద ఆటోకంపెనీ టాటామోటా ర్స్.. మహిళా ఉద్యోగులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. వచ్చే నాలుగు నుంచి ఐదు సంవత్సరాల కాలంలో కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో పాతిక శాతం మంది మహిళా సిబ్బందినే నియమి స్తున్నట్లు ప్రకటించింది. టాటామోటార్స్‌కు మొట్టమొదటి త యారీప్లాంట్ పూనే. స్వర్గీయ జెఆర్‌డి టాటా 1974లో స్వయం గా చొరవ తీసుకొని సుధామూర్తి .. ఇన్ఫోసిస్ సహ వ్యవ స్థాపకుడు



నారాయణమూర్తి భార్యను ఉద్యోగంలోకి తీసుకొ న్నారు. ఆమె అసెంబ్లింగ్ ప్లాంట్‌లో ఇంజినీరుగా పనిచేశారు. రాబోయేనాలుగు ఐదుసంవత్సరాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్యను 20-25 శాతం వరకు పెంచుతామని టాటామోటా ర్స్ చీఫ్ హెచ్‌ఆర్ గజేంద్ర చాందల్ చెప్పారు. ఈ ఏడాది జన వరి చివరి నాటికి కంపెనీలో 2628 మహిళలు పనిచేస్తున్నా రని.. ఫ్యాక్టరీతో కలుపుకొటే మొత్తం సిబ్బంది 41,390 మంది అని.. మొత్తం సిబ్బందిలో ఐదు శాతం మంది మహిళా సి బ్బంది ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాబయే రోజుల్లో 55, 159 మందికి ఉద్యోగుల సంఖ్యను పెంచుతామని.. క్రమంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు పెంచుతామని చందాల్ తెలిపారు.

మార్కెట్లకు గ్లోబల్ దడ

• సెన్సెక్స్ 300 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు సోమవారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ 300 పాయింట్లు, ఎన్ఎస్ఈ 100 పాయింట్ల వరకు నష్టపోయాయి. అమెరికా అధ్యక్షుడు గత వారం గ్లోబల్ వాణిజ్య యుద్ధానికి తెర తీయడంతో దాని ప్రభావం గ్లోబల్ మార్కెట్లపై పడింది. దిగుమతి చేసుకొనే ఉక్కుతో పాటు అల్యూమినియంపై దిగుమతి సుంకం భారీగా పెంచుతామని ట్రంప్ ప్రకటించడంతో ఆసియా మార్కెట్లు వణికిపోయాయి. పులిమీద పుట్రలా ఫిబ్రవరి నెల నిక్కీ ఇండియా సేవల రంగం 47.7 పాయింట్ల దిగిరావడం కూడా మార్కెట్ పతనానికి కారణమైంది. ట్రంప్ దెబ్బకు లోహ రంగానికి చెందిన షేర్లు భారీగా కుదేలయ్యాయి. అయితే డాలర్ మారకంతో రూపాయి కాస్తా కోలుకుంది కాబట్టి సెన్సెక్స్ భారీ నష్టాల నుంచి కాస్తా గట్టెక్కింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 33,653.41 పాయింట్ల మార్కు దిగిపోయింది తర్వాత కోలుకొని 33,746.78 వద్ద ముగిసింది సుమారు 300.16 పాయింట్లు నష్టపోయింది. గత మూడు ట్రేడింగ్ సెషన్‌లలో 398.81 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక నిఫ్టీ విషయానికి వస్తే 99.50 పాయింట్లు క్షీణించి 10,358.85 పాయింట్ల వద్ద ముగిసింది. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ ఎన్నికల్లో హవా కొనసాగినా... దాని ప్రభావం స్టాక్ మార్కెట్లపై కనిపించలేదు. విదేశీ సంస్థాగత మదుపరులు దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి పెద్ద మొత్తంలో పెట్టుబడులు తరలించుకుపోయాయి. బ్యాంకింగ్ రంగంలోని స్కాంలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇక షేర్ల సరళిని గమనిస్తే లోహ రంగానికి చెందిన షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఎన్ఎండీసీ 5.85 శాతం క్షీణించింది. నేషనల్ అల్యూమినియం 4.98 శాతం, జెఎస్‌డబ్ల్యు స్టీల్ 4.68 శాతం, జిందాల్‌స్టీల్ 4.32 శాతం, హిందాల్కో 4.29 శాతం, సెయిల్ 3.58 శాతం, టాటాస్టీల్ 2.95 శాతం, వేదాంత 2.51 శాతం, హిందుస్తాన్ జింక్ 0.71 శాతం వరకు నష్టపోయాయి. ఇతర సూచిల విషయానికి వస్తే చమురు సహజ వాయువు, ఆటో, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యు, క్యాపిటల్‌గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యుత్, రియల్టీ, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు 1.81 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంవగా ఐటి, కన్స్యూమర్ డ్యూరబుల్స్,టెక్ రంగానికి చెందిన షేర్లు లాభపడ్డాయి. టాటామోటార్స్ 5.04 శాతం, బజాజ్ ఆటో



2.73 శాతం వరకు నష్టపోగా.. రిల్ 2.48 శాతం, కోల్ ఇండియా 2.33 శాతం, ఓఎన్‌జీసీ 2.14 శాతం, డాక్టర్ రెడ్డీస్, 2.05 శాతం, ఎస్‌బ్యాంకు 1.95 శాతం, హెచ్‌యూఎల్ 1.90 శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.30 శాతం, ఐటీసీ 1.27 శాతం, ఏషియన్ పెయింట్స్ 1.26 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.25 శాతం, ఎల్అండ్‌టి 0.87 శాతం, మారుతి సుజుకి 0.86 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 0.70 శాతం, ఇన్ఫోసిస్ 0.62 శాతం వరకు నష్టపోయాయి. సన్‌ఫార్మా 2.50 శాతం, టీసీఎస్ 2.21 శాతం, ఎంఅండ్ఎం 0.81 శాతం, ఎస్‌బీఐ 0.48 శాతం వరకు లాభపడ్డాయి.

447 కంపెనీలు... రూ.3,200 కోట్లు
స్వాహా చేశాయి

• రియాల్టీ డెవలపర్ల నుంచి ఐటి కంపెనీల వరకు • ప్రాసిక్యూషన్ మొదలుపెట్టిన ఐటిశాఖ




హైదరాబాద్ : దేశంలో ప్రస్తుతం స్కాంల సీజన్ కొన సాగుతోంది. ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులను బడా వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఒక పక్క ముంచుతుంటే.. మరో పక్క దేశంలోని సుమారు 447 కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.3,200 కొట్ల టీడీఎస్ ఎగ్గొట్టి తాము కూడా స్కాం రేసుల్లో వెనుకబడలేదని నిరూపించుకున్నాయి. ఇక అసలు విషయానికి వస్తే... ఇంకా దేశంలో టాక్స్ సీజన్ జోరందుకోలేదు. అయితే టాక్స్ స్కాంలు మాత్రం వేడి పుట్టిస్తున్నాయని పెద్దెత్తున మీడియాలో వార్తలు వసున్నాయి. గత నెలలో బెంగళూరులో రూ.5 కోట్ల రీఫండ్ మోసం జరిగినట్లు గుర్తించడం జరిగింది. ప్రస్తుతం ఆదాయపు పన్ను శాఖ టీడీఎస్ (టాక్స్ డిడెక్టడ్ ఎట్ సోర్స్) రూ.3,200 కోట్ల స్కాంను ఐటిశాఖ వెలు గులోకి తెచ్చింది. ఐటి శాఖ ఏప్రిల్ 2017 నుంచి మా ర్చి 2018 వరకు జరిపిన విచారణలో సుమారు 447 కంపెనీలు ఉద్యోగుల నుంచి టీడీఎస్ కోత విధించి ఐటిశాఖకు చెల్లించలేదని తెల్చింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ఈ కంపెనీలు టీడీఎస్ డబ్బును తమసొంత వ్యాపారాలకు లేదా మూలధనం కోసం వినియోగించుకున్నాయని చెబుతున్నాయి. ఉదాహర ణకు బడా రాజకీయ నాయకులతో మంచి సంబం ధాలు ఉన్న అతి పెద్ద బిల్డ ర్ సుమారు రూ.100 కోట్లు తమ వ్యాపారాలకు తర లించుకుపోయారం టున్నారు. అదే ఒక బహుళజాతి ఐటిసొల్యూషన్ కంపెనీ రూ.11 కోట్లు ఉద్యోగుల నుంచి టీడీఎస్ రూపంలో కోత విధించి ఐటి శాఖకు డిపాజిట్ చేయడంలో విఫలం అయ్యా రు . టీడీఎస్ చెల్లించకుండా ఎగ్గొట్టిన వారిలో ఆ రంగం ఈ రంగం అటూ తేడా లేకుండా అన్నీ రంగాలకు చెందిన వారు ఉన్నారు. వారిలో అతి పెద్ద సినిమా ప్రొడక్షన్ హౌజెస్‌తో పాటు ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ రం గానికి చెం దిన కంపెనీలు, స్టా ర్టప్‌ల తో పాటు, కొత్తగా కంపెనీ స్థాపించి రాత్రికి రాత్రి బిచాణా ఎత్తివేసే కంపెనీలు కూడా ఉన్నా యి. ఆదాయపు పన్ను శా ఖకు చెందిన టీడీఎస్ విభాగం .. టీడీఎస్ జమ చేయని కంపెనీలపై కేసులను న మోదు చేసే పనిలో పడింది. విశ్వసనీయవర్గాల సమా చారం ప్రకారం ఐటి శాఖ పన్ను ఎగ్గొట్టిన కంపెనీల నుంచి బకాయిలు వసూలు చేయడానికి శ్రీకారం చు ట్టిందని.. వారి బ్యాంకు ఖాతాలను జప్తు చేయడం తో పాటు స్థిర, చరాస్తులనుకూడా జప్తు చేయాలనుకుం టోంది. కొన్ని కేసుల్లో వారెంట్‌లు కూడా జారీ చేయా లని చూస్తోందని అంటున్నారు. ఒక టీడీఎస్ విషయానికి వస్తే ఇది కూడా అడ్వాన్స్ టాక్స్‌లాం టిదే.. ఉద్యోగులు చెల్లించే వేతనాలు, కమిషన్‌లపై కంపెనీలు ముందుగానే (ఐటి పరిమితి దాటితే రూ. 2.5 లక్షల కంటే ఎక్కువ వేతనం) ఉంటే ఐటి పరి ధిలోకి వస్తా రు. ఏడాదికి రూ.2.5 లక్షలు దాటిన ఉద్యో గి నుంచి ఆదాయపు పన్ను (టీడీఎస్) కోత విధించి .. ఆ డిపా జిట్లను కంపెనీలు ప్రతి మూడు నెలలకొసారి ప్రభు త్వ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఒక వేళ కంపెనీ ఉద్యోగి నుంచి టీడీఎస్ కోత విధించలేదంటే కంపెనీనే ఐటి శాఖ బాధ్యులను చేస్తుంది. ఉద్యోగుల నుంచి టీడీఎస్ కోత విధించి ప్రభుత్వానికి ఆ డబ్బు డిపాజిట్ చేయకపోతే ఆదాయపు పన్ను చ ట్టం కిం ద.. కంపెనీ ప్రమోటర్‌కు కఠిన కారాగార శిక్ష విధించడం జరుగుతుంది. అది కనీసం మూడు నెలల నుంచి కావాలనుకుంటే దాన్ని ఏడు సంవ త్స రాల వర కు పొ డిగించవచ్చు.. దీనితో పాటు జరిమా నా చెల్లిం చాల్సి ఉంటుంది. అయితే ఐటి శాఖ వర్గాల సమాచా రం ప్రకారం ఇది స్కాం కాదని.. సాధారణంగా ప్రతి ఏడాది టీడీఎస్ వెరిఫికేషన్ జరుగుతుంటుందని.. ప్రతి ఏడాది ఇలాంటి సాధారణంగా జరుగుతుంటా యి .. ఒక ఏ డాది ఎక్కువ.. మరోడాది తక్కువ స్థాయి లో ఉంటాయని చెప్పారు. కంపెనీ యాజమాన్యం ఉ ద్యోగి వేతనం నుంచి టీడీఎస్ కోత విధించి ఈ డబ్బును ప్రతి త్రైమాసికంలో జమ చేయాల్సి ఉంటుం దని తెలి పారు. అయితే రాబోయే కొద్ది రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వస్తుందని ఆయన పర్కొన్నారు. టీడీ ఎస్ ద్వారా అయితే ఐటి ఫైలింగ్ తేలికగా జరుగుతుం ది. ఒక వేళ ఉద్యోగుల నుంచి కోత విధించిన డబ్బు ప్రభుత్వానికి డిపాజిట్ చేయకపోతే ... ఇన్‌టాక్స్ వెబ్ సై ట్ మీరు పన్ను చెల్లించలేదని చూపిస్తుంది. అటు త ర్వాత మీకు ఇబ్బందులు తప్పవు.. చివరకు ఉద్యోగి తన జేబు నుం చి ఐటి బకాయిలు చెల్లించాల్సి ఉంటుం ది.

ఉద్యోగులు ఏం చేయాలి

దీనికి గాను ప్రభుత్వం 2016లో ఎస్ఎం ఎస్ అలర్ట్ సర్వీస్‌ను ప్రారంభించింది. ఈ ఎస్ఎంఎస్ ద్వారా ప్రభుత్వం ఉద్యోగి నుంచి ఎంత మొత్తం టీడీఎస్ కింద వసూలు చేసిందో ఎస్ఎంఎస్ అలర్ట్‌లో చెబుతుంది. ఉద్యోగి తన సాలరీ స్లిప్‌తో ఎస్ఎంఎస్‌ను ఏడాది చి వర్లో సరిపోల్చుకోవాలి. ఏదైనా తేడా కనిపిస్తే యాజ మాన్యంతో మాట్లాడి క్లియర్ చేసుకోవడమో లేదా ఉ ద్యోగి జేబు నుంచి సమర్పించుకోవాలి. లేదంటే బుక్ అయ్యే ది మాత్రం ఖచ్చితంగా వేతనజీవే!

సేవల రంగం తిరోగమనం

• ఫిబ్రవరిలో 47.8 పాయింట్లు పతనం



న్యూఢిల్లీ : భారతీయ సేవల రంగం ఆరు నెలల కనిష్టానికి దిగివచ్చింది. కంపెనీలకు కొత్త ఆర్డర్లు తగ్గుము ఖం పట్టడంతో పాటు డిమాండ్ తగ్గడంతో ఫిబ్రవ రినెల సేవల రం గం డీలాపడింది. నిక్కీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటి సూచి జనవరిలో 51.7 పాయింట్ల నుంచి ఫిబ్రవరి నాటికి 47.8 పాయింట్లకు ది గివచ్చింది. ఆగస్టు తర్వాత ఈ స్థాయిలో దిగిరావడం ఇదే మొ దటిసారి. సూచి 50 పాయింట్ల కంటే కిందికి దిగివచ్చిందని.. ఆ రంగం బలహీనపడిందని.. 50 దాటితే పుంజుకుందని గుర్తుంచుకోవాల్సి ఉంటుందని నిక్కీ పీఎంఐ నివేదికలో వివరించింది. నవంబర్ నుంచి కంపెనీలకు ఆర్డర్లు తగ్గు ముఖం పట్టాయి. ఆ గస్టు నుంచి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయని ఐహెచ్‌ఎస్ మార్కెట్ ఆర్థి కవేత్త రచయిత ఆష్నా దోదియా చెప్పారు. అయితే రాబో యే 12 నెలల కాలంలో పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తాయని ఆయన తెలిపారు. దీనికి కారణం జూన్ 2011 నుంచి ఉద్యోగాల్లో వృద్ధి కనిపిస్తోందని తెలిపింది. సేవల రంగంలో పరి స్థితులు అనుకూలంగా లేకున్నా కంపెనీలు మాత్రం ఫిబ్రవరిలో పెద్దెత్తున ఉద్యో గులను తీసుకున్నారని, ఈ రంగంలో మరిన్ని ఉద్యో గావకాశాలు వచ్చే అవకాశాలు న్నాయని తెలిపింది. ఇదిలా ఉండగా నిక్కీ పీఎం ఐ కాంపోజిట్ ఇండెక్స్ విషయానికి వస్తే తయారీరంగంతో పాటుసేవల రంగం రెండు జనవరిలో 52.5 పాయింట్లనుంచి ఫిబ్రవరి నాటికి 49.7 పాయింట్లకు దిగి వచ్చాయి. సేవల రంగం డీలాపడ్డంతో దాని ప్రభావం తయారీరంగంపై కూడా కనిపిస్తోంది. ధరల విషయానికి వస్తే నవంబర్ తర్వాత నుంచి నిర్వహణా వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో పాటు ఇంధనం ధరలు పెరిగితే మొత్తం ఆర్థికవ్యవస్థతో పాటు తయారీరంగం... సేవల రంగంపై కూడా ప్రభా వం చూపుతుందని దోదియా నివేదికలో వివరించారు.

టెక్నాలజీతో మెరుగైన సేవలు

• కెనరా హెచ్‌ఎస్‌బీసీ సీఈఓ మాథుర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన సాంకేతికతను అవలంబించడం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించనున్నామని కెనరా హెచ్‌ఎస్‌బీసీ, ఓబీసీ లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. కస్టమర్ల సేవల కోసం అద్భుతమైన సేవలను దగ్గరకు చేశామని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనూజ్ మాథుర్ వెల్లడించారు. వచ్చే మూడేళ్ళలో సంస్థ అన్ని కార్యాలయాల డిజిటలైజేషన్ పూర్తవుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకే తొలి ప్రాధాన్యత ఇచ్చేలా సేవా విభాగాన్ని పటిష్టం చేశామని, పారదర్శకతతో కూడిన సేవలను వారికి దగ్గర చేశామని తెలిపారు. సమీప భవిష్యత్తులో బ్రాండ్ ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నామని మాథుర్ చెప్పారు.

బీఎండబ్ల్యు 6 సిరీస్ గ్రాన్ టురిస్మో

• ధర రూ.58.90 లక్షలు
• చెన్నైలో బీఎండబ్ల్యు 6 సరీస్‌ఆవిష్కరణ


చెన్నై : జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యు చెన్నైలో 6 సిరీస్ గ్రాన్ టురిస్మోను సోమవారం ఆవిష్కరించింది. దీని ధర రూ.58.90 లక్షలు (ఎక్స్‌షో రూం). కాగా గత నెల న్యూఢిల్లీలో జరిగిన ఆటోఎక్స్‌పోలో క్రికెట్ లెజెండ్ సిచిన్ టెండూల్కర్ అధికారికంగా బీఎండబ్ల్యు 6 సిరీస్ గ్రాన్ టురిస్మోను స్పోర్ట్‌లైన్‌ను ఆవిష్కరించారు. బీఎండబ్ల్యు గ్రూపు ప్లాంట్ చెన్నై మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోచెన్ స్టాల్‌క్యాంప్, కున్ ఎక్స్‌క్లూజివ్ డీలర్ ప్రిన్సిపల్ వాసంతి భూపతి అధికారికంగా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కారును చెన్నై సమీపంలోని సింగాపెరుమాల్ కోయిల్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేస్తున్నారు. కాగా డిజిల్ వెరియంట్‌ను ఈ ఏడాది చివరినాటికి మార్కెట్లో విడుదల చేస్తామని ప్రకటనలో తెలిపింది. ఈ కారును చెన్నైలోని కున్ ఎక్స్‌క్లూజివ్‌లో బుక్ చేసుకోవచ్చునని బీ ఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, వి క్రమం పవాహ్ చెప్పారు. కారు ఫీచర్ల గు రిం చి ప్రస్తావిస్తూ విశాలమైన ఇంటిరియ ర్‌లో పాటు అత్యంత సౌకర్యవంతం గా ఉంటుంద న్నారు. 250 హెచ్‌పీ కారు 0 నుంచి 100 కిలోమీటర్లు 6.3 సెకన్లలో చే రుతుందని, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, యాం టీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, డైనమిక్ స్టెబిలిటి కంట్రోల్, ఎలక్ట్రానిక్ వెహికల్ ఇంమొబైల సర్‌తో పాటు ఇతర ఫీచ ర్లు ఉన్నాయని కం పెనీ విడుదల చేసిన ప్రకట నలో వివరిం చింది.



హ్యుందాయ్ శాంత్రో న్యూలుక్

•ఆగస్టు నాటికి మార్కెట్లోకి •ధర రూ.3 నుంచి 5.5 లక్షల వరకు •సెలేరియో, టియాగో, క్విడ్‌కు పోటీ

హైదరాబాద్ : హ్యుందాయ్ మోటార్స్ చిన్న కారు సాంత్రోను సరికొత్త గెటప్‌తో ఈ ఏడాది ఆగస్టులో మార్కెట్లోకి తీసుకురాబోతోంది. రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త సాంత్రోను దేశీయ మార్కెట్లో విడుదల అమ్మకాలు పెంచుకోవాలనుకుంటోంది. ఇప్పటికే భారతీయ రోడ్లపై పరీక్షలు జరిపిందని వార్తలు వస్తున్నాయి. అంతర్గతంగా దీని కోడ్‌నేమ్ ఏహెచ్ 2గా నిర్ధారించారు. దీని ధర ఎక్స్‌షో రూం. రూ.3 లక్షల కంటే తక్కువగా ఉండే అవకాశాలున్నాయని అంటున్నారు. అయితే కొత్త సాంత్రో 2018 మోడల్ పాత ఐ10 మోడల్ ప్లాట్‌ఫాంపై రూపు దిద్దుతున్నారు. హ్యుందాయ్ చిన్న కార్ల విషయానికి వస్తే ఈయాన్, గ్రాండ్ ఐ10 ఈ కోవలోకి వసాయి. అయితే సాంత్రో 2018 మోడల్‌కు పూర్తి స్పోర్టీ గ్రిల్స్‌తో హెడ్‌ల్యాంప్స్, కొత్త బంపర్, ఫాగ్‌ల్యాంప్స్, కొత్త అల్లాయ్స్, ఆకర్షణీయమైన టెయిల్‌లై ట్స్‌ను అందిస్తోంది. దీని ధర రూ. రూ.3 లక్షల నుంచి రూ.5.5 లక్షల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



మోజో @ రూ.1.49 లక్షలు

ముంబై : మహీంద్రాటూ వీలర్స్ సోమవారం కొత్త ప్రీమి యం బైక్‌ను మార్కెట్లో విడు దల చేసింది. 300 సీసీ ప్రీమి యం స్పోర్ట్స్ బైక్‌కు మోజో యూటి 300 అని పేరు పెట్టా రు. దీని ధర రూ.1.49 లక్షలు గా ప్రకటించింది. ఈ నెలలో బైక్‌లు బుక్ చేసుకొన్న వారికి పరిచయ ధర కింద రూ.10, 000 వరకు తగ్గింపు ఆఫర్ ఇస్తామని ప్రకటించింది. ఈ బైక్ దేశంలోని 60 నగరాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. మోజో ఫోర్టు పోలియో నుంచే మోజో ఎక్స్‌ట్రీమ్ టూరర్ (ఎక్స్‌టి)300 అనేది వెరే వెరియెంట్ అని తెలిపింది. కొత్త ప్రీమియం స్పోర్ట్‌బైక్ దేశంలోని అన్నీ భూభాగాలపై సౌకర్య వం తంగా డ్రైవ్ చేసే విధంగా డిజైన్ చెశామని, కొత్త కస్టమర్లను ఈ బైక్ ఆకట్టుకుంటుందని ఆశాభా వం వ్యక్తం చేసింది మోజో యూటి 300 బైక్ ఫీచర్ల విషయానికి వస్తే 300 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్, కాంపాక్ట్ డిజిటల్ ప్యానెల్, కార్బో రేట ర్ ఫ్యూయల్ సిస్టమ్ తో పాటు 17 అంగుళా ల ట్యూబ్‌లెస్ టైర్స్, 21 లీటర్ల పెట్రోల్ ట్యాంకు, ఈ విభాగంలో ఇదే అతి పెద్ద ట్యాం కు అని కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో వివరించింది.

2019 వృద్ధిరేటు 7.5 శాతం

• గ్లోబల్ వృద్ధి రేటుతో ఊతం • పెరగనున్న దేశీయ డిమాండ్ • రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా

ముంబై : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో జీడీపీ వృద్ధిరేటు 7.5 శాతానికి ఎగబాకుతుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తాజా నివేదికలో పేర్కొంది. దేశీయంగా వినియోగం పెరగడంతో పాటు ప్రభుత్వం తీసుకొచ్చే సంస్కరణలు, గ్లోబల్ వృద్ధిరేటు పుంజుకోవడం తదితర అంశాల వల్ల జీడీపీ వృద్ధిరేటు పెరగానికి ప్రధాన కారణాలని క్రిసిల్ నివేదికలో వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతానికి పరిమితం అవుతుందని, ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థికసర్వేలో-2018లో వచ్చే ఆర్థికసంవత్సరం 2019లో జీడీపీ వృద్ధిరేటు 7 నుంచి 7.5 శాతం మధ్యలో ఉండొచ్చునని అంచనా వేసింది. ప్రభుత్వం గత రెండుసంవత్సరాల నుంచి పలు కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. వాటిలో పెద్దనోట్ల రద్దుతో పాటు వస్తు సేవల పన్ను (జీఎస్టి)ని తీసుకు రావడంతో ఆర్థిక వ్యవస్థపై కాస్తా వ్యతిరేక ప్రభావం కనిపించింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు గాడిన పడ్డాయని వృద్ధిరేటు గౌరవ ప్రదమైన 7.5 శాతం స్థాయికి చేరుకుంటుందని సోమవారం నాడు విడుదల చేసిన నివేదికలో వివరించింది. వృద్ధిరేటు పుంజుకోవడానికి దారి తీసే కారణాల గురించి ప్రస్తావిస్తూ.. ప్రభుత్వం తీసుకొ స్తున్న సంస్కరణలతో పాటు, బ్యాంకింగ్ రంగంలో పేరుకుపోయిన మొండిబకాయిలపై కఠిన చర్యలు తీసుకోవడం... బ్యాంకుల్లో పేరుకుపోయిన ఎన్పీఏలను ఎన్సీఎల్‌టికి సిఫారసు వారి ఆస్తులను వేలం వేసి బకాయిలు రాబట్టుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకొంటున్న చర్యలు, అదే విధంగా ప్రభుత్వం నిరంతరంగా సంస్కరణలు తీసుకురావడంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా క్రమంగా పుంజుకోవడం, దేశీయంగా డిమాండ్ పెరగడం తదితర అంశాలు స్థూల దేశీయోత్పత్తి లేదా జీడీపీ పుంజుకోవడానికి దారి తేసే అంశాలని నివేదికలో వివరించింది. ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు ఏకంగా 10.5 శాతానికి ఎగబాకాయి. ప్రభుత్వం దీనిపై కఠినమైన తీర్మానాలు చేస్తే కానీ ఆర్థిక వ్యవస్థ కోలుకోలేదని ప్రకటించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ (ఎన్‌సీఎల్‌టి) పారదర్శకంగా అనుకొన్న సమయంలో వీటిని పరిష్కరిస్తుందన్న నమ్మకం కొంత కలుగుతోందని వివరించింది. దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటే రుణాల డిమాండ్‌కూడా పెరగుతుందని, అదేసమయంలో బ్యాంకుల్లో ఎన్‌పీఏ కూడా స్వల్పంగా పెరిగి మార్చి 2019 నాటికి బ్యాంకుల ఎన్‌పీఏ లేదా మొండిబకాయిలు 11 శాతానికి ఎగబాకవచ్చునని నివేదికలో పేర్కొంది. కేంద్రప్రభుత్వం దేశంలో పెద్దమొత్తంలో ఉపాధి కల్పించడానికి గ్రామీణ ప్రాంతాల్లో పెద్దమొత్తంలో వ్యయం చేయాలని, వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు పెంచుకోవాలంటే మౌలికరంగంపై పెద్దెత్తున వ్యయం చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లభిస్తుం దని, దీంతో కన్స్యూమర్ రంగానికి డిమాండ్ పెరు గుతుందని తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థ నిలదొ క్కుకోవాలంటే.. తిరిగి గాడిలో పడాలంటే కీలకమై న సంస్కరణలు ఉదాహరణకు జీఎస్టి, రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) చట్టం 2016ను పక్కాగా అమలు చేయాలని, గత కొన్ని సంవత్సరాల నుంచి ఉదయ్‌ను కొనసాగిస్తున్నారని దాన్ని అలాగే కొనసాగించాలని సూచించింది. ప్రభుత్వం వీటిపై దృష్టిపెడితే దీర్ఘకాలంలో ఫలితాలు కనిపిస్తాయని, అయినా దాని ప్రభావం స్వల్ప కాలంలో కూడా కనిపిస్తుందని నివేదికలో వివరించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే జోరం దుకుందని.. ఈ ఏడాది 2018లో ప్రపంచవా ణిజ్యం కూడా అదే స్థాయిలో కొనసాగుతుందని తెలి పింది.ఎగుమతులు పుంజుకోవాల్సి ఉంటుం దని, కానీ దానికి పరిస్థితులు మాత్రం ఆశాజ నకంగా లేవని.. దీనికి కారణం స్థానికంగా దీనికి తగ్గమౌలిక సదుపాయాలు లేవు.

మూలధనం ఖరీ దైన వ్యవ హా రంగా మారిపోవడంతో పాటు కార్మి కులపై ఆధార పడిన రంగాల్లో ఉత్పత్తి వ్యయం పెరి గిపో తోందని దాని ప్రభావం ఎగుమతులపై కనిపి స్తోం దని తెలిపింది. ఇక చివరగా కొన్ని కీలకమైన అంశా లపై దృష్టిసారించాలని సూచించింది. వా టిలో వీ లైనంత త్వరగా జీఎస్టికి సంబంధించిన అంశా లు పరిష్కరించాలని.. అలాగే ద్రవ్యలోటు పెరిగితే మూలధనం వ్యయంపై ప్రభుత్వం కోత విధించు కోవాల్సిన అవసరం ఏర్పడుతుందని గుర్తు చేసింది.

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

నెం.జి2/775/2018 తేది : 03-03-2018
గెజిట్ ఆర్.ఆర్.నెం.36 తేది : 03-03-2018

ఫారం-సి

(చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)
(రూల్ 6/12 చూడుడు)

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టరు రంగారెడ్డి వారు ప్రజా ప్రయోజనార్థం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కొరకు రంగారెడ్డి జిల్లా, చేవెళ్ళ మండలం, ఆలూరు-I గ్రామంలో సుమారు ఎకరములు 07-36.5 గుంటల భూమి అవసరమై ఉన్నదని భావించుచున్నారు.
కావున ఈ ప్రాజెక్టు / రహదారి నిర్మాణం నిమిత్తం రంగారెడ్డి జిల్లా, చేవెళ్ళ మండలం, ఆలూరు-I గ్రామములో ఎకరములు 07-36.5 గుంటల భూమిని భూసేకరణ నిమిత్తం నోటిఫై చేయడం జరిగినది. నోటిఫై చేయబడిన భూమి వివరాలు క్రింద ప్రకటించడమైనది.

షెడ్యూలు

జిల్లా: రంగారెడ్డి | మండలం: చేవెళ్ళ | గ్రామం: ఆలూరు-I

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం: టైటిల్	భూమి స్వభావం: రకం	సేకరణ విస్తీర్ణం ఎ.గుం	ఆసక్తిగల వ్యక్తుల పేర్లు, చిరునామా	సరిహద్దులు సర్వే నెంబర్ ప్రకారం: ఉ	ద	తూ	ప	చెట్లు: రకం	చెట్లు: సంఖ్య	నిర్మాణాలు: రకం	నిర్మాణాలు: విస్తీర్ణం	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	240	పట్టా	మెట్ట	0-05.5	మంగళి శ్రీశైలం తండ్రి బుచ్చయ్య	240	గ్రామ సరిహద్దు దామరగిద్ద	240	241	-	-	-	-	-
2	240	పట్టా	మెట్ట	0-00.5	మంగళి లక్ష్మి తండ్రి నరసింహులు	240	గ్రామ సరిహద్దు దామరగిద్ద	240	241	-	-	-	-	-
3	240	పట్టా	మెట్ట	0-03	మంగళి నరసింహులు తండ్రి రామయ్య	240	గ్రామ సరిహద్దు దామరగిద్ద	240	241	-	-	-	-	-
4	241	పట్టా	మెట్ట	0-02	గంగడ అశోక్ తండ్రి నరసింహులు	240	241	241	గ్రామ సరిహద్దు ఆలూరు-III	-	-	-	-	-
5	241	పట్టా	మెట్ట	0-01.5	చాకలి మనెయ్య తండ్రి రామయ్య	240	241	241	గ్రామ సరిహద్దు ఆలూరు-III	-	-	-	-	-
6	241	పట్టా	మెట్ట	0-02	1.చాకలి రాజు 2.చాకలి రాకేష్ 3.రవిందర్ సన్స్ నర్సింలు	240	241	241	గ్రామ సరిహద్దు ఆలూరు-III	-	-	-	-	-
7	241	పట్టా	మెట్ట	0-01.5	మొహమ్మద్ అసద్ ఉల్లా షరీఫ్ తండ్రి సర్దార్ షరీఫ్	240	241	241	గ్రామ సరిహద్దు ఆలూరు-III	-	-	-	-	-
8	242	పట్టా	మెట్ట	0-01	పోలిపల్లి పండు, సత్తయ్య	242	గ్రామ సరిహద్దు ఆలూరు-III	242	రోడ్డు	-	-	-	-	-
9	242	పట్టా	మెట్ట	0-02.5	పోలిపల్లి పండు తండ్రి చంద్రయ్య	242	గ్రామ సరిహద్దు ఆలూరు-III	242	రోడ్డు	-	-	-	-	-
10	243	పట్టా	మెట్ట	0-06	పోలిపల్లి సత్తయ్య తండ్రి చంద్రయ్య	243	రోడ్డు	243	రోడ్డు	-	-	-	-	-
11	243	పట్టా	మెట్ట	0-07.5	1.పోలిపల్లి నారాయణ 2.బుచ్చయ్య 3.ప్రమోద్ కుమార్ 4.వినోద్ కుమార్	243	రోడ్డు	243	రోడ్డు	-	-	-	-	-
12	246	పట్టా	మెట్ట	0-01	1.జి.శివకుమార్ తండ్రి అంజయ్య 2.జి.శ్రావణ్‌కుమార్ తండ్రి సాయికుమార్ 3.ఎం.వర్ష భర్త శ్రీనివాస్ 4.ఎం.లావణ్య భర్త రమేష్	246	గ్రామ సరిహద్దు ఆలూరు-II	246	రోడ్డు	-	-	-	-	-
13	245	పట్టా	మెట్ట	0-01	లహరి నర్సిములు	245	రోడ్డు	245	రోడ్డు	-	-	-	-	-
14	245	పట్టా	మెట్ట	0-00.5	వల్లీ అడ్వకేట్	245	రోడ్డు	245	రోడ్డు	-	-	-	-	-
15	245	పట్టా	మెట్ట	0-21	తుమ్మలపల్లి సత్యనారాయణ	రోడ్డు	గ్రామ సరిహద్దు ఆలూరు-II	రోడ్డు	245	-	-	-	-	-
16	245	పట్టా	మెట్ట	0-27.5	1.జి.శివకుమార్ తండ్రి అంజయ్య 2.జి.శ్రావణ్ కుమార్ తండ్రి సాయికుమార్ 3.ఎం.వర్ష భర్త శ్రీనివాస్ 4.ఎం.లావణ్య భర్త రమేష్	రోడ్డు	గ్రామ సరిహద్దు ఆలూరు-III	రోడ్డు	245	-	-	-	-	-
17	243	పట్టా	మెట్ట	0-34	మరెపల్లి సుధాకర్ తండ్రి జంగయ్య	రోడ్డు	గ్రామ సరిహద్దు ఆలూరు-III	రోడ్డు	243	-	-	-	-	-
18	243	పట్టా	మెట్ట	0-12.5	పోలిపల్లి బుచ్చయ్య	రోడ్డు	గ్రామ సరిహద్దు ఆలూరు-III	రోడ్డు	243	-	-	-	-	-
19	339	పట్టా	మెట్ట	0-15.5	1.కొత్తకాపు బల్వంత్‌రెడ్డి 2.మహిపాల్ రెడ్డి	339	గ్రామ సరిహద్దు ఆలూరు-III	రోడ్డు	339	-	-	-	-	-
20	340	పట్టా	మెట్ట	0-28	1.అంతారం సాయిమాధురి 2.అంతారం శైలజ	340	339	రోడ్డు	రోడ్డు	-	-	-	-	-
21	334	పట్టా	మెట్ట	0-01	మైలారం నారాయణ తండ్రి చంద్రయ్య	334	334	342	రోడ్డు	-	-	-	-	-
22	342	పట్టా	మెట్ట	0-08.5	మైలారం నారాయణ తండ్రి చంద్రయ్య	342	334	గ్రామ సరిహద్దు ఆలూరు-II	రోడ్డు	-	-	-	-	
23	342	పట్టా	మెట్ట	0-09	నరసింహారెడ్డి మరియు శ్రీనివాస్‌రెడ్డి	342	334	గ్రామ సరిహద్దు ఆలూరు-II	రోడ్డు	-	-	-	-	
24	342	పట్టా	మెట్ట	0-06.5	అమరేందర్ తండ్రి వీరయ్య	342	334	గ్రామ సరిహద్దు ఆలూరు-II	రోడ్డు	-	-	-	-	
25	343	పట్టా	మెట్ట	0-03	కనకమామిడి యాదయ్య తండ్రి యల్లయ్య	343	గ్రామ సరిహద్దు ఆలూరు-II	గ్రామ సరిహద్దు ఆలూరు-II	రోడ్డు	-	-	-	-	
26	343	పట్టా	మెట్ట	0-03	శారద భర్త వెంకటయ్య	343	గ్రామ సరిహద్దు ఆలూరు-II	గ్రామ సరిహద్దు ఆలూరు-II	రోడ్డు	-	-	-	-	
27	343	పట్టా	మెట్ట	0-02.5	బుగ లక్ష్మమ్మ భర్త నారాయణ	343	గ్రామ సరిహద్దు ఆలూరు-II	గ్రామ సరిహద్దు ఆలూరు-II	రోడ్డు	-	-	-	-	
28	343	పట్టా	మెట్ట	0-06.5	శారద భర్త వెంకటయ్య	రోడ్డు	రోడ్డు	గ్రామ సరిహద్దు ఆలూరు-III	గ్రామ సరిహద్దు ఆలూరు-II	-	-	-	-	
29	341	పట్టా	మెట్ట	1-11	అక్కమొల్ల సునీత భర్త సుధాకర్	రోడ్డు	రోడ్డు	రోడ్డు	341	-	-	-	-	-
30	341	పట్టా	మెట్ట	0-01.5	మైలారం నారాయణ తండ్రి చంద్రయ్య	రోడ్డు	340	341	341	-	-	-	-	-
31	340	పట్టా	మెట్ట	01-15	1.గొటికె రాజశేఖర్ తండ్రి సిద్ధి రామప్ప 2.చందులాల్ పటేల్ తండ్రి హర్‌జీవన్ పటేల్	రోడ్డు	గ్రామ సరిహద్దు నాయిన్ చెరు	341	340	-	-	-	-	-

మొత్తం ఎ.07-36.5 గుం.లు

భూసేకరణలో పారదర్శకం, న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ చట్టం 2013 (కేంద్ర ప్రభుత్వ చట్టం 30/2013 లోని సెక్షన్ 11 (1) క్రింద మరియు సవరించిన న్యాయ బద్ధమైన నష్టపరిహారం మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017 ప్రకారం ఆసక్తిగల వ్యక్తులందరికీ తెలియచేయడమైనది.

సేకరణ భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు భూసేకరణ అధికారి / రెవెన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్ కార్యాలయములో అందుబాటులో ఉండును. ఆసక్తిగల వ్యక్తులెవరైనను ప్రభుత్వ పనిదినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్, రంగారెడ్డి జిల్లాగారు చట్టంలోని సెక్షన్ 12 ప్రకారము కల్పించిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, భూమి పరిశీలన కొరకు, భూమి పొరలను త్రవ్వుటకు మరియు సంబంధిత పనులు చేయడానికి కావలసిన అన్ని చర్యలు నిర్వహించుటకు భూ సేకరణ అధికారి / రెవిన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్, రంగారెడ్డి జిల్లా గారిని నియమించినారు.

చట్టం యొక్క సెక్షన్ 11 (4) క్రింద కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి సదరు స్థలములో ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏవేని లావాదేవీలు అనగా అమ్మకం / కొనుగోలు / లేదా ఏవేని తాకట్టు రుణభారాలను చేయరాదు.


భూసేకరణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే భూసేకరణ అధికారి / రెవిన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్, రంగారెడ్డి జిల్లా ముందు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద పేర్కొన్నట్లుగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 (అరవై రోజులు) లోపు ఆసక్తిగల వ్యక్తులు దాఖలు చేసుకోవచ్చును.

భూసేకరణ అధికారి / రెవిన్యూ డివిజనల్ అధికారి చేవెళ్ళ డివిజన్, రంగారెడ్డి జిల్లా | **జాయింట్ కలెక్టర్ రంగారెడ్డి జిల్లా** | **జిల్లా కలెక్టర్ రంగారెడ్డి**

విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకొస్తే చేయూత ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కాదు. గ్రామీణ సామాజిక నేపథ్యం గురించి ఆలోచిస్తే ఎన్నో సాధించవచ్చని ఆయన అన్నారు.నల్గొండ జిల్లాకు చెందిన మల్లేష్ నేత కార్మికులకు ఉపయోగపడే ఒక యంత్రాన్ని తయారు చేయడం ఆశ్చర్య పరిచిందని, అతనికి కోటి రూపాయలు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించడం జరుగుతుందని, నూతన ఆలోచనలు, నిర్మాణాత్మకమైన ముఖ్యంగా గ్రామీణ రంగంలో ఉపయోగపడే విధంగా యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా క్రియేటివ్ శృతనాత్మకంగా ఆలోచించాలని, అటువంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. దేశంలో అత్యున్నత సాఫ్ట్‌వేర్ అవకాశాలు హైదరాబాద్ కేంద్రంగా అందించడం జరుగుతుందని, రాబోయే అతి తక్కువ కాలంలో వరంగల్‌ను ఐటి హబ్‌గా తీర్చి దిద్దుటకు ఇక్కడ సర్వీస్ అందించుటకు సిద్ధంగా ఉన్నామని, డ్రోన్ టెక్నాలజీ వినియోగించడం ద్వారా అత్యున్నత సమాచారాన్ని సేకరించవచ్చని డ్రోన్



టెక్నాలజీ ద్వారా ఫస్ట్ రెస్పాండ్ అవడానికి డ్రోన్ కెమెరాలను పోలీస్, ఇతర శాఖలకు అనుసంధానం చేస్తూ సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని ఆయన అన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రపంచంలో హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అత్యున్నత ఐటి హబ్‌గా తీర్చి దిద్దుటలో కల్వకుంట్ల తారక రామారావు కృషి అద్భుతమని, రాబోయే రోజులలో హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ను ఐటీ హబ్‌గా తిర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఐటీ రంగంలో కేటీఆర్ చేస్తున్న కృషికి రతన్ టాటా అభినందించారని ఆయన అన్నారు. ఉద్యమాల్లో ప్రశ్నించడంలో, చదువుల్లో వరంగల్ యువత ముందుందని, ప్రయోగాలు చేయడంలో వరంగల్ యువత అందరికి ఆదర్శంగా ఉండాలని ఎస్ఆర్. విద్యా సంస్థల ద్వారా అత్యున్నత విద్యావకాశాలు కల్పిస్తున్న ఎస్.ఆర్. యాజమాన్యం, సంస్థ ప్రతినిధి వరదారెడ్డిని అభినందించారు. ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యాపరంగా అందిస్తున్న సేవలను అభినందిస్తూ ఎస్.ఆర్. కళాశాల ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వరంగల్ యువతకు ఎంతో దోహదపడుతుందని కేటిఆర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మ నగర మేయర్ నన్నపనేని నరేందర్, పార్లమెంటు సభ్యులు పసునూరి దయాకర్, శాసనసభ్యులు వర్ధన్నపేట ఆరూరి రమేష్, ఘన్‌పూర్ రాజయ్య, మహబూబాబాద్ శంకర్ నాయక్, జె.ఎన్‌టి.యు వైస్ ఛాన్సలర్ వేణుగోపాల్ రెడ్డి, హరికేస్ మిట్టల్, రవి త్యాగి, వరదారెడ్డి, డేవిడ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి భవన్ ముట్టడి విఫలం

- అడుగడుగునా పోలీసుల అడ్డంకులు..హౌస్ అరెస్టులు
- ప్రభుత్వతీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కె.లక్ష్మణ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రధాని నరేంద్రమోదీపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం భాజపా తలపెట్టిన ఛలో ప్రగతిభవన్ ముట్టడిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల కళ్ళుగప్పి ప్రగతి భవన్‌లోనికి చొచ్చుకుని వెళ్ళేందుకు నాయకులు విఫలయత్నం చేశారు. అయితే వారి చర్యలను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకుని నియంత్రించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు, పోలీసుల మధ్య పలుమార్లు తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసుల చర్యలను నిరసిస్తూ భాజపా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరాస ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ.... నరేంద్రమోదీకి కేసీఆర్ క్షమాపణ చెప్పాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దంబాల్‌రెడ్డి తదితరులు ప్రగతి భవన్ గేట్ వరకు చొచ్చుకుని వెళ్ళారు. వారితో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. కాగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, శాసనసభా పక్ష నాయకుడు జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజాసింగ్, ఎన్వీఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ రాంచందర్‌రావులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వారు ఇంటి నుంటి బయటకు రాకుండా పెద్దఎత్తున బలగాలను ఏర్పాటు చేశారు. కాగా ఆదివారం రాత్రి నుంచే పోలీసులు భాజపా

నాయకులను ముందస్తు అరెస్టు చేశారు.

కాగా పోలీసుల చర్యలపై లక్ష్మణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఛలో ప్రగతి భవన్‌కు పిలుపునిస్తే.....దీనిని అడ్డుకునేందుకు



కేసీఆర్ ప్రభుత్వం తమపై పోలీసులను ఉసిగొల్పడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేసే అధికారం కూడా ప్రతిపక్షాలకు లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ నియతృంత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

ఢిల్లీకి వెళ్ళి ఏం సాధిస్తారు

హైదరాబాద్‌లోనే ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలోకి అడుగుపెట్టలేని ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీకి వెళ్ళి ఏం ఒరగపెడతాడని భాజపా జాతీయ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ప్రశ్నించారు. దేశంలో ఆయన బలమెంతో చూసుకుని కేసీఆర్ మాట్లాడుతే బాగుంటుందని సూచించారు.సోమవారం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ను ఎత్తివేసిన కేసీఆర్ ఢిల్లీకి వెళ్ళి ధర్నా చేస్తా అనడం సిగ్గుచేటన్నారు.

ఏసీబీలో ఇంటి దొంగలు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)లో ఇంటి దొంగలున్నారా? అవినీతి పరుల గుండెల్లో నిద్రపోవాల్సిన అధికారులు వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారా? ప్రస్తుతం ఈ అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కొన్నేళ్ళ క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఒక కుదుపు కుదిపిన లిక్కర్ మాఫియా కేసు నుంచి మొదలు తాజాగా హెచ్ఎండిఎ ప్రణాళికా విభాగం అధికారి పురుషోత్తంరెడ్డి కేసు వరకు లీకు వీరులతోనే నీరు గారుతున్నాయా? ఈ ప్రశ్నలన్నింటినీ ప్రస్తుతం ఎసిబి అధికారులను తొలుస్తున్నాయి.గత నెలలో ఎసిబి అధికారులు హెచ్ఎండిఎ ప్రణాళికా విభాగం అధికారి పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులపై జనవరి మాసంలో సమాచారాన్ని సేకరించడం ప్రారంభించారు. ఇందుకోసం ఉన్నతాధికారులు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఆస్తుల చిట్టాను సేకరించేపనిలో ఉంచారు. ఎసిబి అధికారుల సమాచార సేకరణపై శాఖలో పని చేస్తున్న కొంత మంది పురుషోత్తంరెడ్డికి చేరవేయడం, ఉన్నంతలో సర్ధుకున్న అధికారి ఎసిబి ఆరా విషయం ఏ మాత్రం తెలియని వాడిగా నటించి నెల రోజుల సెలవు పెట్టి ఫోన్ స్విచాఫ్ చేసి పారిపోయాడు. ఫిబ్రవరి 2 వ తేదీన అధికారులు పురుషోత్తంరెడ్డి ఇళ్ళు, బినామీలు, బంధువుల ఇళ్ళు, కార్యాలయంపై దాడి చేసి సోదాలు నిర్వహించి దాదాపు రూ. 300 కోట్ల ఆస్తులను గుర్తించారు. అధికారులకు వచ్చిన సమాచారం ప్రకారం ఆయన ఆస్తులు వేయి కోట్ల వరకు ఉంటాయని ఉంది. కానీ ముందుగానే పురుషోత్తంరెడ్డి సర్ధుకోవడంతో మూడో వంతు ఆస్తులు మాత్రమే పట్టుబడ్డాయి. ఎసిబి కేసు నమోదు అనంతరం పరారీలో ఉన్న పురుషోత్తంరెడ్డిని పట్టుకునేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు కూడా ఎప్పటికప్పుడు తెలుసుకున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీంతో కేసును దర్యాప్తు చేస్తున్న ముగ్గురు అధికారులను బదలీ చేయాల్సి వచ్చింది.తాజాగా జిహెచ్ఎంసిలో పని చేస్తున్న ఒక అధికారి ఆస్తులపై దాడులు చేయాలని ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు. ఆ అధికారి ఆస్తులు, వ్యవహారం గురించి ఆరా తీసేలోపుగానే సమాచారం లీకై సర్ధుకున్నాడని అధికారులు అంటున్నారు. అత్యంత కీలకమైన శాఖలో 'కొంత మంది చేస్తున్న లీకుల వ్యవహారం శాఖకు తలనొప్పిగా మారింది.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

గార్ల, ప్రభన్యూస్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఉన్నత శిఖరాలను ఆదిరోహించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ బి.అరవింద్ సూచించారు. సోమవారం వరంగల్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని బంజార సేవా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆంగ్ల మధ్యమ పాఠశాలకు లక్ష రూపాయల విలువగల కంప్యూటర్‌లను వితరణచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల మధ్యమాన్ని అభివృద్ధి చేసుకుని, ఉద్యోగ భవిష్యత్‌ను పొందు పర్చుకోవాలని అన్నారు.

క్యాన్సర్ రోగులకు టాటా ట్రస్ట్ చేయూత

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మధ్యవర్తిత్వం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు కష్టాలు తీర్చడానికి టాటా ట్రస్టు ముందుకొచ్చింది. ఇక చికిత్స కోసం ఎంఎన్‌జేకు వచ్చి నిరీక్షించే బాధలు తీరనున్నాయి. కేన్సర్ చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలతో పాటు కావ లసిన సదుపాయాలు, నిధులను సమకూర్చడానికి టాటాట్రస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మధ్యవర్తితం నెరపనుంది. రోగులకు స్థానికంగానే నాణ్యమైన చికిత్సను అందుబాటులోకి తెచ్చేందుకు ఈ ట్రస్టు తన సేవలను అందించనుంది. దీనికోసం మూడంచెల చికిత్స విధానాన్ని అమలు చేసేందుకు ఈ ట్రస్టు, రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించుకుంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధికి గురైన వారు చికిత్స నిమిత్తం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి రావలసిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనివల్ల క్యాన్సర్ రోగికి చికిత్స అందడంలో జాప్యంతో పాటు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని టాటాట్రస్టు తమ సేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో 5 రోజుల క్రితం అవగాహన ఒప్పందం క



ుదుర్చుకుంది.రాష్ట్ర వ్యాప్తంగా చాలామంది క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. ఇందులో పలురకాల క్యాన్సర్‌లు ఉంటాయి. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. మగవారు ఎక్కువగా నోటిక్యాన్సర్ వ్యాధి బారిన పడుతుండగా, మహిళలు గర్భాశయ ముఖద్వారా తదితర క్యాన్సర్ వ్యాధుల బారిన పడుతున్నారు. క్యాన్సర్ సోకిన వారు వారాల తరబడి చికిత్స పొందాల్సి ఉంటుంది. ఎంఎన్‌జే ఆస్పత్రిలో రేడియోథెరఫీ, కీమోథెరఫీ చికిత్సల కోసం రోగులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఓపీ విభాగానికి రోజుకు 800 మంది రోగులు వస్తుంటారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వ్యాధి గ్రస్తులకు నిరంతరాయంగా చికిత్సను అందించడంలో వైద్యులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు.

ఎంఎన్‌జేపై ఒత్తిడి తగ్గుతుంది
క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత

టాటాట్రస్ట్ తమ సేవలను ప్రారంభిస్తే ఎంఎన్‌జేపై ఒత్తడి తగ్గుతుంది. ప్రతి జిల్లాల్లోనూ దీనికి అవసరమైన సిబ్బందిని గుర్తించే పనిలో ఉన్నాం. అందరూ శిక్షణ పొందిన వారే ఉంటారు. ఎంఎన్‌జే ఆస్పత్రిని ఎల్-1గా గుర్తించడంతో నోడల్ సెంటర్ పేర్కొంటున్నాం. ఎల్-2 జిల్లా ఆస్పత్రుల్లో క్యాన్సర్‌కు చికిత్స అం దించే ఆస్పత్రులు, ఎల్-3 టీచింగ్ ఆస్పత్రులు, ఎల్-4 ఇన్వెస్టిగేషన్ చేసే సెంటర్లుగా విభజించాం. 12 జిల్లాల్లో ఇప్పటికే సెప్టెంబర్ నుంచి స్క్రీనింగ్ టెస్టులను చేస్తున్నాం. దీనికోసం గతంలోనే వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇప్పించాం. ప్రస్తుతం మరింతమందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. ఎక్కడికక్కడే జిల్లా ఆస్పత్రిలో క్యాన్సర్‌కు చికిత్స అందించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రస్తుతం ఎంఎన్‌జేలో కూడా అధునాతన పరికరాలను ప్రభు త్వం సమకూర్చింది. జిల్లాలకు కూడా మరిన్ని అధునాతన పరికరాలను ప్రభుత్వం సమ కూర్చనుంది.

అసైన్డ్‌భూములపై హక్కుల బదలాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భూమిలేని నిరుపేదలు అసైన్డ్ భూములు కొనుగోలు చేస్తే వారికి ఆ భూములు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 2017, డిసెంబర్ 31 నాటికి కొనుగోలు చేసుకున్న వారికి ఈ వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ భూముల రీఅసైన్డ్ అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అసైన్డ్ చేసిన భూములు చేతులు మారాయని అధికారులు ఇటీవల జరిపిన క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయడంతో 2.41 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు చేతులు మారినట్టు నిర్ధారించింది. ఈ భూములను నిరుపేదలకు కొనుగోలుచేస్తే వారికి రీఅసైన్డ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వాలు దశల వారీగా 22.55 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను 20.10 లక్షల మంది నిరుపేదలకు పంపిణీ చేసింది. అయితే ఇందులో 2.41 లక్షల ఎకరాల భూములను 84,706 మంది కొనుగోలు చేసినట్టు అధికారులు నిర్ధారించారు. నిరుపేదలు కొనుగోలు చేసిన వారికి ఈ సవరణ లబ్ధి చేకూరుస్తుంది.

నేను పరకాల విద్యార్థినే:కేటీఆర్

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : తాను చిన్ననాడు పరకాలలో విద్యాభ్యసం చేశానని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గుర్తుచేశారు. 1982-83లోపరకాలలోతమసమీప బంధువుల ఇంటి వద్ద ఉంటూ మినార్వ ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుకున్నానన్నారు. సోమవారం పరకాలకు వచ్చిన మంత్రి కేటిఆర్ పరకాల మాజీ శాసన సభ్యులు మొలుగూరి బిక్షపతి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బిక్షపతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో కలిసి తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. పరకాలలో విధ్యనభ్యాసం చేసిన విషయాన్ని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తాను చదువుకున్న పాఠశాల రికార్డులను ఒకసారి పరిశీలించారు. తన మిత్రులు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా పాఠశాలలో చదువుకున్న రికార్డులు తెప్పించుకున్నారు. మినర్వ పాఠశాలకు చెందిన శాంతి ప్రసాద్, ఎస్వికళాశాలకు చెందిన సిరికొండ అభితేజ, వినోద్‌లు పాఠశాల రికార్డులను కేటిఆర్‌కు ముందు ఉంచగా ఆయన ఆశ్చర్యంచెందారు. 35 ఏళ్ల క్రిందటి పాఠశాల రికార్డుల్లో తన పేరును చూసుకుని మురిసిపోయారు.

దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు

- టిఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశప్రజలంతా కెసిఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్ అన్నారు. టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ఏర్పాటుచేయనున్న బిజెపి, కాంగ్రెసేతర ఫ్రంట్ నిలవదని కడుపు మంటతో తప్పుడుకూతలు కూస్తున్నారన్నారు. టెంట్లకింద కూర్చుని తెలంగాణ సాధించిన చరిత్ర కెసిఆర్‌కు ఉందని, కెసిఆర్ ఏర్పాటుచేసే రాజకీయఫ్రంట్ టెంట్ కాదని.. పర్మినెంట్ అని అన్నారు. కెసిఆర్ వ్యక్తికాదని, బలమైన శక్తి అని అన్నారు. కెసిఆర్ ఢిల్లీలో కాలుమోపిన రోజే దడ పుట్టిస్తారని, తన శక్తేంటో చూపిస్తారని ఆయన అన్నారు. గతంలో లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, ఎన్టీఆర్‌లు జాతీయ రాజకీయాల్లో మార్పు కోసం కృషి చేశారని, ఇపుడు కెసిఆర్ జాతీయ రాజకీయాలను మార్చేందుకు కదులుతున్నారన్నారు.


శ్రీనివాసన్ కేసులో తీర్పు వాయిదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జగన్ అక్రమాస్తుల కేసులో ప్రత్యేక కోర్టు ముందు తనకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థిస్తూ ఇండియా సిమెంట్స్ చైర్మన్ ఎన్.శ్రీనివాసన్ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో మనీలాండరింగ్ చట్టం (పీఎంఎల్ ఏ) కింద ప్రత్యేక కోర్టులో ఈడీ కేసులు దాఖలు చేసింది. ఇండియా సిమెంట్స్ వ్యవహారంలో ఈడీ అభియోగ పత్రం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ..శ్రీనివాసన్‌పై సీబీఐ దాఖలు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసిందని తెలిపారు. అయితే ప్రత్యేక కోర్టు ముందు తరచూ జరిగే విచారణలకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు.ఈ వ్యవహారంలో తీర్పును వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

కాపలాలేని లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని కాపలాలేని లెవల్ క్రాసింగ్‌లను తొలగించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో కాపలాలేని లెవల్ క్రాసింగ్‌లను తొలగించడంలో సికింద్రాబాద్ డివిజన్ అగ్రభాగన నిలిచింది. డివిజన్ పరిధిలోని అన్ని రూట్లలో కాపలాలేని లెవల్ క్రాసింగ్‌లను తొలగించడం జరిగిందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

ఆర్ఎస్ఎస్ చేతిలో కేసీఆర్ కీలుబొమ్మ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాగ్‌పూర్ పెద్దలు వదిలిన బాణమే థర్డ్‌ఫ్రంట్ వ్యవహారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ చేతిలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కీలుబొమ్మగా మారాడని ఆయన దుయ్యబట్టారు. కుంభకోణాల నుంచి సీఎం కేసీఆర్ బయటకు రావాలంటే.. చంద్రబాబు కాళ్లకు బంధం వేయాలని బీజేపీ నేతలు కేసీఆర్‌కు సూచన చేశారని ఆయన వివరించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. అందుకే సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రి నరేంద్రమోడికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ, ప్రధాన మంత్రిని కాపాడటానికే సీఎం కేసీఆర్ మూడు రోజుల నుంచి ఒక కొత్త డ్రామా ఆడుతున్నారని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. దీంతో సమీకరణాలు వేగంగా మారుతున్నాయని ఆయన వివరించారు. దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లకు పైగా ఎంపీ సీట్లు వస్తాయని, బీజేపీకి మాత్రం 30 నుంచి 40 సీట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రుల కుంభకోణం, సహారా ఇండియా కంపెనీ కుంభకోణంలో సీబీఐ విచారణ జరుగుతోందని ఆయన ఆరోపించారు. కేసులకు భయపడే బీజేపీ ఆడినంచినట్లుగా కేసీఆర్ నడుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మన దేశంలో చైనా చట్టాలను అమలు చేస్తే కేసీఆర్‌కు ఉరిశిక్షపడుతుందన్నారు.

సీబీఐ విచారణపై కేసీఆర్ స్పందించాలి

- మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాట మీద నిలబడని సీఎం చంద్రశేఖర్‌రావును తెలంగాణ ప్రజలు ఇక నమ్మరని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. నోరు తెరిస్తే అబద్దాలేనని, అసెంబ్లీలో మాట్లాడిన మాటలు.. ఆ తర్వాత తానేమి అనలేదని కూడా చెబుతారని ఆయన విమర్శించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. మాట నిలబడని వ్యక్త దేశ రాజకీయాలను మారుస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ చేసిన థర్డ్‌ఫ్రంట్ ప్రకటన పరోక్షంగా బీజేపీకి మేలు చేసే విధంగానే ఉందన్నారు. సహార ఇండియా గ్రూప్‌కు సంబంధించి ప్రావిడెంట్ ఫండ్ విషయంలో సీఎం కేసీఆర్ సీబీఐ విచారణ ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం స్పందించాలన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో బీజేపీని సమర్థించడంలో కేసీఆర్ ముందున్నారని ఆయన తెలిపారు. రాజ్యాంగాన్ని మారుస్తామని అంబేద్కర్‌ను కించపర్చేలా కేసీఆర్ మాట్లాడారని ఆయన విమర్శించారు. వ్యవస్థను బలహీనర్చే కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది దేశ సమగ్రతకు మంచిది కాదని ఆయన హితవు పలికారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి ముంచిన ఘనుడు కేసీఆర్ అని ఆయన విమర్శించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కూడా మాటా మార్చారని శశిధర్‌రెడ్డి అన్నారు. విధేశాల్లోని నల్లధనాన్ని స్వదేశానికి తీసుకొస్తామని మాట వరుసకే అన్నామని అమిత్ చెప్పారని ఆయన గుర్తు చేశారు.

ఎన్నికల పొత్తును చంద్రబాబు నిర్ణయిస్తారు

- తెదేపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికార తెరాస, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటించాలని, ప్రజల సమస్యలపైనే దృష్టి కేంద్రీకరించి పోరాటం చేయాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా పొత్తు లేదని, ఆ పార్టీనే ప్రకటించినందున దానిగురించి కార్యకర్తలు ఆలోచించవద్దని ఆయన చెప్పారు. రాష్ట్ర పార్టీ సోమవారం ఎన్‌టిఆర్ భవన్‌లో సమావేశమై తాజా రాజకీయాలు, పార్టీ బలోపేతం, రైతు ఆత్మహత్యలపై చర్చించింది. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకునే విషయాన్ని జాతీయ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయిస్తారని, ఈలోగా పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని రమణ చెప్పారు. రాష్ట్రంలోని అన్ని శాసనసభ నియోజకవర్గాలకు త్వరలో ఇన్‌ఛార్జీలను నియమిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అరవింద్ కుమార్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రావులపాటి సీతారామారావు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు బండ్రు శోభారాణి, నన్నూరి నర్సిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు కొమ్మినేని సాయివికాస్, కర్నాటి విద్యాసాగర్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థినులకు సైకిళ్లు!



- ఆలోచిస్తున్న పాఠశాల విద్యాశాఖ
- 5 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చేవారికి ఇచ్చే యోచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థినులకు సైకిళ్లను ఇవ్వాలని పాఠశాల విద్యా శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సీఎస్ఎస్ పథకంలో భాగంగా విద్యార్థినులకు సైకిళ్లను ఇవ్వాలని ఆలోచనను పాఠశాల విద్యా శాఖ చేస్తోంది. త్వరలో జరుగబోయే ప్లానింగ్ అప్రూవల్ బోర్డు (పిఏబి) సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పాఠశాల విద్యా శాఖ రూపొందించింది. ఆయా ప్రతిపాదనలను పిఏబి సమావేశంలో చర్చించి అవసరమైన నిధులను బట్టి విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేయాలని పాఠశాల విద్యా శాఖ ఆలోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులను ఎంత మంది ఉంటారోనే లెక్కలను జిల్లా విద్యాశాఖాధికారులను నుంచి తెప్పించుకోనున్నారు. వివరాలను పిఏబిలో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటారు.

మోడల్ స్కూల్స్‌కి భారీగా దరఖాస్తులు

తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. 6వ తరగతిలో చేరడానికి 55,281 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో 194 మోడల్ స్కూల్స్ ఉండగా వాటిలో 19400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో సీట్ల కోసం 55,281 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించారు. వీరికి రాత పరీక్ష ఏప్రిల్ 15న నిర్వహిస్తారు. 7వ తరగతిలో ప్రవేశాలకు 21,331 మంది, 8వ తరగతికి 18,112 మంది, 9వ తరగతికి 13,220 మంది, 10వ తరగతికి 4183 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు నిమిషం టెన్షన్

- గత ఏడాది సడలించిన ప్రభుత్వం
- ఈ ఏడాది అమలుకు సన్నాహాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పరీక్షలంటేనే భయపడే విద్యార్థులకు... ఇప్పుడు నిమిషం నిబంధన మరీ హడలెత్తిస్తోంది. ఎస్ఎస్‌సీ పరీక్షలు రాసే విద్యార్థులకు నిమిషం నిబంధనను అమలు చేయాలని పాఠశాల విద్యా శాఖ ఆలోచిస్తోంది. పరీక్షకు నిమిషం ఆలస్యంగా వస్తే అనుమతించ కూడదని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది ఎస్ఎస్‌సీ పరీక్షలకు విద్యార్థులకు నిమిషం నిబంధనను అమలు చేయకుండా అధికారులు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్ ఇచ్చారు. కానీ ఈ ఏడాది అందుకు విరుద్ధంగా పరీక్షకు నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించకూడదని అధికారులు నిర్ణయించారు. నిమిషం నిబంధనను అమలు చేస్తే విద్యార్థులు ఆందోళన చెందే ప్రమాదం ఉండడమే కాకుండా, పరీక్ష రాయలేకపోతే వారు తీవ్ర ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఒక్క పరీక్ష రాయలేకపోయినా విద్యార్థి ఏడాది నష్టపోవాల్సి వస్తుంది. నిమిషం నిబంధన ఎక్కడో సాధారణంగా పోటీ పరీక్షలకు అమలు చేస్తారు. ఈ మధ్య కాలంలో వార్షిక పరీక్షలకు సైతం అమలు చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు కూడా నిమిషం నిబంధనను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎస్ఎస్‌సీ పరీక్షలకు కూడా నిమిషం నిబంధనను అమలు చేయాలని పాఠశాల విద్యా శాఖ ఆలోచిస్తోంది. దీంతో మార్చి 15 నుంచి పరీక్షలు రాయబోయే ఎస్ఎస్‌సీ విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నిమిషం నిబంధన ఎత్తేయాలి

నిమిషం నిబంధనతో విద్యార్థులు ఒత్తిడికి లోనై భయభ్రాంతులకు గురవుతారని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బి.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైన శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షా కేంద్రాలు మండల కేంద్రానికి సుమారు 3 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయని, విద్యార్థులు గ్రామాల నుంచి రావడానికి ఎన్నో కారణాలతో నిమిషం ఆలస్యం అయితే అతను ఏడాది పాటు నష్టపోవాల్సి వస్తోందని అన్నారు. విద్యా శాఖ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పరీక్షలకు సిద్ధపడటానికి విద్యార్థులు నానా తంటాలు పడుతుంటే ఇప్పుడు నిమిషం నిబంధనతో మరో సమస్యను విద్యార్థులకు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

పరీక్షలకు 5,38,867 మంది దరఖాస్తు

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్‌సీ పరీక్షలకు 11,109 స్కూల్స్ నుంచి 5,38,867 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 5,03,117 మంది రెగ్యులర్ విద్యార్థులుండగా, 35,750 మంది వన్‌టైం ఫెయిల్ వారు ఉండగా, ఒకేషనల్ విద్యార్థులు 20,838 మంది ఉన్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 2542 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం 2375 పరీక్షా కేంద్రాలు, సప్లిమెంటరీ విద్యార్థులకు 167 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 431 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 144 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు: అరుణ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో కాంస్య పతకంతో తన సత్తాను చాటిన అరుణారెడ్డి సోమవారం రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి పద్మారావు గౌడ్‌తో భేటీ అయ్యారు. సికింద్రాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో తనకు రూ. 2కోట్లు నజరానాగా ప్రకటించినందుకు సీఎం కె చంద్రశేఖరరావు, మంత్రి పద్మారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం ఉంటుందని అరుణారెడ్డికి మంత్రి భరోసా ఇచ్చారు. తదుపరి పోటీలు ఆస్ట్రేలియాలో జరుగుతున్నాయని, అక్కడికి వెళుతున్నట్లు అరుణారెడ్డి మంత్రికి చెప్పారు.

ఇంగ్లీష్-2కు 96 శాతం హాజరు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-2కు 96 శాతం మంది హాజరయ్యారు. పరీక్షకు 4,39,979 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 4,22,308 మంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇద్దరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముగ్గురు, పెద్దపల్లి జిల్లాలో ఒక్కరు, సంగారెడ్డిలో ఒకరు, యాదాద్రి జిల్లాలో ఇద్దరు, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మాల్ ప్రాక్టీస్ కేసులో బుక్ అయ్యారు.

అజయ్ మిశ్రాకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ బాధ్యతలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాకు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఈ శాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగిన రజత్ కుమార్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా నియమించిన నేపథ్యంలో ఆయన అక్కడి నుంచి రిలీవ్ చేశారు.

జగన్ పాదయాత్రకు నీరా'జనం'

ఒంగోలు, ప్రభన్యూస్ బ్యూరో : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర సోమవారం ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలో సాగింది. పాదయాత్ర 104వ రోజున 1400 కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా జగన్ నాగులపాడు వద్ద మొక్క నాటారు. పాదయాత్రకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ శివభరత్‌రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు అద్దంకి శివారులోని జగన్ శిబిరం వద్దకు అనేకమంది రైతులు వచ్చి మద్దతు తెలిపారు. నాగులపాడు గ్రామస్తులు దారిపొడవునా రంగులతో తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. మొక్క నాటిన అనంతరం గ్రామచావిడి వద్ద జగన్ జెండా ఆవిష్కరించారు. ఆ గ్రామానికి చెందిన నాగరాజు, అనూష దంపతులు తమ బిడ్డ మైఖేల్‌కు గుండె ఆపరేషన్ అవసరముందని, అయితే తమ వద్ద తగినంత సొమ్ము లేదన్నారు. తమ బాధను జన్మభూమి కమిటీ వద్ద చెప్పుకున్నా కనీసం రేషన్ కార్డు ఇవ్వలేదని తెలిపారు. కొంచెం ఓపిక పట్టాలని, ఆదుకుంటామని జగన్ హామీ ఇచ్చారు. అనంతరం వెంకటాపురం చేరుకున్న జగన్, అక్కడ పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. ఆ గ్రామంలోని చైతన్య మహిళా మండలికి చెందిన మూగ, చెవుడు స్కూల్ విద్యార్థులను జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన పిజియోథెరపిస్టులు పాదయాత్రకు, ప్రత్యేక హోదా పోరాటానికి మద్దతు తెలిపారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, అందుకోసం సాగే పోరాటంలో చేయూతనిస్తామని తెలిపారు. వెంకటాపురం, అలవలపాడు, తక్కెళ్లపాడులో జగన్ పాదయాత్ర నిర్వహించారు.

మహిళా సంక్షేమానికి రూ. 21,271 కోట్లు

- గత బడ్జెట్ కంటే రూ.540 కోట్లు అదనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుంది. మహిళా శిశు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. అందుకు అవసరమైన నిధులు సమకూర్చడంలో కూడా మానవీయ నిర్ణయాలు తీసుకుంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాల కోసం బడ్జెట్‌లో 1731.50 కోట్లు కేటాయించగా 2018 -19 ఆర్థిక సంవత్సరానికి రూ. 21,271 కోట్ల వరకు ప్రతిపాదనలు నివేదించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈసంవత్సరం రూ. 540 కోట్లు అదనంగా ఖర్చు చేయడానికి సిద్ధపడింది. దీనికి తోడు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు సమకూర్చుకుంటుంది. గర్భిణీలు బాలింతలు, శిశువుల విషయంలో ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంటుంది. అందరికీ పౌష్టికాహారం అందించే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మి కార్యక్రమాలను అమలు జరుపుతుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం సరఫరా చేయడంతో పాటుగా ప్రతి రోజు గుడ్లు, పాలు, పోషకాహారం అందిస్తున్నారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు ప్రోత్సహిస్తుంది. ఇటీవలి కాలంలో 102 నెంబర్ ఉచిత అంబులెన్స్‌లను ప్రారంభించి, గర్భిణీలను ఆసుపత్రులకు ఉచితంగా తీసుకురావడం జరుగుతుంది. ప్రసవం అయిన వెంటనే పుట్టిన బిడ్డ కోసం కెసిఆర్ కిట్ అందచేస్తున్నారు.

గర్భిణీలకు మూడు విడతల్లో రూ. 12 వేల మొత్తాలను అందచేస్తుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఇటీవలి కాలంలోనే వేతనాలు పెంచడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 67,411 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీటితో పాటు పలు మహిళాభ్యున్నతి కార్యక్రమాలు అమలు జరుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిసాధికారతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుంది. సామాజిక, ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. సాధికారత దిశగా మహిళలు ముందుకు సాగడానికి అనేక ప్రోత్సాహకాలు అందుబాటులోకి తెచ్చింది. గౌరవం, సాధికారత, సమానత్యం కోసం తీసుకుంటున్న చర్యలు గ్రామీణ మహిళల జీవితాలలో వెలుగులు నింపుతుంది.

మహిళా సాధికారతతో పాటుగా శిశు సంక్షేమం, బాలికా సంరక్షణ, పౌష్టికాహారం, విద్య, వైద్యం అందిపుచ్చుకోవడానికి అనేక పథకాలను అందుబాటులోలకి తేవడం జరుగుతుంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు మంచి ఆదరణ లభిస్తుంది. బాలికా సంరక్షణతో పాటు బాలికల విద్య విషయంలోకూడా అనేక ప్రోత్సాహకాలు అందుబాటులోకి తెచ్చారు. మహిళా శిశు సంక్షేమంలో పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే ఎంతో ముందంజలు ఉన్నామని అధికారులు తెలిపారు.

టూర్లు.. చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

రైతు సంఘాల ప్రతినిధులను పిలిపించి సమీక్షిస్తారు. అదే సమయంలో మీడియా సంస్థలు, ప్రముఖ జర్నలిస్టులు, పారిశ్రామికవేత్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులతోనూ సమాలోచనలు జరిపి బలమైన వేదికకు పునాదులు వేస్తారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ ప్రజల అవసరాలు, వారి ఆలోచనలు, భవిష్యత్తులో మరింత మెరుగైన పాలనకు అనుసరించిన వ్యూహాలపై నివేదికను సిద్ధం చేసుకుంటారు. ఈ సమావేశాలు దేశంలోని ప్రధాన నగరాలన్నింటిలోనూ నిర్వహించి రాజధాని ఢిల్లీలో మూడో కూటమికి మద్దతు ఇస్తున్న వారందరినీ కలుపుకుని భారీ బహిరంగ సభను నిర్వహించి సత్తాను చాటాలని సీఎం కేసీఆర్ వ్యూహాన్ని రచిస్తున్నారు. హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర మెట్రోపాలిటన్ నగరాల్లోనూ మూడో కూటమి బహిరంగ సభలు నిర్వహించి దేశాన్ని సమాయత్త పరుస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న మేధావి వర్గాలను సంప్రదించడానికి, వారందరినీ సమన్వయపరచడానికి ఒక్కో ప్రముఖ వ్యక్తితో స్వయంగా ఆయనే మాట్లాడాలని నిర్ణయించుకున్నారు.

దేశం బాగు పడాలని, దేశ ప్రజలు సుఖశాంతులతో ఉండాలన్న ఆలోచనకు తనకున్న ముందుచూపు, వ్యవస్థ ప్రక్షాళన ఆవశ్యకతను వారికి వివరించి సిద్ధంచేస్తారు. అనంతరం వేలాది మంది సమన్వయంతో ఢిల్లీలో థర్డ్‌ఫ్రంట్ కార్యాలయాన్ని ప్రారంభించి జెండా, అజెండాను ప్రకటిస్తారు. దేశానికి అవసరమైన అన్ని అంశాలపై స్పష్టత ఇస్తూ మరింత మంది మద్దతుదారులను కూడగట్టుకునే ప్రయత్నం చేస్తారు. తాను చేసిన ఒకేఒక్క ప్రకటనతో భారీస్థాయిలో వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే కేసీఆర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన పలువురు ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. గరిష్టంగా నెల రోజుల్లోగా దేశానికి దశ, దిశ చూపించే ప్రత్యామ్నాయ రాజకీయ కూటమికి తానే నేతృత్వం వహించాలన్న వ్యూహంలో విజయం సాధించేందుకు ముందుకు సాగుతున్నారు.

చెలరేగిన మావోయిస్టులు

- రెండు బస్సులు, మూడు లారీలు దగ్ధం

చింతూరు, ప్రభ న్యూస్ : ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు రాష్ట్రం అయిన ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం రాత్రి చెలరేగారు. మావోయిస్టులు సుకుమా జిల్లా డోర్నపాల్ సీఆర్పీఎఫ్ క్యాంపుకి అతి సమీపంలో కుట్టి గ్రామం దగ్గరలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు జగ్దల్పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సును మావోయిస్టులు తగులబెట్టారు. ఈ ఆర్టీసీ బస్సుతో పాటు మరో బస్సు, మూడు లారీలను సైతం మావోలు దగ్ధం చేశారు. తెలంగాణ - ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో మూడు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులను మాత్రం మావోయిస్టులు ఏమి చేయకుండా వదిలివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో ప్రయాణికులు భయంతో దగ్గరలోని సీఆర్పీఎఫ్ క్యాంపుకి వెళ్లి తలదాచుకున్నారు.


'బీజేపీ ఎక్స్‌ప్రెస్' నాలుగేళ్లు లేటు

- విశాఖలో టీడీపీ వినూత్న నిరసన

విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: ప్రత్యేక హోదా ప్రకటిస్తామని, రైల్వేజోన్ కేటాయిస్తామని ఆంధ్రా ప్రజలను నాలుగేళ్లుగా బీజేపీ ప్రభుత్వం మభ్యపెట్టిందని, ఇంతటి మోసానికి పాల్పడిన మోడీ ప్రభుత్వం మెడలు వంచుతామని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి సరస్వతి పార్కు వరకు ఎనిమిది బోగీల నమూనా రైలుతో టీడీపీ శ్రేణులు వినూత్నంగా నిరసన ప్రదర్శన చేపట్టాయి. ప్రతీ బోగీపైన కూడా ఆయా పథకాలకు రాష్ట్రప్రభుత్వం ఎంత మొత్తంలో ఖర్చుచేసింది, కేంద్రం ఎంత కేటాయించింది అన్న విషయాలు పొందుపరిచారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.3,400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రం రూ.7,800 కోట్లు ఖర్చు చేసిందని ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రదర్శన అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగేళ్లు లేటుగా అభివర్ణించారు. విభజన చట్టంలో అంశాలు తక్షణమే అమలు చేయాలని , రైల్వేజోన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఆయా సమస్యల పరిష్కారానికి గళమెత్తుతున్నారని వారు సంఘీభావంగా ఈ నిరసన ప్రదర్శన చేపట్టామన్నారు. విభజన చట్టం ప్రకారం రూ.74వేల కోట్లు విషయమై చేస్తాం.. చూస్తాం.. చెబుతున్నారని ఇది సరికాదన్నారు. మోడీ ఆంధ్రాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఒక వైపు మహారాష్ట్రలో శివసేనకు కత్తిపోటు పొడిచారని, ఇప్పుడు ఆంధ్రాకు అదే విధంగా అన్యాయం చేస్తున్నారన్నారు.

భూసేకరణ ఇబ్బందైతే

భూగర్భ పైప్‌లైన్లు



- ప్రాజెక్టులు పూర్తికావడమే లక్ష్యం
- ప్రాధాన్యతా జాబితాలో మరో 20 ప్రాజెక్టులు
- పోలవరం డిజైన్ల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారి: సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించ తలపెట్టిన ప్రాధాన్య ప్రాజెక్టులతో పాటు నిర్మాణంలో ఉన్న ఇతర ప్రాజెక్టుల పూర్తికి ప్రధాన అడ్డంకిగా ఉన్న భూసేకరణ సమస్యను అధిగమించాలంటే భూగర్భ పైపులైన్లే మార్గమని దీనికి అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.


భూగర్భ పైపు లైనులు వేయడానికి ఎవరి ఆమోదం అవసరం లేదని, ప్రధానంగా భూసేకరణ వ్యయం కూడా ఆదా అవుతుందన్నారు. ఇప్పటికే 28 ప్రాధాన్య ప్రాజెక్టులను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి ఈ క్రమంలో మరో 20కిపైగా ప్రాజెక్టులను ఈ జాబితాలో చేర్చాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే 28 ప్రాజెక్టులు చాలా వరకు పూర్తి కావస్తున్నందున కొత్త ప్రాజెక్టులను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో పోలవరం ఇతర ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. గోదావరి-పెన్నా అనుసంధనం మొదటి దశ, మహేంద్ర తనయ, జిఎన్ఎస్ఎస్ రెండో దశ వెలుగొండ-1, 2 టన్నెల్స్ వైకుంఠపురం బ్యారేజి, స్వర్ణముఖి-సోమశిల, మల్లెల మడుగు, శ్రీ బాలాజీ రిజర్వాయర్, వేణుగోపాలసాగర్, హీరా-ఇచ్ఛాపురం- సోంపేట, జి.డిపల్లి-భైరవానితిప్ప, మూలపల్లి-కుప్పం, పాలేరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఆల్తూరుపాడుతో సహా 20కిపైగా ప్రాజెక్టులను ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో చేర్చాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికార యంత్రాంగానికి సూచించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన అంచనాలను తక్షణమే రూపొందించి, ఏ ప్రాజెక్టు ఎప్పటికల్లా పూర్తి చేయాలి అనే లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. వెంటనే టెండర్లను పిలిచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా తారకరామా తీర్థసాగరం, వెలుగొండ ప్రాజెక్టులను ఈ సీజన్ కల్లా పూర్తి చేయాలని వర్షాలు పడే సమయానికి నీటిని విడుదల చేసేలా చూడాలని చెప్పారు. నాగవళి కాలువల అభివృద్ధి చేసి 110 ఏళ్ళు అయిందని వాటిపైన దృష్టి సారించాలన్నారు. వచ్చే ఏడాదిలోపు రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జల మట్టాలు 15 మీటర్లు మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని గుర్తించి రాష్ట్రంలో ఏ మేరకు తాగు, సాగు, పరిశ్రమలకు నీరు అవసరమవుతుందో లెక్కలు తేల్చాలని ఆదేశించారు.

పోలవరం ప్రాజెక్టు డిజైన్లకు ప్రత్యేకాధికారి

పోలవరం ప్రాజెక్టులకు సంబంధించి మిగిలివున్న వివిధ డిజైన్ల పనులు సత్వరమే పూర్తి చేయాలని, వీటి పర్యవేక్షణకు, డిజైన్ల రూపకల్పనకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సత్వరమే కేంద్ర జలవనరుల శాఖ నుంచి అనుమతులు పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. 2018 జనవరి వరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 13,053.91 కోట్లు వెచ్చించగా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన అనంతరం రూ.7,918.04 కోట్లు ఖర్చు చేసినట్లుగా అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. దీనిలో ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కేంద్ర ప్రభుత్వం రూ. 4,932.26 కోట్లు ఇవ్వగా, మరో రూ.2,985.78 కోట్లు ఇవ్వాల్సివుందని తెలిపారు. గడిచిన వారంలో 24 వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకం పనులు చేపట్టగా 11 వేల క్యూబిక్ మీటర్ల మేర స్పిల్ వే, స్టిలింగ్ బేషిన్ కాంక్రీట్ పనులు పూర్తి అయ్యాయని వివరించారు. డయాఫ్రమ్ వాల్‌కి సంబంధించి 7.6 మీటర్ల నిర్మాణం పూర్తి అయిందని చెప్పారు. మొత్తం మీద పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 1115.59 లక్షల క్యూబిక్ మీటర్లకుగాను ఇప్పటి వరకు 777.54 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకం పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్పిల్ వే, స్టిలింగ్ బేసిన్, స్పిల్ చానెలకు సంబంధించి 35.14 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాల్సివుండగా ఇప్పటి వరకు 5.4 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తి అయ్యాయని వివరించారు. డయాఫ్రమ్ వాల్ సంబంధించి 1011.6 మీటర్ల నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 1,62,739 ఎకరాల భూసేకరణ చేస్తున్నామని, దీనికి సంబంధించి రూ. 4,922.76 కోట్లు చెల్లించి 1,02, 480.90 ఎకరాలను సేకరించినట్లు వివరించారు. ఇంకా 60,258.10 ఎకరాల భూసేకరణ చేయాల్సివుందని దీనికి రూ.28,302.98 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎడమ కాల్వ పనులు పురోగతిపై వచ్చే వారం నుంచి ప్రతి వారం నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఇఎన్‌సీ వెంకటేశ్వర రావు, సీఎం అదనపు కార్యదర్శి రాజమౌళి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జైట్లీతో చర్చలు



- ఏపీ సమస్యలపై యనమల బృందం నివేదన
- లోటు భర్తీపై కేంద్రం- రాష్ట్రం చెరో వాదన
- త్వరలో మళ్లీ సమావేశానికి నిర్ణయం
- అమిత్‌షాతో జరగని భేటీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏపి ప్రజల న్యాయమైన హక్కులను నెరవేర్చాలని ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల మనోభావాలను, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి సుజనా చౌదరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో అమలు చేయాల్సిన అంశంపై చర్చించారు. ప్రధానంగా ఆర్థిక లోటు భర్తీ, ప్రత్యేక హోదాకు సమానంగా ఆర్థిక ప్యాకేజీ అమలుపై చర్చ జరిగింది. ఈ సమావేశం అనంతరం ఏపీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రజల మనోభావాలు అర్థం చేసుకోవాలని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి వివరించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిందంతా కూడా హక్కుగానే అడుగుతున్నామన్నారు. విభజనలో నష్టపోయిన ఏపీకి న్యాయం చేయాలని కోరామన్నారు. రెవెన్యూ లోటు కింద ఆంధ్రప్రదేశ్‌కు 16వేల కోట్లు రావాల్సి ఉందన్నారు. ఈ అంశంపై కేంద్రం లెక్కలకు, రాష్ట్రలకు తేడా ఉందన్నారు. రెవెన్యూ లోటు కింద ఇప్పటి వరకు కేవలం నాలుగువేల కోట్లే వచ్చాయని, మిగతా బ్యాలెన్స్ ఇవ్వాలని కోరామన్నారు. న్యూలోటు కింద ఇంకా కేవలం 1600 కోట్లే వస్తామంటున్న కేంద్రం వాదనతో తాము అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై మరింత స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక ఆర్థిక సాయం కింద ఈఏపీ ప్రాజెక్టులను వర్కవుట్ చేస్తున్నామన్నారు. దీనిపై మరోసారి సమావేశమై, సమస్యను పరిష్కరిద్దామని అరుణ్‌జైట్లీ చెప్పారని తెలిపారు. ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులను, రాజకీయ పరిస్థితులు, ప్రజల మనోభావాలను గుర్తించాలని కోరారు.

ఏపీకి ప్రత్యేక హోదా కూడా ఇవ్వాలని కోరామని వెల్లడించారు. అలాగేపారిశ్రామికరాయితీలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై త్వరలో నిర్ణయం చెపుతామన్నారని, దాని కోసం చూస్తామన్నారు. రెవెన్యూ, నాబార్డు గ్రాంట్స్ తదితర అంశాలపై అధికారుల స్థాయి లో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. ప్రత్యేక హోదా, ప్యాకేజి, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, రాయితీలపై చర్చించామన్నారు. అరుణ్ జైట్లీతో జరిగిన చర్చలు సంతృప్తినివ్వలే దన్నారు.రాష్ట్ర బడ్జెట్‌కు కేంద్రం ఇచ్చే నిధులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. పార్లమెంటు లోపల, రాష్ట్రంలో తెలుగు దేశం ఆందోళన కొనసాగుతుందని చెప్పారు. ప్రత్యేక హోదాతో కాడినఫలాలు ఇస్తామని చెప్పినా ఇంతవరకు ఇవ్వలేదని, దాని వల్లే ఆందోళనలు కొనసాగుతున్నాయన్నారు.

రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితులు జైట్లీకి వివరించామని తెలిపారు. అన్ని పార్టీలు రోడ్లపైకొచ్చి ఆందోళన చేస్తున్నాయ న్నారు. మిగతా రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఉన్నప్పుడు మా కెందుకు ఇవ్వరని జైట్లీని అడిగామన్నారు. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని చెప్పారు. వెంకయ్య నాయుడు నివాసంలో జరిగిన సమావేశానికి, ఇప్పటి సమావేశానికి తేడా ఉందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన అంశాలను అడగడం తమ హక్కు అన్నారు.

ప్రత్యేక హోదాతో సమానంగా నిధులు : హరిబాబు

ఏపీకి నిధులను ఎలా ఇవ్వాలనేదానిపై చర్చించామని ఏపీ బీజేపీ అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. ఆర్థికలోటు భర్తీ, ప్రత్యేక సాయం అమలుపై సమావేశంలో మాట్లాడమనారు. ప్రత్యేక హోదా ఇస్తే ఎలాంటి ప్రయోజనాలు వస్తాయో దానికి సమానమైన నిధులను కేంద్రం ఇస్తుందన్నారు. ఆ నిధులు ఏ విధంగా ఇవ్వాలనే దానిపై ప్రధానంగా చర్చించామని తెలిపారు. నిధుల అమలులో ఆలస్యం అవుతుందని భావన ఉందన్నారు. రెవెన్యూలోటు కింద 16 వందల కోట్లు మాత్రమే ఇస్తాం అని కేంద్ర ఆర్థికశాఖ అధికారులు చెపుతున్నారని అన్నారు. రెవెన్యూలోటు భర్తీ, హోదాతో సమానమైన నిధులను కేంద్రం ఇవ్వడానికి చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

సమావేశానికి రాని అమిత్‌షా!

తాము అమిత్ షా ఆహ్వానం మేరకే చర్చలకు వచ్చామని ఆర్థిక మంత్రి యనమల చెప్పారు. అయితే తన విమానం ఆలస్యం కావడం వల్ల అమిత్ షాను కలవలేకపోయామన్నారు. అయితే అరుణ్‌జైట్లీకి ఈ అంశాలన్నింటిని నివేదించారని తెలిపారు. ఆ మేరకు జైట్లీతో సమావేశమయ్యామని చెప్పారు.

నలుగురు అధికారులు సస్పెండ్

ఆర్టీఏలో దళారీ వ్యవస్థపై మంత్రి ఆగ్రహం



హైదరాబాద్ , ఆంధ్రప్రభ : బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో అక్రమాలకు పాల్పడిన నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిన రూ. 1.20 కోట్ల మొత్తాన్ని అందుకు బాధ్యులైన వారి నుండి వసూలు చేయాలని సంబంధిత సీనియర్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. రవాణా శాఖ మంత్రి పి. మహేందర్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఆర్టీఏ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ, జేటీసీ రమేష్, డిటిసీలు ప్రవీణ్‌రావు, మమతా ప్రసాద్, ఐటి కార్యదర్శి ఓఎస్‌డి రమాదేవి తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. రవాణా శాఖ అధునీకరణ, అవినీతి నివారణ, ఎన్‌ఐసి ఆధారిత కార్యకలాపాలపైన ప్రధానంగా చర్చించారు. ఆర్టీఏలో అవినీతికి తావులేకుండా ఆన్‌లైన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ అందించే పౌర సేవల్లో దళారుల ప్రమేయం లేకుండా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకొనవలసి ఉందని సూచించారు. బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో పాత వాహనాల రిజిస్ట్రేషన్, ఆర్సీల జారీలో జరిగిన అక్రమాలు, అవినీతిపైన మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా అనేక చర్యలు తీసుకున్నప్పటికీ అవినీతికి అవకాశం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

మత్స్యరంగానికి అంతర్జాతీయ గుర్తింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ మత్స్య రంగానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలో ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా ఏటా రూ.1000 కోట్ల వ్యయంతో ఉచిత చేపల పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందుకు ఈ ఘనత దక్కింది. అందుకుగానూ ఈనెల 15 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ కేంద్రంగా ఆక్వా ఎక్స్ ఇండియా - 2018 అంతర్జాతీయ సదస్సు నిర్వహించేందుకు కేంద్ర మత్స్యశాఖ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో ఈ సదస్సు జరుగుతుందని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తెలిపారు. ఈ అంశంపై సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, దక్షిణాసియా దేశాల్లోనే ప్రప్రథమంగా జరుగుతున్న ఈ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ రాష్ట్రాన్ని ఎంపిక చేయడం గర్వకారణమని అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి) కేంద్రంగా 15న ఈ కాన్ఫరెన్స్‌ను సీఎం కె.చంద్రశేఖరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.

ఉద్యమ బాటలో స్పష్టత రావాలి

పనికొచ్చే డిమాండ్లు పట్టుకోవాలి!

● పోలవరం నిధులు పూర్తిగా ఇవ్వాలి ● నాబార్డ్‌తో లింకు పెట్టడం సరికాదు ● రూ. 50 వేల కోట్లు రాష్ట్రానికివ్వాలి ● అమరావతి ఖర్చు కేంద్రం భరించాలి ● పాత సంప్రదాయమే పాటించాలి ● చిన్న రాజధాని చాలంటే కుదరదు ● రాష్ట్ర ప్రజలకు పార్టీలు భరోసానివ్వాలి ● ఉద్యమ సంస్థలు విశ్వాసం కల్పించాలి ● పరస్పర రాజకీయ నిందారోపణలు వద్దు

(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీల్ని కేంద్రం అమలుచేయడం లేదంటూ అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమాలు మొదలెట్టాయి. సాధారణ ఎన్నికలకు ఇంకా ఏడాది మాత్రమే గడువు ఉండడంతో విభజనానంతరం ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం తీవ్రనష్టం కలుగజేసిందన్న అంశం అన్ని పార్టీలకు ప్రధాన ప్రచారాస్త్రంగా మారి పోయింది. గత నాలుగేళ్లుగా ప్రత్యేకహోదా అంశం నలుగుతూనే ఉంది. హోదా వస్తేనే రాష్ట్రానికి పునరుజ్జీవముంటుందంటూ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళన నిర్వహిస్తూనే ఉన్నాయి. హోదా ఇవ్వని పక్షంలో ఆరుకోట్ల సీమాంధ్రులకు భవిష్యత్ ఉండదన్న ప్రచారం కూడా జోరుగానే సాగుతోంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హోదా సాధించుకోవాలన్న డిమాండ్‌ను అన్ని రాజకీయ పార్టీలు తలకెత్తుకున్నాయి. ఆఖరకు ఇంతకాలం హోదాపై విభిన్న రీతుల్లో స్పందించిన అధికార తెలుగుదేశం కూడా ఇప్పుడు ఇచ్చి తీరాల్సిందేనంటూ ఉద్యమబాట పట్టింది. తన ఎంపీలతో పార్లమెంట్‌ను స్తంభింపజేస్తోంది. రాష్ట్రానికి జరిగిన మోసాన్ని సరిదిద్ది హోదా ఇవ్వాలంటూ డిమాండ్ మొదలెట్టింది. ఇదొక్కటే కాదు.. విభజన చట్టంలో పేర్కొన్నా.. పేర్కొనకపోయినా చట్టసభల సాక్షిగా ఇచ్చిన హామీలన్నీ అమలు కావాల్సిందేనంటూ ఇప్పుడు ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీ లు కేంద్రంపై ఒత్తిడి పెంచాయి. కొన్నయితే ఏకంగా ఢిల్లీ వెళ్ళి ధర్నాలు, ఆందోళనలు చేపట్టాయి.

హోదా ఆవశ్యకతపై చర్చా వేదికలు

మరోవైపు ప్రజాసంఘాలు, సమా చార వ్యవస్థలు హోదా ఆవశ్యకతపై చర్చా వేదికలు నిర్వహిస్తున్నాయి. దీనిపై అవ గాహన కలిగిన మేథావుల్ని ఆహ్వానించి హోదా వల్ల కలిగే ప్రయోజనాలు, ఇవ్వని పక్షంలో జరిగే అనర్ధాలపై ప్రజల్ని చైతన్య పరుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఆధ్వర్య ంలోని జనసేన కూడా సంయుక్త నిజనిర్ధారణ కమిటీ నేతృత్వంలో హోదా, ఇతర హామీలను కేంద్రం వెంటనే అమలు చేయాల్సిందేనంటూ ఉద్యమానికి సన్నద్ధ మౌతోంది. ఇలా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హోదా, విభజన హామీలే చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ డిమాండ్ల సాధన వల్ల ఒనగూరుతాయంటున్న ప్రయోజనాల్లోని సహేతుకత ఎంతంటూ పరిశీలకులు అధ్యయనాలు జరుపుతున్నారు. ఈ ప్రయోజనాలపై తగిన స్పష్టతలేకుండానే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నాయంటూ వీరు పేర్కొంటున్నారు. విశాఖకు రైల్వేజోన్ వస్తే అదనంగా రెండువేల ఉద్యోగాలు లభిస్తాయన్న ప్రచారం సరికాదని స్పష్టం చేస్తున్నారు. రైల్వే జాతీయ స్థాయి సంస్థ. ఉద్యోగనియామకాలు జాతీయస్థాయిలోనే ఉంటాయి. ప్రాంతీయత, రాష్ట్రాలకు లోబడి నియామకాలు జరగవు. కానీ జోన్ పరిధిలో లభించే ఆదాయానికనుగుణంగా ఆ జోన్‌లో అభివృద్ధి పనులు ప్రతిపాదిస్తారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ డివిజన్ భువనేశ్వర్ కేంద్రంగా గల తూర్పుకోస్తా జోన్‌లో ఉంటే విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు సికింద్రాబాద్ కేంద్రంగా గల దక్షిణ మధ్యరైల్వేలో ఉన్నాయి. అత్యంత కీలకమైన కిరండోల్ - కొత్తవలస రైల్వేలైన్ వైజాగ్ డివిజన్ పరిధిలో ఉంది. తూర్పుకోస్తా రైల్వేకు అత్యధిక ఆదాయం తెచ్చిపెట్టే లైన్ ఇదే. నిత్యం ఇనుప ఖనిజ రవాణా ఈ లైన్‌లోనే జరుగుతోంది. దీని ద్వారా వస్తున్న ఆదాయానికనుగుణంగా తూర్పుకోస్తా రైల్వే పరిధిలో పనులు ప్రతిపాదిస్తున్నారు. ఇవన్నీ వీటిని ఒడిశా పరిధిలోనే చేపడుతున్నారు.

ఆదాయానికనుగుణంగా లేని అభివృద్ధి

ఆదాయానికనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పనుల్ని పొందలేక పోతున్నాం. అదే వైజాగ్ కేంద్రంగా జోన్ ఏర్పడితే ఆదాయానికనుగుణంగా మంజూరయ్యే పనుల్ని ఆంధ్రప్రదేశ్ పరిధిలో నిర్వహించే అవకాశాలుంటాయి. రాష్ట్ర ప్రజలకదనంగా మౌలిక సదుపాయాలు అందుబాటులోకొస్తాయి. అందువల్ల జోన్ ఏర్పాటు కోసం గట్టిగా ప్రయత్నం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే జాతీయ స్థాయి విద్యాసంస్థల ఏర్పాటు వల్ల ఆయా ప్రాంతాలకేం ఒరిగేదేం ఉండదు. ఇప్పటికే వైద్య విద్యను కేంద్ర అధీనంలోకి బదలాయించారు. గతంలో ఎమ్‌సెట్ ద్వారా భర్తీ చేసే సీట్లను ఇప్పుడు జాతీయస్థాయి ప్రవేశపరీక్ష నీట్ ద్వారా నింపుతున్నారు. రాష్ట్రాల స్థాయిలో కన్వీనర్ కోటా తీసేశారు. వచ్చే ఏడాది నుంచి సాధారణ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలక్కూడా జాతీయస్థాయిలో రాతపరీక్షను తప్పనిసరి చేసేశారు. ఇక ఐఐటిలు, నిట్‌లు వంటి జాతీయస్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు రాష్ట్రాల ప్రాతిపదికన జరగవు. జాతీయ పరీక్షలు, ర్యాంక్‌లకనుగుణంగానే సీట్లొస్తాయి. ఇప్పుడు కూడా రైల్వేలో ఉద్యోగాలు, ఈ విద్యాసంస్థల్లో ప్రవేశాల్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు, విద్యార్థులు పోటీపరీక్షల్లో ర్యాంకులు పొందడం ద్వారా సాధించుకునే వీలుంది. ఈ విద్యాసంస్థల ఏర్పాటు వల్ల ఆయా ప్రాంతాల్లో చిన్న చిన్న మార్కెట్లు వృద్ధి చెందడం మినహా అంతకుమించి స్థానికంగా ప్రయోజనాలుండవని వీరు స్పష్టం చేస్తున్నారు.

ఆర్థిక లోటు భర్తీపైనే దృష్టి పెట్టాలని యోచన

పోలవరం, అమరావతిల నిర్మాణంతో పాటు ఆర్థిక లోటు భర్తీ చేయడంపైనే అన్నిపక్షాలు దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు. రాజధానిలేని రాష్ట్రానికి కొత్త రాజధాని నిర్మాణానికయ్యే వ్యయాన్ని కేంద్రం భరించడం సంప్రదాయంగా వస్తోంది. గతంలో గుజరాత్ రాజధాని గాంధీనగర్ నిర్మాణానికి కేంద్రం నిధులిచ్చింది. చత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయపూర్‌కు కేంద్రం నిధులు సమకూర్చింది. అలాగే అమరావతి నిర్మాణానికయ్యే మొత్తం వ్యయాన్ని కేంద్రం భరించాలి. ఇంతవరకు ప్రతిపాదించిన నిర్మాణాలకు 50వేల కోట్లు ఖర్చవుతాయని అంచనాలేస్తే ఇందులో కేంద్రం ఇంతవరకు 2,500కోట్లు మాత్రమే విదిల్చింది. మొత్తం తాత్కాలిక భవనాల నిర్మాణానిక్కూడా సరిపోదు. శాశ్వత ప్రాతిపదికన పెద్దరాజధాని నగర నిర్మాణానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి. మనకున్న హైదరాబాద్‌ను కేంద్రమే తెలంగాణాకు కేటాయించినందున అంతటి స్థాయిలో నగర నిర్మాణానికి పట్టుబట్టాలి. నయారాయపూర్, గాంధీనగర్ వంటి చిన్న చిన్న పట్టణాల్ని చూపిస్తూ ఆ స్థాయిలో రాజధాని నిర్మించుకోండన్న కేంద్ర ప్రభుత్వ సూచనల్ని

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలి



తిప్పికొట్టాలని పేర్కొంటున్నారు. పోలవరం నిర్మాణానికయ్యే మొత్తాన్ని కేంద్రమే భరించాలన్నది విభజన చట్టంలోని మరో ప్రధానాంశం. అయితే నిర్మాణానికి నాబార్డ్‌కు లింకెట్టడం సరికాదు. బ్యాంక్ ద్వారా రుణం తీసుకుని నిర్మించుకుంటే దాన్ని తాము కడతామంటూ చెప్పడం, నిబంధనల పేరిట నిర్మాణాన్ని అడకత్తెరలో ఇరికించడమే. నేరుగా కేంద్రమే నిర్మాణానికి అవసరమైన 40నుంచి 50వేల కోట్లు అంచెల వారీగా రాష్ట్రప్రభుత్వానికందివ్వాలి. దానికి వినిమయ ధృవీకరణ పత్రాల్ని తిరిగి పొందాలి. అలాగే రెవెన్యూ లోటు భర్తీక్కూడా పట్టుబట్టాలి. అంతేతప్ప ప్రత్యక్ష ప్రయోజనాల్లేని డిమాండ్లను ముందెట్టి ఉద్యమానికి దిగడం సహేతుకంకాదని పేర్కొంటున్నారు.

సందేహాలు తీర్చే బాధ్యత ఉద్యమకారులపైనే...

ఉద్యమానికి సంబంధించి ప్రజల్లో వ్యక్తమౌతున్న భయాందోళనలు, సందేహాల్ని ఎప్పటికప్పుడు తీర్చాల్సిన బాధ్యత కూడా ఉద్యమకారులపై ఉంది. తెలంగాణా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్నో రకాలుగా భయాందోళనలు కల్పించారు. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే విద్యుత్ ఉండదన్నారు. రాష్ట్రం అంధకార బంధురమౌతుందన్నారు. ఉగ్రవాదుల అడ్డాగా మారిపోతుందన్నారు. పాకిస్థాన్ లక్ష్య పరిధిలోకి వస్తుందన్నారు. తగినంతమంది భద్రతాబలగాలు అందుబాటులో ఉండరన్నారు. పెట్టుబడులు రావన్నారు. తీవ్రవాదులు పెట్రేగిపోతారన్నారు. అయినా తెలంగాణా ఉద్యమనేత కెసిఆర్ ఒక్కొక్క భయాందోళనకు వివరణిచ్చారు. అలాంటి పరిస్థితి రాదంటూ ప్రజలకు విశ్వాసం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ తరహా విశ్వాసాన్ని, భరోసా కల్పించాల్సిన బాధ్యతను ఈ ఉద్యమ సంస్థలు, రాజకీయ పార్టీలు తలకెత్తుకోవాలని పేర్కొంటున్నారు. అలాగే చర్చావేదికల్లో రాజకీయ పార్టీలు పరస్పర ఆరోపణలకు దిగుతున్నాయి. వైఫల్యాలకు కారణం మీరంటే మీరంటూ నిందారోపణలకు దిగుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్రంగా తెలంగాణ



● కొత్తగా వంద యూనిట్లు
● రూ. 3వేలకోట్లతో ఎఫ్‌పీఏ
● నేడు మంత్రివర్గ ఉపసంఘం భేటీ

హైదరాబాద్ : దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఫుడ్‌ప్రాసెసింగ్ రాష్ట్రంగా నిలపాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పంటలకు మద్దతు ధర కల్పించడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి దిశగా ఆహార పరిశ్రమల యూనిట్ల స్థాపనను పెద్ద ఎత్తున ప్రోత్సహించనుంది. వ్యవసాయ రంగంతో పరిశ్రమలను అనుసంధానం చేయాలని సంకల్పించింది. కొత్తగా రాష్ట్రంలో వంద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి నియోజక వర్గంలో ఒక యూనిట్ ఏర్పాటయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రంలో చేపట్టిన సాగు నీటి పథకాలు పూర్తయితే పెద్ద ఎత్తున పంటలసాగు విస్తీర్ణం పెరగనుందని అందుకు తగ్గట్టుగా ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలు కూడా ఏర్పడితేనే రైతుకు లాభసాటిగా ఉంటుందని ముఖ్యమంత్రి కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. వరిసాగు భారీగా పెరుగనుందన్నది సీఎం అచనాగా వుంది. ఆయా ఉత్పత్తులకు అనుగుణంగా ఏర్పాటు చేయాల్సిన రైస్ మిల్లులు , జిన్నింగ్ మిల్లులు , కోల్డ్‌స్టోరేజి యూనిట్లు , మార్కెటింగ్ వసతుల పెంపుదల తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. బల్లంపల్లి , జగిత్యాలలో ఉన్న మామిడి మార్కెట్లలో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. పూర్తి స్దాయిలో ఆధునీకరించటంపాటుగా , మంచిర్యాలలో కూడా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కేవలం 4లక్షల టన్నుల నిలువ సామర్థ్యం ఉన్న గోదాములను 18 లక్షల టన్నుల స్థాయికి పెంచింది. కోత్తగా 164 మండలాల్లో గోదాముల ఏర్పాటుకు స్థలసేకరణ ప్రక్రియ ప్రారంభించాలని మంత్రి హరీష్ రావు నాలుగురోజుల కిందట జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. అభివృద్ధిని వికేంద్రీకరించే దిశగా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. సిద్దిపేట ,గజ్వేల్ నియోజకవర్గాల్లో క్లస్టర్లు, హుస్నాబాద్ , ముంద్రాయి , ముందపల్లిలో రైస్ మిల్లులు , పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు జరు గుతున్నాయి.

నేడు ఉపసంఘం భేటీ

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సమావేశం కానుంది. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి మంత్రులు ఈటెల రాజేందర్ , హరీష్ రావు , కేటీఆర్ హాజరు కానున్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబందించిన పలు అంశాలను సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోనున్నారు.

రూ.6వేలకొట్లతో ప్రాసెసింగ్ జోన్

రాష్ట్రంలో ఆహార శుద్ది రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందు కొస్తున్నాయి. జహీ రాబాద్‌లో రూ.6వేలకోట్లతో సమీకృత ఆహార , వ్యవసాయ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు దక్షిణ ఆగ్రోపోలీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ జహీరాబాద్‌లో 300ఎకరాల్లో జోన్ ఏర్పాటు చేయనుంది. ఈ పరిశ్రమ ద్వారా 5వేలమందికి ఉపాధి లభించనుంది. రూ.3500కోట్లతో ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు వ్యవసాయంలో మెళకువలు నేర్పటం,వ్యవసాయోత్పత్తుల ఆధునీకరణ వంటి అంశాలపైన ఈ నిధులు వెచ్చించనున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా 25వేల మంది రైతులకు నేరుగా సహకారం అందనుంది. ఈ మెగా ఆహార శుద్ది జోన్‌లో మొక్కజొన్న, చెరకు, వరి పంటలకు సంబంధించిన ఆహార శుద్ది యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి వివరించారు. మార్కెటింగ్ రంగంలో పరిశోధనా విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఏడాది కిందటే మంత్రి హరీష్ రావు ప్రతిపాదించారు.

ఉద్యోగాల పేరుతో అఘాయిత్యాలు

(మొదటిపేజీ తరువాయి)

మాట కలిపేవాడు. అనంతరం వారికి ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశపెట్టి ఇంటికి తీసుకు వెళ్ళే వాడు. అక్కడ పానీయంలో మత్తు మందు కలిపి ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసేవాడు. ఆ తర్వాత వారిపై అత్యాచారం చేసేవాడు. అనంతరం తాను చెప్పినట్లు వినాలని బెదరించే వాడు. అనంతరం వారిని తన ఇంటికే రప్పించుకుని విటులకు సహకరించాలని బెదరించేవాడు. వారం రోజుల క్రితం బస్తీలో 16 సంవత్సరాల యువతి కనిపించకుండా పోవడంతో స్థానికులు వెతకడం ప్రారంభించారు. నిందితుడి ఇంట్లో యువతి ఉందని తెలుసుకున్న తలిదండ్రులు ఇంట్లోకి చొరబడి కూతురును తమతో పాటు తీసుకు వెళ్ళారు. అనంతరం యువతి చెప్పిన విషయాలు విని ఆశ్చర్యానికి గురైన తలిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.యువతి నుంచి వాంగ్మూలం తీసుకున్న పోలీసులు స్థానికంగా మాంసం దుకాణం నిర్వహిస్తున్న గోవింద్‌పై కేసును నమోదు చేసి వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితుడు యువతిని తిరుపతి కూడా తీసుకు వెళ్ళాడని, అక్కడ కూడా వ్యభిచారం చేయించినట్లు యువతి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొంది. ఇదే తరహాలో మరికొంత మంది బాలికల జీవితాలను గోవింద్ నాశనం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత యువతికి స్నేహితురాలైన గోవింద్ కూతురు ఘటన జరిగినప్పటి నుంచి కనిపించకుండా పోవడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు కూతురిపై కూడా అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కూతురిని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు పేర్కొంటున్నారు. గోవింద్‌పై స్థానికులు పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యువతులంటే గోవింద్‌కు ఏ మాత్రం గౌరవం లేదని అంటున్నారు. గోవింద్‌కు ఆయన భార్య కూడా సహకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఆ కోణంలో పోలీసులు దర్యాప్తును సాగిస్తున్నారు.

థర్డ్ ఫ్రంట్ ఒక డ్రామా

● టీఆర్ఎస్ తుడిచిపెట్టుకుపోతుంది
● కేసీఆర్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు
● టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతీయ స్థాయిలో థర్డ్‌ఫ్రంట్, ఫెడరల్ ఫ్రంట్ అని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కొత్త డ్రామాకు తెరలేపారని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ తడిచిపెట్టుకుపోతుందని, ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా గెలుచుకోలేదని ఆయన వ్యా ఖ్యానించారు. ఉమ్మడి నిజాబాబాద్ జిల్లాలో రెండు పార్లమెంట్, 9 అసెంబ్లీ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి సర్వనాశనం చేశారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్రలో భాగంగా సోమవారం ఆర్మూర్‌లో జరిగిన బహిరంగ సభలో ఉత్తమ్ మాట్లాడారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేత నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే సీఎం కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ మాటలను నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని, గత నాలుగేళ్లుగా చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు. రైతు రుణమాఫిని నాలుగు విడతలుగా అమలు చేయడం రైతులకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసినవారందరిని కేసీఆర్ మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. ముస్లింలకు, ఎస్టీలకు ఇచ్చే 12 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిలదీశారు. రాష్ట్రంలో 4 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రైతు రుణమాఫీ రూ. 2 లక్షల వరకు మాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని ఎర్రజొన్నలు, పసుపు, పత్తి, మిర్చి పంటలకు



మద్దతు ధరను ఎందుకివ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. నిజాం చెక్కర ఫ్యాక్టరీని ఎందుకు తెరిపియడం లేదని ఉత్తమ్ ప్రశ్నించారు. మద్దతు ధర అడిగిన రైతులకు బేడిలు వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఖాళీగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీని విస్మరించారని, తన కుటుంబంలో మాత్రం నలుగురికి ఉద్యోగాలు ఇచ్చారని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. మంత్రి వర్గంలో మాల, మాదిగలతో పాటు మహిళకు స్థానం ఇవ్వకపోడం దుర్మార్గమన్నారు. యువకులకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగం ఇవ్వలేని వారికి నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి, పంటలకు గిట్టు బాటు ధరను అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ, అసెంబ్లీ మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఏమి చేయలనే వ్యక్తి కేంద్రంలో ఏమి చేస్తారని సీఎం కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఆర్మూర్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ వ్య వసాయానికి ప్రకటించిన ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సభలో టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు.

కారుకు బ్రేకులు వేసేందుకు

కాంగ్రెస్ వ్యూహం

● బస్సు యాత్రలో ప్రజాసమస్యలపై గళం పెంచిన నేతలు ● అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సర్కార్‌ను ఇరకాటంలో పెట్టాలని నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కారు స్పీడ్‌కు బ్రెకులు వేసేందుకు హస్తం పార్టీ వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నది. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి రావాలనే పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను రచిస్తోంది. ఇప్పటికే ప్రజా చైతన్య బస్సుయాత్రతో ప్రజల్లోకి వెళ్లిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు.. ప్రభుత్వ పాలనపై విమర్శల జోరు పెంచారు. ప్రభుత్వం తీరును తీవ్రంగా తప్పుపడుతూ ప్రజల పక్షాన గళం వినిపిస్తున్నారు. అంతే కాకుండా వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సర్కార్‌ను ఇరుకున పెట్టాలనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. బస్సుయాత్రతో వస్తున్న ఆధరణతో మరింత స్పీడ్ పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత పేర్కొన్నారు. ఇక పోతే గత ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నిర్వహించే సభల్లో కాంగ్రెస్ నేతలు ప్రస్తావిస్తున్న విషయం తెలిసిందే. కాగా అసెంబ్లీ వేదికగా మరోసారి ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయానికి వచ్చారు. రెండో విడత చేపట్టిన బస్సుయాత్ర ఈ నెల 8 వరకు నిర్వహించే అవకాశం ఉంది. 9 నుంచి బస్సుయాత్రకు బ్రేక్ ఇచ్చి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత మూడో విడత చేపట్టాలనే అభిప్రాయంతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. బస్సుయాత్ర విరామం తర్వాత సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసి అసెంబ్లీలో అనుసరించే వ్యూహంపై చర్చించనున్నారు.

డిసెంబర్‌లోనే ఎన్నికలు!

ఇదిలా ఉంటే వచ్చే డిసెంబర్‌లోనే రాష్ట్రంలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ఆ పార్టీ నేతలు ప్రిపేర్ అవుతున్నారు. ప్రధానంగా దళితులకు, గిరిజనులకు 3 ఎకరాల భూ పంపిణి, ముస్లింలు, గిరిజనులకు చెరో 12 శాతం రిజర్వేషన్ల హామీ, రెండు పడుక గదుల ఇళ్ల నిర్మాణం, ఇంటికో ఉద్యోగం, రైతు రుణ మాఫీతో పాటు తదితర అంశాలను ప్రస్తావిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు మూడు ఎకరాల భూమి ఇవ్వకపోతే.. భూమిలేని ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నది. దీంతో దళిత, గిరిజన వర్గాలను దరి చేర్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇక రైతుల విషయంలో కూడా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ రూ. 2 లక్షల వరకు ఏక కాలంలో మాఫీ చేస్తామని హామీ ఇస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణపై.. సుప్రీంలో పిటిషన్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ కాం గ్రెస్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. పునర్ వ్యవస్థీకరణ చట్టం అమలయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని పొంగులేటి తరపున న్యాయవాది కోర్టును కోరారు. ఈ కేసులో ప్రతివాదులుగా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలతో సహా కేంద్ర ఆర్థిక, హోంశాఖ, మానవ వనరుల అభివృద్ధి, జల వనరుల శాఖలను చేర్చారు. దీంతో పిటిషన్ కాపీని ప్రతివాదులకు ఇవ్వాలని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

పీఎన్‌బీ కుంభకోణంలో

దద్దరిల్లిన పార్లమెంట్


● నీరవ్‌మోడీని పట్టుకురావడంలో ప్రభుత్వం విఫలమైందని విపక్షాల ఆరోపణ ● ఉభయసభల్లోనూ చర్చకు పట్టు ● ఏపీ విభజన చట్టం హామీల అమలుపై టీడీపీ, రిజర్వేషన్ల కోటాపై టీఆర్ఎస్ ఎంపీల ఆందోళనలు ● గందరగోళం మధ్య ఉభయసభలు వాయిదా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో నీరవ్‌మోడీ కుంభకోణంపై పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లాయి. నీరవ్‌మోడీని స్వదేశానికి రప్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విపక్షాలు ఆందోళనకు దిగాయి. సోమవారం పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చించాలని లోక్‌సభ, రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ సహా పలు పార్టీలు చర్చకు నోటీసు ఇచ్చాయి. విపక్షాలకు పోటీగా బీజేపీ సభ్యుడు వినయ్ సహస్రబుద్దే రాజ్యసభలోనూ నోటీసు ఇచ్చారు. మా జీ కేంద్రమంత్రులు, వారి బంధువుల అవినీతిపై రూల్ 267 కింద చర్చించాలని కోరారు. రాజ్యసభలో మరోవైపు కావేరీ జల వివాదాలు, ఇటీవల సుప్రీం తీర్పుపై చర్చించాలని అన్నాడిఎంకె పట్టుబట్టింది. ఏపీ విభజన చట్టం అమలు చేయాలని టీడీపీ నోటీసు ఇవ్వగా, ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ ఎంపీ కేవీపీ నోటీసు ఇచ్చారు. రాజ్యసభ కార్యకలాపాలు ప్రా రంభకాగానే తమ నోటీసులపై చర్చించాలని విపక్షాలన్నీ చైర్మ న్ పోడియంలోకి దూసుకెళ్లి నినాదాలు చేశాయి. కావేరీ జల బోర్డు ఏర్పాటు అంశంపై చర్చకు అనుమతిస్తున్నట్లు చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించారు. సభ్యులెవరూ దానికి అం గీకరించకుండా వెల్‌లో గట్టిగా నినాదాలు చేశారు. దాంతో స భ పదే పదే వాయిదా పడింది. మధ్యాహ్నం తర్వాత ప్రారంభ మైన రాజ్యసభలో బ్యాంకులో కుంభకోణాలపై స్వల్పకాలిక చర్చకు డిప్యూటీ చైర్మన్ కురియన్ అనుమతించారు. కావేరీ నదీ జలాల బోర్డు ఏర్పాటు తదితర అంశాలపై ఒకదానివెంట మరొటి చర్చిద్దామన్నారు. అయితే సభ్యులు వివిధ అంశాలపై పెద్ద ఎత్తున నినాదాలు కొనసాగించడంతో గందరగోళం ఏర్పడింది. గందరగోళం మధ్య గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ, దేశంలో ఒకదాని వెంట మరో బ్యాంకు కుంభకోణం జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

ఇటు లోక్‌సభలోనూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. నీరవ్‌మోడీ కుంభకోణంపై చర్చించాలని స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశాయి. కాంగ్రెస్, టిఎంసిలు ప్లకార్డులు పట్టుకుని నీరవ్‌మోడీపై ప్రధానమంత్రి మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. ఏపీ పునర్విభజన చట్టం హామీలు అమలు చేయాలని ప్లకార్డులతో తెలుగుదేశం పార్టీ ఎంపీలు, రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్రాలకే ఇచ్చేలా రాజ్యాంగ సవరణ చేయాలని టిఆర్ఎస్ ఎంపీలు స్పీకర్ పోడియం వద్ద నినాదాలు చేశారు. దాంతో సభను 12గంలకు వాయిదా వేశారు. తిరిగి విపక్షాల ఆందోళనతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.

మోడీ, అమిత్‌షాకు ఘన స్వాగతం



మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో పార్లమెంటులో ప్రధానమంత్రి మోడీకి అమిత్‌షా, కేంద్రమంత్రులు ఘనస్వాగతం పలికారు. ఇటు రాజ్యసభలో పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాకి పార్టీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు. ఆయన సభలోకి అడుగుపెట్టగానే చప్పట్లు చరుస్తూ, లేచి నిలబడి స్వాగతం పలుకుతూ అభినందించారు. త్రిపుర సంప్రదాయ కండువాతో ఆయన రాజ్యసభలో అడుగుపెట్టారు. పలు పార్టీల నేతలను ఆయనకు అభినందనలు తెలిపారు.

పార్లమెంట్‌లో

తెరాస పోరుబాట



● రిజర్వేషన్ల అంశంలో కేంద్రంపై తిరుగుబాటు
● సభలోపల ఆందోళన, నేడు గాంధీ విగ్రహం ఎదుట ధర్నా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విభజన హామీలపై ఇప్పటికే ఆందోళన చేపట్టిన ఆంధ్రప్రదేశ్ ఎంపీల బాటలో తెలంగాణ ఎంపీలు చేరారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ సోమవారం పార్లమెంటులో ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో కొన్ని వర్గాలకు రిజర్వేషన్లను కల్పిస్తూ, మరికొన్ని వర్గాల రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి ఆమోదించాల్సిందిగా రాష్ట్రపతికి పంపించిన విషయం తెలిసిందే. ఇదే బాటలో ఆంధ్రప్రదేశ్ కూడా కాపులను బీసీల్లో చేర్చుతూ, బీసీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచాల్సిందిగా తీర్మానం చేసింది. మరికొన్ని రాష్ట్రాలు రిజర్వేషన్లు పెంచాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదాన్న సుప్రీం కోర్టు ఆదేశాలను సాకుగా చూపుతూ రిజర్వేషన్ల శాతం పెంచేందుకు నిరాకరిస్తోంది. దీనిపై తెరాస నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్లు పెంచడానికి రాజ్యాంగంలోని 16వ అధికరణాన్ని సవరించాలని టీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇదే నినాదాలతో ప్లకార్డులు చేతబట్టి పార్లమెంటు లోపల ఆ పార్టీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. దీంతో ఓవైపు ప్రత్యేక హోదా నినాదాలతో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు చేస్తున్న నిరసనకు, తెరాస ఎంపీల నిరసన స్వరం తోడైంది. ఈ ఆందోళన మంగళవారం కూడా కొనసాగిస్తామని ఆ పార్టీ ఎంపీ బి. వినోద్ కుమార్ సభ వాయిదా పడిన తర్వాత మీడియాకు వెల్లడించారు. ఉదయం పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేపడతామని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగాల్లో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా రిజర్వేషన్లు ఉన్నాయని, అలాగే ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీలు, ఎస్టీల సంఖ్య పెరిగినందున వారికి రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీ తీర్మానాన్ని రాష్ట్రపతికి పంపామని తెలిపారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో పొందుపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు ఆయన వివరించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదని, రాజ్యాంగ సవరణ చేసే విషయంలో కేంద్రం సానుకూలంగా లేదని వినోద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని కేంద్రం ఎందుకు తొక్కి పెట్టిందనే అంశంపై తాము వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. తమ నిరసనలతో స్పీకర్ సభను రెండు సార్లు వాయిదా వేశారని వినోద్ అన్నారు.

రిజర్వేషన్ల బిల్లుపై పోరాడాలి : ఎంపీ వినోద్

పార్లమెంటు మలి విడత బడ్జెట్ సమావేశాలకు ముందు తమ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు నేతృత్వంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రిజర్వేషన్ల అంశంపై పోరాడాలని నిర్ణయించినట్టు వినోద్ కుమార్ తెలిపారు. రిజర్వేషన్ల అంశంపై స్పష్టత వచ్చేవరకు లోక్‌సభను స్తంభింపజేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెంది ప్రజలు బీజేపీకి ఓటు వేశారని, కానీ ప్రజలు ఆశించిన స్థాయిలో బీజేపీ పనిచేయడం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఒక జిల్లా అంత ఉన్న త్రిపురలో విజయాన్ని బీజేపీ గొప్పగా చెప్పుకుంటోందని వినోద్ ఎద్దేవా చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గూర్ఖాల్యాండ్ పేరు చెప్పి అక్కడ గెలిచిన బీజేపీ, తమ ఎంపీని నియోజకవర్గానికి పంపించలేని పరిస్థితిలో ఉందని వినోద్ అన్నారు.

రిజర్వేషన్ల వ్యవహారంతో పాటు మరికొన్ని అంశాలపైనా కేంద్రంతో పోరాడాలని తెరాస ఇప్పటికే నిర్ణయించింది. పనికి ఆహార పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని చాలా కాలంగా ఆ పార్టీ కేంద్రాన్ని కోరుతోంది. తద్వారా వ్యవసాయంలో కూలీల కొరతను తీర్చడంతో పాటు రోజు కూలీలకు ఉపాధిని కల్పించినట్టు అవుతుందని ఆ పార్టీ ఎంపీలు పలు సందర్భాల్లో పార్లమెంటులో మాట్లాడారు. అలాగే పంటకు గిట్టుబాట ధర విషయంలోనూ తెరాస తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. విభజన చట్టంలో పొందుపరిచిన హామీల మేరకు తెలంగాణకు ఇవ్వాల్సిన సంస్థల విషయంలోనూ కేంద్రం చిన్నచూపు చూస్తోందని తెలంగాణ రాష్ట్ర సమితి నేతలు అంటున్నారు. చట్టంలో పేర్కొన్న బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్ సహా అనేక అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయని తెరాస లోక్‌సభాపక్ష నేత ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్లకు సుప్రీంకోర్టుతో ముడిపెట్టడం సరికాదని, రిజర్వేషన్లకు సుప్రీంకోర్టుకు అసలేమాత్రం సంబంధం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

అసలైన సమస్యలపై స్పందించండి



రిజర్వేషన్ల వ్యవహారంపై టీఆర్ఎస్ ఎంపీ కవిత సామాజిక మాధ్యమం ట్విట్టర్ ద్వారా స్పందించారు. సోమవారం లోక్‌సభలో తెరాస ఎంపీలు రిజర్వేషన్ల వ్యవహారంపై ఆందోళన చేశారని, అలాగే ఏపీ ఎంపీలు విభజన హామీలపై చేయగా తమిళనాడు ఎంపీలు కావేరీ నదీ జలాల పంపిణీ చేశారని ఆమె అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇలాంటి అసలైన సమస్యలు, అంశాలపై స్పందించాలని, సభలో బదులివ్వాలని ఆమె ట్విట్టర్ వేదికగా వ్యాఖ్యానించారు.

మోడీ, బాబుపై పోలీసులకు ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఓవైపు టీడీపీ, వైసీపీ కేంద్రంపై హోరాహోరీగా పోరాడుతుం టే... మరోవైపు కాంగ్రెస్ సోమవారం పోలీస్ కంప్లైంట్‌తో సరిపెట్టింది. ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ రఘువీరా రెడ్డి నాయకత్వంలోని ఏపీ కాంగ్రెస్ బృందం సాయంత్రం 4 గంటలకూ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ప్రధాని మో డీ, చంద్రబాబుపై ఫిర్యాదు చేశారు. ఏపీకి ప్ర త్యేక హోదా, విభజన హామీలను అమలు చేస్తా మని ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసి ప్రజ లను మోసం చేసినందుకు మోడీ, చంద్రబాబు పై ఫిర్యాదు చేశారు.

ప్రజాక్షేత్రంలో నిర్వహించే నిరసన, ఆందోళన కార్యక్రమాలకు తోడుగా పార్లమెంటు లోపల కూడా తమ పోరాటం వివిధ రూపాల్లో ఉంటుందని గిడుగు రుద్రరాజు వెల్లడించారు. ఇప్పటికే 184 నిబంధన కింద లోక్‌సభలో చర్చకు నోటీసు ఇచ్చామని, దీనిపై స్పీకర్ చర్చకు అంగీకరిస్తే ఓటింగ్ కూడా ఉంటుందని, తద్వారా ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టంగా తెలిసిపోతుందని అన్నారు. , యూపీఏ మిత్రపక్షా లు తమ పోరాటానికి బాసటగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పోరాడేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉంటామని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ పోరాటాలకు సీపీఐ, సీపీఐ(ఎం) సహా ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతిస్తున్నాయని అన్నారు.

రఘువీరారెడ్డితో పాటు కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, తూ.గో జిల్లా కాంగ్రెస్ అధ్య క్షులు పంతం నానాజీ, ఉపాధ్యక్షులు ఏ.బి.బుచ్చి మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు గిడుగు రుద్రరాజు, ఎస్.ఎన్ రాజా, జంగా గౌతం, కామన ప్రభాకరరావు, తదితర నాయకులు కంప్లైంట్ ఇచ్చిన వారిలో ఉన్నారు.

హోదా పోరాటం ఆగదు

వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల ధర్నా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చే వరకూ తమ పోరాటం ఆగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా మన హక్కు అనే నినాదంతో సోమవారం న్యూఢిల్లీలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు పార్లమెంటు స్ట్రీట్‌లో ధర్నాకు దిగారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ధర్నా మొదలుపెట్టారు. పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, వరప్రసాద్, మిథున్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, పార్టీ ఎమ్మెల్యేలు ధర్నాలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని ఎంపీ వైవి సుబ్బారెడ్డి అన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుడా నాన్చుతున్నారని అన్నారు. ఏపీకి ప్రత్యేక హెూదా కోసం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘగా పోరాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అన్యాయంపై ప్రశ్నిస్తే అరెస్టులా..!

ఏపీ ప్రజలకు జరిగిన అన్యాయం ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ప్రజల కోసం దేనికైనా తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. హోదా కోసం పార్లమెంటు వేదికగా పోరాడుతామని అన్నారు. ఈ నెల 21న కేంద్రంపై అవిశ్వాస తీర్మానాన్ని పెడతామని, అప్పటికీ కేంద్రం దిగిరాకపోతే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాజీనామాలు, అరెస్ట్‌లకు సిద్ధంగా ఉన్నా మని ఎంపీ వరప్రసాద్ అన్నారు. 15 ఏళ్లు ప్రత్యేక హోదా కావాలన్న చంద్రబాబు తమ మంత్రులు, ఎంపీలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగంలో ప్రత్యేక హోదా ను చేర్చడం సంతోషకరమని వైఎస్ఆర్ సీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లకు చంద్రబాబు తమ దారిలోకి వచ్చినందుకు అభినందనలు అని అన్నారు. దొంగ పేర్లతో నిధులను చంద్రబాబు దోచుకుంటున్నారని, అందుకే కేంద్రాన్ని నిలదీసే ధైర్యం చేయలేకపోతున్నారని విమర్శించారు. 'ఢిల్లీ పెద్దలను ఎదిరించడం మాకు కొత్త కాదు. గతంలో చాలాసార్లు మేం ఢిల్లీ పెద్దలను ఎదిరించాం, గతంలో ఏం చేసిందో, ఇప్పుడు బీజేపీ అదే చేస్తోంది. ప్రత్యేక హోదా హామీని కేంద్రం నెరవేర్చాలి' అని వైఎస్ఆర్‌సీపీ నేత కురసాల కన్నబాబు అన్నారు. 'టీడీపీ – బీజేపీ కుట్రలతో ఏపీకి అన్యాయం జరుగుతోంది. అరెస్టులకు మేం భయపడం. మరింత ఉధృతంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తాం' అని ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, పార్టీ నేతలు తమ్మినేని సీతారాం, విశ్వరూప్ తెలిపారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధర్నాకు వామపక్ష పార్టీలు మద్దతు పలికాయి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సిపిఐ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. వీరితో పాటు మేధావుల సంఘం చలసాని శ్రీనివాస్, జేఏసీ నేత శ్రీహరినాయుడు, ఆప్ ఏపీ నేతలు వైసీపీ పాల్గొని మద్దతు పలికారు.

సయోధ్యా? సమరమా?

తేల్చుకోండి

● బీజేపీకి తెలుగుదేశం ఎంపీల అల్టిమేటం ● గాంధీవిగ్రహం వద్ద ధర్నా, ఉభయ సభల్లో ఆందోళన ● శ్రీకృష్ణుడి వేష ధారణలో చిత్తూరు ఎంపీ శివప్రసాద్ ● మత గ్రంథాలు చేతబట్టి ఏలూరు ఎంపీ మాగంటి బాబు నిరసన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : భారతీయ జనతా పార్టీ తమతో సంధి కోరుకుంటుందా లేక సమరానికి సిద్ధపడుతుందా తేల్చి చెప్పాలని తెలుగుదేశం పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. సోమవారం నుంచి ప్రారంభమైన పార్లమెంట్ మలి దశ బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా సహా విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ ఎంపీలు ఆందోళన కొనసాగించారు. తొలుత పార్లమెంటులోని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సమావేశమైన ఎంపీలు, తమ కార్యాచరణ రూపొందించుకున్నారు. అందులో భాగంగా పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద వివిధ రకాల నినాదాలతో రూపొందించిన ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. ఉదయం సరిగ్గా 10.25 గంటలకు ప్రారంభమైన ఈ ధర్నా 11.00 గంటలకు వరకు కొనసాగింది. 'మిత్రధర్మాన్ని పాటించండి', 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించండి', 'విభజన హామీలు అమలు చేయండి' అన్న నినాదాలతో కూడిన ప్లకార్డులను ఎంపీలు ప్రదర్శించారు.

కృష్ణుడి వేషధారణలో శివప్రసాద్ నిరసన

శ్రీకృష్ణుడి వేషధారణలో వచ్చిన చిత్తూరు ఎంపీ ఎన్. శివప్రసాద్ భారతీయ జనతా పార్టీపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. వివిధ సందర్భాల్లో వివిధ కళారూపాలతో తన నిరసన తెలియజేసే శివప్రసాద్, తాను గతంలోనూ ఓసారి శ్రీకృష్ణుడి వేషం వేశానని, ఆ సమయంలో రాష్ట్రాన్ని విభజించవద్దు అంటూ నాటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీని హెచ్చరించానని, ఆమె పెడచెవిన పెట్టినందుకు తగిన మూల్యం చెల్లించుకున్నారని అన్నారు. తాజాగా తాను మళ్లీ అదే శ్రీకృష్ణుడి వేషంలో విభజన హామీలు అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని డిమాండ్ చేస్తున్నాని, తన మాటలు పెడచెవిన పెడితే కాంగ్రెస్ పార్టీ తరహాలోనే బీజేపీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అసలు మిత్రపక్షమైన తమతో సంధి కోరుకుంటున్నారా లేక, సమరానికి సిద్ధపడ్డారో తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా నాన్చుకుంటూ పోవడం తగదని వ్యాఖ్యానించిన శివప్రసాద్, "దేశంలోని పార్టీలన్నీ ఏకం కాకపోవు, నువ్ ఎంతటి మొనగాడివైనా మొదటికే మోసం రాకపోదు, తెలుసుకుని మసలుమా మోడీ గారూ" అంటూ ఏకంగా ప్రధాని మోడీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

కేంద్రం నుంచి స్పందన కరువు : గల్లా జయదేవ్

ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ తాము తొలి దశ సమావేశాల్లో ప్రతి రోజూ ఆందోళన చేసినా కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఇప్పుడు కూడా ఆందోళన కొనసాగిస్తున్నామని, హామీలన్నీ అమలు చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వెల్లడించారు. బీజేపీ అధినేత అమిత్ షా చర్చలకు పిలిచినప్పటికీ, అందులో ఆశించిన ఫలితం ఉంటుందని తాను అనుకోవడం లేదని గల్లా జయదేవ్ వ్యాఖ్యానించారు. "ఆశించిన ఫలితం లభిస్తే మంచిదే, లేదంటే మా వ్యూహాలు మార్చుకుని ఆందోళన మరింత ఉధృతం చేస్తాం" అన్నారు. ప్రత్యేక హోదాకు బదులుగా అవే ప్రయోజనాలతో కూడిన ప్యాకేజి ఇస్తామని నాడు కేంద్రం చెప్పడంతో సరేనన్నామని, కానీ అది కూడా అమలు చేయకపోవడంతోనే ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని గల్లా జయదేవ్ అన్నారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా పన్ను మినహాయింపులు, పారిశ్రామిక రాయితీలు ఇస్తూనే ఉన్నారని, అందుకే తాము ఎట్టి పరిస్థితుల్లోనూ హోదా వదులుకోకూడదని నిర్ణయించుకున్నామని తెలిపారు. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలనే అమలు చేయమంటున్నామని మిగతా ఎంపీలు ముక్తకంఠంతో నినదించారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువే ఇచ్చామన్న బీజేపీ నేతల వ్యాఖ్యలను వారంతా తప్పుబట్టారు. అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినట్టే ఆంధ్రప్రదేశ్‌కూ ఇచ్చారని, అవి కాకుండా ప్రత్యేకంగా ఏమిచ్చారో చెప్పమనండి అంటూ ఎదురు ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఖర్చు పెట్టిన డబ్బే ఇవ్వలేదని, పరిహారం, పునరావాసం కోసం అయ్యే ఖర్చు రూ. 33వేల కోట్లుగా అంచనా వేయగా, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక పెద్ద జాబితాయే అవుతుందని హిందూపురం ఎంపీ నిమ్మల కిష్టప్ప అన్నారు. కాంగ్రెస్ అన్యాయం చేసిందన్న ఉద్దేశంతో బీజేపీతో కలిస్తే, వారు కూడా అన్యాయం చేస్తున్నారని మరో ఎంపీ కొనకళ్ల నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మిత్రధర్మం పాటించాలని ఆయన హితవు పలికారు.

బీజేడీ, టీఎంసీ నేతలతో టీడీపీ ఎంపీల భేటీ

సభ వెలుపల, సభ లోపల ఆందోళనలకు పరిమితం కాకుండా తెలుగుదేశం ఎంపీలు వ్యూహాత్మకంగా తమ పోరాటానికి మద్ధతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా రైల్వే జోన్ విషయంలో అడ్డంకులు సృష్టిస్తున్న ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్ (బీజేడీ) ఎంపీలను కలిసి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తెలుగుదేశం పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం నేతృత్వంలో ఎంపీలు రామ్మోహన్ నాయుడు, నిమ్మల కిష్టప్పలతో కూడిన బృందం బీజేడీ ఎంపీ బర్తృహరి మెహతాబ్‌ను కలిసి ఒక విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు.

తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, ఎంపీ సుదీప్ బంధ్యోపాధ్యాయను కలిశారు. ఇచ్చిన హామీల అమలు కోసం తాము చేస్తున్న పోరాటా నికి మద్ధతివ్వాలని కోరారు. ఓవైపు థర్డ్ ఫ్రంట్ అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు ప్రతిపాదించిన అటు ఎన్డీయే, ఇటు యూపీఏలో లేని బలమైన ప్రాంతీయ పార్టీల నేతలను తెలుగుదేశం నేతలు కలవడం చర్చనీయాంశంగా మారింది.

వేంకటేశ్వరుడి సాక్షిగా మోడీ అబద్ధాలు : మాగంటి బాబు

భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర మత గ్రంథాలతో పాటు వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని చేత పట్టుకుని ధర్నాలో పాల్గొన్న ఏలూరు ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ తిరుపతి వెంకటేశ్వరుడి సాక్షిగా ఢిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తామని నాడు మోడీ అన్న విషయం గుర్తు చేశారు. ఏమేం హామీలిచ్చారో ఆయన మర్చిపోతే పార్లమెంటు ఉభయ సభల్లో ఒక లఘు చిత్రాన్ని ప్రదర్శించే అవకాశం కల్పిస్తే, ఆ వీడియో ద్వారా గుర్తుచేస్తామని మాగంటి బాబు అన్నారు. ఆనాడు ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నాం తప్ప తామేమీ వింత కోర్కెలు కోరడం లేదని తెలిపారు.

రైల్వే జోన్ విషయమై ఏపీకి అన్యాయం : జేసీ దివాకర్‌రెడ్డి

జేసీ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే జోన్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన నష్టమేదీ లేదని అన్నారు. జోన్ ఇచ్చినంత మాత్రాన ఉద్యోగాలు రావని, ఒక్క పైసా రాష్ట్రానికి రాదని వ్యాఖ్యానించారు. కేవలం రూ. 10 కోట్లు ఖర్చు పెడితే జోన్ కార్యాలయ భవనాలు సిద్ధమవుతాయని, ఆ కాస్త ఖర్చు కేంద్ర ప్రభుత్వానికి సముద్రంలో ఇసుక రేణువంత కూడా కాదని దివాకర్ రెడ్డి అన్నారు.

విభజన సమస్యలు ఏపీకే పరిమితం : గరికపాటి

తెలంగాణ ప్రాంతం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న గరికపాటి మోహన్ రావు మాట్లాడుతూ విభజన సమస్యలు కేవలం ఆంధ్రప్రదేశ్‌కు పరిమితం కాలేదని అన్నారు. విభజన హామీలు రెండు రాష్ట్రాలకూ సంబంధించినవని, ఈ వ్యవహారం మొత్తం తెలుగు ప్రజలకు సంబంధించినదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి సైతం కేంద్రం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఏపీకి హోదా ఇవ్వాలని వ్యాఖ్యానించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నేతలంతా కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని అన్నారు.



కృష్ణుడి వేషధారణలో శివప్రసాద్

అమిత్ షా నివాసం ముట్టడి

ప్రత్యేక హోదాపై ఆంధ్ర విద్యార్థుల ధర్నా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆ రాష్ట్రానికి చెందిన పలు విద్యార్థి సంఘాల నేతలు ఢిల్లీలోని బీజేపీ అధినేత అమిత్ షా నివాసాన్ని ముట్టడించారు. సాయంత్రం గం. 6.30 సమయంలో అమిత్ షా నివాసానికి చేరుకున్న విద్యార్థి సంఘం నేతలు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలను అమలు చేయాలని నినదించారు. దీంతో ఒక్కసారిగా ఆయన నివాసం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.

అప్రమత్తమైన భద్రతా సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఢిల్లీ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేశారు. దగ్గరిలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టయిన విద్యార్థులు మీడియాతో మాట్లాడుతూ, అరెస్టులు చేసినా ఎన్ని నిర్బంధాలు అమలు చేసినా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.

సంజ్వాన్ ఆర్మీ దాడి రూపకర్త
ముఫ్తీ వకాస్ హతం


- హత్వార్ ఎన్‌కౌంటర్‌లో కాల్చివేత
- సూసైడ్ బాంబర్లను తయారు చేయడంలో వకాస్ నిష్ణాతుడు
- సోపియాన్‌లో ఇద్దరు మిలిటెంట్లు హతం ● నలుగురు పౌరులు మృతి

శ్రీనగర్: జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ టాప్ కమాండర్, సంజ్వాన్ ఆర్మీ క్యాంప్ పై దాడి ప్రధాన సూత్రదారి ముఫ్తీ వకాస్ హతమయ్యాడు. ఆర్మీ, కాశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్ లో వసాన్ ను మట్టుబెట్టాయి. జమ్ము కాశ్మీర్ లోని అవంతీపూర్ లో ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించడం తో ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించాయి. దక్షిణ కాశ్మీర్ లోని అవంతిపురలో జరిపిన ఎన్ కౌంటర్ లో ముఫ్తీ వకాస్ హతమైనట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. మకాస్ తన ఇంట్లో ఉన్నట్లు గుర్తించిన భద్రతా బలగాలు ఆ ఇంటిని చుట్టుముట్టి కాల్పులు జరిపారు. వకాస్ నుంచి ఓ ఏకే 47 రైఫిల్ కూడా స్వాధీనం చేసుకున్నామని... ఆపరేషన్ సమయంలో పౌరులెవరికి హాని కలగలేదని.. తెలిపారు. జైషే ఉగ్రవాది సంస్థ కు నూరు మమ్మద్ చనిపోయిన తర్వాత వకాస్ కమాండర్ గా వ్యవహరిస్తున్నాడు. గతనెలలో సంజ్వాన్ ఆర్మీ క్యాంప్ పై జరిగిన దాడిలో ఓ పౌరుడు, ఐదుగురు ఆర్మీ సిబ్బంది మృతి చెందిన విషయం తెలిసిందే.

దక్షిణ కాశ్మీర్‌లోని షాపెయన్ జిల్లాలో జరిగిన కాల్పుల ఘటనలో మృతుల సంఖ్య 6కి పెరిగింది. ఈసందర్భంగా పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ షాపెయన్ ఘటనలో సోమవారం ఉదయం మరో ఇద్దరి మృతదేహాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతి చెందిన ఉగ్రవాదిని లష్కరే తయిబాకు చెందిన ఆషిక్ హుస్సేన్ భట్‌గా గుర్తించామన్నారు. రెండు వాహనాల్లో సైన్యం, పోలీసుల మొబైల్ చెక్‌పోస్టుపై కాల్పులు జరు పుతూ పారిపోతున్న ఉగ్రవాదులపై సైన్యం ఎదురు కాల్పులు జరిపిందన్నారు. చనిపోయిన ఉగ్రవాది రఖ్ కార్పన్ ప్రాంతానికి చెందినవాడన్నారు. ఉగ్రవాది పక్కనే మరో వాహనంలో పడి ఉన్న పౌరుడి మృతదేహం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతడిని ఉగ్రవాద సంస్థల తరఫున పనిచేసేవ్యక్తిగా భావిస్తున్నామన్నారు. షాపెయన్‌లోని పోహాన్ వద్ద మొబైల్ వెహికల్ చెక్‌పోస్టు దగ్గర ఒక కారును ఆపటానికి ప్రయత్నించగా కారులో ఉన్నవారు ఆపకుండా దూసుకుపోవటానికి ప్రయత్నించారన్నారు. వారిపై రక్షక దళాలు కాల్పులు జరపగా కారులో ఉన్నవారుకూడా కాల్పులకు దిగారన్నారు. ఈ ఘటనలో ఒక ఉగ్రవాది మరణించాడన్నారు. చనిపోయిన ఉగ్రవాది అమీర్ అహ్మద్ మాలిక్‌గా గుర్తించామన్నారు. గతేడాది జులైలో ఇతను ఉగ్రవాద సంస్థలో చేరాడన్నారు. చనిపోయినవారి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించామన్నారు. వారి వద్ద లభించిన ఆయుధాలను సీజ్‌చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పౌరులు హతమవడం బాధాకరం: సీఎం ముఫ్తీ

షాపెయన్ ఘటన ఎదురుకాల్పుల్లో సామాన్య పౌరులు హతమవడం బాధాకరమని జమ్మూ కాశ్మీర్ ముఖ్య మంత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. రక్షక దళాల ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులేకాక నలుగురు సామాన్య పౌరులు కూడా తమ ప్రాణాలు కోల్పోవటం అత్యంత బాధ కలిగించిందని ఆమె అన్నారు. మృతుల కుటుంబాలకు ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను అని ఆమె ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. కాగా ఘటన అనంతరం రెండునెలల విరామం తరువాత సోమవారం తెరుచుకున్న విద్యాలయాలు, పాఠ శాలలును ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు మూసివేయించారు



ఎవరీ వకాస్

పాకిస్తాన్ కు చెందిన వకాస్ ..2017 లో జమ్ముకాశ్మీర్ లో చొరబడ్డాడు. అప్పటి నుంచి కాశ్మీర్ లోయ ప్రాంతంలో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలు చూస్తూ..కీలక పదవులు పొందాడు. ఆత్మాహుతి దళాలను తయారు చేయడంలో నిపుణుడైన వకాస్ ఎన్నో దాడులు చేయించాడు. ఫిబ్రవరి 10న ఆర్మీ క్యాంప్ దాడిలో వకాస్ కీలక సూత్రదారి. జమ్ము లోయ ప్రాంతంలో యువకులను ఉగ్రవాదం వైపు మళ్లించడంతో కీలక పాత్ర పోషించాడు. ఫడీన్ ఖాన్, మన్జూర్ బాబా లాంటి వారిని సూసైడ్ బాంబర్లుగా తయారుచేశాడు. వీరిని గతేడాది డిసెంబర్ 31 తేదీన దక్షిణ కాశ్మీర్‌లోని లెతపుర సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై దాడికి ఉసిగొల్పాడు.



సోపియాన్‌లో 6గురు మృతి

దక్షిణ కాశ్మీర్‌లోని సోపియాన్ కాల్పుల ఘటనలో ఆరుగురు మృతిచెందారు. కాగా ఈ సంఘటనపై విస్తృత దర్యాప్తు చేస్తున్నామని జమ్మూ అండ్ కాశ్మీర్ డీజీపీ ఎస్‌పి వేద్ అన్నారు. ఈసందర్భంగా డీజీపీ వేద్ మాట్లాడుతూసోపియాన్ జిల్లాలో రక్షక దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులతో సహా ఆరుగురు మరణించారని ఈ ఘటనపై విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇక్కడ పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. కాశ్మీర్ ప్రజలు శాంతివహించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదుల దగ్గరున్న ఆయుధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం రాత్రి ఉగ్రవాదులు రక్షక దళాల శిబిరంపై దాడికి యత్నించారన్నారు. పోలీసులు, రక్షక దళాలు ఎదురుదాడికి దిగి అనంతరం పరిశీలించగా ఇద్దరి ఉగ్రవాదుల మృతదేహాలతోపాటు మరో నలుగురి మృతదేహాలు కనిపించాయన్నారు. ఉగ్రవాదులతోపాటు చనిపోయిన మరో నలుగురు భూగర్భ కార్మికుల్లా ఉన్నారని విలేఖరులు అనటంతో సైన్యం దర్యాప్తులో ఏమితేలుతుందో చూడాలన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందన్నారు. ఉగ్రవాదంను విడిచిపెట్టి తన కుటుంబ సభ్యులతో కలిసిపోయిన మిలిటెంట్ గురించి ప్రస్తావించగా ఉగ్రవాదులుగా మారిన తమ కుమారులను తిరిగిరావలసిందిగా వారి కన్నతల్లులు విజ్ఞప్తి చేయాలని డీజీపీ కోరారు. తమ పిల్లలు నేరస్థులుగా మారకుండా తల్లిదండ్రులే కీలకపాత్ర పోషించాలన్నారు.

అంబేద్కర్ జయంతిపై అమెరికన్ పార్లమెంట్ తీర్మానం

వాషింగ్టన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 126 జయంతి ఉత్సవాలను అమెరికాలోనూ ఘనంగా నిర్వహించాలని అమెరికన్ పార్లమెంట్ తీర్మానం చేసింది. మహర్ కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ అస్పృశ్యతపై నిరంతర పోరాటం చేశారని.. భారత్ లో కుల వ్యవస్థపై ఎన్నో రకాల పోరాటాలు చేశారని పార్లమెంట్ సభ్యులకు చదివి వినిపించారు. రంగు, కులం,.లింగం ప్రాతిపదికన వివక్ష చూపడాన్ని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారని.. అలాంటి మహోన్నతమైనవ్యక్తి జయంతిని నిర్వహించు కోవాల్సిన అవసరముందని గుర్తు చేశారు.విదేశాల్లో పీహెచ్‌డీ చేసిన మొదటి భారతీయుడిగా అంబేద్కర్ రికార్డు సృష్టించడమే కాకుండా నాలుగు సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి గడించారన్నారు. న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సంఘ సంస్కరణ వేత్తగా అంబేద్కర్ ప్రజాదరణ పొందారని చెప్పారు. కుల వివక్ష లేని సమాజం కోసం అంబేద్కర్ అనునిత్యం పరితపించేవారని.. అస్పృశ్యతపై పోరాటానికి తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడిని గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు.

ఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తు

హోం మంత్రి రాజ్‌నాథ్ ఆదేశం

న్యూఢిల్లీ: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) సీజీఎల్ పేపర్ లీకేజ్‌పై సీబీఐతో దర్యాప్తు చేయించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఆందోళన చేస్తున్న ఎస్ఎస్‌సీ అభ్యర్థుల డిమాండ్లన్నింటినీ అంగీకరిస్తున్నామని, పేపర్ లీకేజ్ విషయంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేస్తామని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం వెల్లడించారు. అభ్యర్థులు వెంటనే తమ ఆందోళనను విరమించాల్సిందిగా ఆయన కోరారు. గత నెల 17 నుంచి 22 వరకు ఎస్ఎస్‌సీ సీజీఎల్(టైర్-2) పరీక్ష నిర్వహించిన విషయం విదితమే. 21న జరగాల్సిన పరీక్షను మార్చి 9కి వాయిదా వేశారు. పేపర్ లీక్ అయినట్లు వార్తలు రావడంతో అధికారులు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు ఢిల్లీలో గత వారంరోజులుగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కష్టపడి పరీక్షలకు సిద్ధపడితే మధ్యలో ఇటువంటి అవాంతరాలు ఎదురవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఇప్పటికే పేపర్ లీకేజ్‌పై సీబీఐ దర్యాప్తునకు అంగీకరిస్తున్నట్లు ఎస్ఎస్‌సీ చైర్మన్ కూడా తెలిపిన విషయం విదితమే.

చికిత్స కోసం అమెరికాకు పారికర్?

న్యూఢిల్లీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ వైద్య పరీక్షలు, చికిత్స కోసం అమెరికా వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో సీఎం పారికర్ సోమవారం ముంబై వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకుంటారని, ఆ తరువాత వైద్యుల సలహామేరకు అవసరమైతే విదేశాలకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది. ఈ విషయాన్ని సీఎం వ్యక్తిగత కార్యదర్శి రూపేష్‌కామత్ తెలిపారు. అయితే, ఆయన కుటుంబ సభ్యులు ఇప్పటికే అమెరికాలోని ఓ ఆస్పత్రిలో సంప్రదింపులు జరిపారని పారికర్ సన్నిహిత వర్గాల సమాచారం. పారికర్‌కు స్వల్పంగా పాంక్రియాటైటిస్ రావడంతో గత నెల 15న లీలావతి ఆసుపత్రిలో చేర్చినట్లు సీఎంఓ ప్రకటించింది.

మందిరం కట్టకపోతే మరో సిరియాగా భారత్

అయోధ్య వివాదంపై రవిశంకర్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అయోధ్య రామ మందిరం-బాబ్రీ వివాదంపై ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడం మంచిదని, లేనిపక్షంలో భారత్ మరో సిరియాగా మారుతుందని హెచ్చరించారు. సిరియా నరమేధం నుంచి ముస్లింలు కొన్ని విషయాలు నేర్చుకుని, అయోధ్య వివాదంపై ఆశలు వదులుకుని వెనక్కి తగ్గడమే ఉత్తమమని అభిప్రాయపడ్డారు. జాతీయ మీడియా ఇండియా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రవిశంకర్ ఆయోధ్య విషయంపై ప్రస్తావించారు. అయోధ్య అనేది ముస్లింలకు సంబంధించిన అంశం, ప్రాంతం కాదని వారు గుర్తించాలన్నారు. అయితే, హిందువులు, ముస్లింల పరస్పర ఆమోదంతో రామమందిర నిర్మాణం జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు. ముస్లింలకు ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని, వారు ఆ స్థలంలో మసీదు నిర్మించుకోవడం ఉత్తమమని, వివాదాస్పద స్థలంలో రామమందిర నిర్మాణానికి ముస్లింలు పూర్తి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

అమెరికాలో జడ్జీ పదవి రేసులో ఎన్నారై

హోస్టన్ అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని హేరీస్ కౌంటీ సవిల్ జిల్లా జడ్జి పదవికి ప్రవాస భారతీయురాలు షాంపా ముఖర్జీ డెమోక్రటిక్ పార్టీ తరఫున పోటీ పడుతున్నారు. ఈ కౌంటీలో సివిల్ కోర్టులకు తాను ఎక్కువ సేవ చేయగలననీ,అందుకే జడ్జి పదవి కోసం పోటీ పడుతున్నానని ఆమె చెప్పారు. టెక్సాస్ రాష్ట్రం చట్టాలను పరిరక్షిస్తాననీ, న్యాయమైన,సమానమైనరీతిలో వివాదాలను పరిష్కరిస్తానని ఆమె తన ప్రచారం సందర్భంగా వెల్లడించారు. పేదలకు న్యాయం చేకూర్చడమే తన లక్ష్యమని ఆమె చెప్పారు. ఫిబ్రవరి 20వ తేదీనపార్టీ ప్రైమరీస్‌లో ఓటింగ్ రేపు పూర్తి అవుతుంది. ముఖర్జీ తండ్రి ఇంజనీర్.ఆమె తల్లి పట్టభద్రురాలు. ఆమె భర్త శామ్ ముఖర్జీ అటార్నీగా పని చేస్తున్నారు.

మిసా భారతికి ఊరట

న్యూఢిల్లీ: ఆర్జెడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె, అల్లుడికి ఊరట లభించింది. వీరిద్దరికి ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం మనీలాండరింగ్ కేసులో బెయిల్ మంజూరు చేసింది. మీశాభారతి దంపతులకు వచ్చిన సమన్లను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించడంతో ప్రత్యేక న్యాయస్థానం జడ్జి జస్టిస్ అరవింద్ కుమార్ బెయిల్ మంజూరు చేశారు. రూ. 2 లక్షల వ్యక్తిగత పూచికత్తుతో బెయిల్ ఇచ్చారు. మనీలాండరింగ్ కేసులో తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిద్దరికి బెయిల్ ఇవ్వొద్దని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వాదించినా..న్యాయస్థానం ఈడీతో ఏకీభవించలేదు. ఇప్పటికే పలుమార్లు విచారించినప్పటికీ మరోసారి మీశా భారతి దంపతులను కస్టడీకి ఎందుకు కోరుతున్నారని కోర్టు ప్రశ్నించింది. గతనెల 8న మిశాభారతి, ఆమె భర్త సుశీల్ కుమార్ లకు సమన్లు జారీ చేసింది. గతేడాది డిసెంబర్ 23న తుది అఫిడవిట్ ను దాఖలు చేసిన ఈడీ.. ఢిల్లీలోని ఫామ్ హౌస్, మిశాలి ప్యాకర్స్ అండ్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా వీరికి చెందినదిగా గుర్తించింది.

పీఎన్‌బీ జీఎంను విచారించిన సీబీఐ

- సాఫ్ట్‌వేర్‌కు దొరక్కుండా అవినీతి
- మరో ఇద్దరినీ ప్రశ్నించిన అధికారులు

న్యూఢిల్లీ : దేశాన్నే కుదిపేసిన రూ.12,636 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం విషయమై సీబీఐ ఆ బ్యాంకు జనరల్ మేనేజర్‌ను విచారించింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు జీఎం ఎస్‌కే చంద్ ఆర్థిక శాఖతో సంబంధం ఉన్న వ్యక్తి కావడంతో అన్ని కోణాల్లో విచారించారు. ప్రముఖ జ్యూవెల్లర్ నీరవ్ మోడీ అతని మామయ్య మేహుల్ చోక్సీ వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఇద్దరు ఉద్యోగులు, నీరవ్ మోడీ గ్రూప్ ఆఫ్ కంపెనీల ఆడిటర్‌తో పాటు గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీల డైరెక్టర్‌ను కూడా సీబీఐ విచారించింది. పీఎన్‌బీ ఆర్థిక శాఖ జనరల్ మేనేజర్ ఎస్‌కే చంద్ నుంచి సీబీఐ ప్రశ్నించడం ప్రారంభించింది. భారత దేశానికి చెందిన బ్యాంకుల నుంచి రూ.12,636 కోట్లు విదేశాలకు తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆరోపణల నేపథ్యంలో సీబీఐ ఎస్‌కే చంద్‌ను విచారించింది. పై అధికారులకు తెలియనీవకుండా ఈ తతంగం కొనసాగించారు. సాఫ్ట్‌వేర్‌కు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విదేశాల్లో ఉన్న నీరవ్‌తో అంతర్జాతీయ మెసేజ్ సిస్టం ద్వారా సంబంధం కొనసాగిస్తూ వచ్చారు. ఈ వ్యవస్థను స్విఫ్ట్‌గా పిలుస్తుంటారు. దీని ద్వారా ప్రపంచంలోని ఏ బ్యాంకులో అయినా సులువుగా డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసే అవకాశం ఉంటుంది. భారత్‌కు సంబంధించిన బ్రాంచులు విదేశాల్లో ఉంటే దరఖాస్తుదారుడికి స్వల్ప కాలిక రుణం మంజూరు చేసే అవకాశం ఉంటుంది. ఒక వేళ తిరిగి డబ్బులు చెల్లించని పక్షంలో ఒప్పందం ప్రకారం ఇచ్చిన బ్యాంకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని యాంట్‌వార్ప్, హాంకాంగ్, బహ్రెయిన్, మారిటియస్, ఫ్రాంక్‌ఫోర్ట్‌లోని భారతీయ బ్యాంకులైన కెనరా బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంకు, అలహాబాద్ బ్యాంకులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు చేరవేసింది. ఈ మేసేజ్‌ను స్విఫ్ట్ ఆధారంగా పంపించింది. దీంతో సందేశాన్ని అందుకున్న బ్యాంకులు పెద్ద మొత్తాన్ని పంజాబ్ నేషనల్ బ్యాంకు నోస్ట్రో ఖాతాలోకి బదిలీ చేశాయి. నోస్ట్రో ఖాతా అనేది ఖాతాదారుడు ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకులో విదేశీ కరెన్సీని వ్యాపారం చేయడానికి బదిలీ చేయడానికి ఉంటుంది.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఘోరంగా పరాజయం పొందడంపై సోమవారం పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం స్పందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం. దీనికి పార్టీ కట్టుబడి ఉంది. మళ్లీ ప్రజల నమ్మకాన్ని పొందడానికి ప్రయత్నిస్తాం. మేఘాలయలో అధికారం కోల్పోగా, త్రిపుర, నాగాలాండ్‌లో మాత్రం ఒక్కసీటు కూడా రాబట్టుకోలేకపోయింది. మేఘాలయలో 21 సీట్లు పొందినా సరైన భాగస్వామ్యం లేకపోవడంతో చతికిలపడ్డట్టు అయ్యింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అహ్మద్‌పటేల్, కమల్ నాథ్ షిల్లాంగ్ చేరుకుని ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు చేద్దామనుకున్నా ఎవరూ అందుబాటులో లేకుండా పోయారు. ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తాం. ప్రజల మన్ననలు పొందుతాం. కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించిన ప్రతీ కార్యకర్తకు నా ధన్యవాదాలు అని ట్విట్టర్ వేదికగా స్పందించారు.

బీజేపీది డేంజర్ గేమ్

కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జీవాలా

న్యూఢిల్లీ: ఈశాన్యంలో ఏవిధంగానైనా అధికారం సాధించేందుకు బీజేపీ డేంజర్ గేమ్ ఆడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్ ఇంఛార్జి రణదీప్ సూర్జీవాలా విలేఖరులతో మాట్లాడుతూ బీజేపీ ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలో ప్రభుత్వ ఏర్పాటుపై ఆయన వరుస ట్వీట్‌లతో విమర్శల వర్షం కురిపించారు. ప్రధాని మోదీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నుంచి దేశంలో శాంతి నెలకొల్పే విషయంలో పాఠాలు నేర్చుకోవాలన్నారు. రాహుల్ దక్షతకు అసోం, మిజోరాం ఘటనలు నిదర్శనాలు అన్నారు.

చిరునవ్వుతో పరీక్షలు రాయండి

విద్యార్థులకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: పరీక్షలకు హాజరవుతున్న టెన్త్, ఇంటర్ విద్యార్థులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చిరునవ్వుతో పరీక్షలు రాయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. బోర్డు ఎగ్జామినేషన్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఆశావహ దృక్పథాన్ని ఎట్టిపరిస్థితుల్లో వదులుకోకూడదన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న నా యువ మిత్రులందరికీ ఆల్ ది బెస్ట్ ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరవ్వండి అంటూ ప్రధాని ట్విటర్ వేదికగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ నిర్వహించే ఇంటర్ పరీక్షలు, అదేవిధంగా టెన్త్ పరీక్షలకు సుమారు 28లక్షల అభ్యర్థులు హాజరవనున్నారు. టెన్త్ పరీక్షలకు 16లక్షల విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, ఇంటర్ పరీక్షలకు 12లక్షలకుపైగా విద్యార్థులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు.

ప్రధాని ఆధార్, ఓటర్ ఐడీ వివరాలివ్వలేం

న్యూఢిల్లీ: భారత ప్రధాన మంత్రి ఆధార్‌కార్డు వివరాలు, ఓటర్ ఐడి వివరాలను ఇతరులకు వెల్లడించడానికి వీలు లేదని, ఈ విషయంలో ప్రధాని కార్యాలయం తీసుకున్న నిర్ణయం సరైందేనని కేంద్ర సమాచార శాఖ ముఖ్య కమిషనర్ ఆర్‌కె మాథుర్ సోమవారం వెల్లడించారు. సమాచార హక్కు చట్టం-2005 సెక్షన్ 8(1) (జె) క్రింద ప్రధాన మంత్రి తన వివరాలు వెల్లడించకుండా వుండేందుకు మినహాయింపు లభించిందని ఆయన వివరించారు. సమాచార హక్కు చట్టం క్రింద పై వివరాలు తెలియజెయాల్సిందిగా సోనీ ఎస్ ఎరామత్ అనే వ్యక్తి దరఖాస్తు చేయగా ప్రధాని కార్యాలయం తిరస్కరించింది.


యాక్సిస్ బ్యాంకుకు రూ.3కోట్ల జరిమానా

ముంబై: నిబంధనలు అతిక్రమించిన విషయమై సోమవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ) యాక్సిస్ బ్యాంకుకు రూ. 3 కోట్ల రూపాయల జరిమానా విధించింది. మార్చి31, 2016 తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి యాక్సిస్ బ్యాంకు కార్యకలాపాలపై ఆర్బీఐ నిర్వహించిన ఆడిటింగ్‌లో రుణ గ్రహీతల ఆస్తుల అంచనా విలువలలో పలు అవకతవకలు చోటు చేసుకున్నట్టు ఆర్బీఐ గుర్తించింది.

సరిహద్దుల్లో చైనా నిర్మాణాలు

- సెంట్రీపోస్ట్‌లు, హెలిపాడ్‌లు, కందకాల ఏర్పాటు
- లోక్‌సభలో వెల్లడించిన రక్షణ మంత్రి నిర్మలా

న్యూఢిల్లీ: చైనా కయ్యానికి కాలుదువ్వుతోంది. డోక్లాం ప్రతిష్టంభన తర్వాత భారత్- చైనా మధ్య సంబంధాలు ఆశించిన స్థాయిలో మెరుగుపడకపోయినా.. చైనా తన వక్రబుద్ధిని ప్రదర్శిస్తూనే ఉంది. రెచ్చగొట్టే కార్యకలాపాలకు పాల్పడుతూ పైకి మాత్రం ఏం ఎరగని దానిపై నీతులు పలుకుతోంది. డొక్లామ్ ప్రాంతంలో చైనా సైన్యం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సెంట్రీపోస్ట్‌లు, కందకాలు, హెలిపాడ్‌లు నిర్మిస్తున్నట్లు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడిం చారు. సీతారామన్ లోక్ సభలో మాట్లాడుతూ.. సరిహద్దు అంశాలపై ఎప్పటికప్పుడు దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకునేందుకు భారత్ ప్రయత్నిస్తు న్నప్పటికీ..చైనా పైకి చర్చలు జరుపుతూనే లోలోపల మత్రం తమ కార్యకలాపాలను యదేచ్ఛగా కొనసాగిస్తోంది.డొక్లామ్ ప్రతిష్టంభన తర్వాత ఎలాంటి ఘర్షణ పరిస్థితు లు తలెత్తకుండా డొక్లామ్ ప్రాంతంలో భారత్ సైన్యాన్ని తగ్గించినప్పటికీ చైనా మాత్రం తన వక్రబుద్ధిని ప్రదర్శిస్తోంది. అని మండిపడ్డారు. గతవారం రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ భార్మే కూడా చైనాపై ఇలాంటి ప్రకటనే చేశారు. భారత్- చైనా సరిహద్దుల్లోని పరిస్థితులు చాలా సున్నితమైనవని తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో చైనా నిర్మాణాలు చేపడుతున్నట్లు శాటిలైట్ చిత్రాలు వెలువడ్డాయని..డొక్లామ్ సమీపంలో చైనా ఏడు హెలిప్యాడ్లు నిర్మిస్తోందని.. సరిహద్దు ప్రాంతంలో యుద్ధ ట్యాంకర్లు, క్షిపణులను ఉంచిందని పేర్కొన్నారు. చైనా చేస్తున్న ఇలాంటి రెచ్చకొట్టే వాతావరణాన్ని నెలకొల్పడంతో దౌత్య మార్గాలు, అధికారుల సమావేశాల ద్వారా సమస్యకు పరిష్కార మార్గాలు కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



మూడు లక్షల సైన్యం కుదింపు

పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో చైనా సంస్కరణలకు శ్రీకా రం చుట్టింది. మూస పద్ధతిలో నియామ కాలను నిలిపివేయ డంతో పాటు సైన్యం నుంచి మూడు లక్షల మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. సైన్యాన్ని కుదించా లన్న ఆలోచన ను చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ 2015లోనే చేసినప్పటికీ.. త్వరలో ఆచరణలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. 1980 వరకు 45 లక్షలుగా ఉన్న చైనా సైన్యాన్ని 1985లో 23 లక్షలకు కుదించారు.

చైనా రక్షణ శాఖ బడ్జెట్ 17500 కోట్ల డాలర్లు

ఈ ఏడాది రక్షణశాఖ బడ్జెట్ చైనా భారీగా పెంచింది. గతేడాది కంటే 8.1 శాతం ఎక్కువ నిధులు కేటాయించింది. సైన్యం ఆధునికీకరణకు ఏకంగా 17500 కోట్లడాలర్లు బడ్జెట్ ను కేటాయించారు. జాతీయ ప్రజా కాంగ్రెస్ లో సమర్పించిన బడ్జెట్ వివరాలను ఈ విషయం బయటపడింది.గతేడాది 1500 కోట్లడాలర్లు బడ్జెట్ ను కేటాయించిన చైనా ఈ సారి ఏకంగా 200 కోట్ల బడ్జెట్ ను పెంచింది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీని నవీకరించాలని గత రెండేళ్లుగా కసరత్తు చేస్తున్న చైనా అధ్యక్షుడు జిన్ పింక్ బడ్జెట్ లోనూ ఎక్కువ నిధులు కేటాయించడం గమనార్హం.

మేఘాలయాలో సంగ్మా సర్కార్

- నేడు ప్రమాణ స్వీకారం

షిల్లాంగ్ : మేఘాలయలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గవర్నర్ గంగాప్రసాద్ నుంచి ఆహ్వానం అందిందని ఎన్‌పీపీ అధ్యక్షుడు సంగ్మా సోమవారం తెలిపారు. ఈసందర్భంగా సంగ్మా మాట్లాడారు. మంగళవారం ఉదయం 10.30 నిమిషాలకు మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. మేజిక్ ఫిగర్ నా వద్ద ఉండటంతో గవర్నర్ నుంచి పిలుపు వచ్చింది. దీన్ని రాజ్‌భవన్ అధికారులు కూడా అధికారికంగా ప్రకటించారు. 60 మంది ఎమ్మెల్యేల్లో 34 మంది ఎమ్మెల్యేలు ఎన్‌పీపీ వెంట ఉన్నారు. గవర్నర్‌తో సమావేశమై 34 ఎమ్మెల్యేలు సపోర్టు చేస్తున్నట్టు పత్రాన్ని సమర్పించడం జరిగింది. 19 మంది ఎన్‌పీపీ అభ్యర్థులు, ఆరుగురు యూనైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ), నలుగురు పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్), ఇద్దరు హిల్ స్టేట్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (హెచ్ఎస్‌పీడీపీ), బీజేపీ, ఒక స్వతంత్ర అభ్యర్థితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాం. పదేళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి ఉంటూ వచ్చింది. 59 సీట్లలో 21 సీట్లు పొందింది.

రేపు ఒకరోజు ప్రత్యేక అసెంబ్లీ

మేఘాలయలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో కలిసి బుధవారం ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించనున్నట్టు అసెంబ్లీ కమిషనర్, కార్యదర్శి ఆండ్రూ సిమన్స్ తెలిపారు. ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రారంభం అవుతుంది.

సిరియాలో దాడులపై విచారణ

జెనీవా: సిరియా తూర్పు ప్రాంతంలోని ఘౌటా ప్రాంతంలో తాజా పరిస్థితిపై వెంటనే విచారణకు జరిపించాలనీ, తిరుగుబాటు దారుల ప్రాబల్యం ఉన్న ఆ ప్రాంతానికి మానవీయ సాయం పంపేందుకు తక్షణ చర్యలకు ప్రభుత్వం సాయపడాలని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల మండలి ఆదేశించింది. ఈ ప్రాంతంలో 2013 నుంచి నాలుగు లక్షల మంది ఉన్నారనీ, వారికి ఎటువంటి సాయంఅందడం లేదనీ, ఆ ప్రాంతంలో వారికి ఆహారం,మందుల కొరత ఏర్పడినట్టు మండలి జరిపించిన సర్వేలో వెల్లడైందని మండలి పేర్కొంది.ఆ ప్రాంతంలో పరిస్థితిపై అత్యవసరంగా విచారణ జరిపించాలన్న ప్రతిపాదనపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో ఓటింగ్ జరుగగా, 29ఓట్లు అనుకూలంగా పడ్డాయి.14 మంది సభ్యులు గైర్‌హాజరయ్యారు.

బీజేపీ వ్యతిరేక కూటమికి మద్దతు

న్యూఢిల్లీ: బీజేపీకి వ్యతిరేకంగా పార్లమెంటు లోనూ, వెలుపలా కలిసి పనిచేసేందుకు ప్రతిపక్షాలన్నీ ఒక కూటమిగా ఏర్పడాలన్న ప్రతిపాదనకు మద్దతుపెరుగుతోంది.డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకె స్టాలిన్‌కు బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ మద్దతు ప్రకటించారు.ప్రతిపక్షాలను ఒక తాటిపైకి తెచ్చే యత్నాలకు మమతా బెనర్జీ చొరవ తీసుకుంటున్నారనీ, భావసారూప్యం గల అందరితో ఆమె సంప్రదింపులు జరుపుతున్నారు.

నాయకత్వ శూన్యం తొలగిస్తా



చెన్నై: సూపర్ స్టార్ రజినీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులోని నాయకత్వ శూన్యతను తాను తొలగిస్తానని వ్యాఖ్యానించారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత మరణం, డీఎంకే అధినేత కరుణానిధి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండటంతో తమిళనాడులో మంచి నాయకుడి లేక రాజకీయాల్లో శూన్యత్వం కనిపిస్తోందన్న రజినీ.. మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ అంత కాకపోయినా.. పేదల పక్షపాత నాయకుడికి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటానని అన్నారు. గతేడాది డిసెంబర్ లోపార్టీ పేరును ప్రకటించిన ఆయన..తొలిసారి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వచ్చే వెయ్యేళ్లలోనూ ఎంజీఆర్‌కు ఎవరూ సాటిరారని.. అయితే తాను ఎజీఆర్ అంత కాకపోయిన మంచి పరిపాలనాదక్షుడినని అనిపించుకుంటానన్నారు. వెలప్పన్ వాడీలోని ఎంజీ రామచంద్రన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రజినీకాంత్...తాను ఎంజీఆర్ అంతటివాడిని కాకపోయినా పేదలు, సామాన్యుల సంక్షేమం కోసం ఆయనలాంటి పాలన అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.



మను భాకర్‌కు స్వర్ణం

ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్

న్యూఢిల్లీ: మెక్సికోలోని గ్వాడలాజరాలో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్(ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ కప్ పోటీల్లో భారత షూటర్ మెరిసింది. సోమవారం జరిగిన 10మీ. ఎయిర్ పిస్టల్ మహిళ విభాగం పోటీలో మను బాకర్ స్వర్ణం గెలుచుకోగా, పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ పోటీలో రవికుమార్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. రెండు సార్లు ప్రపంచకప్ ఫైనలిస్ట్ ఆతిథ్య జట్టు షూటర్ అలెజాండ్రా జావలాను మను ఓడించింది. 24 షాట్ల ఫైనల్లో చివరి షాట్‌లో బాకర్ 10.8 పాయింట్లు సాధించి మొత్తం 237.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. అలెజాండ్రా 237.1 పాయింట్లతో రెండో స్థానంలో నిలువగా, ఫ్రాన్స్‌కు చెందిన సెలీనా గొబెర్‌విల్లీ 217 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకంను గెలుచుకుంది. కాగా మరో భారత షూటర్ యశస్విని సింగ్ దేశ్వాల్ తృటిలో పతకాన్ని కోల్పోయింది.

ఆస్ట్రేలియాతో అమీతుమీ

- 'అజ్లాన్ షా' హాకీ కప్
- నేడు కంగారూలతో తలపడనున్న భారత్

ఇపో(మలేసియా): ప్రసిద్ధ హాకీ టోర్నీ అజ్లాన్ షా కప్‌లో భారత జట్టు ఆట నిరాశ పరుస్తోంది. ఇప్పటివరకు ఆడిన మ్యాచుల్లో ఓటమిపాం దిన సర్దార్ సింగ్ నేతృత్వంలోని జట్టు నేడు ప్రపంచ నెంబర్ వన్ ఆస్ట్రేలియాను ఢీకొననుంది. ఈ టోర్నీలో ప్రపంచ నెం.2 అర్జెంటీనా చేతిలో 3-2 తేడాతో ఓడిన భారత్, ఇంగ్లండ్‌తో జరిగిన మరో మ్యాచులో 1-1తో డ్రా చేసుకుంది. ఈ టోర్నీలో నిలవాలంటే నేడు ఆస్ట్రేలియా తో ఆడనున్న మ్యాచ్‌లో భారత్ తప్పక గెలవాల్సి ఉంది. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో భారత్ ప్రస్తుతం సింగిల్ పాయింట్‌తో నాలుగో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో ఉంది.

సీనియర్లతో ఆస్ట్రేలియా బలోపేతం

ఆస్ట్రేలియా జట్టును పరిశీలిస్తే అనుభవమున్న ఆటగాళ్లు ఉండటంతో ఆ జట్టు ఉరకలేస్తోంది. ఆస్ట్రేలియా తాను ఆడిన రెండు మ్యాచుల్లో ఇంగ్లండ్‌ను 4-1 తేడాతో ఓడించగా, ఆతిథ్య జట్టు మలేసియాపై 3-1తేడాతో విజయం సాధించింది. కాగా భారత జట్టులో అంతా కొత్త కుర్రాల్లతో అనుభవ రాహిత్యాన్ని ఎదుర్కొంటోంది. భారత ఆటగాళ్లు ఆడిన రెండు మ్యాచుల్లో తమకు వచ్చిన అవకాశాలను సరిగా ఉపయోగించుకోలేకపోయారు. ఇంగ్లండ్‌తో ఆడిన రెండో గేమ్‌లో మొత్తం 9 పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా వాటిని గోల్స్‌గా మలచలేకపోయారు. డచ్ కోచ్ జోయెర్డ్ మారిజ్‌నే మార్గ నిర్దేశకత్వంలోని భారత జట్టు పటిష్టమైన ఆస్ట్రేలియాను ఓడించాలంటే.. వచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని కూడా భారత జట్టు వదులుకోకూడదు. స్కిప్పర్ సర్దార్ సింగ్ మునపటి ఆటను ప్రదర్శించి కుర్ర ఆటగాళ్లకు ప్రేరణగా నిలుస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. సర్దార్ సింగ్‌కు ఇది చావోరేవో తేల్చుకోవాల్సిన సమయంగా నేటి మ్యాచ్ మారింది. మరోవైపు ఈ ఏడాది పలు ముఖ్యమైన టోర్నీల్లో భారత్ పాల్గొనాల్సి ఉంది. మరోవైపు జట్టు సెలక్టర్లు యువకులకే ప్రాధాన్యత ఇస్తుండటంతో.. సర్దార్ సింగ్ తన ఆటతో ఆకట్టుకోవడమేకాక, భారత జట్టును గెలిపించాల్సిన బాధ్యతను ఎత్తుకోవాల్సి ఉంది. నేటి మ్యాచ్‌లో భారత్ గెలిస్తే భారత్ సెమీస్‌కు చేరే అవకాశాలు మెరుగవుతాయి. గ్రూప్ మ్యాచ్‌లో భాగంగా భారత్ చివరి రెండింటిలో ఒక మ్యాచ్‌ను బుధవారం మలేసియాతో, మార్చి 9న ఐర్లాండ్‌తో ఆడాల్సి ఉంది. నేడు జరుగనున్న ఇతర మ్యాచుల్లో ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో ఆడనుండగా, అర్జెంటీనా, మలేసియాతో తలపడనుంది.



తొలి పంచ్ కంగారూలదే

- 118 పరుగుల తేడాతో సఫారీలపై విజయం
- నాలుగు టెస్టుల సిరీస్‌లో 1-0 తో ఆసీస్ ఆధిక్యం

డర్బన్: సంచలనాలేమీ నమోదు కాలేదు. విజయానికి ఒక వికెట్ దూరంలో నిలిచి ఐదో రోజు బౌలింగ్‌కు దిగిన కంగారూలు 22 బంతుల్లో ముగించి విజయాన్ని సొంతం చేసుకున్నారు. 83 పరుగులు చేసిన డి కాక్ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. అవతల ఎండ్‌లో మోర్కెల్ 3 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. దీంతో నాలుగు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండు ఇన్నింగ్స్‌లోనూ స్వింగ్ బౌలింగ్‌తో వికెట్ల పండగ చేసిన స్టార్క్(9/109)ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అంతకుముందు మార్క్‌రమ్ సెంచరీతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఒక దశలో డికాక్, మార్క్‌రమ్‌ల (143) జంట సఫారీలను విజయతీరాలకు చేర్చేలా కనిపించినా.. స్టార్క్ మార్క్‌రమ్ వికెట్‌తోపాటూ వరుస బంతుల్లో రెండు లోయర్ ఆర్డర్ వికెట్లు తీసి సఫారీలను కోలుకోలేని దెబ్బతీశాడు.

డికాక్-వార్నర్ ల మధ్య వాగ్వాదం

వార్నర్, డికాక్‌ల మధ్య నాలుగోరోజు టీ విరామంలో గొడవ జరిగినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి.. సీసీటీవీలో రికార్డు అవ్వడంతో క్రికెట్ ఆస్ట్రేలియా ఈ అంశంపై విచారణ కూడా చేపట్టింది. సీసీటీవీ ఫుటేజీలో వార్నర్ ఆవేశపడడం, దూకుడుగా వ్యవహరించడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ తో పాటూ ఆటగాళ్లు ఖ్వాజా, టిమ్ పెయిన్ లు వార్నర్‌ని ముందుకు వెళ్లకుండా నెట్టడం కనిపించింది. అయితే అందులో డికాక్ నే వార్నర్ టార్గెట్ చేసినట్టు లేదు. ఈ విషయంపై స్పందించిన క్రికెట్ ఆస్ట్రేలియా.. ఆన్ ఫీల్డ్ అంపైర్లు, రిఫరీలు తగు చర్యలు తీసుకుంటారు అని తెలిపింది..



టాటాల హాకీ బాట

నావల్ టాటా హాకీ అకాడమీ స్థాపన



జంషెడ్‌పూర్: టాటా ట్రస్టులు, టాటా స్టీల్ సంస్థ సంయుక్తంగా హాకీ అభివృద్ధికి నడుకట్టాయి. నావల్ టాటా హాకీ అకాడమీ(ఎన్‌టీహెచ్‌ఏ) పేర హాస్టల్ వసతితో కూడిన శిక్షణా సంస్థను స్థాపించాయి. టాటా గ్రూప్ స్థాపకుడు జంషెడీజీ టాటా ఆశయం మేరకు ఈ శిక్షణా అకాడెమీని స్థాపించారు. 14 నుంచి 16 ఏళ్లున్న బాలురకోసం ఈ అకాడమీని టాటా సంస్థ స్థాపకుడు జంషెడీజీ జన్మ దినోత్సవం మార్చి 3 పురస్కరించుకుని మార్చి2న జరిపిన సంరంభాల్లో భాగంగా టాటా ట్రస్టుల ఛైర్మన్ రతన్ టాటా ప్రారంభించారు. దేశంలో హాకీ క్రీడ అభివృద్ధికి పాటుపడ్డ అదే కుటుంబానికి చెందిన నావల్ హెచ్ టాటా స్మారకార్థం దీనికి పేరు పెట్టారు. అకాడెమీలో హాకీ మైదానం పార్కులతో పాటు ఫుట్‌బాల్ మైదానాలు కూడా ఉన్నాయి. నావల్ టాటా హాకీ అభివృద్ధికి పాటుపడ్డాడని ఆయన తన జీవితంలో కొనసాగించిన క్రీడల అభివృద్ధిని, ఆయన మరణాంతరం కూడా ఆయన జ్ఞాపకార్థం కొనసాగిస్తున్నామని రతన్ టాటా వెల్లడించారు. నావల్‌టాటా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ స్పోర్ట్స్(ఏ ఐసీఎస్) అధ్యక్షుడిగా పనిచేయడమేకాక, భారత హాకీ ఫెడరేషన్(ఐహెచ్ఎఫ్) అధ్యక్షుడిగా 15 ఏళ్లు పనిచేశా డు. అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్(ఎఫ్ఐహెచ్) వైస్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. టాటా నావల్ హాకీ ఆకాడమీలో ప్రపంచ స్థాయి శిక్షణ సౌకర్యా లు కల్పిస్తున్నారు. కృత్రిమ టర్ఫ్ మైదానం, ఫ్లడ్ లైట్ల సౌకర్యం, అంతర్జాతీయ కోచ్‌లు, ఒక పోషకాహార నిపుణుడు, ఫిజిషియన్, సైకాలజిస్టులు కూడా ఈ సంస్థలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారు. ప్రారంభంలో సిందెగా, కుంతి, పశ్చిమసింగ్‌భం జిల్లాల్లోని గ్రామాలకు చెందిన 5000 మంది బాల, బాలికలనుంచి ఎంపిక చేసిన 26 మంది బాలురకు ఈ శిక్షణను అందించనున్నారు. భారతదేశంలో ఈ విధంగా అట్టడుగు స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో హాకీలో శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారి. రానున్న రోజుల్లో జార్ఖండ్ రాష్ట్రం నుంచి 26 మంది బాలికలను ఎంపిక చూసి శిక్షణ ఇవ్వాలని అకాడెమీ నిర్ణయించింది. బొవలేందర్ ఈ అకాడమీకి తొలి సాంకేతిక డైరెక్టర్. అకాడమీలో 52 మంది బాలురకు, 52 మంది బాలికలకు శిక్షణ ఇచ్చే సామర్థ్యం కలిగివుంది.

కుర్రాళ్లు కుమ్మేస్తారా!

దక్షిణాఫ్రికా నుంచి భారత జట్టు ఇలా వచ్చిందో లేదో అప్పుడే నిదహాస్ టోర్నీ ఆడేందుకు శ్రీలంకకు బయల్దేరిం ది. కాకపోతే వచ్చిన జట్టుకు, వెళ్తున్న జట్టుకూ మధ్య చాలా తేడాలున్నాయి. సఫారీలతో పోరాటం చేసింది అతిరథ మహారథులయితే ఇప్పుడు లంకకు బయల్దేరిన మెజారిటీ ఆటగాళ్లు అర్ధరథులే. అదే అంతగా అంతర్జాతీయ అనుభవం లేని కుర్రాళ్లు. అనుభవం లేని వాళ్లైనా ఆడేది మాత్రం వాళ్లకు అలవాటైన టీ20 ఆటే. మరి ఈ కుర్రాళ్లు సత్తా చాటుతారా! టోర్నీ ముగిసేందుకు ఇంకా సమయం వుంది కాబట్టి అంతకంటేముందే నేడు శ్రీలంకతో జరిగే ఆరంభ మ్యాచ్‌లో అదరగొడతారో లేక బెదిరిపోతారో చూడాలి...

- నిదహాస్ ట్రై సిరీస్‌కు కోహ్లీ, ధోని దూరం
- నేడు శ్రీలంక- ఇండియా మ్యాచ్‌తో ప్రారంభం

జట్లు

టీమిండియా: రోహిత్ శర్మ(కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్(వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజువేంద్ర చాహల్, అక్సర్ పటేల్, విజయ్ శంకర్, శార్దుల్ ఠాకూర్, జయదేవ్ ఉనద్కత్, సిరాజ్, రిషబ్ పంత్

శ్రీలంక: దినేశ్ చండిమాల్(కెప్టెన్), సురంగ లక్మల్, ఉపుల్ తరంగ, గుణతిలక, కుశాల్ మెండిస్, దసున్ శంక, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, ఇసురు ఉదానా, అకిల దనంజయ, అమిల అపోంసో, నువాన్ ప్రదీప్, చమీరా, ధనంజయ డిసిల్వా

బలాబలాలు



శ్రీలంక

ఈ మధ్య కాలంలో శ్రీలంక గురించి మాట్లాడాల్సి వస్తే బలాలకంటే బలహీనతల గురించే ఎక్కువ మాట్లాడాల్సి వస్తుంది. జయవర్దనే, సంగక్కరల రిటైర్మెంట్ తర్వాత ఆ జట్టు ఇంకా ప్రత్యామ్నాయ ఆటగాళ్లను వెతుక్కోలేక పోతోంది. దీనికి తోడు బౌలింగ్‌లోనూ మలింగ మునుపటి లా లేకపోవడం, ఆ స్థాయి బౌలర్‌ను లేకపోవ డం పెద్దలోటు. ఇక ఉన్న జట్టులో బలం చూసుకుంటే చండిమాల్ కెప్టెన్సీ. ఉన్న జట్టుతో అద్భుతాలు చేసేందుకు అతను సిద్ధంగా వున్నాడు. తన బ్యాటింగ్ ప్రదర్శనతో సహచరుల్లో స్థైర్యాన్ని నింపగలడు కూడా. అతనికి తోడుగా ఉపుల్ తరంగ, కుశాల్ పెరీరా, గుణతిలక, జీవన్ మెండిస్ లాంటి బ్యాట్స్ మెన్ ఎలాగు వున్నారు. ఇకబౌలింగ్ లో ఆ జట్టు మరీ బలహీనంగా కనిపిస్తోంది. లక్మల్ తప్ప పెద్ద తెలిసిన పేరు కనిపించడం లేదు. అలాంటి బౌలింగ్ లైనప్ ఏ స్థాయి ప్రదర్శన చేస్తుంది అనేది చూడాలి. తొలి మ్యాచ్ కాబట్టి ఈ మధ్య కాలంలో భారత్ జట్టు పేలవ ప్రదర్శన మొదటి మ్యాచ్‌ల లోనే ఎక్కువగా చేస్తుండడం వల్ల శ్రీలంకకు ఆ రకమైన ఆశలు పెట్టుకోవడం తప్ప ఆ జట్టుకు మరో అవకాశం కనిపించడం లేదు.

ఇండియా



రిజర్వ్ బెంచితో కూడా అభేద్యమైన జట్టును తయారు చెయ్యగలిగే జట్లలో ఇండియా ముందు వరసలో వుంటుంది. ప్రపంచ స్థాయి ఆటగాళ్లకు రెస్ట్ ఇస్తే అంతకుమించిప్రదర్శన చేసి ఆకట్టుకునేందుకు బెంచి మీద ఆటగాళ్లు సిద్ధంగా వున్నారు. బ్యాటింగ్ లో రోహిత్, రాహుల్, రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్.. ఇలా ఏ పేరు తీసుకున్నా ఒంటి చేత్తో మ్యాచ్ గెలిపించే వాళ్లే. రిషబ్ పంత్ ఆల్రెడీ అందరికీ తెలిసిన వాడైపోయాడు. కేవలం అంతర్జాతీయ క్రికెట్‌లో ఓ గొప్ప ప్రదర్శన చేసేందుకు ఎదురు చూస్తున్నాడు. బౌలింగ్ లోనూ అంతే. వాషింగ్టన్ సుందర్, చాహల్ తమ స్పిన్‌తో పెద్ద పెద్ద జట్లకు వణుకు పుట్టించగలరు. ఉనద్కత్ గురించి ప్రత్యేకించి అవసరం లేదు. హైదరాబాద్ పేస్ బౌలర్ సిరాజ్ తన పేస్‌తో ఇబ్బంది పెట్టగలడు. ఆల్ రౌండర్ గా సత్తా చాటేందుకు దీపక్ హుడా, బంతితో మెరిసేందుకు శార్దుల్ అందరూ సిద్ధంగా వున్నారు.

ట్రైసిరీస్ ప్రత్యేకత

శ్రీలంకకు స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లయిన సందర్భంగాఆ దేశం నిదహాస్ పేరుతో ట్రైసిరీస్ నిర్వహి స్తోంది. ఇదే పేరుతొ 1998లో 50 ఏళ్ల స్వాతంత్ర్యం సందర్భంగా ఒక ట్రోఫీని నిర్వహించింది సింహళ దేశం. అయితే అపట్లో 50 ఓవర్ల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తే ఇప్పుడు 20 ఓవర్ల క్రికెట్‌కు పరిమితమయింది. 1998లో భారత్, న్యూజిలాండ్, శ్రీలంక జట్ల మధ్య టోర్నీ నడిచింది. అనాడుఫైనల్లో లంక ను ఓడించి భారత్ టోర్నీ కైవసం చేసుకుంది. సచిన్-గంగూలీలు 252 పరుగుల రికార్డు పార్ట్‌నర్‌షిప్‌తో ఆనాటి విజయంలో కీలకపాత్ర పోషించారు. 128 పరుగులు చేసిన సచిన్ తన 7000 పరుగుల మైలురాయిని ఆ మ్యాచ్ లోనే చేరుకోవడం విశేషం. అంతా బాగుందికానీ ఎప్పుడూ క్రికెట్‌తో బిజీగా వుండే భారత్ మాత్రం స్వాతంత్ర్యాన్ని గుర్తు చేసుకుంటూ క్రికెట్ టోర్నీలు నిర్వహించిన చరిత్ర కనిపిం చకపోవడం బాధాకరం.



ఇండియానే ఫేవరేట్: లంక కోచ్



సెకండ్ గ్రేడ్ టీమ్‌తో ఆడుతున్నప్పటికీ ట్రై సిరీస్‌లో ఇండియానే ఫేవరేట్ అని శ్రీలంక కోచ్ హతూరిసింఘా అభిప్రాయపడ్డాడు. 'ర్యాంకింగ్స్ ప్రకారం చూసుకుంటే ప్రస్తుతం ఇండియానే నెంబర్‌వన్. ఇప్పుడు ఆ జట్టు తరపున ఎవరు ఆడుతున్నారు అనేది పెద్ద విషయం కాదు. ఎవరాడుతున్నారు అనేదాంతో సంబంధం లేకుండా ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన చేయగలదు' అని ఆయన వ్యాఖ్యానించారు. భారత జట్టు కోహ్లీ, ధోని లే గాక స్ట్రైక్ బౌలర్లు భువనేశ్వర్, బుమ్రాలు లేకుండానే లంక పర్యటనకు బయల్దేరనున్న విషయం తెలిసిందే.

ఏంటీ డీ స్పోర్ట్స్?

డిస్కవరీ స్పోర్ట్స్ పేరు తోడిస్కవరీ కమ్యూనికేషన్స్ సంస్థగత ఏడాది మార్చిలో కొత్తస్పోర్ట్స్ చానెల్ ను లాంచ్ చేసింది. ఇప్పుడు అదే చానెల్ ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంకల మధ్య జరగనున్న ట్రైసిరీస్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ కొత్త కొత్త స్పోర్ట్స్ చానెల్స్ కారణంగా భారత క్రికెట్ ప్రేమికులు ఎన్నో రకరకాల చానెల్స్ చూడాల్సి వస్తోంది. అంతకుముందు నియో స్పోర్ట్స్ అనీ..తర్వాత స్టార్ స్పోర్ట్స్ అనీ.. ఐపీఎల్ అయితే సెట్ మ్యాక్స్ అనీ.. విదేశాల్లో ఆడితే టెన్ క్రికెట్ అనీ, లేదా సోనీ ఈఎస్‌పీఎన్ అనీ.. ఇలా రకరకాల చానెల్స్ అన్నీ చూడాల్సి వస్తోంది. ఇప్పుడు అదే వరసలో డీ స్పోర్ట్స్ కూడా చేరింది. ఏమైనా మామూలు క్రికెట్ ప్రేమికులకు డీస్పోర్ట్స్ కొంచెం కొత్తగా అనిపించినా.. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్, పాకిస్తాన్ ప్రీమియర్ లీగ్ లాంటి లీగ్‌లను కూడా ఫాలో అయ్యే బెట్టింగ్ రాయుళ్లకు ఇలాంటి చానెల్స్ బాగానే పరిచయం. 2017లో బుల్లితెర మీదకొచ్చిన ఈ చానెల్ గతంలో పాకిస్తాన్ ప్రీమియర్ లీగ్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్, ఇండిపెండెంట్ లీగ్ కొన్ని క్రికెట్ టోర్నీలను మాత్రమే ప్రసారం చేసింది.

ట్రై సిరీస్ షెడ్యూల్

మార్చి 6	శ్రీలంక-ఇండియా
మార్చి 8	ఇండియా-బంగ్లాదేశ్
మార్చి 10	బంగ్లాదేశ్-శ్రీలంక
మార్చి 12	ఇండియా-శ్రీలంక
మార్చి 14	ఇండయా-బంగ్లాదేశ్
మార్చి 16	బంగ్లాదేశ్-శ్రీలంక
మార్చి 18	ఫైనల్

- అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 7 గంటల సమయానికే ప్రారంభం అవుతాయి.
- 7 మ్యాచులకు కొలంబోలోని ప్రేమదాస స్టేడియమే వేదిక కానుంది.

ఆనంద్‌కు మరో టైటిల్

- తాల్ మెమోరియల్ ర్యాపిడ్ చెస్



మాస్కో: చెస్ రారాజు విశ్వనాథన్ ఆనంద్ మరో అంతర్జాతీయ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మాస్కోలో జరుగుతున్న తాల్ మెమోరియల్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ఫైనల్ రౌండ్ ముగిసే సరికి అత్యధికంగా ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఫైనల్ రౌండ్లో ఇజ్రాయెల్‌కు చెందిన బోరిస్ గెల్ఫాండ్ రూపంలో బలహీన ప్రత్యర్థి లభించడంతో ఆనంద్ పని మరింత సులువైంది. మొత్తం టోర్నీలో చదరంగ విశ్వనాథుడు మూడో రౌండ్‌లో అజర్‌బైజాన్ కు చెందిన మామెదరోవ్ చేతిలో మాత్రం ఓటమి చవిచూశాడు. అయితే అంతకు ముందు రెండు విజయాలతో పాటూ.. మరో రెండు విజయాలతో ఫైనల్ రౌండ్ కు చేరుకుని 9 పాయింట్లకు గానూ 6 పాయింట్లు సాధించి టైటిల్ సాధించాడు. ఆనంద్ ను ఓడించిన మామెదరోవ్, మరో ఆటగాడితో పాటూ 5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు.

ధోనీతో జట్టుకట్టిన డ్రీమ్11

బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక



రిటైర్మెంట్‌కు దగ్గరగా వచ్చినా ధోని బ్రాండ్ వాల్యూ మాత్రం తగ్గలేదు. ధోనీని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించు కనేం దుకు కంపెనీలు క్యూలు కడుతున్నా యి. తాజాగా ఈ వరసలో డ్రీమ్11 అనే ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ చేరింది. ధోనీని బ్రాండ్ అంబాసిడర్ గా నియమిస్తూ... 'మా యూజర్లు ప్రతి ఒక్కరూ ధోనిలాంటి ఆలోచనా విధానాన్ని కోరుకుంటారు. అందుకే డ్రీమ్ 11 బ్రాండ్‌కు ధోని మాత్రమే సరైన వ్యక్తిగా భావిస్తున్నాం' అని కంపెనీ తెలిపింది. డ్రీమ్11 ఐపీఎల్ సమయంలో ఫాంటసీ లీగ్‌లు నడుపుతూ యువతకు బాగా చేరువైంది. ఫాంటసీ లీగ్‌లో యూజర్లకు తమకు నచ్చిన జట్టును ఎంచుకునే అవకాశం వుంటుంది. నచ్చిన జట్టును ఎంపిక చేసుకునే ఆ జట్టు మీద పందెం కాసేందు కు అవకాశం వుంటుంది. ఇది ఒకరకమైన బెట్టింగ్ వెబ్ సైట్ అని చెప్పొచ్చు. మరోవైపు ధోని ఓ చాక్లెట్ కంపెనీ యాడ్‌లో కనిపిస్తూ కనువిందు చేస్తున్న సమయంలోనే మరో కంపెనీ అతడిని బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకోవడం, అది కూడా ఓ బెట్టింగ్ సైట్ కావడం విశేషం.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మీ ట్విట్టర్, ఫేస్‌బుక్, ఫోర్‌స్క్వేర్, టంబ్లర్, ఫ్లికర్ వంటి ఇతర సామాజిక మాధ్యమాల ఖాతాలకు లింక్ లేదా అనుసంధానం చేసుకోవచ్చు. మీరు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టే ప్రతిసారి ఫోటోను, పోస్టును అన్ని నెట్‌వర్క్‌లకు లేదా ఎదైనా మరొక మాధ్యమానికి కూడా షేర్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యక్తిగత మరియు ఒరిజినల్ ఫోటోలు, వీడియోలు పెడితేనే ఫాలోవర్స్ హర్షిస్తారు. ఫేస్‌బుక్ పబ్లిక్ నోటిస్ బోర్డు అయితే ఇన్‌స్టాగ్రామ్ మన ఫోటో ఆల్బమ్ లాంటిది. ఇక ఇన్‌స్టాగ్రామ్‌ను ఎలా ఉపయోగించాలో చూద్దాం.

ఫోటోలు: మీరు లాగిన్ ఐన వెంటనే అప్రమేయంగా / డిఫాల్ట్‌గా మీ మొబైల్ కెమెరాని సక్రియం చేస్తుంది, కాబట్టి మీరు ఫోన్‌లో ఉన్న ఫోటో ఎంచుకోవచ్చు లేదా అప్పటికప్పుడే తాజాగా ఫోటో తీసుకొని పెట్టొచ్చు. ఒకసారి మీరు ఫోటో తీసిన లేదా ఎంపిక చేసుకున్న తర్వాత పదిహేనుకు పైగా ప్రసిద్ధ ఇన్‌స్టాగ్రామ్ ఫిల్టర్‌లలో ఏదో ఒకటి ఎంచుకొని ఎడిట్ చేసి పోస్ట్ చేయొచ్చు. ప్రత్యేకమైన ఫోటోల కోసం పనోరమాలు, వ్యక్తిగత చిత్రాలు, తీవ్రమైన రంగులు, నిర్దిష్ట ఫిల్టర్‌లు మొదలైన వాటిని ఫోటోను బట్టి ఎంచుకొని ఎడిట్ చేయొచ్చు. ప్రతీ ఫోటోకు అనుబంధ బోర్డర్ ఎంచుకోవాలి.

వీడియోలు: ఇన్‌స్టాగ్రామ్‌లో మీరు మూడు నుండి పదిహేను సెకన్ల వరకు చిన్న వీడియో క్లిప్‌లను రికార్డ్ చేయవచ్చు లేదా అప్పటికే ఫోన్లో ఉన్న వీడియోలను ఉపయోగించవచ్చు.

డిస్క్రిప్షన్: మీరు కోరుకుంటే, మీ ఫోటోలు, వీడియోలకు వృత్తాంతం, లేదా ఫాలోవర్‌లు ఆస్వాదించగల ఏదైనా డిస్క్రిప్షన్ వివరిస్తూ...దానిని జోడించవచ్చు.

హ్యాష్ టాగ్: మీ పోస్ట్‌కు ఫోటో, వీడియోలకు సంబంధించిన ప్రత్యేక వర్గం హ్యాష్ టాగ్‌లను జోడించవచ్చు మరియు ...ఎట్ ది రేట్ ఆఫ్ అనే సింబల్ (@)ఉపయోగించి ప్రత్యేక వ్యక్తులను ట్యాగ్ చేయవచ్చు.

లొకేషన్: ఫోనులో లొకేషన్ ఆప్షన్ బట్టి మీరు పెట్టే ఫోటో లొకేషన్, స్థలం, ఊరు వివరాలు కూడా ఫోటో, వీడియోకు ఆటోమేటిక్‌గా జోడించే అవకాశం ఉంది.

ఫాలోవర్స్/ఫాలోవింగ్: ఇప్పటికే ఇతర సోషల మీడియాలో మీకున్న ఫ్రెండ్స్, ఫాలోవర్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా అనుసరించడానికి వీలుగా సెర్చ్ ఆప్షన్ ఉపయోగించుకోవచ్చు. మీ ప్రొఫైల్ ట్యాబ్‌కు వెళ్లి, 'స్నేహితులను కనుగొనండి' ఆప్షన్‌ను ఎంచుకోండి. వారి ఫేస్‌బుక్ మరియు ట్విట్టర్ ఖాతాలను ఇన్‌స్టాగ్రామ్‌కు కనెక్ట్ చేసిన స్నేహితుల కోసం మీరు శోధించవచ్చు. మీరు కొంతమందిని అనుసరిస్తే, మీ ఫీడ్‌లో వారి ఫోటోలను చూస్తారు, ఇది నావిగేషన్ ప్యానెల్లో ఎడమ వైపున కనిపించే హోమ్ చిహ్నాన్ని క్లిక్ చేయడం ద్వారా వీలవుతుంది. మీ ఫ్రెండ్స్, ఫాలోవర్స్ ఫోటోలతో పాటు, ఫోటోను లైక్ కొట్టిన లేదా కామెంట్ చేసిన వ్యక్తులను మీరు చూసి, వారిని ఫాలో అవ్వొచ్చు. ఆర్టికల్ ప్రారంభంలో చెప్పుకున్నట్లు.. ఎన్ని సామాజిక మాధ్యమాలున్నా ఎంత మంది ఫోటోలు పెట్టినా ఇంద్రజ(శ్రీదేవి) లేని లోటు కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఆమె లేని లోటు కొంతైనా తీర్చుకోవాలంటే..ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పటివరకు పంచుకున్న ఫోటోలను చూడాల్సిందే!

రాశి తక్కువ..వాసి ఎక్కువ!

అసలు విషయానికి వస్తే....ఇన్‌స్టాగ్రామ్ అనేది కేవలం ఒక ఫోటో షేరింగ్ సోషల్ నెట్‌వర్కింగ్ యాప్. ఇది ఖాతాదారులు తీసుకొన్న ఫోటోలని ఫిల్టర్లతో ఎడిట్ చేసి వివిధ రంగులు, షేడులు, బోర్డర్లు, లైటింగ్ లాంటివి హెచ్చుతగ్గులను సవరించడానికి వీలు కల్పిస్తుంది. ఇన్ స్టాగ్రామ్‌లో ప్రపంచం మొత్తం మీద ఎక్కువ ఫాలోవర్స్ ఉన్న సెలబ్రెటీలు సెలెనా గోమ్స్. ఆమెకి కోటి ముప్పై లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇక క్రిస్టియానో రొనాల్డోకు కోటి ఇరవై లక్షలు, బియోన్స్ మరియు కిమ్ కర్దాషియన్‌లకు కోటి మంది పైనే ఫాలోవర్స్ ఉన్నారు. మన బాలీవుడ్, టాలీవుడ్ స్టార్‌లకు పది నుంచి ముప్పై లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా, యువతపై ఫేస్‌బుక్ తక్కువ ప్రభావం చూపడంతో అసలు కారణం ఆరా తీయగా తెల్సిందేమిటంటే యువతీ యువకులు ఇన్‌స్టాగ్రామ్ మోజులో పడ్డారని! అది చాలా సింపుల్‌గా ఉపయోగించొచ్చని మరియు ఎంగేజ్‌మెంట్ విషయంలో ఏ సోషల్ మీడియా యాప్ అయినా దాని ముందు బలాదూర్ అని. ఇది తెలుసుకున్న యాజమాన్యం ఫేస్‌బుక్ మనుగడకు ముప్పు వాటిల్లిందని తెలుసుకొని జేబులనిండా బిలియన్ అమెరికన్ డాలర్లు డబ్బులు కుక్కుకొని వెళ్లి ఇన్‌స్టాగ్రామ్‌ని కొనేశారు. ఆలా ఇన్ స్టాగ్రామ్ ప్రస్తుతం ఫేస్‌బుక్ గూటిలోకొచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ యొక్క ఏకైక ప్రయోజనం, ఉద్దేశం ప్రయివేటు ఫోటోలు, వ్యక్తిగత వీడియోలు పోస్ట్ చేయడానికి మరియు వీక్షించడానికి. మరో విషయం ఇన్‌స్టాగ్రామ్ మొబైల్ అప్లికేషన్ ఆధారిత యాప్. ఈ మధ్య వెబ్‌లో కూడా ప్రారంభించినా కేవలం తిలకించొచ్చు కానీ ఫోటోలు పోస్ట్ చేయడం కుదరదు. ఫేస్‌బుక్‌లో సాధారణంగా తెలిసిన స్నేహితులు ఫ్రెండ్స్‌గా ఉంటారు. మనం వాళ్ల కొత్తగా పెట్టిన ఫోటోలు, వీడియోలు, లింకులపై లైక్ కొడతాము. పోస్టులపై అభిప్రాయం వ్యక్తం చేస్తాము. పుట్టినరోజు, పెళ్లిరోజుకు అభినందనలు తెలుపుతాము. వాళ్ల ఫేస్‌బుక్ గోడలపై మనకొచ్చిన వాటిని ఫార్వర్డ్ పెట్టి టాగ్ కూడా చేస్తాము. ఫేస్‌బుక్ కంటెంట్ ఆధారితమైంది.... ఎన్నో విషయాలు కోసం ఉపయోగించొచ్చు. ఫేస్‌బుక్ 100 రకాల తిండి పదార్థాలు గల ఒక రెస్టారెంట్ లాంటిది. కానీ ఇన్‌స్టాగ్రామ్ మెక్ డోనాల్డ్స్ లాంటిది. వెళ్ళేవాళ్ళు బర్గర్లు తప్ప ఇంకోటి ఆశించరు. ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన ఫోటో ప్లయిన్ వెనిల్లా ఐస్క్రీమ్ లాంటిది. ఇన్‌స్టాగ్రామ్‌లో మన ఫోటోని రంగులద్ది, ముస్తాబు చేసి ఆకర్షణీయమైనదిగా తీర్చిదిద్దొచ్చు, కాబట్టి అది టాపింగ్స్, నట్స్, జెమ్స్, డ్రై ఫ్రూట్స్, హాట్ చాకలెట్ వేసిన ఐస్‌క్రీం లాంటిది. మరో ముఖ్యమైన విషయం, ఫేస్‌బుక్ ఒక కలగూర గంప కావడం వలన అక్కడ క్లట్టర్ ఎక్కువ. మనం పెట్టిన పోస్ట్, ఫోటో మన ఫ్రెండ్స్ అందరి ఫీడ్లో కనిపించదు. అందుకే ఎంగేజ్‌మెంట్ అంటే లైక్లు, షేర్లు, కామెంట్లు లాంటివి తక్కువుంటాయి. మనకి 1000 ఫ్రెండ్ ఉంటే ఫేస్‌బుక్ అల్గోరితం కేవలం 100 మంది ఫీడ్లో మన పోస్ట్ కనిపించేలా చేస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో క్లట్టర్ ఉండదు. కంటెంట్ పరమైనది కాదు. కేవలం మీ ఫోటో వీడియోలు పెట్టి మీ మానానా మీరు వెళ్లిపొండ్రా అంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అల్గోరితం లేకుండా మీ ఫాలోవర్స్ పెట్టిన ఫోటోలు వీడియోలు పోస్ట్ చేయబడ్డ టైమ్ ప్రకారం వరుస క్రమంగా మీకు కనబడతాయి. కాబట్టి ఇన్‌స్టాగ్రామ్‌లో ఎక్కువ లైకులు, కామెంట్లు అందుకోవడానికి అవకాశమెక్కువ.

గత శనివారం జాము రాత్రి, జాబిలమ్మ ఆఖరిపోరాటం సలిపి మానవులందర్నీ వదిలి పెట్టి వెళ్లిపోయినపుడు యావత్ ప్రపంచం దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. అయితే అతిలోకసుందరి అంతకు ముందు రోజు ఇన్ స్టాగ్రామ్‌లో పెట్టిన ఫోటోలు చూసుకొంటూ కొంతమంది కలత చెందారు. మరికొందరు కన్నీళ్లపర్యంతమయ్యారు. కెమెరా బయట శ్రీదేవి చాలా నెమ్మదస్తురాలు. ఎక్కువ మాట్లాడరు అంటారు. కానీ ఆమె సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్‌లో చాలా యాక్టీవ్‌గా ఉండేవారు. తన కుటుంబం యొక్క చిత్రాలను ఆవిడ అభిమానుల కోసం, ఫాలోవర్స్ కోసం పోస్ట్ చేసేవారు. మరో పక్క కేరళ కుట్టి ప్రియా ప్రకాష్ వారియర్ తొలిసారి నటించిన సినిమాలోని ఒక పాటను సోషల్ మీడియాలో పెట్టి..రాత్రికి రాత్రే...ఇంటర్నెట్ లో సంచలనం సృష్టించింది. ప్రియా ప్రకాష్ వారియర్ కేవలం తన కనుసైగలతో అక్షరాలా నాలుగు రోజుల్లోనే 11 లక్షల ఇన్‌స్టాగ్రామ్ అభిమానుల హృదయాలను గెల్చుకొన్నారు. కను సైగలతో కుర్రకారును కవ్వించిన వీడియో వైరల్ అవ్వకముందు... ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అమె 2000 కన్నా తక్కువ మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉండేవారు. కానీ ఇప్పుడు ఆమె ఫాలోవర్స్ లక్షల్లో ఉన్నారంటే ఆతిశయోక్తి కాదు. ఇది ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌కు ఉన్న క్రేజీ!

ఇంద్రజ ఇష్టపడిన ఇన్‌స్టాగ్రామ్!



శ్రీదేవి పోస్టు చేసిన ఫోటో..!

ఎంగేజ్ మెంట్ కింగ్ ఇన్‌స్టాగ్రామ్!

ఫేస్‌బుక్ మాత్రమే కాదు కానీ ప్రతి ఇతర సోషల్ మీడియా ఛానల్ కన్నా ఇన్ స్టాగ్రామ్‌లో ఎంగేజ్‌మెంట్ ఎక్కువ. ఒక అధ్యయనం ప్రకారం, పది సోషల్ నెట్ వర్కింగ్ సైట్‌లలో ముప్పై లక్షల ఖాతాదారుల పరస్పర చర్చలను చూస్తే... ఫేస్‌బుక్ మరియు ట్విట్టర్లతో సహా.. పది సోషల్ మీడియా సైట్‌లలో ఒక శాతం కన్నా తక్కువ ఎంగేజ్‌మెంట్ కాగా... ఇన్ స్టాగ్రామ్‌కి నాల్గు శాతం ఉంది. అలాగని ఇన్‌స్టాగ్రామ్ సోషల్ మీడియా రారాజు అని అనుకొంటే పప్పులో కాలేసినట్లే. ఒక ఫోటోలకే ఇది పరిమితం. ఫేస్‌బుక్ కంటే ఇన్ స్టాగ్రామ్‌లో ఎల్లప్పుడూ ఎక్కువ లైకులు పొందలేరు. సోషల్ మీడియాలో మీ ఫాలోవర్లు, యూజర్లు ఏమి కోరుకొంటారు? ఏది ఇష్టపడతారు? వాటి మీద ఆధారపడి లైకులు వస్తాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోకు చాట భారతం అంత డిస్క్రిప్షను రాస్తే నచ్చరు. చేంతాడంత పోస్ట్ మీ అభిమాన నటి మీద రాస్తే చదవరు. ప్రతి సోషల్ మీడియా సైట్‌కి ఒక ప్రత్యేకత, అసాధారణ గుణం, ప్రయోజనం ఉంటుంది, అనేక విభిన్న అంశాలు ఉంటాయి. అందుకే మీ ఫ్రెండ్స్, ఫాలోవర్స్ ఏ నెట్‌వర్క్ దేనికోసం ఎలా ఉపయోగిస్తారో గమనించాలి. తదనుగుణంగా పోస్టులు ఆయా సామాజిక మాధ్యమాలలో పంచుకోవాలి. ఫేస్‌బుక్ ఎక్కువగా సమాచారం, టెక్స్ట్, డేటా, కంటెంట్‌తో కూడినది. ఇన్‌స్టాగ్రామ్‌లో కంటెంట్ కొంచెం ఉన్నా అది ఒరిజినల్ మాత్రమే, ఫార్వార్డ్, కాపీ పేస్ట్ లాంటివి అసలు ఉండవు. ఇది ఖాతాదారులకు అత్యంత సందర్భోచిత కంటెంట్‌ను, ఫోటోలను సూచిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు అప్రమేయంగా పబ్లిక్‌గా సెట్ చేయబడతాయి. కానీ మీరు సెట్టింగ్స్‌లో ప్రైవేట్ అని ఎన్నుకోవచ్చు. ఆ సందర్భంలో.. మీరు ఆమోదించిన ఫాలోవర్స్ మాత్రమే మిమ్మల్ని అనుసరిస్తారు. మీ ఫోటోలను చూడగల్గుతారు. మీ ప్రొఫైల్ ట్యాబ్‌లో ప్రైవసీ లోకి వెళ్లి ఎన్నో ఇతర సెట్టింగులు చేయొచ్చు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ప్రారంభించాక అక్కడ మీ ప్రొఫైల్ చిత్రాన్ని అప్‌లోడ్ చేసి, మీ గురించిన ప్రొఫైల్ సమాచారాన్ని, 150 అక్షరాలలో రాయొచ్చు. ఇన్‌స్టాగ్రామ్ మొబైల్ యాప్ కావున ఇది సాపేక్షంగా ఏకాంత సామాజిక అనువర్తనం. కాకపోతే మీ





- సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్



గెలాక్సీ ఎస్9 స్మార్ట్ ఫోన్ ఫీచర్లు

- ఐపీ 68 సర్టిఫైడ్ వాటర్,డస్ట్ రెసిస్టెన్స్
- 5.8 అంగులాల కర్వ్‌డ్ ఎమోలెడ్ డిస్‌ప్లే
- ఆండ్రాయిడ్ 8.0 ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్
- 4జీ ర్యాం..64జీబీ/128 జీబీ/256 జీబీ స్టోరేజ్ సౌకర్యం
- 12 మెగా పిక్సల్ బ్యాక్ కెమెరా, 8మెగా పిక్సల్ ఫ్రంట్ కెమెరా
- 400జీబీ వరకు మైక్రో ఎస్‌డీ కార్డు సపోర్ట్ చేస్తుంది.
- 3000ఎంఏహెచ్ సామర్థ్యం ఉన్న బ్యాటరీ(వైర్‌లెస్ చార్జ సపోర్ట్)

గెలాక్సీ ఎస్9-ప్లస్ స్మార్ట్ ఫోన్ ఫీచర్లు

- ఐపీ 68 సర్టిఫైడ్ వాటర్,డస్ట్ రెసిస్టెన్స్
- 6.2 అంగులాల కర్వ్‌డ్ ఎమోలెడ్ డిస్‌ప్లే
- ఆండ్రాయిడ్ 8.0 ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్
- 6జీబీ ర్యాం.64జీబీ/128 జీబీ/256 జీబీ స్టోరేజ్ సౌకర్యం
- 12 మెగా పిక్సల్ బ్యాక్ కెమెరా, 8మెగా పిక్సల్ ఫ్రంట్ కెమెరా
- 400జీబీ వరకు మైక్రో ఎస్‌డీ కార్డ్ సపోర్ట్
- 3500ఎంఏహెచ్ సామర్థ్యం ఉన్న బ్యాటరీ

శ్యాంసంగ్ నుంచి రెండు కొత్త మోడల్ స్మార్ట్ ఫోన్లు

శ్యాంసంగ్ కంపెనీ మరో రెండు గెలాక్సీ మోడల్ స్మార్ట్ ఫోన్‌లను లాంచ్ చేసింది.గెలాక్సీ ఎస్9, గెలాక్సీ 9- ప్లస్ ..మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేసింది. అయితే ఇండియన్ మార్కెట్లోకి ఎప్పుడు వస్తుందన్న విషయం ఖచ్చితంగా తెలియదు. కాని ఈనెల 16 నుంచి భారతీయ మార్కెట్లో ఈ రెండు మోడళ్లు అందుబాటులోకి వస్తాయన్నది విశ్వసనీయ సమాచారం. కొత్తగా విడుదల చేసిన ఈ స్మార్ట్ ఫోన్లలో ఫేస్ రికగ్నిషన్, అగ్ మెంటెట్ రియాలిటీ(ఎఆర్) ఎమోజీ పిక్చర్స్ కూడా ఉన్నాయి. ఇక ధరల విషయానికి వస్తే శ్యాంసంగ్ గెలాక్సీ ఎస్8,అండ్ గెలాక్సీ ఎస్8- ప్లస్ కంటే అధికంగా ఉండే అవకాశాలున్నాయి. గెలాక్సీ ఎస్9, ధర 60,000 రూపాయలు, గెలాక్సీ ఎస్ 9-ప్లస్ ధర 70,000 రూపాయలు ఉండవచ్చని అంచనా. ఆకర్షణీయమైన లుక్కుతో మార్కెట్లోకి అడుగుపెట్టిన ఈ రెండు మోడళ్లు మిడ్‌నైట్ బ్లాక్, టైటానియం గ్రే, కోరల్ బ్లూ మరియు పర్పుల్ రంగుల్లో లభ్యమవుతాయి. ఇక ఫీచర్ల విషయానికి వస్తే.....


న్యూజనరేషన్ కోసం ఆడి ఏ6!



రోజుకు సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతోంది. దానిని అందిపుచ్చుకుని వివిధ రంగాలలో నూతన ఆవిష్కరణలు వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా ఆటోమోబైల్ రంగం కొత్తకొత్త మోడళ్లలో కార్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. జర్మన్‌కు చెందిన ఆడి కార్ల కంపెనీ న్యూజనరేషన్ కారును మార్కెట్లోకి పంపేందుకు సర్వం సిద్ధం చేసింది. వచ్చే ఏడాది ప్రారంభంలో న్యూజనరేషన్ కారు ఆడి ఏ6 రోడ్లమీదికి రానుంది. 2019 మోడల్ ఆడిఏ6ను అంతకు ముందు వచ్చిన కార్లకు కంటే అధికంగా.. విలాసవంతమైన సౌకర్యాలు జోడించి తయారు చేశారు. కారు లోపల బయట ఆకర్షణీయంగా డిజైన్ చేసారు. ఆడి ఏ6 .. డిజిటల్ ఎంఎంఐ టచ్ రెస్పాన్స్ సిస్టమ్, సున్నితమైన సస్పెన్షన్, మెరుగైన క్రీడా తత్వంతో రాబోతోంది. ఈ కారులో లెవల్ 3 అటానమస్ ఫీచర్లు అదనం. డిజైన్ మరియు స్టైలింగ్ విషయానికి వస్తే ఏ8 మరియు ఏ7 ఆడికార్ల మేలు కలయికగా ఏ6 ఆడికారును రూపొందించారు. కారు అంతర్భాగం విశాలవంతంగా, స్మార్ట్ ఎడ్జెస్‌తో స్ట్రైకింగ్ లైన్స్‌తో ఆకర్షణీయంగా ఉంటుంది. తేలిక బరువుండే అల్యూమినియంతో వీల్ సస్పెన్షన్ రీడిజైన్ చేసారు. దీని ముందు axle కు అల్యూమినియంతో తయారు చేసిన క్లిప్స్ బ్రేకులను అమర్చారు. కొత్త ఆడి ఏ6 లాంగ్ వీల్ బేస్, షార్ట్ ఓవర్‌హ్యాంగ్స్ బ్యాలెన్స్ తదితర సౌకర్యాలతో మొత్తానికి స్పోర్టీ ప్రపోర్షన్స్‌తో విలాసవంతంగా తయారైంది. దీని డిజైన్ కారణంగా ఎత్తు తగ్గిందన్న భావనను కల్గిస్తుంది. దీని వెనుక వీల్స్ పెద్దగా ఉన్నప్పటికి రైడ్ అండ్ శబ్దం విషయంలో కంఫర్ట్‌గా ఉంటుంది. అధునాతన టెక్నాలజీతో విలాసవంతమైన, ప్రయాణానికి సౌకర్యవంతమైన ఫీచర్లతో కొత్త ఆడి6 2019లో మన ముందుకు రానుంది. ఇది 5.1సెకన్లలో 100కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఇక దీని టాప్ స్పీడ్ గంటకు 250 కిలోమీటర్లు!

కొత్త రీచార్జ్ ఆఫర్ ప్రకటించిన ఎయిర్‌టెల్


ఎయిర్ టెల్ ..తన ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం మరో కొత్త రీచార్జ్ ఆఫర్‌ను ప్రకటించింది. 995 రూపాయలప్రీపెయిడ్‌తో 180 రోజుల వరకు అన్ లిమిట్ కాల్స్(లోకల్ మరియు ఎస్టీడీ) చేసుకోవచ్చు. అంతే కాకుండా నెలకు 1జీబీ (3జీ / 4 జీ) డాటా కూడా వినియోగించుకునే సౌకర్యం కల్పించింది. అంటే మూడు నెలల వ్యవధిలో 6జీబీ డాటా వాడుకునేందుకు వీలుంది. ఈ ప్లాన్ కింద అదనంగా రోజుకు ఉచితంగా 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఈ ప్రీపెయిడ్ ప్లాన్ ఢిల్లీ-ఎన్‌సీఆర్, తెలంగాణ,తమిళనాడు, మరియు దేశంలోని అన్ని సర్కిళ్లకు ఈ ప్లాన్ వర్తిస్తుంది. అదే విధంగా 999రూపాయల ప్రీపెయిడ్ ప్లాన్ కూడా ఎయిర్ టెల్ ప్రకటించింది.దీని కాల వ్యవధి 90రోజులు. ఈ మూడునెలల వ్యవధిలో అన్‌లిమిట్ వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. రోజుకు 100ఉచిత ఎస్ఎంఎస్‌తో పాటు 60 జీబీ (3జీ / 4 జీ) డాటా వాడుకోవచ్చు. రిలయన్స్ జియో 999రూపాయల ప్లాన్‌కు ధీటుగా, తన వినియోగ దారుల దృష్టి అటువైపు మళ్లకుండా.. ఎయిర్ టెల్ దీనిని ప్రకటించిందని మార్కెట్ వర్గాల విశ్లేషణ.



చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అభిషేకం



(గత సంచిక తరువాయి భాగం)

3-7-47

'వారు భయకంపితులై సర్వాధికారికి సర్వం నివేదిస్తే ఆ వేళకాగది ప్రక్కకు ఎవ్వరూ పోరాదని శాసించారు.

ఆరోజుల్లోనే మరొకటి జరిగింది. పూర్వం మధ్యాహ్న భోజనానంతరం గూడా ఎండలో కొండకు వెళ్లి వచ్చే వారు గదా భగవాన్. తిరిగి వచ్చేటప్పుడు హాలు వద్ద గచ్చుమీదికి వచ్చి వెనుక వెంటనున్న వారు చెంబుతో నీళ్ళిస్తే కాళ్లు కడుక్కొని లోపలకు వెళ్లే వారు. కొందరు చాటుగా కాచుకొని వుండి వారటు హాల్లోకి వెళ్లగానే ఈ నీళ్ళు తలమీద ప్రోక్షించుకునేవారు. గాలించుట కారంభిస్తే నలుసులన్నీ బయట పడవలసిందే గదా? భగవాన్ ఇదీ గమనిస్తూనే ఉన్నారు కాబోలు. ఒకదినం మధ్యాహ్నం బహుకాలంగా ఉంటూ ఉన్న భక్తులొకరీ జలం శిరస్సున చల్లుకోటం కిటికీలోంచి చూచారు. సమయం చిక్కిందని పట్టుకున్నారిక. "అదుగో, అవే చేష్టలు. ఎందుకెందుకని చూచీ చూడనట్లూరు కుంటే మితిమీరుతున్నది. ఎన్నాళ్లున్నా, ఎన్నిసార్లు విన్నా ఒక్కొక్కరికీ, ఈ చేష్టలు పోవే! ఏం పని యిది? ఇక కాళ్లు కడుక్కోటమే మానేస్తాను తెలిసిందా?" అని గట్టిగా మందలించారట. ఆ భక్తుడు నిర్విణ్ణుడై దుఃఖించి, లజ్జించి వెంటనే భగవానుని సన్నిధికి వెళ్లి క్షమాపణ చెప్పుకున్నాడు.

భగవాన్ వారినట్లు మందలించుటేగాక మర్నాటి నుండీ కాళ్ళు కడుక్కోననటం, సేవకులు బ్రతిమలాడటం జరిగిందట. నేనప్పుడు టవున్‌లో ఉండటం వల్ల, వెంటనే ఈ సంగతి తెలియలేదు. నాల్గురోజులు గడిచిన వెనుకెవరో భిక్ష చేసి నన్ను భోజనానికి పిలిచారు. భోజనం చేసి అక్కడే ఉండి పోయినాను. భగవాన్ యథాప్రకారం కొండ దిగి వస్తున్నారు. సాధనలో ఏదో సందేహం వుండి, వచ్చి కూర్చున్న వెనుక, సావకాశంగా ఉంటుంది గదా అడగవచ్చునని హాలుకు వెలుపల పడమర దిక్కున ఉన్న కిటికీ వద్ద నిలుచున్నాను. ఎప్పుడైనా అట్లా అడగటం కద్దు. ఇప్పుడేమయిందను కున్నావ్. ఎప్పుడూ తూర్పుగా మళ్లేవారు. ఆనాడు నేనున్న వైపునకే తిరిగారు భగవాన్. జంకుతూనే ఒదిగి దోవ ఇచ్చాను. కొరకొరా నాకై చూచారు. గజగజా వణికాను. ఎందుకట్లా చూచారో తెలియలేదు. కిటికీ దాటి మలుపు తిరగబోతుంటే, కాళ్ళకు నీళ్లు ఈయబోయినారు సేవకులు. వద్దని గద్దించారు భగవాన్. "ఎండలో వచ్చారే స్వామీ" అని వారంటే, "ఒస్తే ఏమయ్యా. మనం శుభ్రతకై చూస్తే, ఆ నీళ్ల నిమిత్తం ఎందరో కాచుకొని ఉంటారు. చాలు చాలును, కావాలంటే నీవు కడుక్కో" అంటూ హాల్లో ప్రవేశించారు భగవాన్. మనవల్ల ఏమైనా అపచారం వచ్చిందా యేమి అన్న భయంతో నా సందేహం నావద్దనే ఉంచుకొని వెళ్లానవతలకు. సాయంత్రం సమీపవర్తులను విచారించి సమాచారం తెలుసుకొన్న వెనుక నా మనస్సుకు శాంతి కలిగింది.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: గృహవిషయాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. ఆదాయంలో నూతన అవకాశాలు ఏర్పడతాయి.

వృషభ రాశి: మానసిక చిరాకులు పెరుగుతాయి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. వాహన కొనుగోళ్ళు ఉపకరిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ప్రయాణాలు సుఖవంతం. ఆర్థిక ఇబ్బందులు పరిష్కరింపబడతాయి. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. వేగవంతమైన నిర్ణయాలు పనికిరావు. ఆదాయంలో అభివృద్ధి ఉంటుంది.

మిథున రాశి: ఆరోగ్య అనుకూలత పెరుగుతుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. స్థిరాస్తి విషయాల్లో ఆదాయం పెరుగుతుంది. పనులను అనుకొన్న సమయానికి పూర్తిచేయగలుగుతారు. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆదాయపరంగా ఉంటాయి.

కర్కాటక రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ఆరోగ్య విషయంలో క్రమశిక్షణ తప్పనిసరి. శత్రుభీతి పోతుంది. ఆదాయంలో అనుకూలత గట్టి ప్రయత్నాలతో సాధ్యం.

సింహ రాశి: ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. వృత్తిలో గుర్తింపు లభిస్తుంది. ఒత్తిడులు అన్నిరకాలుగా పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆదాయ మార్గాలు మూసుకుపోతాయి. కాబట్టి జాగ్రత్తలు వహించాలి. ఆదాయంలో అసహన పరిస్థితులు ఉన్నా నెట్టుకు రాగలుగుతారు.

కన్యా రాశి: వాహన కొనుగోళ్లు ఉపకరిస్తాయి. దూరప్రయాణాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. ప్రత్యర్థులు బలపడతారు. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: నూతన కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. విదేశీలావాదేవీలు లాభిస్తాయి. సినీరంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు ఉన్నా అంతిమ విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. సమాచారాలని సమయానికి సమర్పించలేకపోతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఉద్యోగ యత్నాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. మానసిక రుగ్మతలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: శారీరకశ్రమ తగ్గుతుంది. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. విదేశీలావాదేవీలు ఉపకరిస్తాయి. శ్రమ తగ్గుతుంది. పనులు వేగవంతంగా పూర్తి చేయగలుగుతారు. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: కోర్టు వ్యవహారాల్లో ఊరట లభిస్తుంది. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక విస్మయాలు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయంలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభరాశి: వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆర్థిక ప్రయత్నాలు కలసి వస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విష యాల్లో జాగ్రత్తలు పాటించాలి. ప్రయాణాల విషయంలో కూడా సరైన అవ గాహనతో కూడిన నిర్ణయాలు మాత్రమే విజయాలను కలిగిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.


మీనరాశి: ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఆరోగ్య రక్షణ ఉంటుంది. ముఖ్యమైన పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

అపరిమిత రక్షణకు చేయవలసిందిదే!

భగవంతుని ఏది కోరితే అది ప్రసాదిస్తారు. భగవాన్ నాకు ఎప్పుడు ఏది కావాలో, ఏది నాకు మంచిదో అదే ప్రసాదించు' అని కోరితే అంతా ఆయన చేతుల్లో ఉంచితే ఆయనే అన్నీ చూస్తాడు. మనకు భగవత్ వచనాలు సంపూర్ణంగా అర్థం కావు. కనుక భగవంతునికీ, భక్తునికీ ఎంత దూరం అని కాక 'ఓ భగవాన్! సర్వ వేళలా సర్వత్రా నన్ను కాపాడు' అని కోరుకోవాలి. అప్పుడు భగవంతుడు తన రక్షణ వలయాన్ని మన చుట్టూ ఉంచి సర్వత్రా కాపాడుతూనే ఉంటాడు.



భారతీయ సంస్కృతిలో భగవంతుడు నిరంతరం భక్తులను కాపాడుతూ ఉన్న సందర్భాలు అనేకం కనిపిస్తాయి. ఐనా మనం భగవంతుడు కొందరి ప్రార్థనలే వింటాడు. వారి చెంతనే ఉంటాడు అని భావిస్తాం. **ఎక్కడో అల వైకుంఠ పురంబులో, నగరిలో ఆ మూల సౌధంబు దాపున ఉన్న విష్ణుమూర్తి, ఆ గజరాజు 'రావే ఈశ్వర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా!** అనే ప్రార్థన విని వచ్చి కాపాడాడు కదా! ఎంత దూరంలో ఉన్నాడు? ఎలా వచ్చాడు? ప్రహ్లాదుని ఎలా కాపాడాడు? ఇవన్నీ ప్రశ్నలే అసలు భగవంతునికీ , భక్తునికి ఎంత దూరం. మనం అనుకుంటాం 'ఏనుగు అరిస్తే ఎంత దూరం వినబడుతుందో అంత దూరంలో భగవంతుడు ఉంటాడు. అందువల్లనే గజరాజు ప్రార్థన విని వచ్చాడు' అని. ఇది పొరబాటు. 'ఎవరు భగవంతుని ఎలా ప్రార్థిస్తారో ఆయనా ఆ రూపంలోనే వచ్చి కాపాడుతాడు'.

ఎవరైనా 'భగవాన్ నా వెనకనే ఉండి కాపాడు ' అని ప్రార్థిస్తే అలాగే వారి వెనుకనే ఉండి కాపాడుతాడు. ఆ భక్తునికి భగవంతుని పాద శబ్దం మాత్రమే వినిపిస్తుంది. భగవంతుడా! నా కష్టాలు కనబడడం లేదా అని ప్రార్థిస్తే వానికి ఆయన నేత్రాలు మాత్రమే కనిపిస్తాయి. మరొక భక్తుడు, 'స్వామీ నా ప్రార్థన వినపడడం లేదా అని ప్రార్థిస్తే అతడి చెంత భగవంతుని చెవులు మాత్రమే ఉంటాయి. ఒక భక్తుడు షిరిడీ బాబావారిని 'స్వామీ మీరు నిరంతరం నా వెనుకే ఉండి కాపాడాలి' అని ప్రార్థించగా బాబా 'అలాగే' అని అభయమిచ్చారుట. అతడు కొంత దూరం వెళ్లి వెనక్కు చూస్తే అక్కడ బాబా వారు లేరు. అతడు అమిత బాధ చెంది మరల వెళ్లి, 'బాబా మీరిలా నన్ను మోసం చేయవచ్చా! నా వెనుకే ఉంటానని మాట ఇచ్చి ఇలా చేయ డమేం బావు లేదు. నేను మీ కోసం వెనక్కు తిరిగితే మీరక్కడ లేనే లేరు' అన్నాడట. వెంటనే బాబా వారు 'ఓరీ సైతాన్! నేను నీ వెనక నీ వీపు వైపే ఉన్నాను! నీవు కోరింది నీ వెంట ఉండమనేగా! అన్నారుట. మనం భగవంతుని ఏది కోరితే అది ప్రసాదిస్తారు. భగవాన్ నాకు ఎప్పుడు ఏది కావాలో, ఏది నాకు మంచిదో అదే ప్రసాదించు' అని కోరితే అంతా ఆయన చేతుల్లో ఉంచితే ఆయనే అన్నీ చూస్తాడు. మనకు భగవత్ వచనాలు సంపూర్ణంగా అర్థం కావు. కనుక భగవం తునికీ, భక్తునికీ ఎంత దూరం అని కాక 'ఓ భగవాన్! సర్వవేళలా సర్వత్రా నన్ను కాపాడు' అని కోరుకోవాలి. అప్పుడు భగవంతుడు తన రక్షణ వలయాన్ని మన చుట్టూ ఉంచి సర్వత్రా కాపాడుతూనే ఉంటాడు. తన భక్తుడు మార్కం డేయుని కోసం దిగి వచ్చి మృత్యువును సైతం తరమికొట్టాడు శివుడు, గురుదక్షిణగా ఏనాడో మర ణించిన గురు పుత్రుని తీసుకొచ్చాడు శ్రీకృష్ణుడు. ప్రహ్లాదుని మాట నిజం చేయడానికి, దుష్ట సంహారానికి నరసింహ రూపం ధరించి వచ్చాడు. ఇలాఎన్నో లీలలు. ఆయన అపార కరుణామూర్తి, సర్వ సమర్థుడు, అన్నీ తెలిసిన వాడు. తలిస్తే ఏ మార్గం లేని చోట దారి కనబడుతుంది. కొండొకచో అది అతి సహజంగా కనిపిస్తుంది. ఆయన అపార కరుణను పొందడానికి భక్తి ఉండాలి. చిత్తశుద్ధితో ప్రార్థించాలి. శరణాగతి పొందాలి. అందుకే భక్తుల యోగ క్షేమాలు తాను చూస్తానని పరమాత్మ గీతలో అన్నాడు.

అనన్యాశ్చింతయంతోమాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం.

- ఆదూరి హైమావతి
(చికాగో నుంచి)


ధర్మాల గని దమయంతీ చరితం

నలుని ధర్మనిరతి వల్ల అతనిని కలి ఆవహించలేకపోయాడు. నలుడు అధర్మం ఎప్పుడు చేస్తాడా అని ఎదురు చూడసాగాడు. అలా 16 ఏళ్లు గడిచింది. ఎక్కడా నలునిలో అధర్మం లేదు. అది అతని ధర్మ నిష్ఠ. కలి అంటే అధర్మమే, అబద్ధమే. అధర్మంగా ఇతరుల సొమ్ము కాజేయడం అధర్మమే. ఒక రోజు నలుడు అల్పాచమానానికి వెళ్లి కాళ్లు కడుక్కోవడం మరిచాడు. దానితో అతను అశౌచంతో ఉన్నాడు. ఆ సమయంలో కలి అతనిని ఆవహించాడు.

కర్తవ్యం నెరవేరుస్తున్నా ఒక్కోసారి పూర్వ జన్మ పాపం వల్ల అనేక కష్టాలు ఎదురవుతుంటాయి. దాన్నే విధి అంటాం. విధిని ఎదిరించడం త్రిమూర్తుల వల్ల కూడా కాదు. భారతంలోని అటువంటి చరిత కథా భాగం ఇది. పూర్వం భీముడనే మహారాజు ఉండేవాడు. ఆయన కుమార్తె దమయంతి. ఆమెకు యుక్తవయసు రావడంతో వివాహం చేయాలనుకున్నాడు. అందువల్ల స్వయంవరం ప్రకటించాడు. అయితే హంస రాయబారంతో అంతకు ముందే దమయంతి నలుని గురించి విని ఆయననే పెళ్లి చేసుకోవాలనుకుంది. నలుడు కూడా దమయంతి అందచందాల గురించి గుణగణాల గురించి విని ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నాడు. దమ యంతి అద్భుత సౌందర్యవతి. ఇంద్రుడు, అగ్ని, వాయువు మొదలైన దేవతలు కూడా ఆమె అందచందాలు చూసి మానవకాంత అయినా ఆమెను వివాహం చేసుకోవాలని భావించారు. అయితే ఆమె నలుని వివాహం చేసుకుంటుందని తెలుసు. అందు వల్ల వారు స్వయంవరానికి వెడుతున్న నలుని ఆపి తమలో ఒకరిని వివాహం చేసుకోమని దమయంతికి చెప్పమన్నారు. నలుడు తన ప్రేమ విషయం వారికి చెప్పాడు. అయినా వారు పట్టుబట్టడంతో దేవతల మాట కాదనలేక, దమ యంతి ఎలాగూ వారిని వివాహం చేసుకోదని నలుడు అంగీకరించాడు. అంతఃపురంలోకి అదృశ్యంగా వెళ్ళడానికి వారు అతనికి తిర స్కరణీ విద్య ప్రసాదించారు. నలు డు ఆ విద్య ఉపాయంతో దమ యంతి వద్దకు వెళ్ళాడు. ఆమె నలుని చూసి సంతోషించింది. అయితే దేవతలు చెప్పమన్న విష యం చెప్పాడు. ఆమె విముఖత వ్యక్తం చేసింది. నలుడు అదే విష యం దేవతలకు చెప్పాడు. దానితో వారు స్వయంవరానికి వచ్చి తాము కూడా నలుని రూపాలతో ప్రత్యక్షం అయ్యారు. దమయంతి తికమకపడింది. ఆమె చిన్ననాటి నుంచి భవానీ భక్తురాలు అయినందువల్ల భవానీ దేవిని ప్రార్థించడంతో బాటు, దేవతలను నిజరూపాలతో ప్రత్యక్షమై తనను ఆశీర్వదించమని కోరింది. దమయంతి నిబద్ధత, నలుని సత్య సంధతకు దేవతలు సంతోషించి తమ అసలు రూపాలతో ప్రత్యక్షమై నలదమయంతులను దీవించి తమ లోకానికి బయలుదేరారు. (ఇది నలుని పరీక్షించడానికే గాని వారికి ధర్మ విరుద్ధంగా మానవ కాంత పట్ల మోహం ఉందని భావించరాదు) దారిలో కలి ఎదురయ్యాడు. ఆయనా స్వయంవరానికి ఆలస్యంగా వస్తున్నాడు. వారు స్వయంవరం అయిపోయిందని అతనికి చెప్పారు. దానితో అతను కోపోద్రిక్తుడై 'ఆ నలుడు దమయంతితో ఎలా సుఖపడతాడో నేను చూస్తాను' అని కక్షకట్టాడు. అయితే కలి అధర్మం ఉన్న చోట మాత్రమే ప్రవేశిం చగలడు. నలుని ధర్మ నిరతి వల్ల అతను నలుని ఆవహించలేకపోయాడు. నలుడు అధర్మం ఎప్పుడు చేస్తాడా అని ఎదురు చూడసాగాడు. అలా 16 ఏళ్లు గడిచింది. ఎక్క డా నలునిలో అధర్మం లేదు. అది అతని ధర్మ నిష్ఠ. కలి అంటే అధర్మమే, అబద్ధమే. అధర్మంగా ఇతరుల సొమ్ము కాజేయడం అధర్మమే. ఒక రోజు నలుడు అల్పాచమానానికి వెళ్లి కాళ్లు కడుక్కోవడం మరిచాడు. దానితో అతను అశౌచంతో ఉన్నాడు. ఆ సమయంలో కలి అతనిని ఆవహించాడు. తనకు తెలిసిన పుష్కరుడనే రాజును నలునితో పాచికలాడమని ఆ పాచికలలో చేరి తాను అతనికి విజయం తద్వారా నలుని రాజ్యం అపహరించవచ్చని ఆశ చూపాడు. అతను వచ్చాడు. నలుని జూదానికి పిలిచాడు. అధర్మంఅని తెలిసి కలి ప్రభావం వల్లనో, విధి ప్రభావం వల్లనో నలుడు పాచికలాట (జూదం) ఆడాడు. రాజ్యాన్ని పందెంగా కాసి ఓడిపోయాడు. నల దమయంతులకు నీడ లేకుండా పోయింది. దమయంతి పిల్లలను తన తండ్రి ఇంటికి పంపింది. నలదమయంతులిద్దరూ అడవికి చేరారు. ఆహారం కోసం పంచె విసిరి పక్షుల్ని పట్టుకుందాయని నలుడు గోచీ ధరించి పంచె విసిరితే పక్షులు ఆ పంచెతో ఎగిరిపోయాయి. అది కూడా కలి పనే. దానితో ఆయనకు ఆకులు కట్టుకోవలసిన గతి ఏర్పడింది. వారు ఆ రాత్రి అడవిలో పడుకున్నారు. అయితే దమయంతి తనవల్ల కష్టాలు పడుతోందని బాధపడిన నలుడు, తాను లేకపోతే ఆమె తన తండ్రి వద్దకు వెడుతుందని భావించి ఆమెను అక్కడ విడిచి, ఆమె చీరె నుంచి ఒక ముక్కను కోసి దానిని ధరించి వెళ్ళిపోయాడు.

ఉదయం నిద్ర లేచిన దమయంతి నలుని కోసం అంతా వెతికింది. ఎక్కడా కనబడకపోవడంతో దారితెలియక సంచరించసాగింది. ఇంతలో ఒక కొండచిలువ ఆమెను పట్టుకుంది. ఆమె సాయం కోసం ఆర్తనాదం చేయగా ఒక కిరాతుడు దానిని చంపి ఆమెను రక్షించాడు. ఆమె వివరాలు తెలుసుకుని 'నీకు భర్త లేడు కనుక నేనే నీ భర్తనవుతాన'ని మీదికొచ్చాడు. ఆమె తన పాతివ్రత్య శక్తితో అతనిని శపించి బూడిద చేసింది. అలా వెళ్లి చివరకు చేది దేశం చేరుకుంది. అక్కడి రాణి ఆశ్రయం కోరింది. అయితే గౌరవనీయమైన విధులు మాత్రమే చేసే సైరంధ్రిగా ఉంటానని కోరింది. ఆమె శుభ లక్షణాలు చూసిన అక్కడి రాణి సునంద అందుకు అంగీకరించింది. అక్కడ అడవిలో దమయంతిని వదలివెడుతున్న నలునికి కార్చిచ్చులో చిక్కుకున్న ఒక సర్పం కనిపించింది. ఆపదలో ఉన్న వారిని రక్షించే గుణం ఉన్న నలుడు దానిని రక్షించాడు. ఆ సర్పం నిజానికి సర్ప జాతి ప్రముఖుడైన కర్కోటకుడు. అతను సర్ప రూపంలో అడవిలో సంచరిస్తూ ఆ కార్చిచ్చులో చిక్కుకున్నాడు. అతడు నలుని కథను తెలుసుకుని త్వరలో మంచి రోజులు రాగలవని చెప్పి అంతవరకు పరమ ధర్మాత్ముడైన ఋతుపర్ణుడనే మహారాజు ఆస్థానంలో ఉండమని చెప్పాడు. తనకు ప్రాణదానం చేసినందుకు ప్రత్యుపకారంగా సుందరరూపుడైన నలుని ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు అతనిని కాటు వేసి రూపుమారుస్తానని అది తాత్కాలికంగా ఉపయోగపడుతుందని చెప్పాడు. అతను కాటువేయడంతో నలుడు పొట్టిగా, నల్లగా మారి పోయాడు.

భారతంలో చిన్న కథలు




అనంతరం ఋతుపర్ణ మహారాజు ఆస్థానంలో రథ సారథిగాను, వంట వానిగాను ఉద్యోగంలో చేరాడు. మరోపక్క నలదమ యంతులు రాజ్యాన్ని కోల్పో యి అడవుల బాట పట్టారని దమయంతి తండ్రికి తెలిపింది. వారిని వెదకమని ఆయన విప్రులను వివిధ రాజ్యాలకు పంపాడు. ఒక విప్రుడు దమ యంతి ఆశ్రయం పొందిన చేది దేశపు ఆస్థానంలో ఆమెను చూసి గుర్తు పట్టాడు. ఆ రాజుకు, రాణికి ఆమె దమయంతి అనే విషయం చెప్పాడు. వెంటనే సునందా దేవి 'నీ తల్లి, నేను అక్కచెల్లెళ్ళం' అని చెప్పి ఆమెను తండ్రి ఇంటికి పంపింది. నలుణ్ణి కునుగొనే మార్గం కోసం అన్వేషిస్తున్న దమయంతి మళ్లీ విప్రులను పిలిచి మీరు ఒక మాట ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో వినిపించండి. దానికి ఎవరు బదులు చెబితే అతడే నలుడని గుర్తించవచ్చని చెప్పింది . ఆమె చెప్పిన మాట 'భార్యతో ఎప్పుడూ సత్యం మాట్లాడే వాడివి, ధర్మా చరుణుడివి, భార్య కట్టుకున్న చీరెను సగం చించుకుని వెళ్ళడం భావ్యమా. ఆమె పట్ల దయచూపు'. ఈ మాటకు ఎక్కడా స్పందన లభించలేదు. కాని ఋతుపర్ణ మహారాజు ఆస్థానంలోని బాహుకుడు విప్రులు చెప్పిన ఈ మాట విన్నాడు. ఆయనకు దుఃఖం ఆగలేదు. దానిని దిగమింగుకుని 'భర్తలో లోపాలు ఉన్నాయని గుర్తించినా అవి బయటపెట్టక ఉండే పత్ని వచ్చే జన్మలోనైనా మంచి భోగాలు పొందుతుంది' అని అన్నాడు. విప్రులు ఈ విషయాన్ని దమయంతికి చెప్పారు. అయితే ఆ స్పందించిన వ్యక్తి నలునిలా అందంగా కాక లావుగా, పొట్టిగా, నల్లగా వంటలు చేస్తూ, గుర్రాలను మేపుతూ ఉన్నాడని చెప్పారు. అయితే నలుణ్ని కనిపెట్టడానికి మరో మార్గాన్ని దమ యంతి ఆలోచించింది. తనకు పునఃస్వయంవరమని, అది కూడా రేపేనని ఋతుపర్ణ మహారాజుకు కబురు చేయమంది. ఋతుపర్ణ మహారాజు రాజ్యం నుంచి దమయంతి ఉన్న రాజ్యానికి రావాలంటే రథానికున్న గుర్రాలు మహావేగంగా వెళ్ళాలి. వాటిని అంత వేగంగా పరుగెత్తించగల అశ్వ హృదయ విద్య ఒక్క నలునికే తెలుసు. ఆ విధంగా అతనిని పట్టుకోవచ్చని ఆమె ఊహ. దమయంతి పునఃస్వయంవరం విషయమేమిటో చూడడానికి ఋతుపర్ణుడు వెడదామనుకున్నాడు. కాని అంత వేగంగా మర్నాటికల్లా అక్కడికి వెళ్లడం సాధ్యం కాదు కదా అని బాహుకునితో అన్నాడు. తాను ఆఘమేఘాల మీద తీసికెళ్ళగలనని బాహుకుడు చెప్పడంతో బయలుదేరాడు. గుర్రాలను అతి వేగంగా పరుగెత్తించగల నలుని విద్య ఆయనకు ఆశ్చర్యం కలిగించింది. నలునికే తెలిసిన ఈ విద్య బాహుకునికి కూడా తెలుసు ననుకున్నాడు.

దానితో ఆ అశ్వ హృదయ విద్యను తనకు తెలపమన్నాడు. ఊరికే ఏ విద్యను తీసుకోరాదు కనుక తన వద్ద ఉన్న అక్షహృదయ విద్యను ఇస్తానన్నాడు. ఇద్దరు ఆ విద్యలు ఒకరికి ఒకరు నేర్చుకునే సరికి విదర్భ రాజ్యం వచ్చింది. బాహుకుని పరీక్షగా చూసిన దమయంతి చివరి ప్రయత్నంగా తన పిల్లలను బాహుకుని వద్దకు పంపింది. వారిని చూసిన నలుడు ఆగలేక రోదిస్తూ వారిని దగ్గరకు తీసుకున్నాడు. అందరికీ అసలు విషయం తెలిసింది. నలుడిని రప్పించేందుకే ఇలా చేశానని భీముడు, ఋతుపర్ణునికి తెలిపాడు. దానితో నలుడంతటి వాని చేత సారథ్యం చేయించుకున్నందుకు ఋతుపర్ణుడు నొచ్చుకున్నాడు. అతడు నలుడని తెలియడంతో అక్ష విద్య పూర్తిగా సశాస్త్రీయంగా ఉపదేశించాడు. ఆ దివ్య విద్య నలుని శరీరంలోకి ప్రవేశించగానే ఆయనలోని కర్కోటకుని విషం బయటకు వచ్చి పూర్వ రూపం పొందాడు. ఆ దివ్య విద్య శక్తి వల్ల కలి పురుషుడు లోపల ఉండలేక బయటకు వచ్చేశాడు. కొన్ని మంత్ర విద్యల శక్తి అలా ఉంటుంది. కలి వల్లనే ఇదంతా జరిగిందని తెలిసిన నలుడు అతనిని శపించబోయాడు. అయితే నలుని చరిత్ర విన్న వారికి తన భయం ఉండదని కలి అభయం ఇచ్చాడు. దానితో నలుడు శాంతించాడు. ధర్మాచరణ పరాయణులను తాను ఆశ్రయించనని కలి తెలిపాడు. నలదమయంతులు తమ రాజ్యాన్ని తిరిగి పొంది ఆనందంగా జీవించారు.

- అశ్విని

భగవద్గీత



నన్ను పొందినవారు ఈ అనిత్య జగానికి తిరిగిరారు

అధ్యాయం 8

శ్లోకం 15

మాముపేత్య పునర్జన్మ
దుఃఖాలయమశాశ్వతమ్ ॥
నాప్నువంతి మహాత్మానః
సంసిద్ధిం పరమాం గతాః ॥

తాత్పర్యం


భక్తియోగులైన మహాత్ములు నన్ను పొందిన పిమ్మట సంపూర్ణత్వాన్ని పొందినవారగుటచే దుఃఖాలయమైన ఈ అనిత్య జగమునకు ఎన్నడు తిరిగిరారు.

భాష్యం

అశాశ్వతమైన ఈ భౌతిక ప్రపంచము బహు దుఃఖములతో కూడుకొని ఉంటుంది. ఇచ్చట జన్మ, మృత్యు, జరా వ్యాధి తప్పవు కనుక అత్యున్నత స్థితియైన కృష్ణలోకమునకు చేరుకున్న భక్తుడు సహజంగా ఇక్కడకు తిరిగి రావాలని ఎప్పుడూ కోరుకొనడు. వేదాలు ఆ ఉన్నత లోకాన్ని అవ్యక్తమని, అక్షరమని, పరమగతి అని కొనియాడుతున్నవి. అనగా నిజమైన భక్తులు కృష్ణుని సందేశాలను శుద్ధ భక్తుల నుండి విని భక్తిని పెంపొందించుకుని కృష్ణుడు, అతని సాంగత్యాన్ని తప్ప మరోదానిని కోరరు. ఉన్నత లోకాలు గాని, ఆధ్యాత్మిక లోకాలు గాని వారిని ఆకర్షించవు. కృష్ణుణ్నే కోరుకునే మహాత్ముల గురించి ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించబడింది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

కులాసా



మహిళలకు మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లముప్పు ఎక్కువ. వీటి బారినపడితే నొప్పి, మంట, తరచుగా మూత్రానికి వెళ్లాల్సి రావటం వంటివి తీవ్రంగా వేధిస్తాయి. ఈ ఇన్‌ఫెక్షన్లు యువతుల్లో తరచుగా కనబడుతుంటాయి. మధ్య వయసువారిలోనూ ఎక్కువే. మహిళల్లో వయసుతో పాటు మూత్రకోశ వ్యవస్థగోడలు బలహీనం అవుతుంటాయి. దీంతో ఇన్‌ఫెక్షన్లముప్పూ పెరుగుతుంది. సాధారణంగా ఈస్ట్రోజెన్ హార్మోన్ సూక్ష్మ క్రిములను చంపే రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది. మూత్రకోశ వ్యవస్థగోడలు మందంగా, ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుంది. అయితే నెలసరి నిలిచిన తర్వాత ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గుతూ వస్తుంటాయి. దీంతో సూక్ష్మ క్రిములను నిర్మూలించే సామర్థ్యం తగ్గుతుంది. మూత్రకోశ గోడలూ బలహీనమవుతాయి. అలాగే యోనిలో మంచి బ్యాక్టీరియా తగ్గి చెడు బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇవన్నీ మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లను తెచ్చిపెట్టేవే. అయితే తరచుగా మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లబారినపడేవారు కొన్ని జాగ్రత్తలతో వీటి ముప్పును తగ్గించుకోవచ్చు.

(మార్చి 8న ప్రపంచ కిడ్నీ దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)

మహిళల్లో కిడ్నీ వ్యాధులు

దీర్ఘకాల కిడ్నీ వ్యాధి అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రజా ఆరోగ్య సమస్యగా మారింది. దీనివల్ల కిడ్నీ వైఫల్యంతో బాటు మరణాలు సంభవిస్తున్నాయి. దీర్ఘకాల కిడ్నీ వ్యాధి అనేది దాదాపు 195 మిలియన్ మహిళలు ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. మహిళల్లో మరణాలు సంభవించడానికి ఎనిమిదో ప్రధాన కారణంగా దీర్ఘకాల కిడ్నీ వ్యాధి నిలిచింది. దాదాపు ప్రతిసంవత్సరం 6 లక్షల మంది చనిపోతున్నారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో దీర్ఘకాల కిడ్నీ వ్యాధి ముప్పు పొంచి ఉన్నట్లు అధ్యయనాల్లో వెల్లడైంది.

దీర్ఘకాల కిడ్నీ వ్యాధులు సంభవించడానికి మూడుప్రధాన కారణాలు ఉన్నట్లు గుర్తించారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో కిడ్నీ వ్యాధి నెమ్మదిగా ముదురుతుంది. సామాజిక ఆర్థికప్రభావం వల్ల మహిళల్లో అవగాహన తక్కువగా ఉంటుంది. డయాలసిస్ కూడా ఆలస్యంగా చేయించడం వల్ల కూడా కిడ్నీ వ్యాధి ముదిరిపోతుంది.

కొన్ని ప్రాంతాలలో వైద్య సంరక్షణ అందుబాటులో లేకపోవడం కూడా ఒక కారణంగా నిలిచింది.

కిడ్నీ మార్పిడిలు కూడా కొన్ని ప్రత్యేక కారణాల వల్ల కూడా జరగడం లేదు. సామాజిక, సాంస్కృతిక, మానసిక కారణాల వల్ల అన్నిచోట్ల కిడ్నీ మార్పిడులు జరగడం లేదు.

మహిళలు ఎక్కువగా కిడ్నీ దానాలు చేస్తున్నారు. కానీ అవసరమైనప్పుడు వారికి కిడ్నీలు ఇచ్చేవారు లేకుండా పోతున్నారు.

మహిళలు ఎక్కువగా ఇంట్లోనే ఉండటం వల్ల కిడ్నీ వ్యాధిని గుర్తించడంలో నిర్లక్ష్యం జరుగుతుంది.

మహిళలు ఎక్కువగా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. సరిగ్గా పని చేయలేకపోతున్నారు. ఫలితంగా తమ ఉద్యోగాలను వదిలేసుకునే పరిస్థితి వస్తుంది. ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదుర్కోవడం వల్ల దీర్ఘకాల కిడ్నీ వ్యాధిని గుర్తించలేకపోతున్నారు.

చాలా చోట్ల తమ భర్త నుంచి లేదా కుటుంబ సభ్యుల నుంచి సరిగ్గా సహకారం రాకపోవడం వల్ల ముఖ్యంగా సామాజిక ఆర్థిక వెనుకబాటుతనం వల్ల దీర్ఘకాల కిడ్నీ వ్యాధికి గురవుతున్నారు.

కుటుంబ సహకారంలేకపోవడం వల్ల చాలా చోట్ల మహిళలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు.

లూపస్ నెఫ్రోపతి, కిడ్నీ ఇన్‌ఫెక్షన్

కొన్ని కిడ్నీ వ్యాధులు అంటే లూపస్ నెఫ్రోపతి లేదా కిడ్నీ ఇన్‌ఫెక్షన్ పురుషులతో బాటు మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

ఆటో ఇమ్యూన్ వ్యాధి వల్ల కూడా లూపస్ నెఫ్రిటిస్ వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లినప్పుడు కణాలు, అవయవాల మీద దాడి జరుగుతుంది.

కిడ్నీ ఇన్ఫెక్షన్స్ (యురినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్స్) వల్లకూడా మహిళలు ఎక్కువగా గర్భిణీ సమయంలో ముప్పును ఎదుర్కొంటున్నారు.

కిడ్నీ వ్యాధిని ఆరంభంలోనే గుర్తించాలి. అప్పుడే చికిత్స సాధ్యమవుతుంది.

గర్భిణీ సమయంలో కిడ్నీ వ్యాధి

గర్భిణీ సమయంలో కిడ్నీ వ్యాధి వచ్చినట్లయితే సంతానోత్పత్తి మీద ప్రభావం చూపుతుంది. మహిళల్లో హైపర్‌టెన్షన్, మూత్ర సంబంధ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రం దుష్పరిణామాలు ఎక్కువగా ఉంటాయి.

డయాలసిస్ అయ్యే మహిళ గర్భిణీగా అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఒకవేళ గర్భిణీగా ఉన్న సమయంలో మాత్రం వారానికి నాలుగైదుసార్లు డయాలసిస్ చేసుకోవాలి. వారిని దగ్గరుండి పర్యవేక్షించాలి.


కిడ్నీ మార్పిడి తర్వాత సంతానోత్పత్తికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. యురినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ వల్ల కిడ్నీల పనితీరు బాగా దెబ్బతింటుంది. అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి. గర్భిణీగా ఉన్న సమయంలో అవలక్షణాలు ఉంటే మాత్రం కిడ్నీ వ్యాధి ముదిరిపోతుంది.

ప్రి ఎక్‌లామ్‌సియా సింద్రోమ్ వల్ల సాధారణ కిడ్నీ కూడా గర్భస్త మాయ దెబ్బతింటుంది. అధిక రక్తపోటు వల్ల ఈ సింద్రోమ్ వస్తుంది. దీనివల్ల మూత్రంలో ప్రోటీన్ లీక్ అవుతుంది. గర్భిణీ సమయంలో మరణాలు చెందడానికి ఇది మూడో అతిపెద్ద కారణంగా నిలిచింది.

ప్రీక్లామ్‌సియా, సెప్టిక్ అబార్షన్ (గర్భస్త మాయ ఇన్‌ఫెక్షన్), పోస్ట్ పార్టమ్ హ్యమరేజ్ (జన్మనిచ్చిన తర్వాత రక్తస్రావం ఎక్కువగా ఉండటం) వల్ల కూడా అక్యూట్ కిడ్నీ ఇన్‌జ్యూరీ (ఎకెఐ) యువతుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. కొందరు రోగుల్లో కిడ్నీలు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు గర్భిణీ సమయంలో అవలక్షణాలు ఎదుర్కొంటున్నారు. సంరక్షణ, డయాలసిస్ అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల కూడా ఎక్కువగా కిడ్నీ వైఫల్యానికి గురవుతున్నారు.

డాక్టర్ కవితా గోనె
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్
కాంటినెంటల్ హాస్పిటల్స్



హోమియో వైద్యం

హోమియో వైద్యం కిడ్నీలలో రాళ్లు ఏర్పడటాన్ని యురోలిథియాసిస్ అని కూడా అంటారు. యురినరీ ట్రాక్ట్‌లో ఘనపదార్థాలు పేరుకుపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. మూత్రంలోఉన్న ఖనిజలవణాలు ఎక్కువ గాఢతలో ఏర్పడినప్పుడు కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయి. చిన్న రాళ్లు అయితే మూత్రంలో విసర్జింపబడతాయి. కానీ పెద్దరాళ్లు మూత్రనాళంలో అడ్డంకిగా మారతాయి. దీనివల్ల తీవ్రమైన నొప్పి వాటిల్లుతుంది. మూత్రంలో రక్తం కూడా పడుతుంది. వాంతులు, విరోచనాలు, వికారం ఏర్పడుతుంది. చెమట పడుతుంది. మూత్రం విసర్జించే సమయంలో తీవ్ర నొప్పి ఉంటుంది. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడితే హోమియోలో అద్భుతమైన వైద్యం ఉంది. ఇది సురక్షితమైనది. సైడ్ ఎఫెక్ట్ ఉండదు. కిడ్నీల్లో రాళ్లు తీసివేయడానికి చికిత్స తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

డాక్టర్ టి. గీత
హోమియోవైద్యనిపుణులు
8019109109





ఆయుర్వేద పరిష్కారాలు

సాధారణంగా పెద్దవాళ్లకి షుగర్ వ్యాధి, హైబీపీ వ్యాధుల వలన కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ రోజుల్లో చిన్న, పెద్ద వయస్సు తేడా లేకుండా మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడటం ఒక సాధారణ సమస్యగా తయారైంది. మూత్రపిండాల్లో వుండే మూత్రం అవక్షేపాలుగా ఏర్పడి రాళ్లుగా మారుతాయి. కానీ ఇవి సాధారణంగా రాళ్లుగా మారవు. రాళ్లుగా మారినా, చిన్న పరిమాణంలో ఏర్పడి ఎలాంటి వ్యాధి లక్షణాలను బహిర్గతపరచకుండా మూత్రం ద్వారా బయటికి పంపబడతాయి. మూత్రపిండాల్లో వివిధ రకాల రాళ్లు ఏర్పడతాయి.

అవి కాల్షియం ఆక్సాలైట్ రాళ్లు, సిస్టీన్ రాళ్లు, మెగ్నీషియం రాళ్లు, కాల్షియం పాస్ఫేట్ రాళ్లు, యూరిక్ ఆసిడ్ రాళ్లు వంటి రకరకాల రాళ్లు ఏర్పడతాయి. కానీ మూత్రాశయంలో ఎక్కువగా కాల్షియం ఆక్సలేట్ వల్ల ఏర్పడతాయి.



మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడినప్పుడు ఉండే లక్షణాలు

మూత్రపిండాలలో కలిగే రాళ్లు ఏర్పడినప్పుడు వుండే లక్షణాలు, ఏర్పడిన రాళ్ల యొక్క పరిమాణం, రకంను బట్టీ లక్షణాలు బహిర్గతం అవుతుంటాయి. ఐదుమిల్లీమీటర్ కంటే తక్కువ పరిమాణంలో ఏర్పడిన రాళ్లు ఎలాంటి లక్షణాలను, సమస్యలను కలిగించకుండా మూత్రం ద్వారా శరీరం నుండి బయటకు పంపబడతాయి. కానీ పెద్ద పరిమాణంలో ఉండే రాళ్లు (6 మిల్లీమీటర్ కంటే పెద్దగా వుండే రాళ్లు) మూత్ర విసర్జనలో అడ్డంకులను ఏర్పరుస్తాయి. మూత్ర విసర్జనలో అడ్డంకులు ఏర్పడితే వెన్నుముక కింది భాగం తీవ్రమైన నొప్పిని కలుగజేస్తుంది. మూత్రంలో మంట, మూత్రంలో రక్తం రావడం, వాంతులు ఇన్‌ఫెక్షన్‌లకి గురైతే విశ్రాంతి లేకపోవడం, జ్వరం వంటి లక్షణాలను బహిర్గతపర చవచ్చును.


ఆహారం : ఫాస్ట్‌ఫుడ్, చిప్స్, ఉప్పు, మాంసాహారం, ఊరగాయలు, కాఫీ, టీ, దుంపలు, చాకోలెట్స్, ఆకుకూరలు, చీజ్, పెరుగు, పాలు వంటి వాటిని తినకుండా ఉండాలి.

జాగ్రత్తలు : ప్రతి రోజు 8 నుంచి 10 గ్లాసులు త్రాగాలి. తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. అధికంగా ఉప్పు ఉండే ఆహార పదార్థాలకు దూరంగా వుండండి. మూత్రం వచ్చినప్పుడు ఆపుకోవడం చేయకండి. అలా ఆపుకోవడం వల్ల మూత్రనాళంపై ఒత్తిడి ఏర్పడి మూత్ర పిండాల యొక్క వడపోతను ప్రభావితపరుస్తాయి. ఆల్కాహాల్ సేకరణ తగ్గించండి. రోజు వ్యాయామాలు చేయాలి. ఇలా చేయటం వల్ల రక్తపీడనాన్ని ఆరోగ్యకరస్థాయిలో నిర్వహించటమే కాకుండా తీవ్రమైన కిడ్నీ వ్యాధులు కలగకుండా చేస్తాయి.

మూత్ర పిండాలలో రాళ్లు ఏర్పడి చాలామంది సమస్యలకు గురవుతున్నారు. మూత్రపిండాలలో ఏర్పడిన రాళ్లను, ఇతర ఇన్ఫెక్షన్‌లను తొలగించుటకు ఆయుర్వేద ఔషధాలను వాడటం వలన ఎలాంటి దుష్ప్రభావాలు కలగకుండా సహజంగా రాళ్లు కరిగిపోయి మూత్రం ద్వారా బయటకు పంపబడతాయి.

డాక్టర్ జి. క్రాంతికుమార్
కేరళ ఆయుర్వేద
పంచకర్మ సెంటర్
హైదరాబాద్
9494675168





ఆక్యుపంక్చర్ చికిత్స

కిడ్నీ సంబంధిత వ్యాధులను అరికట్టడానికి ఆక్యుపంక్చర్ వైద్య విధానానికి మంచి స్పందన ఉంది. ప్రాచీన చైనా వైద్యానికి కిడ్నీ కార్యకలాపాలు యథావిధిగా అయిన సందర్భాలు నిరూపితమైంది. కిడ్నీలు మన శరీరంలో ఎంతో కీలకమైన అవయవాలు. కిడ్నీల ఆరోగ్యం చెడిపోతే వ్యక్తి ఆరోగ్యం పూర్తిగా చెడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అరికాళ్లలో మసాజ్ చేయడం వల్ల కొన్ని ప్రత్యేక పాయింట్ల వద్ద ఒత్తిడి పెంచిన పక్షంలో ఆక్యుపంక్చర్‌లో కిడ్నీల అనారోగ్యం నుంచి కాపాడవచ్చు.

హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్ హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808



వేసవికాలంలో చర్మ వ్యాధులు

గజ్జి, తామర వంటి చర్మ వ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా నిత్య జీవితంలో తీవ్ర అసౌకర్యానికి ఇబ్బందులకూ గురిచేస్తాయి. చర్మానికి ఎంతో హాని చేస్తాయి. చర్మాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటూ, అంటురోగాలకు దూరంగా ఉంటే ఇవి రాకుండా చూసుకోవచ్చు. అయితే వీటి బారిన పడనివారు దాదాపు అరుదుగా ఉంటారు. ఈ వ్యాధులు ఎలా సంక్రమిస్తాయి. నివారణ చర్యలు గురించి ఈ వారం తెలుసుకుందాం.

అపరిశుభ్రవాతావరణం, కాలుష్యంతో పాటు హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించనివారు ఎక్కువగా ఈ చర్మ వ్యాధులబారినపడుతుంటారు. వీటిలో గజ్జి, తామర అనేవి ప్రధానమైనవి. గజ్జినే స్కాబిస్ అని అంటారు. ఈ చర్మ వ్యాధి సార్కోప్టస్ స్కాబీస్ అనే పరాన్నజీవి వలన సంక్రమిస్తుంది. ఈ వ్యాధి ఉన్నవారితో సంబంధం పెట్టుకున్నవారికి వ్యాపిస్తాయి. ఈ క్రిములు ప్రవేశించిన నాలుగు వారాలలోగా దురద ప్రారంభమౌతుంది. అది గజ్జిగా మారుతుంది.

లక్షణాలు


చర్మంపై దురద ఏర్పడటంతో ఈ వ్యాధి మొదలౌతుంది. ఈ సూక్ష్మ జీవులు నివసిస్తున్న చర్మం మీద చిన్న ఎరుపు రంగు పొక్కులు, పుండ్లు ఏర్పడతాయి. తర్వాత తీవ్రమైన దురద కలుగుతుంది. రాత్రివేళల్లో ఇది విపరీతస్థాయిలో ఉంటుంది. గజ్జి పుండ్ల వలన చర్మం మీద జరిగే ప్రతిచర్యతో తీవ్రమైన దురద వస్తుంది. మొదటిసారిగా గజ్జి సోకిన వ్యక్తి ఎన్నో నెలలకుగానీ ఈ దురదకు కారణం తెలుసుకోలేరు. ఆ తర్వాత వచ్చిన అంటువ్యాధుల వలన ఈ కీటకం చేరిన కొన్ని గంటలలోపు ఆపుకోలేని దురద ప్రారంభమవుతుంది. ఈ కీటకాలు మూడు రోజులు మాత్రమే మనిషి శరీరం మీద జీవించి వుంటాయి. అయితే అవి వారి దుస్తులపైన, వారి పక్క బట్టలకు మరికొన్ని సూక్ష్మజీవులను వారికుటుంబసభ్యులకు, స్నేహితులకు, సహచరులకు వ్యాపిస్తాయి. వీటిని శుభ్రపరిచేవరకు, తగిన చికిత్స పొందిన తర్వాతే ఒక వ్యక్తి తిరిగి ఈ వ్యాధి కలిగియున్న అదేవ్యక్తితో మరో వ్యక్తితో సంబంధం కలిగిఉన్నా ఇది సోకే అవకాశం ఉంది.



వ్యాధి సోకే శరీర భాగాలు చేతివేళ్ల మధ్య, వేలిపక్కన ఉండే చర్మం, కాలి వేళ్ల వద్ద, తొడల మధ్య, గజ్జలలో, చంకల మధ్య, మోకాలు, మోచేయి కింద భాగంలో, మణికట్టు వద్ద, పొత్తికడుపు వద్ద గజ్జి తొందరగా ఏర్పడుతుంది. అరచేయి కింది ప్రాంతంలో ఎప్పుడోకాని గజ్జి పుండ్లు కనబడవు. అలాగే కాలి పాదాల మీద ఎప్పుకో కానీ కనపడవు. అలాగే మెడ మీద కూడా కనపడవు.

వ్యాప్తి

గజ్జి వ్యాధి ఉన్నవారి ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వారికి తగిన చికిత్స జరగనంతవరకు వారితో సంబంధం గల ఇతరులకు ఇది సోకుతుంది. గజ్జిని కలిగించే పరాన్న జీవి 0.3 మిల్లీమీటర్ల పొడవుండే ఒక కీటకం (మైట్). ఆడ పరాన్నజీవి మనిషి శరీరంలోని చర్మం క్రింద చిన్న కన్నం చేసుకుని అక్కడ రెండు, మూడు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు రెండుగంటల్లో వృద్ధి చెందుతాయి. అవి పదిరోజుల్లోనే కీటకాలుగా ఎదుగుతాయి. అవి నివసించిన ప్రదేశంలో గజ్జి ఏర్పడి అంటువ్యాధిగా వ్యాపిస్తుంది. లక్షల సంఖ్యలో ఉన్న ఈ కీటకాల వలన వ్యాధి వ్యాపిస్తే ఏ వ్యక్తి అయినా ఆ పుండ్లను గోకినా, గోకకపోయినా, ఆ వ్యక్తిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే ఈ వ్యాధి తీవ్ర స్థాయిలో వ్యాపిస్తుంది. ఈ వ్యాధి ఒకరినుంచి ఒకరికి దగ్గరగా చర్మ సంబంధం వలన సోకుతుంది. భార్య భర్తలకు ఒకరినుంచి ఒకరికి సోకుతుంది. అలాగే ఈ వ్యాధి సోకినవారు నిద్రించిన పరుపులను, పక్కలను ఉపయోగించినా, వారు ధరించిన దుస్తులు ధరించినా లేదా వారితో కరచాలనం చేసినా ఈ వ్యాధి ఇతరులకు సోకుతుంది.




మధుమేహ రోగుల్లో, రక్త క్యాన్సర్ రోగులు, మందులు వాడటం వలన రోగ నిరోధక శక్తి తగ్గినవారిలో శారీరక అవయవాలను శస్త్ర చికిత్స ద్వారా మార్పిడి చేయించుకుని మందులు వాడుతున్న వారిలో, ఎయిడ్స్ వ్యాధిలో ఉన్నవారిలో గజ్జి తీవ్రంగా ఉంటే దానిని క్రస్టడ్ స్కాబీస్, నార్వీజీయస్ స్కాబీస్ అని అంటారు.

చికిత్స

గజ్జి నివారణకు తీవ్రతను బట్టి అనేకరకాల లోషన్లను పూస్తారు. సాధారణంగా ఐదుశాతం పెరిమిథిన్‌ను లోషన్‌లో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ ద్రవాన్ని శరీరం మీద రాసి 12 నుంచి 24 గంటలు ఉంచాలి. దీనిని శరీరమంతా ఒకసారి రాస్తే చాలు. ఒకవేళ ఈ క్రిములు ఒక వారం తర్వాత కూడా శరీరంపైన ఇంకా జీవించి ఉంటే అప్పుడు స్కాబీసైడ్ తిరిగి రాయాలి. అప్పటికీ కాలమైన్ ద్రవం, యాంటీ హిస్టామిన్ మందులు పూత పూయడం వలన దురద కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. మరీ తీవ్రంగా ఉంటే యాంటీబయాటిక్ మాత్రలు, ఇంజెక్షన్ కూడా ఉపయోగించి చికిత్స చేయాలి. గోకడంతో నివారణ జరగదు.

- గజ్జి పుండ్లను గోకి, గీరి వాటి పెచ్చులను తీసివేస్తే ఈ కీటకాలు తొలగిపోయి కొంతవరకు ఈ వ్యాధిని తగ్గించుకోవచ్చని చాలామంది భావిస్తారు. కానీ అలా పోదు.
- కీటకాలను పూర్తిగా నిర్మూలిస్తే గానీ గజ్జి వ్యాధి తగ్గదు.
- ఈ వ్యాధి నివారణకు చిట్కా వైద్యాలు తాత్కాలికంగా పనిచేసినట్లు అన్పించినా పూర్తిగా తగ్గించలేవు. సమూలంగా గజ్జిని నివారించాలంటే డాక్టర్‌ని తప్పనిసరిగా సంప్రదించాలి.
- పూర్తిగా తగ్గాలంటే పరిశుభ్రత పాటించాలి.
- రోజూ రెండుపూటలా స్నానం చేయాలి.
- ఉతికిని దుస్తులు ధరించాలి.
- ఇతరులు ధరించిన దుస్తులు, ఇతర చేతి గుడ్డలు వాడకూడదు.
- కుటుంబంలోని అందరు సభ్యులూ ఈ వ్యాధికి చికిత్సను ఒకేసారిగా చేయించుకోవాలి.
- కుటుంబంలోని ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే వారి దుస్తులు, నిద్రించిన పడక, పక్క దుస్తులు బాగా మరిగించిన వేడినీటిలో తడిపి ఉతకాలి.
- ఆ తర్వాత వాటిని ఎండలో ఆరవేయాలి.

డాక్టర్ మాధవి
అడ్వాన్స్‌డ్ స్కిన్ హెయిర్ అండ్ లేజర్ క్లినిక్
హైదరాబాద్
9642659757




ఆస్కార్ కల...తీరిందిలా...

★ వైభవంగా 90వ అకాడెమీ అవార్డుల వేడుక.. ★ తళుకులీనిన లాస్ ఏంజెల్స్ డాల్బీ థియేటర్..

★ సమానత్వం, లైంగిక వేధింపులపై గళమెత్తిన తారలు...


ప్రపంచ చలన చిత్ర పరిశ్రమ ఆసక్తిగా ఎదురుచూసే వేడుక ఆస్కార్. చిత్ర రంగంలో తమ ఏడాది శ్రమను ఈ అత్యుత్తమ సినీ పురస్కారంలో చూసుకోవాలని కలలుగనని వారుండరు. అలాంటి వారి కలలన్నీ తీరుస్తూ 90వ ఆస్కార్ వేడుకలు తళుకులీనాయి. లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్ ఈ సంబరానికి వేదికైంది. ద షేప్ ఆఫ్ వాటర్ అత్యధిక పురస్కారాలు గెల్చుకోగా...ఉత్తమ నటుడిగా గారీ ఓల్డ్ మ్యాన్, ఉత్తమ నాయికగా ఫ్రాన్సెస్ మెక్‌డార్మెండ్ అకాడెమీ అవార్డ్ అందుకుంది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, జాతి విద్వేషం, రాజకీయాల ప్రభావం వంటి అనేక అంశాలు పురస్కార ప్రదానోత్సవం సందర్భంగా చర్చకురావడం విశేషం...



ఉత్తమ చిత్రం - ద షేప్ ఆఫ్ వాటర్


ఉత్తమ నటి: ఫ్రాన్సెస్ మెక్‌డార్మండ్


ఉత్తమ నటుడు: గ్యారీ ఓల్డ్ మ్యాన్


ఉత్తమ యానిమేషన్ ఫిల్మ్: కోకో


ఉత్తమ దర్శకుడు : గులెర్మో డెల్ టోరో





ఆదివారం రాత్రి అమెరికా లాస్‌ఏంజెల్స్ డాల్బీ థియేటర్ హాలీవుడ్ తారలతో తళుకులీనింది. 90వ అకాడెమీ అవార్డుల కార్యక్రమం వేడుకగా జరిగింది. అత్యధిక నామినేషన్‌లు అందుకున్న ద షేప్ ఆఫ్ వాటర్...నాలుగు పురస్కారాలు గెల్చుకుంది. ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడిగా గులెర్మో డెల్ టోరో అవార్డ్ అందుకున్నారు. ఈ చిత్రానికే బెస్ట్ ఒరిజినల్ స్కోర్, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగాల్లో పురస్కారాలు దక్కాయి.

ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ రూపొందించిన డంకిర్క్ మూడు ఆస్కార్‌లు గెల్చుకుంది. బెస్ట్ సౌండ్ ఎడిటింగ్, బెస్ట్ సౌండ్ మిక్సింగ్, బెస్ట్ ఎడిటింగ్ విభాగాల్లో పురస్కారాలను డంకిర్క్ చిత్రం అందుకుంది. బ్లేడ్ రన్నర్ 2049, కోకో, డార్కెస్ట్ అవర్, త్రీ బిల్ బోర్డ్ ఔట్ సైడ్ ఎబింగ్ మిస్సోరి రెండేసి ఆస్కార్‌లు సొంతం చేసుకోగా...ఐ, తాన్యా, గెటవుట్, కాల్ మీ బై యువర్ నేమ్, ఎ ఫెంటాస్టిక్ వుమెన్, ఇకారస్, ఫాంటమ్ థ్రెడ్, హెవెన్ ఈజ్ ఏ ట్రాఫిక్ ఆన్ ద 405, ద సైలెంట్ చైల్డ్, డియర్ బాస్కెట్ బాల్ ఒక్కో అకాడెమీ అవార్డ్ అందుకున్నాయి.

డార్కెస్ట్ అవర్ చిత్రంలో నాటి బ్రిటన్ ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో నటించిన గారీ ఓల్డ్ మ్యాన్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెల్చుకున్నారు. త్రీ బిల్ బోర్డ్ ఔట్ సైడ్ ఎబింగ్ మిస్సోరి చిత్రంలో తల్లి మిల్రెడ్ హయాస్ పాత్ర పోషించిన ఫ్రాన్సెస్ మెక్ డార్మండ్ ఉత్తమ నటిగా అవార్డ్ సొంతం చేసుకుంది.

ఆస్కార్ విజేతలు వీరే...

ఉత్తమ చిత్రం	-	ద షేప్ ఆఫ్ వాటర్
ఉత్తమ నటుడు	-	గ్యారీ ఓల్డ్ మ్యాన్ (డార్క్ అవర్)
ఉత్తమ నటి	-	ఫ్రాన్సెస్ మెక్‌డార్మండ్ (త్రీ బిల్ బోర్డ్ ఔట్ సైడ్ ఎబింగ్ మిస్సోరి)
ఉత్తమ దర్శకుడు	-	గులెర్మో డెల్ టోరో (ద షేప్ ఆఫ్ వాటర్)
ఉత్తమ సహాయ నటుడు	-	శామ్ రాక్‌వెల్ (త్రీ బిల్ బోర్డ్ ఔట్ సైడ్ ఎబింగ్ మిస్సోరి)
ఉత్తమ సహాయ నటి	-	అలిసన్ జానీ (ఐ, తాన్యా)
ఉత్తమ యానిమేషన్ ఫిల్మ్	-	కోకో
ఉత్తమ విదేశీ చిత్రం	-	ఎ ఫెంటాస్టిక్ వుమెన్ (చిలీ)
బెస్ట్ విజువల్ ఎఫెక్ట్	-	బ్లేడ్ రన్నర్ 2049
బెస్ట్ కాస్ట్యూమ్	-	ఫాంటమ్ థ్రెడ్
బెస్ట్ మేకప్ హెయిర్ స్టైల్	-	డార్కెస్ట్ అవర్
బెస్ట్ సినిమాటోగ్రఫీ	-	బ్లేడ్ రన్నర్ 2049


ఉత్తమ విదేశీ చిత్రం-ఎ ఫెంటాస్టిక్ వుమెన్ (చిలీ)

ఆస్కార్ వేడుకల్లో ప్రధానాంశాలు


ఉత్తమ సహాయ నటి : అలిసన్ జానీ

♦ భారత్ నుంచి ఆస్కార్ విదేశీ విభాగానికి పంపించిన బాలీవుడ్ చిత్రం న్యూటన్ తొలి దశల్లోనే పోటీ నుంచి తప్పుకుంది. చిలీ దేశానికి చెందిన ఎ ఫెంటాస్టిక్ వుమెన్ ఈ విభాగంలో ఆస్కార్ అందుకుంది. భారతీయ నటులు అలీ ఫజల్ నటించిన విక్టోరియా అండ్ అబ్దుల్, అనుపమ్ ఖేర్ నటించిన ద బిగ్ సిక్ ఆస్కార్ గెల్చుకోలేకపోయాయి.

♦ ప్రముఖ టీవీ వ్యాఖ్యాత జిమ్మీ కిమేల్ ఆస్కార్ అవార్డుల వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వరుసగా రెండోసారి ఆయన వ్యాఖ్యాతగా బాధ్యతలు నిర్వహించడం విశేషం. గతంలో బిల్లీ క్రిస్టల్ ఈ ప్రత్యేక గౌరవం పొందారు.

♦ గతేడాది విజేతలను ప్రకటించడంలో తడబాటు జరిగింది. ఇది మొత్తం వేడుకల్లో ఆసక్తికర అంశమైంది. విజేతల పేర్లుండే ఎన్వలప్ కవర్‌లు కలిసిపోవడం వల్ల ఇలా జరిగింది. ఆ సందర్భాన్ని గుర్తు చేస్తూ వ్యాఖ్యాత జిమ్మీ కిమేల్ ...ఈసారి విజేతల పేర్లు పిలవగానే వెంటనే రాకండి అంటూ చమత్కరించారు. గత ఆస్కార్‌లో మూన్‌లైట్ చిత్రాన్ని ఉత్తమ చిత్రంగా ప్రకటించాల్సి ఉండగా....ల..లా ల్యాండ్ సినిమాకు ఇస్తున్నట్లు తప్పుగా ప్రకటించారు.

♦ నాయికలను లైంగిక వేధింపులకు గురిచేసిన వెయిన్‌స్టెన్ వ్యవహారంపై పలువురు వ్యంగ్యస్త్రాలు విసిరారు. ఆస్కార్‌కు హాలీవుడ్‌లో గౌరవం ఉంది. ఆయన చేతులు ఎలా పెట్టుకుంటాడో చూశారా...నొప్పించే మాటలు మాట్లాడడు, హద్దులు తెలిసిన మనిషి అంటూ వెయిన్‌స్టెన్ను ఉద్దేశించి అన్నారు.


♦ విజేతలు తమ ప్రసంగాన్ని వీలైనంత క్లుప్తంగా ఉండాలని వ్యాఖ్యాత పదే పదే కోరారు. ఫాంటమ్ థ్రెడ్ చిత్రానికి బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా ఆస్కార్ అందుకున్న మార్క్ బ్రిడ్జెస్ అతి తక్కువ సమయం 30 క్షణాల్లో తన ప్రసంగం ముగించారు.

♦ సినిమాకు చాలా శక్తి ఉంది. సినిమా చూసి జీవితంలో ఎదిగిన వ్యక్తులను ఎందరినో చూశాం. అని ఉత్తమ నటుడిగా అవార్డ్ అందుకున్న గ్యారీ ఓల్డ్ మ్యాన్ వ్యాఖ్యానించారు.

♦ యానిమేషన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కోకో ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ గౌరవాన్ని మెక్సికో ప్రజలకు అంకితమిస్తున్నట్లు దర్శకుడు లూ అంక్రిచ్ చెప్పారు.

♦ కాల్ మీ బై యువర్ నేమ్ చిత్రానికి ఉత్తమ కథనాన్ని అందించిన జేమ్స్ ఐవొరీ 89 ఏళ్లలో ఆస్కార్ అందుకున్న వ్యక్తిగా చరిత్రకెక్కారు. ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగంలో గెటవుట్ చిత్రానికి ఆస్కార్ అందుకున్న తొలి ఆఫ్రికన్ అమెరికన్‌గా జోర్డాన్ పీలే నిలిచారు.

నివాళి


శ్రీదేవి శశికపూర్

ఇటీవల కన్నుమూసిన భారతీయ దిగ్గజ నటీనటులు శశికపూర్, శ్రీదేవి చిత్రరంగానికి చేసిన సేవలను, ఇంకా దివంగతులైన హాలీవుడ్ నటీనటులు జాన్ హియర్డ్, టానీ అనే వాకర్, జేన్ ఫోరే, రాబర్ట్ అస్‌బోరన్, మార్టిన్, గ్లెన్ హెడ్లీ, రోజర్ మూర్, జార్జ్ ఏ రొమేరో, జెరీ లెవిస్‌లను ఆస్కార్ వేడుకల సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

♦ 90వ అకాడెమీ అవార్డుల కార్యక్రమంలో మరో తొంభై ఏళ్లు ప్రపంచ సినిమా భిన్నత్వాన్ని, సమానతను, హద్దుల్లేని సృజనను సాధించాలని వక్తలు కోరుకున్నారు.

ఆర్మీ అధికారి యుద్ధభూమి

ఇండో- పాక్ బోర్డర్‌లో 1971లో జరిగిన కొన్ని సంఘటనలు ప్రేరణగా మలయాళంలో రూపొందిన చిత్రం 1971 బియాండ్ బోర్డర్స్. మోహన్‌లాల్, అల్లు శిరీష్ ముఖ్యపాత్రధారులు. ఈ చిత్రాన్ని యుద్ధభూమి పేరుతో శ్రీలక్ష్మి జ్యోతి క్రియేషన్స్ పతాకంపై ఎయన్. బాలాజీ తెలుగులో అనువదిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను కేరళలో మోహన్‌లాల్ తన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ రవి అద్భుతమైన దర్శకుడు. ఆర్మీలో పనిచేయడం వల్ల ఆర్మీ నేపథ్యంలో పది సినిమాలు తీయగా, అందులో ఐదు చిత్రాల్లో నేను నటించాను. యుద్ధభూమి కూడా ఆర్మీ నేపథ్యంలో చిత్రీకరించారు. అల్లు శిరీష్ మంచి పర్‌ఫార్మెన్స్ ఇచ్చాడు. తెలుగులో మన్యంపులి చిత్రాన్ని ఆదరించినట్టుగానే యుద్ధభూమి చిత్రాన్ని కూడా ఆదరించాలని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు మేజర్ రవి మాట్లాడుతూ నేను తీసిన ప్రతి సినిమా దర్శకుడిగా నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. దేశం కోసం తప్ప పర్సనల్‌గా బోర్డర్‌లో ఉండే సైనికులకు ఎలాంటి శతృత్వం ఉండదు. పై అధికారుల సూచనల మేరకు సైనికులు నడుచుకోవాలి. ఇరువైపుల సైనికుల భావోద్వేగాలు, బాధలు, బాధ్యతల గురించి ఇందులో చూపించడం జరిగింది అన్నారు. నిర్మాత మాట్లాడుతూ అనువాద కార్యక్రమాలు తుదిదశకు చేరుకున్నాయి. మన నేటివిటికి తగినట్టుగా అనువదిస్తున్నాం. త్వరలో హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తున్నాం. మోహన్‌లాల్, శిరీష్, చిత్ర దర్శకుడు హాజరవుతారు అని చెప్పారు.


మోహన్‌లాల్‌తో నిర్మాత బాలాజీ, దర్శకుడు మేజర్ రవి

స్టూడియోగ్రీన్‌లో విజయ్ దేవరకొండ



కేవలం రెండు చిత్రాలతో స్టార్‌డమ్ సొంతం చేసుకున్న విజయ్ దేవరకొండ నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. ఇంకొక్కడు సినిమా ఫేమ్ ఆనంద్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ.జ్ఞానవేల్ రాజా తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్న ఈ చిత్రంలో మెహరిన్ హీరోయిన్. పలువురు చిత్రప్రముఖుల సమక్షంలో ఈ చిత్ర షూటింగ్ రామానాయుడు స్టూడియోలో వైభవంగా మొదలైంది. విజయ్ దేవరకొండ, మెహరీన్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. సందీప్ రెడ్డి వంగ కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ రోజులు వేగంగా గడిచిపోతున్నాయి. ఇప్పుడిప్పుడే యాక్టింగ్ నేర్చుకుంటున్నా. జ్ఞానవేల్ రాజాగారి సంస్థలో సినిమా చేస్తున్నందుకు గర్వంగా ఫీలవుతున్నాను. స్క్రిప్ట్ వినగానే చాలా ఉత్సాహం కలిగింది. తొలిసారి తెలుగు, తమిళ లో నటిస్తున్నాను అని చెప్పారు.నిర్మాత కె.ఇ.జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ విజయ్ అమేజింగ్ యాక్టర్. ఈ కథకి విజయ్ అయితేనే బావుంటుందని నమ్మి చేస్తున్న సినిమా. మార్చి 8 నుండి చిత్రీకరణ మొదలవుతుంది అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ అర్జున్‌రెడ్డి సినిమా బాగా నచ్చింది. విజయ్ అభినయానికి మంచి స్పందన వచ్చింది. మా స్క్రిప్ట్ బాగా నచ్చింది. తమిళ్ నేర్చుకుని డబ్బింగ్ చెబుతాను అన్నాడు. అది తన కమిట్‌మెంట్ ఏమిటో చెబుతోంది. తెలుగు, తమిళ్ ప్రేక్షకులకు నచ్చే విధంగా ఈ చిత్రం ఉంటుంది అన్నారు. హీరోయిన్ మెహరీన్ కూడా మాట్లాడింది. ఈ చిత్రనికి సంగీతం సి.ఎస్. శ్యామ్, ఛాయాగ్రహణం శాంత, దర్శకత్వం ఆనంద్ శంకర్, నిర్మాత కె.ఇ.జ్ఞానవేల్ రాజా.

పూజా హెగ్డేతో ఎన్టీఆర్





జూ.ఎన్టీఆర్, త్రివిక్రమ్ తొలి కాంబినేషన్ చిత్రానికి హీరోయిన్‌గా పూజా హెగ్డేను ఎంపికచేశారు. కొద్ది రోజులుగా పూజా పేరు ప్రచారంలో ఉంది. ఇప్పుడు అధికారికంగా ప్రకటించారు. వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభమయ్యే ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మించనుంది. ఎన్టీఆర్‌కు ఇది 28వ సినిమా. థమన్ స్వరాలు అందిస్తున్నారు. సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) మాట్లాడుతూ ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో సినిమా తీయడం ఆనందంగా ఉంది అన్నారు. ఏప్రిల్లో షూటింగ్ మొదలుపెడతాం. ఇదే ఏడాది చివర్లో సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేశాం అని పేర్కొన్నారు. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రంలో నటించే ఇఒతర తారాగణం వివరాలు ప్రకటించాల్సి ఉంది.